


సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 18 సంచిక: 151

గురువారం 21-8-2025

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



అనంత్ అదరహో..

ఆసియా చాంపియన్‌షిప్ స్కీట్ ఈవెంట్‌లో స్వర్ణం నెగ్గిన భారత షూటర్ - 13లో



పాలసీదారులకు శుభవార్త!

హెల్త్, లైఫ్ ఇన్సూరెన్స్ ప్రీమియంపై జీఎస్టీకి గుడ్‌బై - 13లో



ఢిల్లీ సీఎం రేఖా గుప్తాపై దాడి

ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తాపై ఓ ఆగంతకుడు దాడి చేశాడు. దీంతో ఆమె చేతికి, తలకు స్వల్ప గాయాలయ్యాయి.

వివరాలు 6లో ▸



గవర్నర్ల దయాదాక్షిణ్యాలపైనా?

'కీలకమైన గవర్నర్, రాష్ట్ర ప్రభుత్వాల నడుమ సామరస్యం ఉందా?' అంటూ సర్వోన్నత న్యాయస్థానం ప్రశ్నాస్త్రాలు సంధించింది.

వివరాలు 6లో ▸



భారత్ ఉత్పత్తులకు ద్వారాలు

భారత్ తమకు ముఖ్య దేశమని.. ఆ దేశ ఉత్పత్తులకు తమ మార్కెట్ ద్వారాలు తెరిచి ఉన్నాయని రష్యా దౌత్యవేత్త రోమన్ చెప్పారు.

వివరాలు 6లో ▸



'అగ్ని-5' క్షిపణి పరీక్ష సక్సెస్

వ్యూహాత్మక సైనిక శక్తి సామర్థ్యాలను చాటడంలో భాగంగా భారత్ 'అగ్ని-5' బాలిస్టిక్ క్షిపణిని విజయవంతంగా పరీక్షించింది.

వివరాలు 6లో ▸

నింద మాటున ప్రభుత్వాలు కూల్చేస్తారా?

న్యాయ స్థానాల్లో విచారణ జరగకుండానే, నేర నిరూపణ కాకుండానే పడగొడతారా?

ప్రధాని, ముఖ్యమంత్రి, మంత్రుల తొలగింపు బిల్లులపై విపక్షాల ముప్పేట దాడి



- బిల్లు ప్రతులను చింపేసి అమిత్ షా పైకి విసిరేసిన విపక్ష సభ్యులు
- నేరారోపణలు ఎదుర్కొంటూ ఏకధాటిగా 30 రోజులు కస్టడీలో ఉంటే పదవుల నుంచే తొలగించే మూడు బిల్లుల రూపకల్పన
- బుధవారం లోక్‌సభలో ప్రవేశపెట్టిన కేంద్రం
- వెంటనే తీవ్ర ఆందోళనకు దిగిన విపక్ష పార్టీలు
- విపక్షపాలిత ప్రభుత్వాలను అస్థిరపరిచేందుకే ఈ బిల్లులు తెచ్చారని మండిపాటు.. అధికార పార్టీ ఎంపీలతో వాగ్వాదం
- తీవ్ర గందరగోళం నడుమ బిల్లులను సంయుక్త పార్లమెంట్ కమిటీకి సిఫార్సు చేసిన మోదీ సర్కార్

న్యూఢిల్లీ: నేరం రుజువుకాకపోయినా కేవలం నిందారోపణలు ఉన్నాయన్న సాకుతో ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన విపక్షపాలిత ప్రభుత్వాలను పడగొడతారా? అంటూ పార్లమెంట్ సాక్షిగా మోదీ ప్రభుత్వంపై విపక్ష పార్టీలు ముప్పేటదాడి చేశాయి. విపక్షపాలిత రాష్ట్ర ప్రభుత్వాలను అస్థిరపరిచే కుట్రతో ఈ మూడు బిల్లులను రూపొందించారని విపక్ష సభ్యులు లోక్‌సభలో ధ్వజమెత్తారు. బిల్లులను తక్షణం ఉపసంహరించుకోవాలని నినాదాలతో హోరెత్తించారు. అయితే బిల్లులను సమర్థిస్తూ అధికార పార్టీ సభ్యులు సైతం దీటుగా స్పందించడంతో లోక్‌సభలో ఒక్కసారిగా మాటల మంటలు రాజుకున్నాయి. అధికార, విపక్ష సభ్యుల వాగ్వాదం మధ్య వివాదాస్పద మూడు బిల్లులను ప్రభుత్వం సంయుక్త పార్లమెంట్ కమిటీకి సిఫార్సు చేసింది. తీవ్ర నేరారోపణలు ఎదుర్కొంటూ ఏకధాటిగా 30 రోజులుగా కస్టడీలో గడుపుతున్న

మిగతా 6వ పేజీలో ▶

ఆన్‌లైన్ గేమింగ్‌పై నిషేధాస్త్రం

- 'ప్రమోషన్ అండ్ రెగ్యులేషన్ ఆఫ్ ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు-2025'కు లోక్‌సభ ఆమోదం... మనీ గేమ్‌లు నిర్వహించినా, ప్రచారం చేసినా జైలుశిక్ష, జరిమానా 6లో

లక్షల ఉద్యోగాలకు ముప్పు!!

- వేల కోట్ల పెట్టుబడులకు విఘాతం
- 400 కంపెనీలు మూతపడే ప్రమాదం
- రియల్ మనీ గేమ్స్ నిషేధంపై పరిశ్రమవర్గాల ఆందోళన

6లో



రాధాకృష్ణన్ నామినేషన్

ఉప రాష్ట్రపతి ఎన్నికల ఎన్డీయే అభ్యర్థి సి.పి.రాధాకృష్ణన్ నామినేషన్ దాఖలు చేశారు. ఆయన తరఫున నామినేషన్ పత్రాలను ప్రధాని మోదీ రిటర్నింగ్ అధికారికి అందజేశారు. 6లో

చంద్రబాబు సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకుంటారని ఆశిస్తున్నా

- ఎన్టీఆర్-చంద్రబాబు మధ్య న్యాయ పోరాటంలో తీర్పునిచ్చిన వారిలో నేనూ ఒకరిని
- ఇండియా కూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి

5లో

తప్పతాగిన శ్రీశైలం ఎమ్మెల్యే..

అటవీ సిబ్బందిపై దాడి

టీడీపీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి అరాచకం



అటవీ శాఖ సిబ్బందిపై దాడి చేస్తున్న టీడీపీ ఎమ్మెల్యే బుడ్డా

- నలుగురు ఫారెస్ట్ సిబ్బంది కిడ్నాప్.. అర్ధరాత్రి విడుదల.. అటవీ వాహనాన్ని తానే డ్రైవ్ చేసుకుంటూ వెళ్లిన ఎమ్మెల్యే
- ఎమ్మెల్యేపై అటవీ శాఖ సిబ్బంది ఫిర్యాదు
- దాడిని ఉపేక్షించేది లేదన్న అటవీ శాఖ డిప్యూటీ డైరెక్టర్.. ఎమ్మెల్యే, అతడి అనుచరులపై తక్షణ చర్యలు తీసుకోవాలని ఫారెస్ట్ అధికారుల సంఘం డిమాండ్

10లో

న్యూస్‌రీల్

విశాఖ ఉక్కు అమ్మకం కుట్రలో బాబు, పవన్ భాగస్తులే!



విశాఖ స్టీల్ ప్లాంట్ అమ్మకానికి కేంద్రం చేస్తున్న కుట్రలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఇద్దరూ భాగస్తులేనని మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మండిపడ్డారు. డిసెంబర్‌లోపు స్టీల్ ప్లాంట్‌ను విక్రయించేందుకు కేంద్రం రంగం సిద్ధం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు.

వివరాలు 5లో ▸

అంతర్ జిల్లాల బదిలీలకు షెడ్యూల్



ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుల అంతర్ జిల్లాల బదిలీలకు మార్గం సుగమమైంది. జీవిత భాగస్వామి, మ్యూచువల్ బదిలీలు చేపట్టేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. గురువారం నుంచి ఈ నెల 24లోగా లీప్ యాప్‌లో దరఖాస్తులు సమర్పించాలని ఉపాధ్యాయులను పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ ఆదేశించారు.

వివరాలు 11లో ▸

మాజీ మంత్రి కాకాణిని వెంటాడిన పోలీసులు



మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి బుధవారం నెల్లూరు జైలు నుంచి విడుదలయ్యారు. అనంతరం ఆయనను గుంటూరు జిల్లా తాడేపల్లి వరకు పోలీసులు వెంటాడారు. వెంట వెళ్లే వాహనాలను అడుగడుగునా అడ్డుకున్నారు.

వివరాలు 2లో ▸

ఎవరితోనైనా పెట్టుకోండి.. నాతో కాదు..



- పిచ్చిపిచ్చి మాటలు మాట్లాడితే ఊరుకోను
- గోవులను చంపించింది భూమన మేనమామ
- తొక్కిసలాటకు కారణం ఆయన అనుచరుడే
- టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు వ్యాఖ్యలు
- ఏర్పాట్లపై భక్తులు సంతృప్తితో ఉన్నట్లు సమర్థన

2లో

ఏ టీటీడీ చైర్మన్ కూడా ఇంతలా దిగజారి మాట్లాడలేదు



- టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి ధ్వజం
- దేవదేవుడి ప్రతిష్ట దెబ్బతినేలా నీచంగా ప్రవర్తిస్తున్నారు
- నాపై చేసిన ఆరోపణలను సీబీఐతో విచారణ చేయించాలి.. బీఆర్ నాయుడూ తప్పు నిరూపిస్తే ఏ శిక్షకైనా సిద్ధం.. ఆయనకు రూ.కోట్ల ఆస్తులెలా వచ్చాయో అందరికీ తెలుసు

2లో

డీఎస్సీలో డొంక తిరుగుడు!

మెరిట్ లిస్ట్ ప్రకటించకుండానే ఎంపిక చేసే కుట్ర

- ఎంపికైన అభ్యర్థుల ఫోన్లకు నేరుగా మెసేజ్ పంపుతామనడంపై అనుమానాలు
- తమకు కావాల్సిన వారికి పోస్టులు ఇచ్చేందుకు అడ్డదారులు
- టెట్ మార్కులు సరిగా నమోదు చేయలేదంటూ అభ్యర్థులపై నెపం
- పూర్తి డేటా ఉన్నా సరిచేయకుండానే డీఎస్సీ మార్కుల విడుదల
- తుది కీలో తప్పులు సరిచేయకుండా అభ్యర్థులకు అన్యాయం
- ఇప్పుడు మెరిట్‌లో ఎవరు ఉన్నారో చెప్పకుండానే నియామకాలకు రంగం సిద్ధం
- ఎక్స్‌సర్వీస్‌మెన్ కోటా తొలగింపుపై న్యాయ పోరాటానికి అభ్యర్థుల సన్నాహాలు.. ముసురుకుంటున్న వివాదాలు
- 3.36 లక్షల మంది జీవితాలతో కూటమి సర్కారు చెలగాటం
- ప్రభుత్వ పెద్దల తప్పిదాలకు నిన్న విద్యార్థులు.. నేడు ఉద్యోగార్థులు బలి!


11లో

ఉద్యోగుల వెతలు.. సీఎస్ కబుర్లు!

జేఎస్‌సీ భేటీలో ఉద్యోగులకు లభించని స్పష్టమైన హామీ

5లో

- కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాది తర్వాత నిర్వహించిన జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో ఏ సమస్యపైనా ఉద్యోగులకు స్పష్టమైన హామీ లభించలేదు. నాలుగు డీఏ బకాయిలు చెల్లించాలని.. 30 శాతం మధ్యంతర భృతి మంజూరు చేయాలని.. పీఆర్సీ కమిషన్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని ఉద్యోగ సంఘాలు డిమాండ్ చేశాయి. వాటిని సీఎం దృష్టికి తీసుకెళ్తానని సీఎస్ విజయానంద్ బదులిచ్చారు.



ఆరుగురు చిన్నారులను

మింగిన నీటి కుంట

- ఈతకు వెళ్లిన 5వ తరగతి విద్యార్థులు బలి.. శోకసంద్రంలో కర్నూలు జిల్లా చిగిలి గ్రామం
- దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన మాజీ సీఎం వైఎస్ జగన్
- బాధిత కుటుంబాలను ఆదుకోవాలని ప్రభుత్వానికి సూచన

2లో

ఇదండీ సంగతి



వాళ్లు ఓటేసి నన్ను గెలిపించినా.. ఆ భారం మోయాల్సింది నువ్వే!!



రాష్ట్రాల్లో కేంద్ర ఉద్యోగులు

దేశంలో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేసే ఉద్యోగుల సంఖ్య గత 5 ఏళ్లలో పెరిగింది. కేంద్ర ఆర్థిక శాఖ గణాంకాల ప్రకారం.. 2019–20లో 14.74 లక్షల నుంచి 2023–24లో 15.19 లక్షలకు పెరిగారు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు. 2024 మార్చి 31 నాటికి దేశంలో.. కేంద్ర ప్రభుత్వ రంగ ఉద్యోగులు అత్యధికంగా ఉన్న రాష్ట్రం మహారాష్ట్ర. ఆంధ్రప్రదేశ్‌లో 64,377 మంది, తెలంగాణలో 36,778 మంది ఉన్నారు.

రాష్ట్రం	ఉద్యోగుల సంఖ్య (లక్షల్లో)
మహారాష్ట్ర	1.68
పశ్చిమబెంగాల్	1.35
ఝార్ఖండ్	1.32
ఒడిశా	1.26
తమిళనాడు	1.09

ఆధారం: కేంద్ర ఆర్థిక శాఖ

క్లుప్తంగా...

నేడు కేబినెట్ సమావేశం

సాక్షి, అమరావతి: సీఎం చంద్రబాబు అధ్యక్షతన గురువారం ఉదయం 11 గంటలకు సచివాలయంలోని మొదటి బ్లాక్‌లో రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరగనున్నది. ఈ సమావేశంలో ఇటీవల సీఆర్‌డీఏ అథారిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలకు ఆమోదం తెలిపి, మరిన్ని అంశాలపై చర్చించనునట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి.

రాష్ట్రంలో లక్ష బోగస్ దివ్యాంగ పింఛన్లు

గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో లక్ష బోగస్ దివ్యాంగ పింఛన్‌లు ఉన్నాయని, వాటిని ఏరివేయడంలో తప్పేంటని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. 7.86 లక్షల మంది దివ్యాంగ పింఛన్ లబ్ధిదారులు రాష్ట్రంలో ఉన్నారని, వీరిలో 4.50 లక్షల మందికి వైద్యుల ద్వారా స్క్రీనింగ్ చేపట్టామన్నారు. ఈ నేపథ్యంలో లక్ష మంది పింఛన్‌కు అనర్హులుగా నిర్ధారించినట్టు వివరించారు. సచివాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. స్క్రీనింగ్‌కు రాని వారికి మళ్లీ నోటీసులు జారీ చేశామన్నారు. స్క్రీనింగ్‌కు హాజరవ్వకపోతే పింఛన్లు రద్దు చేస్తామని స్పష్టం చేశారు. అమరావతి ముంపు నివారణకు ప్రభుత్వం రూ.8 వేల కోట్లతో ప్రణాళిక రూపొందించిందని చెప్పారు.

లక్షకు పైగా వికలాంగుల పెన్షన్లు తొలగించాం

తొలగించమని చంద్రబాబుకు నేనే లేఖ రాశా: స్పీకర్ అయ్యన్న



నర్సీపట్నం: ఇప్పటివరకు రాష్ట్రంలో లక్షకు పైగా వికలాంగుల పెన్షన్లు తొలగించామని స్పీకర్ అయ్యన్న పాత్రుడు తెలిపారు. అనర్హులైన వికలాంగులకు పింఛన్ తొలగించమని సీఎం చంద్రబాబుకు తానే లేఖ రాశానని చెప్పారు. రాష్ట్రంలో 14 నెలల్లో 4.5 లక్షల పెన్షన్లు తొలగించారు. వికలాంగ పెన్షన్లు లక్ష వరకు తొలగించామని సాక్షాత్తు స్పీకరే చెబుతున్నారు. రానున్న కాలంలో మరెన్ని పెన్షన్లకు మంగళం పలుకుతారోనని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. బుధవారం అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలో స్పీకర్ మీడియాతో మాట్లాడుతూ.. అర్హత లేకుండా పెన్షన్ పొందుతున్న వికలాంగులు రాష్ట్రంలో లక్షల మంది ఉన్నారన్నారు. ఈ విషయమై రెండు నెలలు క్రితం తానే స్వయంగా సీఎం చంద్రబాబుకు లేఖ రాసినట్టు తెలిపారు. నిబంధనల ప్రకారం 40 శాతానికి పైగా వైకల్యం ఉన్న వారిని మాత్రమే అర్హులుగా గుర్తించాల్సి ఉందన్నారు. 40 శాతం కంటే తక్కువ ఉన్నవారిని అనర్హులుగా గుర్తించాలన్నారు. అనకాపల్లి జిల్లాలో 4,148 మంది వికలాంగుల్లో 40 శాతం కంటే తక్కువ వైకల్యం ఉన్న వారిని గుర్తించారన్నారు. అందులో 120 మందిని ఆరోగ్య పింఛన్లకు ఎంపిక చేసినట్టు తెలిపారు. 679 మందిని వృద్ధాప్య పింఛన్లలోకి మార్చగా.. 3,349 మంది వికలాంగుల పింఛన్లు రద్దు చేసినట్టు వెల్లడించారు.

ఉపాధి బిల్లుల చెల్లింపునకు కసరత్తు

సీఎం చంద్రబాబు

సాక్షి, అమరావతి: 2014–19 మధ్య కాలంలో మధ్యలో ఆగిపోయిన పనులను ఆన్ గోయింగ్ పనులుగా మార్చుచేసి నిధుల విడుదలకు చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. గత ప్రభుత్వ హయాంలో నిలిపివేసిన రూ.329 కోట్ల ఉపాధి హామీ బిల్లులను దశలా వారిగా చెల్లింపులనకు చర్యలు చేపట్టినట్టు తెలిపారు. 5.54 లక్షల పనులను ఆన్ గోయింగ్ వర్కులుగా నమోదు చేశారని, ఇందుకు సంబంధించి రూ.179.38 కోట్ల బిల్లుల చెల్లించాల్సి ఉండగా, ఇప్పటి వరకు రూ.145 కోట్ల విలువైన 3,54,177 పనుల వివరాలను అప్లోడ్ చేసినట్లు తెలిపారు.

డాక్టర్ ఏఐ..


మీ హెల్త్ కోచ్..!

హెల్త్ ట్రాకర్ల డేటా విశ్లేషించే ఏఐలు వచ్చేస్తున్నాయి	నిద్ర, స్ట్రెస్, ఫిట్‌నెస్.. అన్నింటికీ పర్సనల్ గైడెన్స్	నిపుణులతో సరిసమానంగా 80% కచ్చితత్వం	'పర్సనల్ హెల్త్ కేర్'లో సరికొత్త విప్లవం

మీరు స్మార్ట్ వాచ్ లేదా స్మార్ట్ రింగ్ వంటి వేరబుల్స్ పెట్టుకుంటే.. ప్రతిరోజూ మీ వాచ్‌లో లేదా స్మార్ట్ ఫోన్‌లో ఓ లిస్ట్ కనిపిస్తుంది. ఎన్ని స్టెప్స్ నడిచారు? ఎంత సమయం నిద్రపోయారు? హార్ట్ రేట్ ఎలా ఉంది? స్లీప్ స్కోర్ ఎంత?.. ఇవన్నీ తెలుసుకోవచ్చు. ఇవన్నీ చూడడానికి కేవలం నంబర్లు. మనం నిత్యం అవి చెక్ చేసుకుంటూ లైఫ్ స్టైల్‌లో చేయాల్సిన మార్పుల గురించి ఆలోచిస్తాం. అప్పుడప్పుడు అనేక సందేహాలు కూడా వస్తుంటాయి. ఆ ట్రాకింగ్ డేటాలో నిజానిజాలేంటి? ఆ గణాంకాల గుట్టు ఎంత వరకూ శాస్త్రీయం అని మనమే గూగుల్ తల్లిని అడుగుతుంటాం. ఇకపై, మీకు ఆ శ్రమ అక్కర్లేదు. అన్నీ 'ఏఐ' చూసుకుంటుంది. స్మార్ట్ వాచ్‌లు, రింగ్‌లు, ఇతర వేరబుల్ ట్రాకర్లు సేకరించిన డేటాని విశ్లేషిస్తుంది. లైఫ్ స్టైల్‌లో ఎలాంటి మార్పులు చేసుకోవాలో చెబుతుంది. అంటే జిమ్‌లో ఫిట్‌నెస్ కోచ్‌లా, ఇంట్లో ఫ్యామిలీ డాక్టర్లా అన్నమాట!

-సాక్షి, స్పెషల్ డెస్క్

దిగ్గజ ఐటీ కంపెనీలన్నీ ఇప్పుడు 'ఏఐ' అప్‌డేట్స్‌పైనే వర్క్ చేస్తున్నాయి. ఈ క్రమంలోనే గూగుల్ గూటి నుంచి వచ్చిన జెమినై కూడా నిత్య నూతనంగా అప్‌డేట్ అవుతోంది. ఇప్పుడు కొత్తగా ఓ ఏఐ సిస్టమ్‌ని అడాప్ట్ చేసుకుంది. అదే 'పర్సనల్ హెల్త్ లార్జ్ లాంగ్వేజ్ మోడల్' (పీహెచ్‌ఎల్‌ఎల్‌ఎమ్). ఇదో హెల్త్ కోచ్ మాదిరిగా పని చేస్తుంది. అంటే.. మనం వాడే యాపిల్ వాచ్, ఫిట్ బిట్ వంటి ఫిట్‌నెస్ ట్రాకర్ల నుంచి వచ్చే డేటాని తీసుకుంటుంది. విశ్లేషిస్తుంది. తగిన సలహాలు ఇస్తుంది. ఉదాహరణకి.. మీ నిద్ర క్వాలిటీ తగ్గిందా? వెంటనే అలర్ట్ అవుతుంది. తన నిఘా వ్యవస్థని అడుగుతుంది. మీరెంత సమయం సిస్టమ్‌పై వర్క్ చేస్తున్నారు, టైమ్‌కి తింటున్నారా లేదా.. ఇలా అన్నింటినీ ట్రాకర్స్ నుంచి తీసుకుని 'స్క్రీన్ టైమ్ తగ్గించాలి.. డైట్‌లో ఇలాంటి మార్పులు చేయాలి.. రాత్రి పడుకునే ముందు లైట్ ఫుడ్ తీసుకోవాలి' వంటి పలు సూచనలు చేస్తుంది. సో.. మన హెల్త్ ట్రాకర్లు.. కేవలం డేటా మెషీన్లు కాదు, పర్సనల్ హెల్త్ కోచ్‌లుగా కూడా సరికొత్త అవతారం ఎత్తనున్నాయన్నమాట.



మన గత చరిత్రనూ తవ్వి..

ఏఐ అందించిన ఈ ఫలితాల ఆధారంగా చూస్తే.. ఇది హెల్త్ ఎక్స్‌పర్ట్‌లు ఇచ్చిన సమాధానాలతో దాదాపు సమానమే. అంతేకాదు.. గూగుల్ పరిశోధకులు చెబుతున్న ప్రకారం.. పీహెచ్‌ఎల్‌ఎల్‌ఎమ్ వినియోగదారుల హెల్త్ రికార్డ్స్‌పై మరింత లోతైన విశ్లేషణ చేస్తుందట. రియల్ టైమ్ డేటానే కాకుండా ట్రాకర్ల నుంచి యూజర్ల హిస్టరీని కూడా ఏఐతో కంపైల్ చేస్తున్నారు గూగుల్ పరిశోధకులు. దీంతో మరింత నమ్మకమైన సూచనలు చేసేందుకు వీలవుతుందట. వినియోగదారులకు ఓ ఫ్యామిలీ డాక్టర్ లా సేవలు అందించేలా సిద్ధం చేస్తున్నామని ఏఐ రూపకర్తలు చెబుతున్నారు.

850 కేసులను పరిశీలించి..

దేన్నయినా వెంటనే నిజం అని ఎలా నమ్ముతాం? శాస్త్రీయంగా ఓ నిర్ధారణకి రావాలి. అందుకే గూగుల్ కూడా ఈ ఏఐ లాంగ్వేజ్ మోడల్‌పై ప్రయోగాత్మకంగా పరిశీలన చేసింది. 'నేచర్' మెడిసిన్ జర్నల్‌లో వచ్చిన రిపోర్ట్ ప్రకారం.. పలు ఫిట్‌నెస్ ట్రాకర్ల నుంచి సేకరించిన 850 కేసులను గూగుల్ సేకరించింది.

రియల్ టైమ్‌లో తీసుకున్న మొత్తం డేటాని ఏఐతో కంపైల్ చేస్తే.. 79% నిద్రకి సంబంధించిన ప్రశ్నలకు.. 88% ఫిట్‌నెస్ డేటాపై సరైన సమాధానాలు ఇచ్చిందట.

హార్ట్ బీట్ డేటాపై సగటున 76% సరైన విశ్లేషణ చేసిందని గూగుల్ పరిశోధకులు ప్రకటించారు.

ఎంత వరకూ సురక్షితం ?

'ఆహా!! ఏఐ ఓ అద్భుతమే' అని మనం ప్రశంసించినా.. కచ్చితంగా దానికి కూడా కొన్ని పరిమితులు ఉంటాయి. అందుకే దీనికి కూడా పరిధిని నిర్దేశించుకోవాలని ఆరోగ్య రంగ నిపుణులు చెబుతున్నారు. 'ఏఐ హెల్త్ కోచ్‌లు చెప్పేవి కేవలం సూచనలుగానే పరిగణించాలి. దాన్నే వైద్యుడిగా భావించకూడదు' అంటున్నారు. ఎందుకంటే కొన్నిసార్లు ఏఐ తప్పు అంచనాలు వేయొచ్చని డాక్టర్లు హెచ్చరిస్తున్నారు. పిల్లల కోసం వాడుతున్నట్లయితే కచ్చితంగా పేరెంటల్ కంట్రోల్స్ తప్పనిసరి. ఎప్పటికప్పుడు ప్రైవసీ సెట్టింగ్స్‌ను తప్పనిసరిగా చెక్ చేయాలి.

ఎంత స్మార్ట్ అవుతున్నాయో అంతే సున్నితమైన డేటాను కూడా వేరబుల్స్ రికార్డ్ చేస్తున్నాయి.

హార్ట్ రేట్, స్లీప్ ప్యాటర్న్స్, మానసిక స్థితికి సంబంధించిన సమాచారం లీక్ అయితే.. చాలా పెద్ద సమస్యే.

సైబర్ సెక్యూరిటీ కట్టుదిట్టంగా లేకపోతే.. హెల్త్ డేటా వ్యాపార వస్తువైపోయే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

'పటిష్టమైన డేటా ప్రైవసీ రక్షణ, వాడేవారిలో డిజిటల్ అక్షరాస్యత.. రెండూ తోడైతే హెల్త్ ట్రాకర్స్, ఏఐ మనిషి లైఫ్‌కి చక్కని రక్షణ కవచాలుగా మారతాయి. కచ్చితంగా ఆరోగ్య రంగంలో విప్లవమే అవుతుందని టెక్ నిపుణులు చెబుతున్నారు.

యాపిల్ సంస్థ కూడా ఈ తరహా ఏఐ ఫీచర్స్ అందించేందుకు సిద్ధమవుతోంది. ఐఓఎస్ 18లో ఆరోగ్య సంబంధిత టూల్స్, ఏఐ ఆధారిత న్యూట్రిషన్ ట్రాకింగ్‌ను అందించేందుకు ప్రయోగాలు చేస్తోంది.

ఎవరితోనైనా పెట్టుకోండి.. నాతో కాదు

• టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు



సాక్షి ,హైదరాబాద్: ''మీరు ఎవరితోనైనా పెట్టుకోండి.. బీఆర్ నాయుడితో కాదు. పిచ్చి పిచ్చి మాటలు మాట్లాడితే ఊరుకునేది లేదు. తప్పు చేస్తే చొక్కా పట్టుకుని అడగండి'' అని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు ఆవేశంతో ఊగిపోయారు. సాక్షి గజదొంగలు ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారని నోరు పారేసుకున్నారు. కొందరు హిందువుల మనోభావాలను దెబ్బతీస్తున్నారని ఆరోపించారు. టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డిపై తీవ్రస్థాయి విమర్శలు చేశారు. హైదరాబాద్‌లో బుధవారం బీఆర్ నాయుడు మీడియాతో మాట్లాడారు. ''వైసీపీ నేతలు అసత్య ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదు. భూమన పనిగట్టుకుని తిరుమలపై దుష్ప్రచారం చేస్తున్నారు. ఆయన, ఆయన కొడుకు చేయని దందాలు లేవు. వారి అవినీతి చిట్టా నా దగ్గర ఉంది. ఎవరెవరికి ఎన్ని టికెట్లిచ్చారో నాకు తెలుసు. అలాంటివాళ్లు అవినీతి గురించి మాట్లాడుతున్నాడు. త్వరలో వారు జైలుకెళ్తారు. నీ హయాంలో ఏం అవినీతి జరిగిందో నిరూపిస్తా. కరుణాకర్‌రెడ్డికి దమ్ముంటే చర్చకు రావాలి'' అని వ్యాఖ్యానించారు. గోవులను చంపించింది భూమన మేనమామ హరినాథ్‌రెడ్డి అని.. తొక్కిసలాటకు కారణం భూమన అనుచరుడేనని, వీళ్ల రోజుకు ఎన్ని టికెట్లు అమ్ముకున్నారో ఆధారాలున్నాయని, ంకరుణాకర్‌రెడ్డి చరిత్ర రాష్ట్ర ప్రజలకు తెలుసని, ఆయనపై చాలా కేసులున్నాయని అవన్నీ తిరగదోడాలని బీఆర్ నాయుడు అన్నారు.

- కొండపై క్యాంటీన్ల కేటాయింపులో వైసీపీ మాఫియా నడిచిందని, దానిపై న్యాయ పోరాటం చేస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం ఈ- టెండర్ల ద్వారా హోటళ్ల కేటాయించామన్నారు. తిరుమలలో మెరుగైన సేవల కోసం భక్తుల సలహాలు, సూచనలు తీసుకుంటున్నామన్నారు. ఏర్పాట్లపై భక్తులు సంతృప్తితో ఉన్నట్లు సమర్థించుకున్నారు. ప్రతి నిర్ణయం పాలక మండలిలో చర్చిస్తున్నామని.. తనకు ఇచ్చిన వంద టికెట్లను ఏనాడూ వాడలేదని చెప్పుకొచ్చారు.
- శ్రీవాణి దర్శన సమయాల వేళలు మారుస్తామని, ఉదయం టికెట్లు తీసుకుని సాయంత్రం దర్శనం చేసుకునేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. శ్రీవారి దర్శనాలు, ప్రసాదాల విషయంలో సైబర్ మోసాలను అరికట్టేందుకు సైబర్ సెక్యూరిటీ ల్యాబ్ ఏర్పాటు చేయాలని యోచిస్తున్నామన్నారు. ఏడాదిలో 30 వేల నకిలీ వెబ్‌సైట్లను క్రాష్ చేసినట్లు తెలిపారు.

సాక్షి టీవీ, పత్రికపై పరువు నష్టం దావా

సాక్షి టీవీ, సాక్షి పత్రికపై బీఆర్ నాయుడు పరువునష్టం దావా వేశారు. ఈ నెల 10, 14 తేదీల్లో సాక్షిలో నిరాధార వార్తలు ప్రచురించి, తన ప్రతిష్ఠ, భక్తుల మనోభావాలను దెబ్బతీశారని ఆరోపించారు. బేషరతుగా క్షమాపణ చెప్పాలని.. రూ.10 కోట్లు టీటీడీకి చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఏ టీటీడీ చైర్మన్ కూడా ఇంతలా దిగజారి మాట్లాడలేదు

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, టీటీడీ మాజీ చైర్మన్ భూమన ధ్వజం



సాక్షి ప్రతినిధి, తిరుపతి, తిరుపతి సిటీ: ''కూటమి ప్రభుత్వ పాలనలో శ్రీవారి భక్తులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, పాలక మండలి తప్పులను ఎత్తిచూపితే వాటిని సరిదిద్దుకోకుండా... టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు బజారు రౌడీల కంటే అత్యంత హీనమైన భాష వాడారు. గతంలో ఏ చైర్మన్ కూడా ఇంతలా దిగజారి మాట్లాడలేదు'' అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి మండిపడ్డారు. దేవదేవుడి ప్రతిష్ఠను దిగజార్చుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం తిరుపతిలోని తన నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ''తన గురించి గొప్పలు చెప్పుకొంటూ, నాపైన, మా పార్టీ అధ్యక్షుడిపైన వ్యక్తిగత దూషణలకు దిగి సభ్యసమాజం తలదించుకునేలా చేశారు. నాతో పెట్టుకోవద్దు, అంతు తేలుస్తా అంటూ రౌడీల భాషను మాట్లాడారు. నా మీద మీ ఆరోపణలను సీబీఐతో విచారణ చేయించండి. తప్పు నిరూపిస్తే శిక్షకు సిద్ధం''అని సవాల్ చేశారు.

మీకు భయపడేవారు లేరు...

తమ పార్టీ అధినేత, ఆయన సతీమణిని దుర్భాషలాడిన బీఆర్ నాయుడును ఉపేక్షించేది లేదని కరుణాకర్‌రెడ్డి పేర్కొన్నారు. మీలాంటి బరితెగించిన వాడితో యుద్ధం చేయడం అంటే తనక్కూడా ఇష్టమేనన్నారు. సీఎంగా వైఎస్ జగన్.. స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించిన విషయం మర్చిపోయారా? అని ప్రశ్నించారు. గతంలో తాను గోశాల విషయం లేవనెత్తగా... కరుణాకర్‌రెడ్డి మనిషి జన్మకు అనర్హుడని అభ్యంతరకరంగా మాట్లాడారని, అప్పుడూ తాను ఆయన్ను ఏమీ అనలేదని గుర్తుచేశారు.

నా హయాంలోనే అనేక సంస్కరణలు...

క్యూలైన్లలోని భక్తులకు అన్నప్రసాదాలు, శ్రీ వెంకటేశ్వర భక్తి చానెల్ స్థాపన, ప్రపంచవ్యాప్తంగా శ్రీవారి కళ్యాణాలు, దళిత గోవిందం, భగవంతుని పాదాల చెంత ఉంచి పూజలు చేయించిన మంగళ సూత్రాలతో సాధారణ ప్రజలకు 36 వేల కళ్యాణాలు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ వంటి అనేక సంస్కరణలు తాను టీటీడీ చైర్మన్‌గా ఉన్నప్పుడు చేపట్టామని కరుణాకర్‌రెడ్డి తెలిపారు.

నోటికొచ్చినట్లు మాట్లాడితే ఊరుకోం..

బీఆర్ నాయుడు హయాంలో చేసిన మంచి ఏమీ లేదని.. ఓవైపు వీఐపీ భక్తులకు పెద్దపీట వేస్తూ, మరోవైపు ఆందోళనలు జరుగుతున్నా ఏమీలేదని చెబుతున్నారని కరుణాకర్‌రెడ్డి అన్నారు. కొండ మీద మద్యం దొరికితే, క్యూలైన్లో కొట్లాడితే, చెప్పులు వేసుకుని ఆలయం ముందుకు వస్తుంటే, మీ చేతగానితనంతో భక్తులు దర్శనం కోసం పరుగులు పెడుతుంటే వాటిని పరిష్కరించకుండా తమ మీద దాడులు చేస్తున్నారని.. నోటికొచ్చినట్లు మాట్లాడుతుంటే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు.

సాక్షిపై కక్షసాధింపు చర్యలా...!

నిజాలను నిర్భయంగా చెబుతున్న సాక్షి పత్రిక, టీవీపై రూ.10 కోట్లకు దావా వేయడం బీఆర్ నాయుడు దిగజారుడుతనానికి నిదర్శనమని భూమన ఆగ్రహం వ్యక్తం చేశారు. సాక్షి యాజమాన్యంపై కక్షసాధింపు చర్యలకు దిగడం దారుణమన్నారు. రాష్ట్రంలో సాక్షి ప్రతిక, చానల్ లేకుంటే ప్రజాస్వామ్యం మంటగలిసేదన్నారు. బీఆర్ నాయుడు బెదిరింపులకు బెదిరేవారు ఎవరూ లేరని తేల్చిచెప్పారు. తిరుపతి పద్మావతి పురంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ''బీఆర్ నాయుడు టీటీడీని భ్రష్టుపట్టించి సంస్థ స్థాయిని దిగజారుస్తున్నారు. ఆయన చైర్మన్ అయ్యాక మసాలా లేకుండా మసాలా వడ అందించడం తప్ప ఏ ఒక్క పనిచేయలేదు. టీటీడీలో తప్పులను ప్రశ్నించే వ్యక్తులపైనా, వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రసార సాధనాలపై సొంత చానల్‌లో అబద్ధాలు ప్రచారం చేసి.. వ్యక్తిత్వ హననం జరిగిందని లీగల్ నోటీసులు ఇస్తూ హంగామా చేస్తున్నారు. కానీ, ఆయన చానల్ వైఎస్సార్‌సీపీ నాయకులపై ప్రసారం చేసే పచ్చి అబద్ధాలపై మేం దావా వేస్తే కొని వేల కోట్లు ఇవ్వాల్సి ఉంటుందో?'' అని అన్నారు.

ఆరుగురు చిన్నారులను మింగిన నీటి కుంట




కిన్నెర సాయి



మహబూబ్ బాషా



సాయి కిరణ్



కుమార్



వినయ్



గొల్ల భీమేష్

ఆస్పరి/ఆలూరు రూరల్: కర్నూలు జిల్లా, ఆస్పరి మండలం, చిగిలి గ్రామంలో తీవ్ర విషాదం అలుముకుంది. ఈతకు వెళ్లిన ఆరుగురు ఐదో తరగతి చిన్నారులు నీటి కుంటలో మునిగి మృత్యువాత పడ్డారు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం, గ్రామానికి చెందిన విద్యార్థులు వినయ్, గొల్ల భీమేష్, మహబూబ్ బాషా, సాయి కిరణ్, శశి కుమార్ , కిన్నెర సాయితో పాటు దుర్గా ప్రసాద్ స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్నారు. బుధవారం సాయంత్రం పాఠశాల వదిలిన తరువాత ఏడుగురు విద్యార్థులు బ్యాగులు ఇంట్లో పెట్టి, గ్రామానికి 2 కిలోమీటర్ల దూరంలో ఉన్న గరుసు కుంటలో ఈతకు వెళ్లారు. అయితే నీటి గుంతలోతు 15 అడుగులు ఉండడంతో, అది గమనించని విద్యార్థులు అందులో దిగారు. ఈత రాకపోవడంతో గుంతలో కూరుకోపోవడం ప్రారంభించారు. అప్పటికి గుంత బయటే ఉన్న దుర్గా ప్రసాద్, మిగిలిన ఆరుగురు స్నేహితులు మునిగిపోవడం గమనించి గ్రామంలోకి పరుగుతీసి గ్రామస్తులకు విషయాన్ని చెప్పాడు. గ్రామంలోని యువకులు పరుగున నీటి కుంట వద్దకు వచ్చేలోపు చిన్నారులంతా నీటి కుంటలో మునిగిపోయారు. యువకులు నీటి కుంటలో దూకి విద్యార్థులను బయటకు తీశారు. కిన్నర సాయి అనే విద్యార్థి కొన ఊపిరితో ఉండడంతో ఆదోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే విద్యార్థి మృతిచెందినట్లు వైద్యులు వెల్లడించారు. పత్తికొండ ఆర్డీఓ భరత్ నాయక్, ఆస్పరి తహసీల్దార్ రామేశ్వర్ రెడ్డి, ఆస్పరి సీఐ గంగాధర్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

మిన్నంటిన రోదనలు

ఈ ఘటనతో గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. ఎస్సీ, బీసీ కాలనీల్లో రోదనలు మిన్నంటాయి. మృతిచెందిన విద్యార్థులంతా పేద కుటుంబాలకు చెందిన వారు. వారి తల్లిదండ్రులు వ్యవసాయ కూలీ పనులకు వెళుతూ వీరిని చదివించుకుంటున్నారు.

సీఎం చంద్రబాబు విచారం

సాక్షి, అమరావతి: కర్నూలు జిల్లా చిగిలిలో ఆరుగురు చిన్నారులు నీటి కుంటలో పడి మరణించిన ఘటనపై సీఎం చంద్రబాబు విచారం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ ఘటన అత్యంత దురదృష్టకరమని.. చిన్నారుల కుటుంబాలకు తీరని కడుపుకోతను మిగిల్చిందన్నారు. వారి కుటుంబాలను ఆదుకుంటామని తెలిపారు.

వైఎస్ జగన్ దిగ్భ్రాంతి

సాక్షి, అమరావతి: కర్నూలు జిల్లాలో ఆస్పరి మండలం చిగిలి గ్రామంలో నీటి కుంటలో పడి ఆరుగురు విద్యార్థులు మరణించడంపై మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈత కోసం వెళ్లిన విద్యార్థులు ప్రమాదవశాత్తూ నీటిలో మునిగి చనిపోవడం తనను తీవ్రంగా కలచివేసిందని చెప్పారు. ఉజ్వల భవిష్యత్‌ను పొందాల్సిన విద్యార్థులు ఇలా ప్రాణాలు కోల్పోవడం చాలా బాధాకరమన్నారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. వారి కుటుంబాలను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని వైఎస్ జగన్ కోరారు. ఇటువంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

అత్యంత బాధాకరం: విరూపాక్షి, ఆలూరు ఎమ్మెల్యే

ఘటన వార్త తెలుసుకున్న ఆలూరు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే విరూపాక్షి హుటాహుటిన గ్రామానికి చెరుకున్నారు. విద్యార్థుల మృత దేహాలకు నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రతి విద్యార్థి కుటుంబానికి అండగా నిలవాలని, రూ.50 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు.

వారికి నోటీసులు ఆపండి!

- మానసిక అనారోగ్య పింఛను దారులపై సర్కారు వెనకడుగు
- జిల్లాల వారీగా వీరి జాబితాలు పంపుతామన్న 'సెర్ప్'
- 'సాక్షి' ఎఫెక్ట్

సాక్షి ఎఫెక్ట్..

సాక్షి, అమరావతి: అనర్హులంటూ రాష్ట్రంలోని లక్షలాది మంది దివ్యాంగ పింఛనుదారులకు కొద్దిరోజులుగా జారీచేస్తున్న నోటీసులను కొందరికి నిలుపుదల చేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. పింఛను కార్యక్రమాలను పర్యవేక్షించే గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) సీఈఓ ఈ మేరకు సూచించారంటూ సెర్ప్ అధికారులు అన్ని జిల్లాల అధికారులకు బుధవారం సమాచారం ఇచ్చారు. ఇందుకు సంబంధించిన జాబితాలను జిల్లాల వారీగా సెర్ప్ కార్యాలయం అందజేస్తుందని వారు తెలిపారు. నిజానికి.. టీడీపీ కూటమి ప్రభుత్వం పింఛన్ల భారాన్ని తగ్గించుకునేందుకు దివ్యాంగులను ప్రధానంగా టార్గెట్ చేసింది. వీరి సంఖ్యను భారీగా కుదించేందుకు 10–15 ఏళ్లకు పైగా పింఛను పొందుతున్న లబ్ధిదారులకు కొత్తగా మళ్లీ వైద్య పరీక్షలు అంటూ హడావుడి చేస్తోంది. మీకు 40 శాతం కంటే తక్కువగా వైకల్యం ఉంది, పింఛనుకు అనర్హులంటూ ప్రతి జిల్లాలో వేలాది మంది లబ్ధిదారులకు నోటీసులు జారీచేస్తోంది.

ఇప్పటికే నాలుగున్నర లక్షల పింఛన్లకు కోత..

గత ప్రభుత్వ హయాంలో 66.34 లక్షల మందికి పైగా పింఛన్లు అందించగా.. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ ఏడాదిలో దాదాపు నాలుగున్నర లక్షల పింఛన్లు తగ్గిపోయాయి. ప్రస్తుతం ఈ ఆగస్టులో పంపిణీ చేసిన మొత్తం పింఛన్లు 62.19 లక్షలే. ఇప్పుడు దీనికి అదనంగా లక్షలాది మంది దివ్యాంగ, వైద్య పింఛనుదారులకు అనర్హత పేరుతో నోటీసులు జారీచేస్తుండడంపై 'సాక్షి' బుధవారం 'పింఛన్లు.. కకావికలం' శీర్షికతో ప్రత్యేక కథనం ప్రచురించిన విషయం తెలిసిందే. దీంతో.. మెంటల్ రిటార్డేషన్, మానసిక అనారోగ్యంతో బాధపడుతున్న 18 ఏళ్లలోపు పిల్లలకు జారీచేసే నోటీసులను నిలుపుదల చేయాలంటూ సెర్ప్ సీఈఓ ఆదేశాలు జారీచేశారు.

మాజీ మంత్రి కాకాణిని వెంటాడిన పోలీసులు

- గుంటూరు జిల్లా తాడేపల్లి వరకు కొనసాగిన ఆంక్షలు
- వెంట వెళ్లే వాహనాలను అడుగడుగునా అడ్డుకున్న పోలీసులు
- కూటమి వైఫల్యాలను ప్రశ్నిస్తూనే ఉంటామన్న కాకాణి
- కేసులకు భయపడి వెనకడుగు వేసే ప్రసక్తే లేదని వెల్లడి

వెంకటాచలం: మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి నెల్లూరు సెంట్రల్ జైలు నుంచి బుధవారం విడుదలైన తర్వాత పోలీసులు ఆయనను వెంటాడారు. ఆయన గుంటూరు జిల్లా తాడేపల్లికి చేరే క్రమంలో పోలీసులు అడుగడుగునా ఆంక్షలు విధించారు. కాకాణి గోవర్ధన్‌రెడ్డి జైలు నుంచి విడుదలయ్యాక నెల్లూరు జిల్లా పరిధిలో ఉండకూడదని హైకోర్టు ఆదేశాలు ఉన్నాయి. దీంతో జైలునుంచి బయటకు వచ్చాక కాకాణి కారులో తాడేపల్లికి బయలుదేరారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నేతలు, అభిమానులు కార్లు, ద్విచక్ర వాహనాల్లో బయలుదేరారు. దీంతో పోలీసులు బుజబుజ నెల్లూరు దగ్గర నుంచి అయ్యప్పగుడి క్రాస్ రోడ్డు, చిల్డ్రన్స్ పార్కు రోడ్డు, కోవూరు సమీపంలో జాతీయ రహదారిపై కాకాణి గోవర్ధన్‌రెడ్డి వాహనం వెంట ఇతర వాహనాలను వెళ్లనివ్వకుండా అడ్డుకున్నారు. నెల్లూరు జిల్లా పరిధి దాటిన తర్వాత ఇక్కడి పోలీసులు ప్రకాశం, గుంటూరు జిల్లాల పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్లకు సమాచారం ఇవ్వడంతో అక్కడ కూడా పోలీసులు అత్యుత్సాహం చూపి వాహనాలు వెళ్లనివ్వకుండా ఆంక్షలు విధించారు. రహదారులపై బారికేడ్లు ఏర్పాటు చేసి కాకాణి గోవర్ధన్‌రెడ్డి వెళ్లే కారు వెనక ఇతర కార్లను వెళ్లనీయకుండా అడ్డంకులు సృష్టించారు. పోలీసుల ఆంక్షలు కాకాణి గోవర్ధన్‌రెడ్డి తాడేపల్లి చేరే వరకు కొనసాగాయి.

కూటమి వైఫల్యాలను ప్రశ్నిస్తూనే ఉంటాం

కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తూనే ఉంటామని కాకాణి గోవర్ధన్‌రెడ్డి స్పష్టం చేశారు. జైలు నుంచి విడుదలైన అనంతరం జైలు వద్ద మీడియాతో ఆయన మాట్లాడుతూ.. సర్వేపల్లి నియోజకవర్గంలో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఆయన కుమారుడి దోపిడీకి అడ్డుకట్ట వేసేందుకు పోరాటాలు ఆపబోనని తేల్చిచెప్పారు. కూటమి ప్రభుత్వం మోపే అక్రమ కేసులకు భయపడి వెనకడుగు వేసే ప్రసక్తే లేదన్నారు. మంత్రిగా, జెడ్పీ చైర్‌పర్సన్‌గా, రెండుసార్లు ఎమ్మెల్యేగా పని చేసిన తనను 86 రోజులపాటు అక్రమ కేసులతో జైల్లో పెట్టారని పేర్కొన్నారు. ఈ సంస్కృతి తెచ్చిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. తమ ప్రభుత్వ హయాంలో తనపై సోషల్ మీడియా పోస్టులు ఎన్నో పెట్టారని.. వారిపై కేసులు పెట్టిన దాఖలాలు లేవని గుర్తు చేశారు. కూటమి పాలనలో తనపై సోషల్ మీడియా పోస్టుల ఆధారంగా 6 కేసులు పెట్టారన్నారు. ఏడు పీటీ వారెంట్లతో చిత్ర, విచిత్రంగా కేసులు పెట్టి తనను జైలుకు పంపారని చెప్పారు. జైల్లో వేసినంత మాత్రాన మనోధైర్యం కోల్పోలేదన్నారు. నెల్లూరు సెంట్రల్ జైలులో ఎక్కువగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులే ఉన్నారని, చంద్రబాబు వల్ల జైల్లో ఉన్న వైఎస్సార్‌సీపీ శ్రేణులతో ఎక్కువ సమయం గడిపే అవకాశం దక్కిందన్నారు. జైళ్లకు, కేసులకు భయపడి కూటమి ప్రభుత్వ వైఫల్యాలు, చంద్రబాబు మోసాలు, కుట్రలపై మౌనంగా ఉండే ప్రసక్తే లేదన్నారు.

అచ్చెన్న 'యంత్ర' తంత్రం!

వ్యవసాయ యంత్ర పరికరాల కాంట్రాక్టులో భారీ అవినీతికి స్కెచ్

- రేట్లు పెంచి రూ.కోట్ల కమీషన్ల వసూలుకు పన్నాగం
- కంపెనీతో డీల్ కుదర్చమని ఆగ్రోస్ జీఎంపై మంత్రి ఒత్తిడి
- ఈ పని చేయలేనంటూ ప్రభుత్వానికి లేఖరాసి దీర్ఘకాలిక సెలవుపై వెళ్లిన జీఎం
- చర్చనీయాంశంగా మారిన మంత్రి అవినీతి బాగోతం



సాక్షి, అమరావతి: ఆయన వ్యవసాయశాఖ మంత్రి. విత్తనాలతోనే కాదు.. యంత్రాలతో సిరుల పంట పండించుకోవాలని రంగం సిద్ధం చేశారు. ఈ పంట పండించాలన్న ఒత్తిడి తట్టుకోలేక ఒక అధికారి ఈ బండారాన్ని బయట పెట్టారు. దీంతో మంత్రి, ఆయన ఓఎస్డీ తేలు కుట్టిన దొంగల్లా మారారు. వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు పేషీ కేంద్రంగా అవినీతి యథేచ్ఛగా సాగుతోంది. మంత్రి అచ్చెన్న అవినీతికి వత్తాసు పలకలేక, వేధింపులు తట్టుకోలేక రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఆగ్రోస్) జనరల్ మేనేజర్ (జీఎం) మునెల్లి చంద్రరాజమోహన్ దీర్ఘకాలిక సెలవుపై వెళ్లిపోయారు. వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని కామధేనువుగా మార్చుకుని భారీ దోపిడీకి తెగబడుతున్నారని ఆయన స్వయంగా ప్రభుత్వానికి లేఖ రాశారు. యంత్ర పరికరాల తయారీ కంపెనీతో డీల్ కుదర్చమని మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారని ఆయన ఓఎస్డీ తనపై తీవ్ర ఒత్తిడి తెచ్చి వేధించారని ఆయన ఆ లేఖలో వివరించారు. అచ్చెన్నాయుడి అవినీతి బాగోతంలో తాజా వ్యవహారం ఇది.

ఆగ్రోస్ ఆధ్వర్యంలో గత ఏడాది రూ.60.14 కోట్ల సబ్సిడీతో 25 వేల పరికరాలు పంపిణీ చేయగా.. 2025–26లో రూ.240 కోట్ల విలువైన కిసాన్ డ్రోన్లతోపాటు యంత్ర పరికరాలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. వీటి కొనుగోలులో కమీషన్ల పేరిట సొమ్ము చేసుకోవాలని మంత్రి అచ్చెన్నాయుడు స్కెచ్ వేశారు. ఆ బాధ్యతను తన ఓఎస్డీ పోలినాయుడుకు అప్పగించారు. రంగంలోకి దిగిన పోలినాయుడు ఆగ్రోస్ జీఎం రాజమోహన్‌ను సంప్రదించారు. యంత్రపరికరాల కంపెనీలతో మాట్లాడి భారీ కమీషన్లు వసూలు చేయాలని చెప్పారు. అందుకు సమ్మతించిన కంపెనీలకే కాంట్రాక్టు కట్టబెట్టాలని మంత్రి అచ్చెన్న ఆదేశించారని కూడా స్పష్టం చేశారు. భారీ కమీషన్ల డిమాండ్‌తో యంత్ర పరికరాల కంపెనీలు వెనుకంజ వేశాయి. దీంతో కమీషన్ల వ్యవహారం తేల్చకుండా కాలయాపన చేస్తున్నారంటూ ఓఎస్డీ పోలినాయుడు రెండు, మూడుసార్లు జీఎం రాజమోహన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి అచ్చెన్న పేరుతో ఓఎస్డీ వేధింపుల్ని తట్టుకోలేక ఆగ్రోస్ జీఎం రాజమోహన్ దీర్ఘకాలిక సెలవుపై వెళ్లిపోయారు. వెళ్లేముందు మంత్రి అచ్చెన్న, ఆయన ఓఎస్డీ తనను ఏవిధంగా వేధించింది, కమీషన్ల కోసం ఎంతగా ఒత్తిడి తెచ్చింది వివరిస్తూ ఆగ్రోస్ చైర్మన్ ఎం.సుబ్బనాయుడు, ఎండీ ఢిల్లీరావు, వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్‌లకు లేఖ రాశారు. ఆ లేఖ కాపీని సీఎం కార్యాలయానికి కూడా పంపారు. ఈ లేఖ మీడియాకు లీక్ కావడంతో మంత్రి అచ్చెన్నాయుడి అవినీతి బండారం బట్టబయలైంది. మీడియాలో వైరల్ అయిన ఈ లేఖ ప్రస్తుతం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

రూ.240 కోట్ల కాంట్రాక్టులో అడ్డగోలు అవినీతికి స్కెచ్

పరికరాల ధరలు పెంచి..

గత ఏడాది రూ.60.19 కోట్ల యంత్రపరికరాల కాంట్రాక్టులోనూ చేతివాటం ప్రదర్శించారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఇందుకోసం యంత్ర పరికరాల ధరలను భారీగా పెంచింది. గత ప్రభుత్వం రోటోవేటర్‌ను రూ.90వేల నుంచి రూ.లక్ష మధ్య కొనుగోలు చేసింది. ప్రస్తుతం అదే రోటోవేటర్‌కు రూ.1.45 లక్షల ధర నిర్ణయించారు. ఇదొక్కటే కాదు.. 2024–25 సీజన్‌లో పంపిణీచేసిన యంత్రపరికరాల ధరలన్నీ మార్కెట్ ధరల కంటే ఎక్కువ రేటు కోట్‌చేసి అవినీతికి పాల్పడ్డారు. తీవ్ర వివాదాల్లో చిక్కుకున్న మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌కు చెందిన నెప్ట్యూన్ బ్యాటరీ స్ప్రేయర్ తయారీ సంస్థను సింగిల్ టెండర్ విధానంలోఎంపిక చేయడమే మంత్రి అచ్చెన్న దోపిడీకి నిదర్శనం. ట్రాక్టర్ల కొనుగోలులో ఎల్–1 టెండర్ ప్రక్రియను పాటించకుండా బాక్స్ టెండర్ పద్ధతిని అనుసరించడం, కేవలం రూ.10 లక్షల గ్యారంటీ ఉన్న కంపెనీలకు ఏకంగా రూ.23 కోట్ల వరకు అడ్వాన్సులు చెల్లించడం, డిస్‌క్వాలిఫై అయిన ఓ ట్రాక్టర్ల కంపెనీని ఎంప్యానెల్ జాబితాలో చేర్చడం వంటి వాటితో అవినీతికి రంగం సిద్ధం చేశారు. ఆ అవినీతికి వత్తాసు పలకలేక దీర్ఘకాలిక సెలవుపై వెళ్లిన ఆగ్రోస్ జీఎం స్థానంలో తమకు విధేయుడైన ఓ జూనియర్ అధికారిని నియమించి అవినీతి దందా సాగించేందుకు మంత్రి అచ్చెన్న సిద్ధపడుతున్నట్టు చెబుతున్నారు.

అవినీతి మంత్రి అచ్చెన్నాయుడును బర్తరఫ్ చేయాలి

వైఎస్సార్‌సీపీ టెక్కలి ఇన్‌చార్జ్ పేరాడ తిలక్ డిమాండ్



సీఎస్‌కు ఆగ్రోస్ జీఎం రాసిన లేఖను చూపిస్తున్న పేరాడ తిలక్

టెక్కలి: అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడిని వెంటనే బర్తరఫ్ చేయాలని వైఎస్సార్‌సీపీ టెక్కలి ఇన్‌చార్జ్ పేరాడ తిలక్ డిమాండ్ చేశారు. బుధవారం శ్రీకాకుళం జిల్లా టెక్కలిలో ఆయన మీడియాతో మాట్లాడారు. అచ్చెన్నాయుడు డైరెక్షన్‌లో ఓఎస్డీ పోలినాయుడు నేతృత్వంలో వ్యవసాయ యంత్ర పరికరాల కొనుగోలులో కోట్లాది రూపాయల అవినీతి జరిగిందన్నారు. దీనికి సహకరించలేదనే కారణంతో ఆగ్రోస్ జీఎం రాజమోహన్‌ను అక్రమంగా నెల్లూరుకు బదిలీ చేశారని చెప్పారు. అనంతరం ఆ స్థానంలో జూనియర్ స్థాయి అధికారిని నియమించి.. అతని ద్వారా అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. దీనిపై ఆగ్రోస్ జీఎం రాజమోహన్ నేరుగా చీఫ్ సెక్రటరీకి లేఖ రాసి.. సెలవులోకి వెళ్లిపోయారన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో కూడా అచ్చెన్నాయుడి పీఏగా ఉన్న పోలినాయుడు అనేక అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని గుర్తు చేశారు. ఆ అవినీతి సంబంధాలతోనే అచ్చెన్నాయుడు మళ్లీ పోలినాయుడిని ఓఎస్డీగా నియమించుకున్నారని చెప్పారు. సీఎం చంద్రబాబుకు చిత్తశుద్ధి ఉంటే.. వెంటనే మంత్రి పదవి నుంచి అచ్చెన్నాయుడిని బర్తరఫ్ చేసి.. నిజ నిర్ధారణ కమిటీతో దర్యాప్తు చేయించాలని డిమాండ్ చేశారు.

కొండవీటి వాగు వరదనీటి మళ్లింపునకు మల్లగుల్లాలు

మంత్రి నారాయణ అర్ధరాత్రి హడావుడి పర్యటన



తాడికొండ: ఓ వైపు అమరావతికి ముంపు లేదని బుకాయిస్తున్న ప్రభుత్వం మరో వైపు కొండవీటి వాగు వరదనీటి మళ్లింపునకు మల్లగుల్లాలు పడుతోంది. వర్షాలు తగ్గుముఖం పట్టి వారం దాటినా వరద నీరు ఎటూ పోకపోవడంతో కొండవీటివాగు వరదనీటి తరలింపునకు పడరాని పాట్లు పడుతోంది. మంగళవారం అర్ధరాత్రి ఒంటిగంటకు వరద ప్రవాహానికి అడ్డంకిగా మారిన మట్టి తొలగింపు పనులను పరిశీలించేందుకు మంత్రి నారాయణ హడావుడిగా రావడం ముంపు సమస్య తీవ్రతకు అద్దం పడుతోంది. సీఆర్డీఏ ఇంజినీర్ల ఆధ్వర్యంలో 20 పొక్లెయిన్లతో చేపట్టిన పనులను త్వరగా పూర్తిచేయాలని, వరద నీటిని బయటకు పంపాలని మంత్రి నారాయణ సిబ్బందికి ఆదేశాలిచ్చారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ నాయకులు సోషల్ మీడియాలో అమరావతి మునిగిపోయింది అని దుష్ప్రచారం చేస్తున్నారని చెబుతూనే.. నీరుకొండ సమీపంలో వెస్ట్ బైపాస్ రోడ్డుపై బ్రిడ్జి నిర్మాణంతో కొండవీటి వాగు ప్రవాహానికి ఆటంకం కలిగిందని, బ్రిడ్జి కింద అడ్డంగా ఉన్న మట్టి తొలగించకపోవడంతోనే నీరు నిలిచిందని, ప్రవాహాన్ని డైవర్ట్ చేసే యత్నం చేసినా ముంపు తప్పలేదని అంగీకరించడం గమనార్హం.

రాజధాని మునకను మంత్రి నారాయణ అంగీకరించారు

వైఎస్సార్‌సీపీ నేతలు అంబటి మురళి, వేమారెడ్డి, డైమండ్‌బాబు



సాక్షి, అమరావతి: 'అమరావతిలో నీటి నిర్వహణ వ్యవస్థను పటిష్టం చేయడంలో వైఫల్యాన్ని ఎత్తిచూపితే ప్రభుత్వం తట్టుకోలేకపోతోంది. వైఎస్సార్‌సీపీ నాయకులపై కేసులు పెడతామని బెదిరింపులకు దిగుతోంది. వరద నీరు అమరావతిని ముంచెత్తడంపై మాట్లాడడం నేరమా? వాస్తవాలను ప్రజల ముందు పెట్టడం తప్పా? అని వైఎస్సార్‌సీపీ పొన్నూరు, మంగళగిరి, తాడికొండ నియోజకవర్గాల సమన్వయకర్తలు అంబటి మురళి, దొంతిరెడ్డి వేమారెడ్డి, డైమండ్‌బాబు ప్రశ్నించారు. అమరావతి వారం రోజుల పాటు వరద ముంపునకు గురైనందునే విజయవాడ పశ్చిమ బైపాస్‌కు గండికొట్టి నీటిని బయటకు పంపామని మంత్రి నారాయణ మీడియా ఎదుట అంగీకరించారని గుర్తు చేశారు. మరి నిజం చెప్పిన ఆయన పైన కూడా కేసులు పెడతారా? అని నిలదీశారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం వారు మీడియాతో మాట్లాడారు. వరద ముంపుపై వాస్తవాలను గ్రహించి, తగిన పరిష్కారాన్ని అన్వేషించడం మాని, కేసుల పేరుతో బెదిరించడం కూటమి ప్రభుత్వ దివాళాకోరుతనానికి నిదర్శనమని ఆగ్రహం వ్యక్తం చేశారు.

వినాయక మండపాలకు ఆన్‌లైన్‌లో అనుమతులు

డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా



సాక్షి, అమరావతి: వినాయక ఉత్సవాల మండపాల ఏర్పాటుకు ఆన్‌లైన్ విధానంలో అనుమతులు మంజూరు చేయాలని పోలీసు శాఖ నిర్ణయించింది. అందుకోసం https://ganeshutsav.net/ వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తెచ్చామని డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అందులో దరఖాస్తు చేసుకుని నిరభ్యంతర పత్రం(ఎన్‌వోసీ) పొందవచ్చన్నారు. దరఖాస్తు చేయగానే సంబంధిత పోలీసు అధికారి ఆ మండపం ప్రాంతాన్ని పరిశీలించి క్యూఆర్ కోడ్‌తో కూడిన ఎన్‌వోసీ జారీ చేస్తారని పేర్కొన్నారు. ఎన్‌వోసీ ఉచితంగా జారీ చేస్తామన్నారు.

సమతుల నాయకత్వం ఉండాలి

సీఐఐ సదస్సులో వక్తలు

సాక్షి, అమరావతి: సమతుల నాయకత్వం కేవలం ఒక భావన కాదని.. అదొక అవసరమని, అన్ని రంగాల్లో ఉండాలని కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీస్ (సీఐఐ) సదస్సులో వక్తలు పేర్కొన్నారు. సీఐఐ ఇండియన్ ఉమెన్ నెట్‌వర్క్ ఏపీ చాప్టర్ వార్షిక సమావేశాన్ని పురస్కరించుకుని 'సమానమైన భవిష్యత్తును రూపొందించడం–సమతుల్యతతో నాయకత్వం' అనే థీమ్‌తో బుధవారం విజయవాడలో చర్చాగోష్ఠి జరిగింది. లింగభేదం లేకుండా ప్రతీ వ్యక్తికి అవకాశాలు, వనరులు, నాయకత్వ పాత్రలు లభించాలని మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ అన్నారు. చదరంగ క్రీడాకారిణి కోనేరు హంపి మాట్లాడుతూ.. నాయకత్వం అంటే ముఖ్యంగా యువతులు తమ సామర్థ్యాన్ని పెంపొందించేలా ప్రేరేపించాలన్నారు.

కడలి వైపు నదుల పరుగులు

- ప్రకాశం బ్యారేజీలోకి 4.64 లక్షల క్యూసెక్కుల ప్రవాహం
- గోదావరిలో వరద ఉధృతి
- భద్రాచలం వద్ద 47.4 అడుగులకు చేరిన నీటి మట్టం



సాగర్ టెయిల్ పాండ్ వద్ద కృష్ణమ్మ పరవళ్లు

సాక్షి, అమరావతి/విజయపురి సౌత్/సత్రశాల/అచ్చంపేట/గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): కృష్ణా, గోదావరి, వంశధార, నాగావళి నదుల్లో వరద ఉధృతి బుధవారం మరింత పెరిగింది. కడలి వైపు నదులు పరుగులు తీస్తున్నాయి. కృష్ణా ప్రధాన పాయతోపాటు ఉప నదులు తుంగభద్ర, భీమా వరదెత్తి ప్రవహిస్తున్నాయి. తుంగభద్ర డ్యాంలోకి 1.30 లక్షల క్యూసెక్కులు చేరుతుండగా 1.21 లక్షల క్యూసెక్కులను దిగువకు వదిలేస్తున్నారు. మంత్రాలయం వద్ద తుంగభద్ర వరద నీటిమట్టం 311.32 మీటర్లకు చేరుకోవడంతో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. బుధవారం సాయంత్రం 6 గంటలకు శ్రీశైలం ప్రాజెక్టులోకి 4,78,032 క్యూసెక్కులు చేరుతోంది. దీంతో 4,85,397 క్యూసెక్కులను దిగువకు వదిలేస్తున్నారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టులోకి 4,87,037 క్యూసెక్కులు చేరుతుండగా 4,48,761 క్యూసెక్కులను దిగువకు వదిలేస్తున్నారు. పులిచింతల ప్రాజెక్టులోకి 4,45,187 క్యూసెక్కులు చేరుతుండగా 4,81,102 క్యూసెక్కులను దిగువకు వదిలేస్తున్నారు. ప్రకాశం బ్యారేజీలోకి 4,64,064 క్యూసెక్కులు చేరుతుండగా.. 4,59,786 క్యూసెక్కులను సముద్రంలోకి వదిలేస్తున్నారు. కృష్ణా వరద ఉధృతి పెరగడంతో ప్రకాశం బ్యారేజీ వద్ద మొదటి ప్రమాద హెచ్చరికను కొనసాగిస్తున్నారు.

గోదావరి ఉగ్రరూపం

గోదావరి ఉగ్రరూపం దాల్చింది. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, ఒడిశాలలో కురిసిన వర్షాల ప్రభావం వల్ల గోదావరి ప్రధాన పాయతోపాటు ప్రాణహిత, ఇంద్రావతి, మానేరు, శబరి ఉప నదులు, వంకలు, వాగులు పరవళ్లు తొక్కుతుండటంతో భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం గంట గంటకూ పెరుగుతోంది. బుధవారం ఉదయం 9 గంటలకు వరద నీటి మట్టం 43.2 అడుగులకు చేరుకోవడంతో భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరికను అధికారులు జారీ చేశారు. బుధవారం అర్ధరాత్రి దాటాక భద్రాచలం వద్ద వరద మట్టం 48 అడుగులను దాటే అవకాశం ఉందని అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి. ధవళేశ్వరం బ్యారేజీలోకి 8,25,477 క్యూసెక్కులు చేరుతుండగా.. గోదావరి డెల్టాకు 4,800 క్యూసెక్కులను విడుదల చేస్తూ మిగులుగా ఉన్న 8,20,677 క్యూసెక్కులను 175 గేట్ల ద్వారా సముద్రంలోకి వదిలేస్తున్నారు. వంశధార, నాగావళి పోటాపోటీగా ప్రవహిస్తున్నాయి. వంశధార నుంచి గొట్టా బ్యారేజీలోకి 17 వేల క్యూసెక్కులు చేరుతుండగా.. 15,661 క్యూసెక్కులను సముద్రంలోకి వదిలేస్తున్నారు.

నీచ రాజకీయాలకు కేరాఫ్ టీడీపీ

తీవ్రంగా మండిపడిన వైఎస్సార్‌సీపీ

- ఆ పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రుల కుంభకోణాలు వరుసగా బహిర్గతం
- మద్యం మత్తులో శ్రీశైలం ఎమ్మెల్యే అటవీ అధికారులపై దాడి
- అవినీతి తుపానులో చిక్కుకున్న మంత్రి అచ్చెన్నాయుడు
- ప్రజాభద్రత కంటే నేరస్థులకు పెరోల్ ఇప్పించడంపైనే శ్రద్ధ
- మహిళలపై ఎమ్మెల్యేల వేధింపులు.. వెకిలి చేష్టలు
- ఇలాంటివి చూసే ప్రజలు టీడీపీని నీచ రాజకీయాల పార్టీ అంటున్నారు
- 'సీబీఎన్ ఫెయిల్డ్ సీఎం' హ్యాష్ ట్యాగ్‌తో 'ఎక్స్'లో పోస్ట్



సాక్షి, అమరావతి: కూటమి ప్రభుత్వంలో మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్పడిన కుంభకోణాలు వరుసగా బయట పడుతుండటంతో టీడీపీ కుప్పకూలిపోతోందని వైఎస్సార్‌సీపీ పేర్కొంది. ఇది ప్రభుత్వ విశ్వసనీయత, పాలన గురించి తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతోందని స్పష్టం చేసింది. నీచపు రాజకీయాలకు టీడీపీ కేరాఫ్‌గా మారిందని నిప్పులు చెరిగింది. ప్రభుత్వ అధికారులపై నిస్సిగ్గుగా దాడులు మొదలు.. అవినీతి, పెరోల్ కుంభకోణాలు, మహిళల పట్ల అసభ్య ప్రవర్తన వరకు అనేక వివాదాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు కూరుకుపోవడంతో అధికార పార్టీ నాయకత్వాన్ని ఆత్మరక్షణలోకి నెట్టిందని ఎత్తిచూపింది. ఈ మేరకు 'సీబీఎన్ ఫెయిల్డ్ సీఎం' హ్యాష్ ట్యాగ్‌తో జాతీయ మీడియా సంస్థలను ట్యాగ్ చేస్తూ బుధవారం సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్టు చేసింది. ఆ పోస్టులో వైఎస్సార్‌సీపీ ఇంకా ఏమన్నదంటే..

- శ్రీశైలంలో టీడీపీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి మద్యం మత్తులో విధి నిర్వహణలో ఉన్న అటవీ అధికారులపై దాడి చేశారు. పెట్రోలింగ్ కార్యకలాపాలను అడ్డుకున్నారు. గిరిజన సిబ్బందిని కూడా వేధించారు. ఈ దిగ్భ్రాంతికర సంఘటన తీవ్ర విమర్శలకు దారితీసింది. ఇది అధికార పార్టీ శాసనసభ్యులలో చట్టవ్యతిరేక కార్యకలాపాలను ఎత్తిచూపింది.
- ఈ వివాదానికి తోడు మంత్రి అచ్చెన్నాయుడు అవినీతిపై తుపానులో చిక్కుకున్నారు. డీలర్లతో అక్రమ కమిషన్ లావాదేవీలలో మధ్యవర్తిగా వ్యవహరించడానికి నిరాకరించినందుకు మాత్రమే తనను అకస్మాత్తుగా బదిలీ చేశారని ఆగ్రోస్ జనరల్ మేనేజర్ మోహన్ నేరుగా ప్రధాన కార్యదర్శికి లేఖ రాశారు. ఈ ఆరోపణలు ఈ ప్రభుత్వ సమగ్రత, పాలనపై తీవ్రమైన సందేహాలను లేవనెత్తాయి.
- వివాదాస్పద పెరోల్ సిఫార్సుల చుట్టూ ఉన్న విషయాలు కూడా అంతే ఆందోళనకరంగా ఉన్నాయి. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, గూడూరు ఎమ్మెల్యే పాసం సునీల్ కుమార్ ఒక ప్రసిద్ధ రౌడీ–షీటర్‌కు పెరోల్‌ను సిఫార్సు చేశారు. ఈ చర్య ప్రజల్లో ఆగ్రహాన్ని రేకెత్తించింది. హోం మంత్రి అనిత ఈ ఫైల్‌ను ఆమోదించడం మరింత ఆందోళన కలిగించే అంశం. ఇటువంటి చట్ట వ్యతిరేక నిర్ణయాలకు చట్టబద్ధత కల్పించారు. ప్రజాభద్రత కంటే నేరస్థులకు పెరోల్ ఇచ్చేందుకు అధికంగా శ్రద్ధ చూపడం ద్వారా తీవ్ర విమర్శలు ఎదుర్కొన్నారు.
- మంత్రులు, ఎమ్మెల్యేల వేధింపులు, అసభ్య ప్రవర్తనకు సంబంధించిన వరుస కుంభకోణాలతో టీడీపీ పూర్తిగా కుప్పకూలింది. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ ఒక మహిళ పట్ల అసభ్యకరమైన సైగలు చేస్తూ వీడియోలో దొరికిపోయాడు. ఇది వైరల్ అయ్యింది. అసెంబ్లీని ఇబ్బంది పెట్టింది. ఈ సంఘటనను బహిర్గతం చేసినట్లు అనుమానించి, మరొక మహిళను కూడా ఆ ఎమ్మెల్యే వేధించి, ఆమెను ఇబ్బంది పెట్టాడు. దాంతో ఆమె ఆత్మహత్యకు ప్రయత్నించింది.
- ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవి కుమార్ కేజీబీవీ ప్రిన్సిపాల్ సౌమ్యను పదే పదే వేధింపులకు గురిచేస్తున్నాడు. ఆమెను పని సాకుతో తన కార్యాలయంలో ఉండమని బలవంతం చేస్తున్నాడు. అర్ధరాత్రి అనుచిత వీడియో కాల్స్ చేస్తున్నాడు. భరించలేని విధంగా అవమానాలకు గురిచేస్తున్నాడు. ఈ ఒత్తిడిని తట్టుకోలేక సౌమ్య ఆత్మహత్యకు ప్రయత్నించినట్లు తెలుస్తోంది. ఇది ఎన్నికైన ప్రజా ప్రతినిధుల అధికార దుర్వినియోగానికి ప్రతిబింబం.
- మొత్తం మీద ఈ సంఘటనలు టీడీపీలోని మరో కోణాన్ని బహిర్గతం చేశాయి. కేవలం మూడు నుంచి నాలుగు రోజుల వ్యవధిలో పలువురు ఎమ్మెల్యేలు, మంత్రులు అవినీతి, అధికార దుర్వినియోగం నుంచి అధికారులపై ప్రత్యక్ష దాడులు, మహిళలపై అసభ్యకరమైన చర్యల వరకు నేరాలకు పాల్పడ్డారు. ఈ ఉదంతాలన్నీ నీచ శ్రేణి రాజకీయాలు చేసే పార్టీగా ప్రజలు టీడీపీని అభివర్ణిస్తున్నారనేందుకు అద్దం పడుతున్నాయని విమర్శకులు స్పష్టం చేస్తున్నారు. టీడీపీ ఎమ్మెల్యేలు, మంత్రులు జవాబుదారీతనం లేకుండా అధికార దుర్వినియోగంతో మహిళల గౌరవం, అధికారుల హక్కులు, ప్రజా విశ్వాసానికి విఘాతం కల్పిస్తున్నారు.





విశ్వాసం అనేది
ఒక మనిషిలో అత్యంత ముఖ్యమైన తృష్ణ
– సోరెన్ కీర్క్‌గార్డ్

సాక్షి
గురువారం, 21 ఆగస్టు 2025

మళ్లీ చివురించిన చెలిమి

ఏ దేశానికైనా ప్రథమ ప్రాధాన్యం స్వీయ ప్రయోజనాలు. ఆ తర్వాతే మిగిలినవన్నీ. గాల్వాన్ ఘర్షణల తర్వాత గత అయిదేళ్లుగా భారత్, చైనాల మధ్య ఏర్పడిన వివాదాలు అనేకానేక చర్చల పరంపర తర్వాత కూడా అసంపూర్ణంగానే ఉండిపోయిన నేపథ్యంలో చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ మన దేశంలో రెండురోజులు పర్యటించటం, ఇరు దేశాల మధ్యా ఏదో మేరకు సదవగాహన కుదరటం హర్షించదగ్గ పరిణామం. ఆయన ప్రధాని నరేంద్ర మోదీతోపాటు అంతకు ముందు విదేశాంగ మంత్రి జైశంకర్‌తో చర్చలు జరిపారు. ఇరుగు పొరుగు అన్నాక సమస్యలు ఉంటాయి. ఒకటి రెండు పర్యటనలతోనో, రెండు మూడు దఫాల చర్చల్లోనో అవి పరిష్కారం కావాలంటే సాధ్యం కాకపోవచ్చు. అందుకు ఎంతో ఓరిమి, తమ వైఖరిపై అవతలి పక్షాన్ని ఒప్పించే నేర్పు అవసరం. దీర్ఘకాలం ఆ వివాదాలను కొనసాగనిస్తే మూడో దేశం తనకు అనుకూలంగా మలుచుకునే ప్రమాదం ఎప్పుడూ ఉంటుంది.

నిరుడు అక్టోబర్‌లో రష్యాలోని కజాన్‌లో బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు సందర్భంగా ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ అప్పటికి నాలుగేళ్ల తర్వాత తొలిసారి కలుసుకున్నారు. ఇరు దేశాల సంబంధాలనూ సాధారణ స్థితికి తీసుకెళ్లేందుకు కృషి చేయాలని నిర్ణయం తీసుకున్నారు. అందులో భాగంగానే మొన్న జూన్‌లో కైలాస– మానససరోవర్ యాత్రకు భక్తులను అనుమతించేందుకు చైనా అంగీకరించింది. భారత్ సందర్శించే చైనా యాత్రికులకు మన దేశం పర్యాటక వీసాలు పునరుద్ధరించింది. ఈనెల 31, సెప్టెంబర్ 1 తేదీల్లో చైనాలోని తియాన్‌జిన్‌లో షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) శిఖరాగ్ర సదస్సు నేపథ్యంలో వాంగ్ యీ వచ్చారు. ఆ సదస్సుకు మోదీ హాజరుకావాలంటే సుహృద్భావ సంబంధాలు అవసరమని కూడా చైనా భావించింది. ప్రధాని ఎస్‌సీఓ శిఖరాగ్ర సమావేశానికి హాజరైతే ఆయన ఏడేళ్ల అనంతరం చైనా సందర్శించినట్టవుతుంది. వాస్తవాధీన రేఖ వెంబడి ఇరు దేశాల సైనికుల మధ్యా జరిగిన ఘర్షణల తర్వాత సైనికాధికారుల స్థాయిలో చాలా దఫాలు చర్చలు సాగాయి. అయినా సరిహద్దుల్లో ఏప్రిల్ 2020కి ముందున్న పరిస్థితులు ఏర్పడలేదు. ఆఖరికి కజాన్‌లో మోదీ–షీల మధ్య సమావేశం తర్వాత కూడా గత పది నెలల్లో చెప్పుకోదగ్గ ప్రగతి లేదు.

వాంగ్ యీ పర్యటన సందర్భంగా ఇరుదేశాలూ 12 అంశాల్లో కీలక నిర్ణయాలు తీసుకున్నాయి. రెండు దేశాల మధ్యా విమాన రాకపోకలను పునరుద్ధరించుకోవాలనీ, వివాదాస్పద సరిహద్దు సమస్యపై చర్చించేందుకు మూడు వేర్వేరు బృందాలు ఏర్పాటు చేసుకోవాలనీ తీర్మానించాయి. సరిహద్దు విషయంలో ఇప్పుడు పనిచేస్తున్న బృందంతో పాటు తూర్పు, మధ్య సెక్టార్లకు సంబంధించి వేర్వేరు బృందాలు ఏర్పడితే త్వరితగతిన పరిష్కారం సాధించవచ్చని ఇరు దేశాల విదేశాంగమంత్రులూ భావించారు. అలాగే వాణిజ్యాన్ని పెంచుకోవటానికి సరిహద్దుల్ని మళ్లీ తెరవాలని నిర్ణయించారు. లిపూలేఖ్ పాస్, షిప్కి లా పాస్, నాథూ లా పాస్‌ల గుండా ఈ వాణిజ్యం సాగుతుంది. అలాగే పరస్పరం పెట్టుబడుల ప్రవాహానికి కూడా అనుమతిస్తారు. అన్నిటికన్నా ముఖ్యం – అరుదైన ఖనిజాల ఎగుమతులకు చైనా అంగీకరించటం. స్మార్ట్ ఫోన్‌ల నుంచి ఫైటర్‌జెట్ల వరకూ, విండ్ టర్బైన్‌ల నుంచి ఎలక్ట్రిక్ కార్ల వరకూ ఉత్పాదన ప్రక్రియలో ఈ అరుదైన ఖనిజాలు అత్యవసరం. ఇవి ప్రపంచంలో 99 శాతం చైనాలోనే లభ్యమవుతాయి. వీటితోపాటు ఎరువుల ఎగుమతులపై లోగడ విధించిన నిషేధాన్ని తొలగించటానికి చైనా అంగీకరించటం ఈ పర్యటనలో ప్రధానాంశం. మన రైతులు ఎక్కువగా మొగ్గు చూపే డీఏపీ ఎరువులు చైనాలో ఉత్పత్తవుతాయి. రెండుచోట్లా ప్రవహించే నదీజలాలపై డేటాను ఇచ్చిపుచ్చుకోవటానికి భారత్, చైనా అంగీకరించాయి. త్రీగోర్జెస్ డ్యామ్‌ను మించిన స్థాయిలో బ్రహ్మపుత్ర నదిపై 16,000 కోట్ల డాలర్ల వ్యయంతో భారీ ఆనకట్ట నిర్మించాలని చైనా తలపెట్టిన నేపథ్యంలో నదీ జలాల డేటాపై అంగీకారం కుదరటం హర్షించదగ్గది.

చర్చల తర్వాత తాజా ప్రపంచ పరిణామాలపై వాంగ్ యీ విడుదల చేసిన ప్రకటనలో పరోక్షంగా అమెరికా వ్యవహారశైలిపై విమర్శలుండటం గమనార్హం. స్వేచ్ఛా వాణిజ్యాన్నీ, అంతర్జాతీయ సంబంధాలనూ భగ్నం చేసేలా కొందరు ఏకపక్షంగా బెదిరింపులకు దిగుతున్న పర్యవసానంగా అనేక సవాళ్లు ఎదురవుతున్నాయని ఆయన ప్రస్తావించారు. ఆధిపత్య ధోరణులు ఏ రూపంలో ఉన్నా గట్టిగా ప్రతిఘటించటం చాలా అవసరం. ఏదేమైనా ఇరుదేశాలూ సాధ్యమైనంత త్వరగా సరిహద్దు సమస్యకు పరిష్కారం అన్వేషించగలిగితే, ఉగ్రవాదం అంతానికి చేతులు కలిపితే... ప్రధాని మోదీ చెప్పినట్టు అది రెండు దేశాల మధ్య మాత్రమే కాదు, ఆసియా ఖండంలోనే కాదు... యావత్ ప్రపంచశాంతికీ, సౌభాగ్యానికీ దోహదపడుతుంది. సాధ్యమైనంత త్వరగా అది సాకారం కావాలని ఆశించాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు శ్రావణ మాసం, **తిథి:** బ.త్రయోదశి ప.12.54 వరకు, తదుపరి చతుర్దశి, **నక్షత్రం:** పుష్యమి రా.1.10 వరకు, తదుపరి ఆశ్లేష, **వర్జ్యం:** ఉ.9.32 నుండి 11.06 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.9.59 నుండి 10.49 వరకు, తదుపరి ప.3.02 నుండి 3.52 వరకు, **అమృత ఘడియలు:** రా.7.01 నుండి 8.35 వరకు, **మాసశివరాత్రి.**

సూర్యోదయం : 5.47
సూర్యాస్తమయం: 6.20
రాహుకాలం : ప.1.30 నుండి 3.00 వరకు
యమగండం : ఉ.6.00 నుండి 7.30 వరకు

సోషల్ టాక్

పోటీ



సెర్చ్ ఇంజిన్‌లను అభివృద్ధి చేయటంలో ఇది పోటీ యుగం. మరింత సంక్లిష్టమైన ప్రశ్నలకు మన 'సెర్చ్'లు సరైన జవాబులు ఇవ్వాలంటే మనకు దీటుగా సవాళ్లు విసురుతున్న వారి పనిని గమనించాలి. మన వైఫల్యాలను ఒక అభ్యాస అవకాశంగా స్వీకరించాలి.

– సుందర్ పిచాయ్, గూగుల్ సీఈవో

చేతలు



మీకొక పని, లక్ష్యం ఏర్పడిన తర్వాత వివాదాలన్నీ మాయమవుతాయి. పనిలో పడిపోతే వేరే ఆలోచనలు రావు. లక్ష్య సాధనలో ఉన్నప్పుడు చేతలు తప్ప మాటల జాడే ఉండదు.

– పినరయి విజయన్, కేరళ సీఎం

ఆలోచన



ఇతరులు మిమ్మల్ని ఎలా చూస్తున్నారు, లేదా మీ గురించి ఎలా ఆలోచిస్తారో అనే దానిని మీరు ఆపలేరు, మార్చలేరు! ఒకటి మాత్రం చేయగలరు. వాళ్లు మీ పట్ల ఎలా ఉన్నా, మీరు వారిని పట్టించుకోకుండా ఉండగలరు!

– హెలెన్ మిర్రెన్ (80), ఆస్కార్ నటి

ప్రేరణ



మీకు మద్దతు ఇచ్చే వ్యక్తులు ఉండాలి. మీరు మెరుగ్గా ఉండటానికి మిమ్మల్ని ప్రేరేపించే వ్యక్తులు ఉండాలి. అలాగే మిమ్మల్ని జవాబుదారీగా ఉంచే వ్యక్తులు కూడా మీకు అవసరమే!

– జెన్నా ఒర్టెగా, 'వెడ్నెస్‌డే' ఫేమ్

లక్ష్యం



మీరు మీ ప్రణాళికకు కట్టుబడి ఉంటే, మీ ఆలోచనలు ఆ ప్రణాళిక పరిధిని దాటకుండా ఉంటే, ఆచరణలోని మీ వేగం మందగించకుండా ఉంటే... అనుకున్న సమయాని కంటే ముందే మీరు మీ లక్ష్యాన్ని సాధిస్తారు.

– బి.వి. ఆర్ సుబ్రహ్మణ్యం, సీఈవో, నీతి ఆయోగ్

ఎంపిక



మనం దేనికి ఫిట్ అవుతామో మనకు మాత్రమే తెలుస్తుంది. స్కూల్లో నేను 'వేగం'లో కంటే 'ఓర్పు'లో మెరుగ్గా ఉన్నానని గ్రహించాను. ఇతరులు 'నిమిషాల'పై దృష్టి పెడితే, నేను 'దూరాన్ని' ఎంచుకున్నాను. అలా అల్ట్రా రన్నింగ్‌లోకి వచ్చాను.

– అశ్వినీ గణపతి, రన్నింగ్ కోచ్

దీపావళి కానుకపై ఆశలు

విశ్లేషణ



అజిత్ రానాడే

దేశవ్యాప్త వస్తువులు, సేవల పన్ను (జీఎస్టీ)ని ఎనిమిదేళ్ళ క్రితం అట్టహాసంగా ప్రారంభించారు. ఆ సందర్భంగా అర్ధరాత్రి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాన్ని కూడా నిర్వహించారు. దేశాన్ని ఉమ్మడి ఆర్థిక మార్కెట్‌గా ఏకీకృతం చేసే చారిత్రక సంస్కరణగా దాన్ని కొనియాడారు. పరోక్ష పన్నులన్నింటినీ ఒకే గొడుగు కిందకు తెస్తున్నామన్నారు. ఘర్షణలు, ఎగవేతలను నిర్మూలిస్తుందని చెప్పారు. ఎక్సైజ్, సర్వీసు పన్నులను విధించే హక్కును కేంద్ర ప్రభుత్వం వదులుకోవడంతో సాయలాపాయలాగా కుదుర్చుకున్న వ్యవహారంగా జీఎస్టీ సంస్కరణ ఆమోదం ఖ్యాతికెక్కింది. దానికి తగ్గట్లుగానే అన్ని రాష్ట్రాలూ రాష్ట్ర స్థాయిలో విధించే అమ్మకం పన్నులు, విలువ–జోడింపు పన్ను, ఆక్ట్రాయ్ వంటి ఇతర చిన్నాచితకా పన్నులను విధించే హక్కును కేంద్రానికి దత్తం చేశాయి. రాష్ట్రాలకు పన్నుల రాబడులలో ఏర్పడే లోటును తాము భర్తీ చేస్తామని కేంద్రం వాగ్దానం చేయడం వల్ల ఆ రాజీ బేరం కుదిరింది. రాష్ట్రాలు పన్నుల విధింపులో ఉన్న స్వయం ప్రతిపత్తిని త్యాగం చేశాయి. దీన్ని 2017 నాటి తొలి చట్టంలో జీఎస్టీ పరిహార క్లాజుగా చేర్చారు. ఆ క్లాజు గడువు 2022తో పూర్తయింది. ఇపుడు జీఎస్టీలో తమ వాటా ఒక్కసారిగా బాగా తగ్గిపోయే ప్రమాదం ఉందని రాష్ట్రాలు భయపడుతున్నాయి.

ఈ నేపథ్యంలో, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో 'దీపావళి కానుక'గా జీఎస్టీలో పెద్ద సంస్కరణనే తీసుకురానున్నట్లు ప్రకటించడం హర్షణీయం. తదుపరి సంస్కరణలు సాధారణ ప్రజానీకంపై, ముఖ్యంగా మధ్యతరగతి, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థలపై పన్ను భారాన్ని తగ్గించేవిగా ఉంటాయని ఆయన వాగ్దానం చేశారు. సంస్థాగత సంస్కరణలు, రేటు హేతుబద్ధీకరణ, బతుకు తెరువును సులభతరం చేయడమనే మూడు అంశాలను ప్రభుత్వం పరిగణించవచ్చు.

పుట్టుకలోనే లోపాలు

రూపకల్పన, అమలులో కూడా ఏకీకృత, దేశవ్యాప్త, పరోక్ష పన్నుగా జీఎస్టీ పుట్టుకలోనే కొన్ని లోపాలున్నాయని చెప్పక తప్పదు. రూపకల్పనలోని లోపం ఏమిటంటే, జీఎస్టీ వంటి పరోక్ష పన్ను అంతర్గతంగానే తిరోగమనమైనది. ఒక వ్యక్తి చెల్లించే పన్ను ఆ వ్యక్తి ఆదాయంపైన కాక, కొనే వస్తువు విలువపై ఆధారపడి ఉంటుంది. కనుక, జీఎస్టీ మంట ధనికుల కన్నా పేదలకు ఎక్కువ తెలుస్తుంది. ఆదాయ పన్ను, సంపద పన్ను వంటి ప్రత్యక్ష పన్నులు పరోక్ష పన్నుల కన్నా ఔచిత్యంతో కూడినవిగా ఉంటాయి. మీ పన్ను ఆదాయంతోపాటే పెరుగుతుంది. ఆదాయం తగ్గితే పన్ను ఉండదు.

జీఎస్టీలోని అసమంజసత్వాన్ని తగ్గించేందుకు బహుళ శ్లాబులు పెట్టారు. పేదలు కొనే వస్తువులను సున్నా లేదా 5 శాతం శ్లాబులో



పెట్టారు. ధనికులు కొనే వస్తువులను హెచ్చు శ్లాబులో పెట్టారు. ఇది ఒక రకంగా పేదలు ఏ వస్తువులను వాడాలో శాసించడమవుతుంది.

సాధారణంగా ఆహారం, ఔషధాలను పన్నుల నుంచి మినహాయించే విధానం ప్రపంచ వ్యాప్తంగా అమలులో ఉంది. అన్ని వస్తువులు, సేవలకు ఒకే రేటు ఉండటం హేతుబద్ధమైన, సమర్థమైన వ్యవస్థ అనిపించుకుంటుంది. యూరోపియన్ యూనియన్ దేశాలు, సింగపూర్, ఆస్ట్రేలియాలలో అది కనిపిస్తుంది. మధ్యస్థ రేటు ఉండాలన్నది స్థూలంగా అంగీకరించే సూత్రం. (ఆహారం, ఔషధాలు వంటి) అత్యవసర వస్తువులపై చాలా తక్కువగా, (పొగాకు, మద్యం వంటి) వ్యసన, విలాస వస్తువులపై చాలా ఎక్కువగా ఉంటుంది.

సులభతర శ్లాబులు మేలు

ఇక అమలులో లోపాల గురించి ముచ్చటించుకుందాం. జీఎస్టీ బహుళ పన్ను శ్లాబుల (0 శాతం, 5 శాతం, 12 శాతం, 18 శాతం, 28 శాతం, పాప కార్యాల కింద వచ్చే వాటిపై వేసే పన్ను, వివిధ సెస్సులు)తో కూడిన సంక్లిష్ట వ్యవస్థ. ఈ సంక్లిష్టత, వస్తువులు, సేవల వర్గీకరణ, పన్ను చెల్లింపుదారులలో అయోమయం, వ్యాజ్యాలు వంటి వివాదాలకు దారితీస్తోంది. అంతిమ వస్తువుల పైన కన్నా ఆ యా వస్తువులను తయారు చేసేందుకు ఉపయోగించే వస్తువులపై పన్ను రేట్లు అధికంగా ఉన్న దృష్టాంతాలు కూడా ఉన్నాయి. ఇది దేశంలో వస్తూత్పత్తిని నీరుగారుస్తోంది.

వ్యవసాయం, పెట్రోలు ఉత్పత్తులు, విద్యుచ్ఛక్తి, ఆల్కహాల్, స్థిరాస్తుల రంగం వంటి జీడీపీలోని పెద్ద భాగాలు... జీఎస్టీ పరిధికి బయటనే కొనసాగుతున్నాయి. కొన్నింటికి మినహాయింపు ఇవ్వడం వల్ల రెవెన్యూ తగ్గుతుంది. జీఎస్టీ సంస్కరణలోని స్ఫూర్తి దెబ్బతింటోంది. చిన్న వ్యాపారాల వారు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థల వారిపై భారం పడుతోంది. కారణం– వారు వెంటనే జీఎస్టీ చెల్లించాల్సి రావడం, వారి ఖాతాదారులు చెల్లింపులలో జాప్యం చేయటం! రిఫండులలో జాప్యాలు ఉండనే ఉన్నాయి. ఇవి వ్యాపారులకు చేతిలో నగదు ఆడకుండా చేస్తున్నాయి.

ప్రధాని ప్రకటించిన ప్రతిపాదిత సంస్కరణల్లో ఒకటి గణనీయమైన మార్పు తీసుకురాగల ఆశ రేపుతోంది. అది ప్రస్తుత బహుళ శ్లాబుల పద్ధతిని రద్దు చేసి, రెండు (స్టాండర్డ్, మెరిట్) రేట్ల శ్లాబుల సులభతర విధానానికి మళ్ళడం! కొన్ని ఎంపిక చేసిన వస్తువులపైన మాత్రం ప్రత్యేక రేట్లు ఉంటాయి. వ్యాజ్యాలతోపాటు, వర్గీకరణకు సంబంధించిన వివాదాలు తగ్గుతాయి. దైనందిన వాడుక వస్తువులు, జనం సమకూర్చుకోవాలని ఆశపడే వాటిపై పన్ను రేటు తగ్గుతుందని భావిస్తున్నారు. వినిమయం పెరగడం సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థలకు ప్రయోజనం చేకూరుస్తుంది. ఈ రేట్లు తగ్గించడం వల్ల భారతదేశపు ఎగుమతుల పోటీ సామర్థ్యం పెరుగుతుంది. దేశంలో ఉద్యోగాల కల్పనకూ సాయపడుతుంది. మధ్యస్థ రేటును మరీ భారం మోపేదిగా ఉన్న 18 శాతంగా కాక 15 శాతంగా నిర్ణయించవచ్చు. పన్నుల సంస్కరణలపై ఏర్పాటు చేసిన కేల్కర్ సత్వర కార్యాచరణ బృందం సిఫార్సు చేసినట్లుగా దాన్ని 15 శాతంకన్నా తక్కువగా 12 శాతంగా నిర్ణయిస్తే ఇంకా బాగుంటుంది.

రాష్ట్రాలకు చేయి తిరిగేలా...

చివరగా, ఫెడరలిజంలో (ఆరోగ్యం, విద్య వంటివాటిపై) వ్యయాల బాధ్యతలను రాజ్యాంగం రాష్ట్రాల పైనే మోపింది. కానీ, స్వతంత్ర ఆదాయ వనరులను మాత్రం కొద్దిగానే కల్పించింది. ఈ అసమతౌల్యాన్ని జీఎస్టీ ఇంకా పెంచి, కేంద్ర బదలాయింపులపైనే రాష్ట్రాలు ఎక్కువగా ఆధారపడక తప్పని స్థితి కల్పించింది. స్థానిక అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి నిధుల సమీకరణకు రాష్ట్రాలకు పన్నులు విధించే అధికారం కొంత కావాలి. జీఎస్టీ భారతదేశపు సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీసిందనే అభిప్రాయం ఒకటి ఉంది. రాష్ట్రాలకు కోశాగారాన్ని విస్తరించుకునే, స్వయం ప్రతిపత్తిని కల్పించే అవకాశాన్ని పునరుద్ధరించేందుకు అన్వేషించవలసిన అవసరం ఉంది. ఫలితంగా, రాష్ట్రాలు వాటి నిర్దిష్ట ఆర్థిక, సామాజిక, ప్రాంతీయ అవసరాలకు తగ్గట్లుగా విధానాలు రూపొందించుకోగలుగుతాయి. అసమానతలను తగ్గించేందుకు, ప్రస్తుతం పరోక్ష పన్నుల వైపు తూగిన తక్కెడను ప్రత్యక్ష పన్నుల వైపు మొగ్గే విధంగా చేయాల్సిన అవసరం కూడా ఉంది.

వ్యాసకర్త ఆర్థికవేత్త
('దక్కన్ హెరాల్డ్' సౌజన్యంతో)

◆ నూతన సంస్కరణలు జీఎస్టీ అమలును సులభతరం చేయవచ్చు. కానీ, అది రాష్ట్రాల ఆర్థిక స్వయం ప్రతిపత్తిని తిరిగి పొదుకొల్పడానికి సహాయపడేదిగా కూడా ఉండాలి.

◆ మరీ భారం మోపేదిగా ఉన్న 18 శాతంగా కాక 15 శాతంగా మధ్యస్థ రేటును నిర్ణయించవచ్చు. కేల్కర్ బృందం సిఫార్సు చేసినట్లుగా 15 శాతం కన్నా తక్కువగా 12 శాతంగా నిర్ణయిస్తే ఇంకా బాగుంటుంది.

మనసుంటే భూపంపిణీ చేయొచ్చు!

భారతదేశంలో నూటికి 65 శాతం పైగా ప్రజలు గ్రామీణ ప్రాంతంలో నివసిస్తున్నారు. భూమిని కలిగి ఉండటం రైతు కుటుంబానికి సామాజిక హోదాను కల్పిస్తుంది. కానీ 78 సంవత్సరాల 'స్వాతంత్ర్యం' తర్వాత కూడా గ్రామీణ ప్రాంతంలో భూమి లేని నిరుపేదలు అత్యధికంగా ఉన్నారు. గ్రామాల్లోని సుమారు 10 కోట్ల కుటుంబాలకు, అంటే గ్రామాల్లోని దాదాపు 56 శాతం కుటుంబాలకు సాగు భూమి అనేది లేదు.

1970 దశకంలో ప్రజల, ముఖ్యంగా గిరిజన ప్రజల పోరాటం ఫలితంగా భూమి సమస్య ప్రధాన ఎజెండాగా ముందుకు వచ్చింది. రాష్ట్రాల వారీగా భూసంస్కరణల చట్టాలు వచ్చాయి. 1972లో జరిగిన ముఖ్యమంత్రుల సమావేశంలో జాతీయ స్థాయిలో ఒకే సీలింగ్ విధానాన్ని రూపొందించారు. ఈ సీలింగ్ ద్వారా 67 లక్షల ఎకరాల మిగులు తేలింది.

శ్రీకాకుళం గిరిజన రైతాంగ పోరాటం ఫలితంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1972లో భూ సంస్కరణల చట్టం చేయబడి 1973లో అమల్లోకి వచ్చింది. భూ సంస్కరణల చట్ట ప్రకారం మొదట 18 లక్షల ఎకరాలను మిగులు భూమిగా ఆనాటి రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. సవరణలతో కుదిస్తూ చివరికి 7.9 లక్షల ఎకరాల



మిగులు భూమి ప్రకటించి, అందులో 6.47 లక్షల ఎకరాలను స్వాధీనం చేసుకుని, 5.82 లక్షల ఎకరాలను లక్షా 79 వేల మందికి పంపిణీ చేసినట్లు ప్రభుత్వం ప్రకటించింది. చట్టంలో ఉన్న లొసుగులను ఉపయోగించుకొని భూస్వాములు, ధనిక రైతులు సీలింగ్‌లోకి రాకుండా తమ భూములను కాపాడుకున్నారు. దేశవ్యాప్తంగా ఇప్పటివరకూ సుమారు 51 లక్షల ఎకరాలను మాత్రమే 57.8 లక్షల పేద రైతులకు పంపిణీ చేయడం జరిగింది.

భూ సంస్కరణల చట్టాల వల్ల భూ సంబంధాల్లో మౌలికమైన మార్పులు జరగలేదు. కొద్ది మంది వద్దే భూమి ఇంకా కేంద్రీకరించబడి ఉంది. 2020 జాతీయ శాంపిల్ సర్వే ప్రకారం, 84%గా ఉన్న చిన్న, సన్నకారు రైతులు హెక్టార్ కన్నా తక్కువ భూమిని కలిగి ఉన్నారు. కేవలం 4.9% ఉన్న భూస్వాముల వద్ద 32% సాగు భూమి ఉంది. రాష్ట్రాల వారిగా కూడా భూకేంద్రీకరణలో వ్యత్యాసాలు ఉన్నాయి. పంజాబ్, బిహార్ రాష్ట్రాల్లో 10%గా ఉన్న భూస్వాముల వద్ద 80 శాతం భూమి ఉంది. తెలంగాణ, రాజస్థాన్, కర్ణాటక రాష్ట్రాల్లో 55% భూమి 10%గా ఉన్న భూస్వాముల వద్ద ఉంది. భారతదేశంలో ఒక పెద్ద భూ కామందు ఒక సన్నకారు రైతు కన్నా 45 రెట్లు ఎక్కువ భూమిని కలిగి ఉన్నారు.

దేశంలో భూ సంస్కరణలు అమలు జరిపారనీ, భూస్వామ్య విధానం లేదనీ, దాని అవశేషాలు మాత్రమే ఉన్నాయనీ, పంచటానికి ఇంకా భూములు లేవనీ కొందరు చేస్తున్న వాదనలు వాస్తవ విరుద్ధం. భూ కామందుల వద్దే కాకుండా ప్రభుత్వ రంగ సంస్థల వద్ద, మత సంస్థల వద్ద లక్షలాది ఎకరాల భూమి ఉంది. ఆ భూములను ప్రభుత్వం పంపిణీ చేయగలిగినప్పుడే పేదలందరికీ భూమి లభిస్తుంది. 10 నుండి 12 ఎకరాల సీలింగ్ విధించి భూ సంస్కరణలు అమలు జరిపితే లక్షల కొద్ది భూములను పేదలకు పంపిణీ చేయవచ్చు. పాలకుల విధానాలకు వ్యతిరేకంగా గ్రామీణ పేదలు భూమి కోసం సంఘటితం కావాలి.

– బొల్లిముంత సాంబశివరావు
రైతు కూలీ సంఘం (ఆం.ప్ర.) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు

జన చరిత్రకారుడు

ఇన్ బాక్స్

ఆయనొక అసాధారణ అధ్యాపకుడు, పరిశోధకుడు, ఎందరో చరిత్ర పరిశోధకులకు స్ఫూర్తి కల్గించినవాడు. చరిత్ర రచనను జనం కేంద్రంగా, ఆర్థిక, సాంఘిక అంశాల ప్రాధాన్యంతో నడిచేట్లు చేసినవాడు. తెలుగు వారి చరిత్రను లోతుగా అధ్యయనం సాగించడానికి ఒక వేదిక అవసరమని భావించి తొలిసారిగా 1976లో ఆంధ్రప్రదేశ్ చరిత్ర కాంగ్రెస్‌ను స్థాపించినవాడు. దేశంలో ఎక్కడా రాష్ట్ర చరిత్ర కాంగ్రెస్‌లు లేని రోజుల్లో నెల్లూరు జిల్లా కావలి జవహర్ భారతి కాలేజీలో, 1976 మే నెల ఒకటి–రెండు తేదీలలో ఆంధ్రప్రదేశ్ హిస్టరీ కాంగ్రెస్ తొలి స్థాపక సమావేశాలను నిర్వహించినవాడు... ఆయన ఎవరో కాదు, జన చరిత్రకారుడు – డాక్టర్ మల్లిరెడ్డి పట్టాభి రామరెడ్డి.



మల్లిరెడ్డి పట్టాభి రామరెడ్డి

నెల్లూరు జిల్లా రాపూరు మండలం గుండవోలులో ఆయన 1922 ఆగస్ట్ 21న జన్మించారు. మద్రాస్ పచ్చయప్పాస్ కళాశాలలో అధ్యాపకుడుగా కొంతకాలం చేసి, గ్రామీణ ప్రాంతాలకు సేవ చేయాలని భావించి కావలి జవహర్ భారతిలో అధ్యాపకుడిగా చేరి ప్రిన్సిపాల్‌గా, అటుపై ఎమిరిటస్ ప్రొఫెసర్‌గా, ఎస్వీ యూనివర్సిటీ సెనేట్ మెంబర్‌గా, యూపీఎస్సీ ఎక్స్‌పర్ట్‌గా, బోర్డ్ ఆఫ్ స్టడీస్ ఛైర్మన్‌గా, పలు కమిటీలకు అధిపతిగా సేవలందించడం జరిగింది. వీటి నిర్వహణా కాలంలోనే క్లియో, ఎ.పి. హిస్టారికల్ రివ్యూ అనే పరిశోధనా పత్రికలను నడపడం, హిస్టరీ ఆఫ్ నెల్లూర్ డిస్ట్రిక్ట్, అగ్రేరియన్ రిలేషన్స్ అండ్ పెజెంట్ మూవ్మెంట్స్ అనే సెమినార్లను నిర్వహించడం చేశారు. మద్రాసులో ఉండిన రోజుల్లో క్విట్ ఇండియా ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న నేపథ్యంలో ఎం.ఎన్. రాయ్ స్ఫూర్తితో నెల్లూరు రాపూరు నియోజక వర్గంలో సోషలిస్టు పార్టీ టికెట్‌పై ఆయన ఎమ్మెల్యేగా పోటీ చేయడం కూడా జరిగింది.

ఆయన రచనల్లో ప్రధానమైనవి: ఈస్టిండియా కంపెనీ ఇన్ ఆంధ్ర విత్ స్పెషల్ రిఫరెన్స్ టు అగ్రేరియన్ రిలేషన్స్, 1757–1857; వేమన అండ్ హిజ్ టైమ్స్; గాజుల లక్ష్మీనరసు చెట్టి–లైఫ్ అండ్ టైమ్స్, గ్లింప్సెస్ ఆఫ్ ఫ్రీడమ్ స్ట్రగుల్ విత్ స్పెషల్ రెఫరెన్స్ టు క్విట్ ఇండియా మూవ్మెంట్; ఎ నోట్ ఆన్ హిస్టోరియన్స్ ఇన్ ఆంధ్ర; ప్రాబ్లమ్స్ ఆఫ్ హిస్టారికల్ రైటింగ్ ఇన్ ఇండియా; అగ్రేరియన్ రిలేషన్స్ ఇన్ ఆంధ్ర అండ్ తెలంగాణ, జమీందార్స్, పాళేగార్స్, జాగీర్దార్స్ అండ్ ఇనాందార్స్ ఇన్ ది నైన్టీన్త్ సెంచురీ. ఇంతటి విశాల చారిత్రక విజ్ఞాన నిధియైన పట్టాభి రామరెడ్డి 2004 మార్చి 30న పరమపదించారు.

– ప్రొ॥ దేవిరెడ్డి సుబ్రమణ్యం రెడ్డి
రిటైర్డ్ చరిత్ర ఆచార్యులు, ఎస్వీ యూనివర్సిటీ, తిరుపతి
(నేడు మల్లిరెడ్డి పట్టాభి రామరెడ్డి జయంతి)

డేటా పాయింట్

పర్యాటకం జోష్

దేశంలో పర్యాటక రంగ విస్తృతి ఏటా పెరుగుతోంది. 2025 జాతీయ గణాంకాల ప్రకారం (ఎన్ఏఎస్)... పర్యాటక రంగ వాటా దేశ జీడీపీలో 1.5 శాతం నుంచి 5 శాతానికిపైగా పెరగడమే ఇందుకు నిదర్శనం. 'పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే' (పీఎల్ఎఫ్ఎస్) అంచనాల ప్రకారం... ఈ రంగం ద్వారా ఏటా వస్తున్న ఉద్యోగాల సంఖ్య కూడా పెరుగుతోంది.

	జీడీపీలో శాతం	ఉద్యోగాలు (కోట్లలో)
2020-21	1.50	6.80
2021-22	1.75	7.00
2022-23	5.09	7.61
2023-24	5.22	8.46

గొప్ప అద్భుతం

దత్తబోధ



శ్రీ గణపతి సచ్చిదానందస్వామి

ఈ ప్రపంచంలో అనేక ఆశ్చర్యకరమైన విషయాలు ఉన్నాయి. వానిలో కొన్ని భగవంతుని సృష్టి. కావున అవి సహజ సిద్ధములు; కొన్ని మానవులచే కల్పించబడినవి. కావున అవి కృత్రిమములు. ప్రతి నిత్యం ఉదయిస్తూ, అస్తమించు సూర్యుడు; ప్రశాంతతను ఇచ్చే, పోల్చుటకు వీలులేని చంద్రుని అందచందాలు; వికసించే పుష్పాలు వెదజల్లే సువాసనలు – ఇవన్నీ వాటిని సృష్టించిన భగవంతుని నిశ్శబ్దంగా కీర్తిస్తున్నాయి. దూరశ్రవణ యంత్రము (దూరవాణి), టెలిగ్రాఫులు, భూమిపై, నీటిపై, గాలిలో ఉపయోగించే ప్రయాణ సాధనాలు, అంతరిక్ష నౌకలు, కంప్యూటర్లు మొదలైనవన్నీ మానవునిచే రూపకల్పన చేయబడిన అద్భుతాలు.

వీటిని అన్నింటినీ మించిన ఆశ్చర్యకరమైన విషయం మరొకటి ఉంది. బహుశః ప్రపంచంలోని ఆశ్చర్యకరమైన విషయాలన్నింటిలోకీ ఇదే అత్యంత ఆశ్చర్యకరమైనది కావొచ్చు. ఈ విషయం ధర్మరాజును యక్షుడు అడిగిన ప్రశ్న: (కిం ఆశ్చర్యం? అత్యంత ఆశ్చర్యకరమైన విషయం ఏది?). ఈ ప్రశ్నకు ధర్మరాజు ఈ విధంగా జవాబు చెప్పాడు:

'ప్రతి క్షణం లెక్కలేనన్ని జీవులు యముని (మృత్యుదేవత) రాజ్యమును చేరుకొంటున్నాయి. అయినప్పటికీ జీవించివున్నవారు మాత్రము తమకు మరణము ఉన్నదని తెలియని వారివలె జీవిస్తున్నారు.'

'మానవుని జీవితం క్షణభంగురం. మరణం అనివార్యం' అనే విషయం దీనివల్ల తేటతెల్లం అవుతున్నది. కాబట్టి మానవులందరూ ప్రతి క్షణాన్నీ సద్వినియోగపరచుకోవాలి. కాలం గడచిన పిమ్మట గతంలోకి తొంగి చూసి, 'అయ్యో! నేను కాలాన్ని సద్వినియోగపరచుకోలేకపోతిని' అని బాధపడటానికి ఏలాంటి అవకాశం లేకుండా తమ జీవితాన్ని గడపాలి.

సాక్షి ఎడిటోరియల్ పేజీ ఈ–మెయిల్: editpage@sakshi.com
ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

క్లుప్తంగా...

ఎర్రచందనం ధరల ఖరారుకు మంత్రుల బృందం
డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అధ్యక్షతన బృందం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో అందుబాటులో ఉన్న ఎర్ర చందనం ధరల నిర్ధారణకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అధ్యక్షతన మంత్రుల బృందాన్ని ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) కె.విజయానంద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. మంత్రుల బృందంలో ఆర్థిక మంత్రి కేశవ్, రహదారులు–భవనాల శాఖ మంత్రి బి.సి.జనార్దన్‌రెడ్డిని సభ్యులుగా నియమించారు. అటవీ, పర్యావరణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మంత్రుల బృందం సమావేశాల ఏర్పాటుకు, బృందం కార్యకలాపాల సమన్వయం చేయడానికి కన్వీనర్‌గా ఉంటారు.

మద్యం అక్రమ కేసులో విచారణ వాయిదా

విజయవాడ లీగల్: మద్యం అక్రమ కేసులో రిమాండ్‌లో ఉన్న రాజ్ కేసిరెడ్డి, పైలా దిలీప్, శ్రీధర్‌రెడ్డిల బెయిల్ పిటిషన్లపై బుధవారం ఏసీబీ కోర్టులో విచారణ జరిగింది. విచారణను న్యాయమూర్తి గురువారానికి వాయిదా వేశారు. ఇదే కేసులో బాలాజీ కుమార్ యాదవ్, నవీన్ కుమార్‌ల బెయిల్ పిటిషన్లపై విచారణ ఈనెల 22వ తేదీకి, జైలులో రెండవ సారి ఇంటి భోజనం తెచ్చుకునేందుకు అనుమతించాలని ఎంపీ మిథున్ రెడ్డి పిటిషన్‌పై విచారణను ఈనెల 26వ తేదీకి, బాలాజీ కుమార్ యాదవ్‌ను అరెస్టు చేసిన సమయంలో అతని వద్ద జప్తు చేసిన రూ.3 లక్షల నగదు పై దాఖలైన పిటిషన్‌పై విచారణ గురువారానికి, వెంకటేష్ నాయుడుని అరెస్టుచేసే సమయంలో జప్తుచేసిన సెల్‌ఫోన్‌ను ఓపెన్ చేసేందుకు అనుమతి ఇవ్వాలని సిట్ దాఖలు పిటిషన్‌పై విచారణ 25వ తేదీకి, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి ఇంటి నుంచి వారంలో మూడు రోజుల పాటు భోజనం తెచ్చుకునేందుకు అనుమతించిన తేదీలను మార్చాలని దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ గురువారానికి ఏసీబీ న్యాయమూర్తి భాస్కరరావు వాయిదా వేశారు.

సినీ నిర్మాత దాసరి కిరణ్ అరెస్టు

పటమట(విజయవాడ తూర్పు): 'వ్యూహం' సినీ నిర్మాత దాసరి కిరణ్‌కుమార్‌ను విజయవాడ పోలీసులు బుధవారం హైదరాబాద్‌లో అరెస్ట్ చేశారు. ఆయనపై గాజుల మహేశ్ అనే వ్యక్తి విజయవాడలోని పటమట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రెండేళ్ల క్రితం తన వద్ద కిరణ్ రూ.4.5 కోట్లు అప్పుగా తీసుకున్నారని తెలిపారు. ఆ డబ్బుల గురించి అడిగేందుకు ఈనెల 18న విజయవాడలోని దాసరి కిరణ్ కార్యాలయానికి వెళ్లానని.. ఆ సమయంలో ఆయన అనుచరులైన అవారు నాగతేజతో పాటు మరో 15 మంది తనతో పాటు తన భార్యపై దాడి చేశారని ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసిన పటమట పోలీసులు బుధవారం హైదరాబాద్‌లో దాసరి కిరణ్‌ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం విజయవాడకు తీసుకొచ్చి.. పటమట స్టేషన్‌లో విచారిస్తున్నారు.

వచ్చే ఏడాది మార్చి కల్లా 10 లక్షల ఇళ్ల నిర్మాణం
సీఎం చంద్రబాబు

సాక్షి, అమరావతి: 2026 మార్చి నాటికి 10 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని గృహ నిర్మాణ, మున్సిపల్ శాఖలను సీఎం చంద్రబాబు ఆదేశించారు. బుధవారం సచివాలయంలో గృహ నిర్మాణంపై సీఎం సమీక్ష నిర్వహించారు. మూడు లక్షల ఇళ్లలో వచ్చే నెలలో గృహ ప్రవేశాలు చేపట్టాలన్నారు. సంక్రాంతి కల్లా మరో 2 లక్షల ఇళ్లు పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగించాలన్నారు. రాష్ట్రంలో ఇంకా ఇళ్లులేని పేద కుటుంబాలను గుర్తించి జాబితా రూపొందించాలన్నారు. ఇందుకోసం 15 రోజుల్లోగా సర్వే పూర్తి చేయాలన్నారు.

జలజీవన్ మిషన్ అమలుకు కన్సల్టెంట్‌గా 'కేపీఎంజీ'
ఏడాదికి రూ. 3.20 కోట్లు చెల్లింపు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో గ్రామీణ మంచినీటి సరఫరా విభాగం (ఆర్‌డబ్ల్యూఎస్) పరిధిలోని జలజీవన్ మిషన్ కార్యక్రమాల అమలులో ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్, ఫైనాన్స్ మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్‌గా కేపీఎంజీ సంస్థను నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆ సంస్థకు ఏడాదికి రూ. 3.20 కోట్లను జలజీవన్ మిషన్ నిధుల నుంచి చెల్లింపులకు అనుమతిచ్చింది. ఇదిలా ఉంటే గ్రామీణ ప్రాంతాల్లో రక్షిత నీటి పథకాల నిర్మాణం కోసం ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థల నుంచి రూ.10 వేల కోట్లు అప్పు రూపంలో సమీకరించుకోవాలని ఇటీవల ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ అప్పు తిరిగి చెల్లింపునకు 'ఆంధ్రప్రదేశ్ జల్ జీవన్ వాటర్ సప్లై కార్పొరేషన్' ఆధ్వర్యంలో స్థానిక సంస్థలు, పరిశ్రమలకు బల్క్‌గా నీటి అమ్మకం ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్‌సీని సర్కారు ఆదేశించింది. ఈ ప్రక్రియలో ఆర్థిక ప్రణాళిక రూపకల్పనలో కేపీఎంజీ సంస్థ సేవలను వినియోగించుకోనున్నట్టు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

పల్లె వెలుగు బస్సుల్ని ఏసీ సర్వీసులుగా మారుస్తాం
రవాణా శాఖ మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి

సాక్షి, అమరావతి: పల్లె వెలుగు బస్సులను ఏసీ సర్వీసులుగా మారుస్తామని రవాణా శాఖ మంత్రి పి.రామ్‌ప్రసాద్‌రెడ్డి తెలిపారు. విజయవాడలో ఆర్టీసీ అధికారుల సమీక్షలో బుధవారం మంత్రి మాట్లాడుతూ.. ఇకపై విద్యుత్ బస్సులనే కొంటామన్నారు. త్వరలో 750 విద్యుత్ బస్సులను ప్రవేశపెడతామని చెప్పారు. సమావేశంలో ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ పాల్గొన్నారు.

ఉద్యోగుల వెతలు.. సీఎస్ కబుర్లు..!

డిమాండ్లపై హామీ లేని జేఎస్‌సీ భేటీ • నిరాశతో వెనుదిరిగిన సంఘాల నేతలు



ఉద్యోగ సంఘాలతో మాట్లాడుతున్న సీఎస్, అధికారులు

సాక్షి, అమరావతి: కూటమి ప్రభుత్వం నుంచి తీపి కబురు వస్తుందని ఆశించిన ప్రభుత్వ ఉద్యోగులకు మరోసారి నిరాశే మిగిలింది. ప్రభుత్వం ఏర్పడిన ఏడాది తరువాత ఎన్నో ఆశలతో బుధవారం వెలగపూడి సచివాలయంలో జరిగిన జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ (జేఎస్‌సీ) సమావేశంలో ఏ సమస్యపైనా ఉద్యోగులకు స్పష్టమైన హామీ లభించలేదు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) విజయానంద్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఉద్యోగ సంఘాలు పలు కీలక డిమాండ్లు ప్రస్తావించాయి. ఒక్క అంశంపైనా తక్షణ పరిష్కారం చూపకపోవడంతో ఉద్యోగ సంఘాల నేతలు అసంతృప్తిగా సమావేశం నుంచి వెనుదిరిగారు.

ఉద్యోగుల డిమాండ్లలో కొన్ని...

- 12వ పీఆర్సీ కమిషన్‌ను వెంటనే ఏర్పాటు చేయాలి
- 30 శాతం మధ్యంతర భృతి (ఐఆర్) మంజూరు చేయాలి
- బకాయి నాలుగు డీఏల్లో కనీసం ఒక డీఏ వెంటనే ఇవ్వాలి
- 11వ పీఆర్సీ డీఏ బకాయిలు చెల్లించాలి
- సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ పద్ధతి పునరుద్ధరించాలి
- పెన్షనర్లకు గ్రాట్యుటీ, కమ్యూటేషన్, ఈఎల్ చెల్లింపులు ఇవ్వాలి
- రెసిడెన్షియల్ సొసైటీల్లో ఉద్యోగుల రిటైర్మెంట్ వయస్సు 62 సంవత్సరాలు చేయాలి
- ఈహెచ్ఎస్ కార్డుల సమస్యలు పరిష్కరించి రీయింబర్స్‌మెంట్ పరిమితి రూ.5 లక్షలకు పెంచాలి.

వీటిపై సీఎస్ ఏమన్నారంటే

''ఉద్యోగులకు సంబంధించి 114 అంశాలు పెండింగులో ఉన్నాయి. ఉద్యోగుల అన్ని సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తాను. కేబినెట్‌లో చర్చించి నిర్ణయం తీసుకుంటాం. ఆర్థికేతర సమస్యలపై సానుకూలంగా స్పందిస్తాం'' అని మాత్రమే సీఎస్ 'హామీ' ఇచ్చారు.

నేతల అసంతృప్తి ఇలా...

ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు



ఉద్యోగుల బకాయిలు రూ.30 వేల కోట్లు దాటిపోయాయి. ఒక ఉద్యోగికి ఎంత బకాయి ఉందో పే స్లిప్‌లో చూపించాలని మేము డిమాండ్ చేశాం. సీఎం అధికారంలోకి రాగానే ఐఆర్ ఇస్తామని హామీ ఇచ్చారు. ఆ హామీ ఎప్పుడు అమలవుతుందని ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు.

– బొప్పరాజు వెంకటేశ్వర్లు, ఏపీజేఏసీ అమరావతి అధ్యక్షులు

తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉద్యోగులు



పీఆర్సీ కమిషన్ చైర్మన్ నియామకం, 30 శాతం ఐఆర్, కనీసం ఒక డీఏ వెంటనే ఇవ్వాలని మేము కోరాం. ఉద్యోగుల బకాయిలు ఇవ్వకపోవడంతో 14 నెలలుగా వారు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు.

–విద్యాసాగర్, ఏపీఎన్జీవో అధ్యక్షులు

టీచర్ల సమస్యలు పరిష్కరించాలి



పాఠశాల విద్యా సమస్యలు, టీచర్ల అంశాలను ప్రస్తావించాం. అంగవైకల్యం ఉన్న ఉపాధ్యాయులకు ఫేషియల్ రికగ్నిషన్ నుంచి మినహాయింపు ఇవ్వాలి. మున్సిపల్ టీచర్లకు జీపీఎఫ్ సౌకర్యం కల్పించాలి

–జి. హృదయరాజు, ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు

ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

ఏపీ సెక్రటేరియట్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.వెంకటరామిరెడ్డి ధ్వజం
జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశానికి వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారని ఆగ్రహం



వెంకటరామిరెడ్డిని అడ్డుకున్న పోలీసులు

సాక్షి, అమరావతి: ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఏపీ సెక్రటేరియట్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.వెంకటరామిరెడ్డి విమర్శించారు. ఉద్యోగులకు ఇచ్చిన హామీల గురించి ప్రశ్నిస్తామనే తనను జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశానికి వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారని మండిపడ్డారు. ఎన్నికల్లో ఉద్యోగులకు ఇచ్చిన ఒక్క హామీ కూడా ప్రభుత్వం నెరవేర్చలేదని ధ్వజమెత్తారు. బుధవారం వెలగపూడి సచివాలయంలో జరిగిన జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశానికి ఆయనను పోలీసులు అనుమతించలేదు. ప్రధాన గుర్తింపు సంఘానికి రాష్ట్ర అధ్యక్షుడిగా సమావేశంలో పాల్గొనాల్సిన తనను అనుమతించకపోవడం కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యల్లో భాగమేనని వెంకటరామిరెడ్డి విమర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే గత ప్రభుత్వం నియమించిన పీఆర్‌సీ కమిషనర్ రాజీనామా చేశారని, ఇప్పటివరకు కొత్త కమిషనర్‌ను నియమించలేదని పేర్కొన్నారు. ఉద్యోగుల పీఆర్‌సీ ప్రక్రియను ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే వాయిదా వేస్తోందని మండిపడ్డారు. అధికారం చేపట్టిన వెంటనే ఐఆర్ ఇస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారని, ఏడాది దాటినా ఆ హామీ అమలు కాలేదని మండిపడ్డారు.

సీపీఎస్, జీపీఎస్‌పై నోరుమెదపరేం

సీపీఎస్, జీపీఎస్ సమస్యలపై కూడా ప్రభుత్వం నోరుమెదపలేదని, కనీసం సమీక్షకు కమిటీని కూడా ఏర్పాటు చేయలేదని వెంకటరామిరెడ్డి విమర్శించారు. ఉద్యోగుల పెండింగ్ బిల్లులు చెల్లిస్తామని కూటమి మేనిఫెస్టోలో స్పష్టంగా చెప్పినా, ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని మండిపడ్డారు. పోలీసులకు సరెండర్ లీవ్ బిల్లులు సంక్రాంతి నాటికి చెల్లిస్తామని ఆర్థిక మంత్రి చెప్పినా పూర్తిగా చెల్లించలేదన్నారు. ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్, కన్సాలిడేటెడ్ ఉద్యోగులకు ప్రభుత్వం పథకాలు వర్తింపజేస్తామని హామీ ఇచ్చినా, ఇప్పటివరకు ఒక్క పథకం కూడా అమలు కాలేదని వెంకటరామిరెడ్డి విమర్శించారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకుంటే పోరాటం తప్పదని సర్కారును హెచ్చరించారు.

రెండ్రోజుల్లో అనంత ఎమ్మెల్యే క్షమాపణ చెప్పాలి

- ఎమ్మెల్యేను టీడీపీ నుంచి సస్పెండ్ చెయ్యాలి
- చలో అనంతపూర్ నిర్వహించి ఎమ్మెల్యే ఇల్లు ముట్టడిస్తాం
- జూనియర్ ఎన్టీఆర్ అభిమానుల హెచ్చరిక
- ఏపీలో ప్రెస్‌మీట్ పెట్టుకునే పరిస్థితి లేదు



సమావేశంలో పాల్గొన్న ఎన్టీఆర్ అభిమానులు

హైదరాబాద్ : 'జూనియర్ ఎన్టీఆర్ తల్లి షాలినిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన అనంతపురం టీడీపీ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్‌ను టీడీపీ నుండి వెంటనే సస్పెండ్ చెయ్యాలని.. రెండ్రోజుల్లో ఆయన బహిరంగ క్షమాపణ చెప్పాలని.. లేదంటే అనంతపురం ముట్టడిస్తామని ఎన్టీఆర్ అభిమానులు హెచ్చరించారు. 'నందమూరి' కోడలిని తిడితే ఎలా ఒప్పుకుంటామని వారు బుధవారం హైదరాబాద్ సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రెస్‌మీట్ పెట్టుకునే పరిస్థితి లేదన్నారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఎవరికైతే ఫోన్‌చేసి బూతులు మాట్లాడాడో అతన్ని పక్కన కూర్చోపెట్టుకుని బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎన్టీఆర్ అభిమానులు నరేంద్ర చౌదరి, సుధీర్ రాజు, కావూరి కృష్ణ, బాబ్జి, ఆదోని ముజీబ్‌లు ఏమన్నారంటే..

ఎమ్మెల్యేను టీడీపీ నేతలు నిలదీయాలి..

ప్రజాప్రతినిధి అయి ఉండి దగ్గుపాటి ఒక మాతృమూర్తిని నోటికి ఎంతవస్తే అంత సోయిలేకుండా మాట్లాడడం సభ్యసమాజం తలదించుకునేలా ఉంది. టీడీపీ అంటే మహిళలను ఎంతో గౌరవించే పార్టీ అని గొప్పగా చెప్పుకునే నాయకులు ఇలా ఒక స్త్రీ గురించి ఎందుకు మాట్లాడాడో ఆయన్ని నిలదీయాలి. ప్రసాద్ అనే ఎమ్మెల్యే వెనక ఎన్టీఆర్ స్థాపించిన టీడీపీ లేకపోతే మా సత్తా ఏమిటో చూపించే వాళ్లం. తప్పుచేసి ఇప్పుడు నా వాయిస్ కాదు అని అంటున్నాడు. కానీ, ఫోన్‌లో మాట్లాడిన అభిమాని మాత్రం ఎమ్మెల్యేనే మాట్లాడాడని స్పష్టంగా చెబుతున్నాడు. దీంతో.. ఎమ్మెల్యే ప్రసాద్ అతనిని, అతని కుటుంబాన్ని బెదిరిస్తున్నాడు. ప్రభుత్వం సినిమాకు అనుమతిచ్చిన తరువాత 'ఎలా రిలీజ్ చేస్తారు' అని అనడానికి ఎమ్మెల్యే ఎవరు? 25 ఏళ్లుగా తలాతోక లేనివారు ఎంతోమంది నానా రకాలుగా ఇబ్బందులు పెట్టారు. అయితే, ఎన్టీఆర్ ఏనాడూ ఎవ్వరినీ ఒక్కమాట కూడా అనలేదు. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ రెండ్రోజుల్లో బహిరంగంగా క్షమాపణ చెప్పకపోతే చలో అనంతపురం నిర్వహించి ఎమ్మెల్యే ఇల్లు ముట్టడిస్తాం. అక్కడి ఎన్టీఆర్ విగ్రహాల వద్ద నిరసన, రాస్తారోకో చేస్తాం. ఎన్టీఆర్ యువసైన్యం తన సత్తా చూపిస్తుంది.

ఏపీలో ప్రెస్‌మీట్ పెట్టే పరిస్థితి లేదు..

ఇక ఈ ప్రెస్‌మీట్ అనంతపురంలో పెట్టాల్సింది. కానీ, అక్కడ పోలీసులు విపరీతమైన ఆంక్షలు పెట్టి మీడియా సమావేశం పెట్టకుండా అడ్డుకుంటున్నారు. విజయవాడలో పెడదామనుకున్నా అక్కడ కూడా పెట్టకూడదంటున్నారు. ఏపీలోని అన్ని జిల్లాల్లో ఇదే పరిస్థితి ఉండడంతో చివరికి హైదరాబాద్‌కు వచ్చి సమావేశం పెట్టాల్సి వచ్చింది.

వీఆర్‌లో ఉన్న వారికి పోస్టింగ్‌లు ఇవ్వాలి

వైఎస్సార్‌సీపీ ఎంప్లాయిస్ అండ్ పెన్షనర్స్ వింగ్ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి



సాక్షి, అమరావతి : తమకు నచ్చని అధికారులను వేకెన్సీ రిజర్వు పేరుతో నెలల తరబడి పోస్టింగు ఇవ్వకుండా, జీతాలు చెల్లించకుండా వేధించడం సరికాదని వైఎస్సార్‌సీపీ ఎంప్లాయిస్ అండ్ పెన్షనర్స్ వింగ్ రాష్ట్ర అధ్యక్షుడు నలమారు చంద్రశేఖర్‌రెడ్డి టీడీపీ కూటమి పాలనపై మండిపడ్డారు. పీ-4 పేరుతో ఉద్యోగులు పేద కుటుంబాలను దత్తత తీసుకోవాలనడం సరికాదని.. కా వాలంటే టీడీపీలో ఉన్న సంపన్నులు, అధికార పార్టీ ఎమ్మెల్యేలు ఒకొక్కరు వందమందిని దత్తత తీసుకోవాలని సూచించారు. ఉద్యోగులకు అబద్ధపు హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక తిరిగి వారిపైనే దాడులు చేయడంపై ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం చంద్రశేఖర్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఏమన్నారంటే.. టీడీపీ కూటమి ప్రభుత్వం సుమారు 199 మందిని వీఆర్ పేరుతో పక్కన పెట్టింది. వీరికి తక్షణమే పోస్టింగులు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాం' అని చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు.

విశాఖ ఉక్కు అమ్మకం కుట్రలో బాబు, పవన్ భాగస్తులే!

మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విశాఖ ఉక్కు కర్మాగారం అమ్మకానికి కేంద్రం చేస్తున్న కుట్రలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఇద్దరూ భాగస్తులేననే అనుమానం తలెత్తుతోందని మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మండిపడ్డారు. బుధవారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. డిసెంబర్‌లోపు విశాఖ స్టీల్ ప్లాంట్‌ను విక్రయించేందుకు కేంద్రం రంగం సిద్ధం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో విశాఖ స్టీల్ ప్లాంట్‌ను నూటికి నూరు పాళ్లు అమ్మేయాలని కేబినెట్ కమిటీ ఆన్ ఎకనామిక్ ఎఫైర్స్ తీసుకున్న నిర్ణయానికి ఇప్పటికీ కట్టుబడి ఉన్నామని పార్లమెంట్ సాక్షిగా కేంద్ర ప్రభుత్వం స్పష్టంగా చెప్పడం దీనికి బలం చేకూరుస్తోందని వడ్డే పేర్కొన్నారు. స్టీల్ ప్లాంట్‌లో ఇప్పటికే కొన్ని వేల మంది కాంట్రాక్ట్ కార్మికులను తొలగించారని, తాజాగా 32 విభాగాలను ప్రైవేటు పరం చేసేందుకు చర్యలు చేపట్టారని విమర్శించారు. కేంద్ర ఉక్కు మంత్రి కర్ణాటకకు చెందిన కుమారస్వామి తన సొంత రాష్ట్రంలో ఓ కేంద్ర ప్రభుత్వం రంగ సంస్థ మూతపడేందుకు సిద్ధంగా ఉంటే దానిని అమ్మివేయాలన్న నిర్ణయాన్ని వెనుక్కు తీసుకుని దానిని నిలబెట్టుకున్నారని, కానీ మన విశాఖ ఉక్కును అమ్మేయడంలో మన పాలకులు భాగస్తులవుతున్నారని వడ్డే ధ్వజమెత్తారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లుతెరిచి విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను ఆపేందుకు కేంద్రంపై ఒత్తిడి పెంచాలని డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ విక్రయం కనుక జరిగితే పవన్, బాబును ప్రజలు క్షమించరని హెచ్చరించారు.

స్మార్ట్ మీటర్లు నిర్ణయం వెనక్కి తీసుకోండి

నివాస గృహాలకు, పరిశ్రమలు, ప్రభుత్వ కార్యాలయాలకు స్మార్ట్ మీటర్లు బిగించాలన్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని మాజీ మంత్రి వడ్డే డిమాండ్ చేశారు. విండ్ సోల్ ప్రాజెక్టుకు నెల్లూరు జిల్లా, కరేడు గ్రామంలో మూడు పంటలు పండే భూములు తీసుకోవడం తగదని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో ఎంఎస్ఎంఈ మాజీ సలహాదారు వీవీఎస్ మహదేవ్ పాల్గొన్నారు.

న్యాయమూర్తులను సత్కరించిన న్యాయవాదుల సంఘం





న్యాయమూర్తులు జస్టిస్ హరినాథ్, జస్టిస్ విజయ్ లను సన్మానిస్తున్న హైకోర్టు న్యాయవాదుల సంఘం కార్యవర్గం



జస్టిస్ సుమతిని సన్మానిస్తున్న హైకోర్టు న్యాయవాదుల సంఘం కార్యవర్గం

సాక్షి, అమరావతి: రాష్ట్ర హైకోర్టు శాశ్వత న్యాయమూర్తులుగా నియమితులైన జస్టిస్ నూనెపల్లి హరినాథ్, జస్టిస్ జగడం సుమతి, జస్టిస్ న్యాపతి విజయ్‌లను హైకోర్టు న్యాయవాదుల సంఘం బుధవారం ఘనంగా సత్కరించింది. హైకోర్టు అసోసియేషన్ హాల్‌లో సంఘం అధ్యక్షుడు కలిగినీడి చిదంబరం అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా శాశ్వత న్యాయమూర్తులకు శాలువాలు కప్పి జ్ఞాపికలు బహూకరించారు. ఈ కార్యక్రమంలో అదనపు సొలిసిటర్ జనరల్ (ఏఎస్‌జీ) చల్లా ధనంజయ, సంఘం ఉపాధ్యక్షుడు రఘువీర్, ప్రధాన కార్యదర్శి చేజర్ల సుబోధ, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

చంద్రబాబు సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకుంటారు

- ఎన్టీఆర్–చంద్రబాబు మధ్య న్యాయ పోరాటంలో తీర్పునిచ్చిన వారిలో నేనూ ఒకరిని
- ఇండియా కూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ : 'చంద్రబాబునాయుడితో నాకు ప్రత్యేక అనుబంధం ఉందని కానీ, అలా అని సంబంధం లేదని కానీ చెప్పలేను. అప్పట్లో ఆయన యువ ముఖ్యమంత్రి. ఒక కొత్త ఆలోచనా ధోరణితో రాజకీయాల్లోకి వచ్చిన వ్యక్తి. 1995లో ఎన్టీ రామారావు–చంద్రబాబు మధ్య జరిగిన న్యాయ పోరాటానికి సంబంధించి తీర్పు ఇచ్చిన వారిలో నేనూ ఒకరిని. ప్రస్తుతం సుదీర్ఘ రాజకీయ అనుభవం, మంచీ.. చెడు బేరీజు వేసే పరిజ్ఞానం బాగా ఉన్న సీనియర్ నేత ఆయన. ఎవరికి ఓటేయాలో సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకుంటారని ఆశిస్తున్నా' అని ఇండియా కూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన ఢిల్లీలో 'సాక్షి', ఇతర ఛానెళ్లతో మాట్లాడారు. ప్రస్తుత ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో సంఖ్యాబలాన్ని పక్కన పెడితే ఇండియా కూటమికే ప్రజా బలం ఎక్కువగా ఉందని చెప్పారు. ఎన్డీయే ఎంపీలు కూడా తనకు ఓటు వేస్తారన్న ధీమా వ్యక్తం చేశారు. తనకు ఎన్డీయే కూటమిలోని చాలా మందితో వ్యక్తిగత పరిచయాలు ఉన్నాయని చెప్పారు. 'నేను ఏ రాజకీయ పార్టీకి చెందిన వాడిని కాదు. సుప్రీంకోర్టులో న్యాయమూర్తిగా, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేశా. ఇప్పుడు ఇండియా కూటమి నన్ను ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా ఎంచుకుంది. ఉప రాష్ట్రపతి పదవి రాజకీయ పార్టీలు చేసే రోజువారీ రాజకీయాలతో సంబంధం లేని నిష్పక్షపాత వ్యవస్థ. అందుకే పోటీలో ఉండాలనుకున్నా. ప్రధాని నరేంద్ర మోదీ ఎన్డీఏ కూటమి అభ్యర్థికి మద్దతు ఇవ్వాలని అందరినీ కోరారు. అలాగే నేను కూడా సాధ్యమైనంత వరకు ఎంపీలందరినీ కలుస్తాను. నా అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలని కోరతా..' అని జస్టిస్ సుదర్శన్‌రెడ్డి చెప్పారు. కాగా, ఆయన గురువారం నామినేషన్ వేయనున్నారు.

బీఎన్ఎస్ సెక్షన్ 104ని రద్దు చేయండి

- హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వివరణ కోరిన హైకోర్టు



సాక్షి, అమరావతి: హత్య కేసులో జీవితఖైదు అనుభవిస్తున్న వ్యక్తి మళ్లీ హత్యకు పాల్పడితే అతనికి మరణశిక్ష లేదా ఆజన్మాంత జైలు శిక్ష విధించేందుకు అవకాశం కల్పిస్తున్న భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని 104 సెక్షన్‌ను కొట్టేయాలని కోరుతూ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలైంది. ఈ సెక్షన్ 104 రాజ్యాంగ విరుద్ధమే కాక ప్రాథమిక హక్కులను కూడా ఉల్లంఘించేలా ఉందంటూ విశాఖపట్నం జిల్లా, చోడవరానికి చెందిన బగ్గ వెంకట సత్య చంద్రశేఖర్ వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన హైకోర్టు... కేంద్ర న్యాయ శాఖ, కేంద్ర హోంశాఖ కార్యదర్శులు, రాష్ట్ర న్యాయశాఖ, రాష్ట్ర హోంశాఖ ముఖ్య కార్యదర్శులకు నోటీసులు జారీ చేసింది. పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. అంతకు ముందు పిటిషనర్ తరఫు న్యాయవాది ఆకుల శ్రీకృష్ణ సాయి భార్గవ్ వాదనలు వినిపించారు. మరణశిక్షకు అవకాశం ఇచ్చిన ఐపీసీ సెక్షన్ 303ని రద్దు చేస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినప్పటికీ, జీవితఖైదు అనుభవిస్తున్న వ్యక్తి మళ్లీ హత్య చేస్తే అతనికి మరణశిక్ష లేదా ఆజన్మాంత జైలు శిక్ష విధించాలంటూ బీఎన్ఎస్ సెక్షన్ 104ను తీసుకురావడం రాజ్యాంగ విరుద్ధమని తెలిపారు. ఈ సెక్షన్ వల్ల న్యాయస్థానాలకు శిక్ష తగ్గింపు కారణాలను పరిగణనలోకి తీసుకునే అవకాశం లేకుండా పోతోందన్నారు. సెక్షన్ 104.. హత్య చేసిన వ్యక్తికి న్యాయస్థానాలు మరణశిక్ష లేదా ఆజన్మాంత జైలు శిక్ష విధించడం మినహా మరో అవకాశం లేకుండా చేస్తోందని తెలిపారు. ఇది సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధమని పేర్కొన్నారు.

పెద్దారెడ్డి కేసులో సింగిల్ జడ్జి ఉత్తర్వుల అమలు నిలుపుదల

జస్టిస్ బట్టు దేవానంద్ నేతృత్వంలోని ధర్మాసనం ఉత్తర్వులు

సాక్షి, అమరావతి: తాడిపత్రిలోని తన ఇంటికి వెళ్లి ఉండేందుకు వీలుగా మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డికి తగిన భద్రత కల్పించాలని పోలీసులను ఆదేశిస్తూ సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వుల అమలును హైకోర్టు ధర్మాసనం నిలుపుదల చేసింది. పెద్దారెడ్డి దాఖలు చేసిన కోర్టు ధిక్కార వ్యాజ్యంలో సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులు అంతకుముందు ఆయన దాఖలు చేసిన ప్రధాన వ్యాజ్యంలో ఇచ్చిన ఉత్తర్వుల పరిధికి మించి ఉన్నాయని ధర్మాసనం తెలిపింది. ఇందుకు ప్రాథమిక ఆధారాలు ఉన్నాయని పేర్కొంది. ప్రతివాది పెద్దారెడ్డికి నోటీసులు ఇచ్చింది. విచారణను సెప్టెంబర్ 10కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ అవధానం హరిహరనాథశర్మ ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది.

2024 ఎన్నికల్లో ఓటమి తరువాత తనను తాడిపత్రిలోకి అడుగుపెట్టనివ్వడం లేదని, తన ఇంటికి వెళ్లేందుకు అనుమతినివ్వడం లేదంటూ పెద్దారెడ్డి గత ఏడాది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా విచారణ జరిపిన హైకోర్టు సింగిల్ జడ్జి.. పిటిషనర్ పెద్దారెడ్డిని తాడిపత్రి నియోజకవర్గంలోకి అనుమతించాలని, ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. అయినా పోలీసులు పట్టించుకోకపోవడంతో పెద్దారెడ్డి కోర్టుధిక్కార పిటిషన్ దాఖలు చేశారు. దీంతో విచారణ జరిపిన సింగిల్ జడ్జి పెద్దారెడ్డికి తగిన భద్రత కల్పించి ఆయన ఇంటికి అనుమతించాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ ఎస్పీ పి.జగదీష్, తాడిపత్రి ఎస్‌హెచ్‌వో సాయిప్రసాద్ లెటర్ పేటెంట్ అప్పీల్ (ఎల్‌పీఏ) దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై జస్టిస్ దేవానంద్ నేతృత్వంలోని ధర్మాసనం బుధవారం విచారణ జరిపి సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వుల అమలును నిలిపేసింది. విచారణను వచ్చే నెల 10వ తేదీకి వాయిదా వేసింది.

బీఎల్‌ఏల నియామకంపై ప్రత్యేక దృష్టి

- 31 నాటికి కేంద్ర కార్యాలయానికి బూత్ లెవల్ ఏజెంట్ల జాబితాలు
- రీజినల్ కో–ఆర్డినేటర్లు, జిల్లా అధ్యక్షులు, నేతలతో సజ్జల టెలీకాన్ఫరెన్స్



సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ బూత్ లెవల్ ఏజెంట్ల (బీఎల్‌ఏ) నియామకంపై నాయకులంతా సీరియస్‌గా దృష్టి పెట్టాలని పార్టీ రాష్ట్ర కో–ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి సూచించారు. దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితాపై ఎన్నికల సంఘం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌కు సిద్ధమైన నేపథ్యంలో అందరూ సమన్వయంతో ముందుకెళ్లాలని చెప్పారు. పోలింగ్ బూత్ నెంబర్, లొకేషన్, బూత్‌లకు అనుసంధానించిన ఓటర్ల రీ లొకేషన్ లాంటి కీలక అంశాలపై ఇప్పటికే రాజకీయ పార్టీలకు సమాచారం ఇచ్చిందన్నారు. దీనిపై నేతలంతా అప్రమత్తంగా ఉండాలని ఇప్పటికే పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ ఆదేశించారని గుర్తు చేశారు. బీఎల్‌ఏలు బూత్ లెవల్ ఆఫీసర్‌తో సమన్వయం చేసుకోవాలని పేర్కొన్నారు. బుధవారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి రీజనల్ కో–ఆర్డినేటర్లు, జిల్లా అధ్యక్షులు, పార్లమెంట్ నియోజకవర్గాల పరిశీలకులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు (కో–ఆర్డినేషన్), రాష్ట్ర ప్రధాన కార్యదర్శి (అనుబంధ విభాగాల ఇన్‌ఛార్జ్), రాష్ట్ర కార్యదర్శులు (కో–ఆర్డినేషన్), ఎంపీలు, పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్తలు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లతో సజ్జల టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆగస్టు 31 నాటికి బూత్‌లెవల్ ఏజెంట్ల పేర్ల జాబితాలను కేంద్ర కార్యాలయానికి పంపాలన్నారు. కమిటీల నియామకం ఇప్పటికే పూర్తైనందున తక్షణం బీఎల్‌ఏలపై దృష్టి పెట్టాలన్నారు. 20 బూత్‌లకు ఒక సీనియర్ లీడర్‌ను నియమించుకుని టాస్క్‌ఫోర్స్ టీమ్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. టెలీకాన్ఫరెన్స్‌లో పార్టీ సీనియర్ నేత బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ జిల్లా పార్టీ అధ్యక్షులు కలెక్టరేట్‌తో సమన్వయం చేసుకుంటే మరింత ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

ఆన్‌లైన్ గేమింగ్‌పై నిషేధాస్త్రం

'ప్రమోషన్ అండ్ రెగ్యులేషన్ ఆఫ్ ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు-2025'కు లోక్‌సభ ఆమోదం

- ఆన్‌లైన్ మనీ గేమ్‌లు నిర్వహించినా, ప్రచారం చేసినా జైలుశిక్ష, భారీ జరిమానా
- నగదు బదిలీలకు వీలు కల్పించినా నేరమే
- ఇలాంటి గేమ్‌లతో యువత భవిష్యత్తు దెబ్బతింటోందని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఆందోళన
- డబ్బు ప్రమేయం లేని ఈ-స్పోర్ట్స్, ఆన్‌లైన్ సోషల్ గేమింగ్‌కు ప్రోత్సాహం

న్యూఢిల్లీ: దేశంలో జనం జేబులను గుల్లచేస్తూ, వారి ప్రాణాలను బలి తీసుకున్న ఆన్‌లైన్ గేమ్‌లకు చెక్‌పెట్టే దిశగా అత్యంత కీలకమైన బిల్లును లోక్‌సభ ఆమోదించింది. డబ్బుతో ముడిపడి ఉన్న ఆన్‌లైన్ గేమ్‌లను నిర్వహించినా లేక ప్రోత్సహించినా లేక ప్రచారం చేసినా జైలుశిక్ష లేదా భారీ జరిమానా.. కొన్నిసార్లు జైలు శిక్షతోపాటు జరిమానా కూడా విధించేలా 'ప్రమోషన్ అండ్ రెగ్యులేషన్ ఆఫ్ ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు-2025'ని కేంద్ర ప్రభుత్వం రూపొందించింది. ఆన్‌లైన్ మనీ గేమింగ్‌పై ఉక్కుపాదం మోపుతూ కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ బుధవారం బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టారు. బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్‌ఐఆర్)కు వ్యతిరేకంగా ప్రతిపక్షాలు ఆందోళన కొనసాగించడంతో, చర్చ లేకుండానే ఈ బిల్లు మూజువాణి ఓటుతో సభలో ఆమోదం పొందింది. బిల్లును ఇక రాజ్యసభలో ప్రవేశపెట్టనున్నారు. అక్కడ కూడా ఆమోదం పొందితే రాష్ట్రపతి సంతకంతో చట్టంగా మారుతుంది.


ఆన్‌లైన్ మనీ గేమింగ్ యువతకు వ్యసనంగా మారిందని, వారు ఆర్థికంగా నష్టపోతున్నారని, అప్పులపాలై ఆత్మహత్యకు పాల్పడుతున్నారని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఆందోళన వ్యక్తంచేశారు. ఆన్‌లైన్ గేమింగ్ బిల్లుపై ఆయన లోక్‌సభలో కొద్దిసేపు మాట్లాడారు. డబ్బుతో ప్రమేయం లేని ఈ-స్పోర్ట్స్, ఆన్‌లైన్ సోషల్ గేమింగ్‌ను ప్రోత్సహించాలని ప్రభుత్వం భావిస్తోందని, ఇందుకోసం ఒక అథారిటీని ఏర్పాటు చేసే అవకాశం ఉందని తెలిపారు. ఆన్‌లైన్ మనీ గేమింగ్ యాప్‌ల వల్ల యువత నష్టపోవడంతోపాటు మనీ లాండరింగ్, ఆర్థిక నేరాలు, మోసాలు సైతం జరుగుతున్నాయని గుర్తుచేశారు. యాప్‌ల ద్వారా ఉగ్రవాద సంస్థలకు నిధులు అందుతాయని తెలిపారు. దీనిపై చర్చలో పాల్గొనాలని ప్రతిపక్ష సభ్యులను కోరగా, వారు వినిపించుకోలేదు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా స్పందిస్తూ... ప్రమాదకరమైన ఆన్‌లైన్ ఆటల వల్ల ఎన్నో కుటుంబాలు నాశనమయ్యాయని, యువత భవిష్యత్తు దెబ్బ తిన్నదని ఆవేదన వ్యక్తంచేశారు. ఆన్‌లైన్ గేమ్‌లపై ప్రభుత్వం నిషేధం విధించాలని గతంలో ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయని అన్నారు. ఎస్‌ఐఆర్ చర్చించాలని పట్టుబడుతూ విపక్షాలు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తుండడంతో స్పీకర్ సభను గురువారానికి వాయిదా వేశారు.

ఎన్నో కుటుంబాలు నాశనం: స్పీకర్

ఏమిటీ బిల్లు?

- అన్ని రకాల ఆన్‌లైన్ బెట్టింగ్, గ్యాంబ్లింగ్(సట్టా, పోకర్, రమ్మీ, కార్డ్ గేమ్స్)తో పాటు ఆన్‌లైన్ ఫ్యాంటసీ స్పోర్ట్స్, ఆన్‌లైన్ లాటరీలను నిషేధిస్తూ ఈ బిల్లును తీసుకొచ్చారు. డబ్బులు పెట్టి ఆన్‌లైన్‌లో ఆడే క్రీడలపై నిషేధం అమలవుతుంది.
- ఆన్‌లైన్ గేమ్‌లకు ప్రచారం చేసినవారు కూడా నేరస్తులే. ఇలాంటి గేమ్‌ల్లో ఒకరి నుంచి మరొకరికి ఆన్‌లైన్‌లో నగదు బదిలీలకు వీలు కల్పించిన బ్యాంక్‌లు లేదా ఆర్థిక సంస్థలను సైతం శిక్షిస్తారు.
- ఆన్‌లైన్ గేమ్‌ను ఏ రూపంలో నిర్వహించినా, ప్రోత్సహించినా, ప్రచారం చేసినా నేరమే. అంటే కంప్యూటర్ లేదా మొబైల్ ఫోన్ ద్వారా చేసినా నేరంగా పరిగణిస్తారు. సోషల్ మీడియా లేదా పత్రికలు లేదా టీవీల్లో ప్రచారం చేసినా శిక్ష తప్పదు.
- నైపుణ్యం లేదా అదృష్టం(చాయిస్)పై ఆధారపడిన ఏ గేమ్ అయినా నిషిద్ధమే.
- మన దేశంలోనే కాకుండా.. దేశ సరిహద్దుల్లో లేదా విదేశీ గడ్డపై నుంచి గేమ్‌లను నిర్వహించినా దోషులే అవుతారు.
- ఈ బిల్లు ప్రకారం.. ఆన్‌లైన్ గేమ్‌ల్లో పాల్గొన్నవారిని దోషులుగా కాకుండా బాధితులుగానే పరిగణిస్తారు.
- డబ్బుతో సంబంధం లేదని ఈ-స్పోర్ట్స్, ఎడ్యుకేషనల్ గేమ్స్, సోషల్ గేమ్స్‌కు కొన్ని నియంత్రణలను బిల్లు సూచిస్తోంది.
- సమాజంలో అశాంతి తలెత్తకుండా చూడాలని, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని బిల్లులో పొందుపర్చారు. డిజిటల్ టెక్నాలజీని బాధ్యతాయుతంగా వాడుకొనేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.
- డబ్బు ప్రమేయం లేని ఈ-స్పోర్ట్స్ చట్టబద్ధమే అవుతాయి. ఇందుకోసం కేంద్ర క్రీడల శాఖ కొన్ని మార్గదర్శకాలు, ప్రమాణాలు రూపొందించాలని బిల్లులో సూచించారు. విద్యా, సాంస్కృతిక విలువలను పెంపొందించడానికి, నైపుణ్యాభివృద్ధికి, సమాజంలో ప్రజల మధ్య అనుసంధానానికి ఆన్‌లైన్ సోషల్ గేమ్స్‌ను ప్రోత్సహించవచ్చు. ఈ మేరకు కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ, కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ చర్యలు తీసుకోవాలి.
- ఈ-స్పోర్ట్స్‌కు సంబంధించి శిక్షణ, పరిశోధనలకు ప్రభుత్వం మద్దతు ఇస్తుంది.
- మానసికోల్లాసం, నైపుణ్యాభివృద్ధి కోసం సోషల్, ఎడ్యుకేషన్ గేమ్స్ ఆడుకోవచ్చు.
- ఆన్‌లైన్ గేమ్‌లను వర్గీకరించడానికి, రిజిస్టర్ చేసుకోవడానికి రూ.50 కోట్లతో జాతీయ స్థాయిలో గేమింగ్ అథారిటీ ఏర్పాటు చేస్తారు. దీనికి ప్రతిఏటా రూ.20 కోట్లు కేటాయిస్తారు. ఎలాంటి గేమ్ అనేది ఈ అథారిటీ నిర్ణయిస్తుంది. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తుంది.

ఇండియాలో ఆన్‌లైన్ మనీ గేమ్‌ల వల్ల ప్రతిఏటా 45 కోట్ల మంది దాదాపు రూ.20,000 కోట్లు నష్టపోతున్నట్లు ప్రభుత్వం అంచనా వేసింది.



గేమింగ్ సంస్థల అభ్యంతరాలు

ఆన్‌లైన్ మనీ గేమింగ్‌ను నిషేధించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని గేమింగ్ సంస్థలు గట్టిగా వ్యతిరేకిస్తున్నాయి. ఇండియా గేమింగ్ ఫెడరేషన్, ఈ-గేమింగ్ ఫెడరేషన్, ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఫాంటసీ స్పోర్ట్స్ వంటి సంస్థలు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాకు లేఖ రాశాయి. మన దేశంలో ఆన్‌లైన్ స్కిల్ గేమింగ్ పరిశ్రమ నానాటికీ వృద్ధి చెందుతోందని, దీని విలువ రూ.2 లక్షల కోట్లకు చేరిందని వెల్లడించాయి. ఈ గేమ్‌లతో ప్రతిఏటా రూ.31,000 కోట్లకుపైగా ఆదాయం వస్తోందని తెలిపాయి. ప్రభుత్వానికి ప్రత్యక్ష, పరోక్ష పన్నుల ద్వారా ఏటా రూ.20,000 కోట్లకు పైగా ఆదాయం లభిస్తోందని గుర్తుచేశాయి. ఈ పరిశ్రమ ప్రతి సంవత్సరం 20 శాతం వృద్ధి రేటు నమోదు చేస్తోందని, 2028 నాటికి రెండురెట్లు అవుతుందని పేర్కొన్నాయి. అందుకే ఆన్‌లైన్ గేమ్‌లను నిషేధించాలన్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని విజ్ఞప్తి చేశాయి.

శిక్షలేమిటి?

- ఆన్‌లైన్ గేమ్‌లు నిర్వహిస్తే మూడేళ్ల వరకు జైలుశిక్ష పడుతుంది లేదా రూ.కోటి దాకా జరిమానా చెల్లించాల్సి రావొచ్చు. కొన్ని సార్లు ఈ రెండు శిక్షలూ అనుభవించాలి.
- ఆన్‌లైన్ మనీ గేమ్‌లకు ప్రచారం చేస్తే రెండేళ్ల దాకా జైలు శిక్ష లేదా రూ.50 లక్షల జరిమానా విధిస్తారు. కొన్ని సందర్భాల్లో ఈ రెండు శిక్షలూ విధించవచ్చు.
- నగదు బదిలీలకు సహకరిస్తే మూడేళ్ల దాకా జైలుశిక్ష లేదా రూ.కోటి జరిమానా విధిస్తారు. కొన్ని సందర్భాల్లో రెండు శిక్షలూ విధించడానికి ఆస్కారం ఉంటుంది.
- ఆన్‌లైన్ గేమ్‌లు నిర్వహిస్తూ మళ్లీమళ్లీ దొరికిపోతే 3 నుంచి 5 సంవత్సరాల దాకా జైలుశిక్ష, రూ.2 కోట్ల దాకా జరిమానా తప్పదు.
- నిందితులపై నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేస్తారు. వారెంట్ లేకుండానే నిందితులను అరెస్టు చేయొచ్చు, విచారించవచ్చు.
- ఆన్‌లైన్ గేమ్‌లకు ప్రచారం కల్పిస్తే సినిమా నటులైనా, క్రికెట్ ఆటగాళ్లయినా, ఇతర ప్రముఖులైనా శిక్ష నుంచి ఎలాంటి మినహాయింపులు ఉండవు.
- ఆన్‌లైన్ గేమ్‌లను నిషేధించడం వల్ల ప్రభు త్వం కొంత ఆదాయం కోల్పోయే పరిస్థితి ఉన్నప్పటికీ ప్రజల సంక్షేమాన్ని, సమాజం బాగును దృష్టిలో పెట్టుకొని నిషేధం వైపే మొగ్గు చూపినట్లు సీనియర్ అధికారి చెప్పారు.

ప్రజా ప్రభుత్వాల మనుగడ

గవర్నర్ల దయపైనా?

- సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు
- ప్రభుత్వం, గవర్నర్ మధ్య సామరస్యమేది?
- రెండోసారి ఆమోదించే బిల్లు రాష్ట్రపతి పరిశీలనకా?
- గవర్నర్‌కు ఆ అధికారాలు లేవు: సీజేఐ
- లేని అధికారం తలకెత్తుకుంటున్న సుప్రీం
- తీవ్ర అభ్యంతరం వెలిబుచ్చిన కేంద్రం



న్యూఢిల్లీ: "దేశ పాలన వ్యవస్థలో అతి కీలకమైన గవర్నర్, రాష్ట్ర ప్రభుత్వాల నడుమ సామరస్యం ఉందా? అతి పెద్ద అధికార కేంద్రాలైన ఈ రెండు వ్యవస్థల నడుమ పలు కీలక అంశాలపై రాజ్యాంగంలో పేర్కొన్న మేరకు ప్రజా ప్రయోజనాలే పరమావధిగా సజావుగా సంప్రదింపుల ప్రక్రియ అసలు జరుగుతోందా?"అని సర్వోన్నత న్యాయస్థానం కీలక సందేహాలు లేవనెత్తింది. రాజ్యాంగ నిర్మాతల ఆకాంక్షలను నెరవేర్చడంలో దేశం ఏ మేరకు సఫలమైందో అర్థం కాని పరిస్థితి నెలకొందంటూ ఆవేదన వెలిబుచ్చింది. "అసెంబ్లీలు ఆమోదించే బిల్లులను గవర్నర్ నిరవధికంగా పెండింగ్‌లో ఉంచితే పరిస్థితేమిటి? మెజారిటీ ప్రజల తీర్పు ఆధారంగా ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వ మనుగడ గవర్నర్ల చపలత్వంపై ఆధారపడ్డట్టేగా! ఇది ఏ మేరకు సబబు? రాష్ట్రంలో పాలన తదితరాలపై దీని ప్రభావం తీవ్రంగా ఉండదా?"అంటూ ప్రశ్నాస్త్రాలు సంధించింది. అసెంబ్లీ రెండోసారి ఆమోదించి పంపే బిల్లులను రాష్ట్రపతి పరిశీలనకు పంపే అధికారం గవర్నర్లకు లేదని పునరుద్ఘాటించింది. "ఆర్టికల్ 200 ప్రకారం ఈ విషయంలో గవర్నర్ ముందు నాలుగు మార్గాలున్నాయి. బిల్లుకు ఆమోదం, పెండింగ్, రాష్ట్రపతి పరిశీలనకు పంపడం, అసెంబ్లీ పరిశీలనకే తిప్పి పంపడం. అసెంబ్లీ గనక బిల్లును మళ్లీ ఆమోదించి పంపితే దాన్ని రెండోసారి రాష్ట్రపతి పరిశీలనకు పంపే అధికారం గవర్నర్‌కు లేదు"అని స్పష్టం చేసింది. రాష్ట్రాల అసెంబ్లీలు ఆమోదించిన బిల్లులకు ఆమోద ముద్ర వేసే విషయంలో గవర్నర్లతో పాటు ఏకంగా రాష్ట్రపతికి కూడా గడువు నిర్దేశిస్తూ సుప్రీంకోర్టు ఇటీవల సంచలనాత్మక తీర్పు వెలువరించడం తెలిసిందే. ఈ విషయంలో సుప్రీంకోర్టు తన పరిధి దాటి వ్యవహరించిందని పలువురు న్యాయ నిపుణులు కూడా అభిప్రాయపడ్డారు. అనంతరం ఈ విషయమై సర్వోన్నత న్యాయస్థానానికి ఉన్న అధికార పరిధిపై పలు రాజ్యాంగపరమైన సందేహాలు లేవనెత్తుతూ ప్రధాన న్యాయమూర్తికి రాష్ట్రపతి ఏకంగా ప్రశ్నావళి పంపడం మరింత కలకలం రేపింది. సీజేఐకి రాష్ట్రపతి ప్రశ్నావళి పంపడం తాలూకు రాజ్యాంగబద్ధతను సవాలు చేస్తూ తమిళనాడు, కేరళ ప్రభుత్వాలు దాఖలు చేసిన పిటిషన్లపై సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ సారథ్యంలోని ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం బుధవారం సుదీర్ఘంగా విచారణ జరిపింది. గవర్నర్ల నియామకం, అధికారాలకు సంబంధించి రాజ్యాంగ పరిషత్‌లో జరిగిన చర్చలను ఉటంకిస్తూ కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు విన్పించారు. కొందరు ఆరోపిస్తున్నట్టుగా గవర్నర్ పదవి రాజకీయ ఆశ్రయానికి ఉద్దేశించినది కానే కాదని మెహతా స్పష్టం చేశారు. రాజ్యాంగం నిర్దేశించిన మేరకు గవర్నర్‌కు పలు కీలక అధికారాలు, బాధ్యతలు దఖలు పడ్డాయని గుర్తు చేశారు. "రాష్ట్రపతికి, గవర్నర్లకు ఇలా గడువు నిర్దేశించడమంటే అత్యున్నత వ్యవస్థల్లో ఒక వ్యవస్థ రాజ్యాంగం తనకు దఖలు పరచని అధికారాలను నెత్తిన వేసుకోవడమే తప్ప మరోటి కాదు. అంతిమంగా ఇది రాజ్యాంగపరమైన అవ్యవస్థకే దారి తీస్తుంది"అని హెచ్చరించారు. గవర్నర్లు తమ విచక్షణాధికారాన్ని అత్యంత పరిమితంగా మాత్రమే ఉపయోగిస్తారని చెప్పుకొచ్చారు. దీనిపై ధర్మాసనం సూటిగా స్పందించింది. "చట్టం అమలు తాలూకు తీరుతెన్నులపై తమ అభిప్రాయాలు వ్యక్తం చేస్తామే తప్ప తమిళనాడు ప్రభుత్వం, గవర్నర్ కేసులో రాష్ట్రపతికి, గవర్నర్లకు గడువు విధిస్తూ సుప్రీం ధర్మాసనం వెలువరించిన నిర్ణయంపై కాదు. ఈ విషయంలో సలహాపూర్వక న్యాయపరిధికే పరిమితం అవుతాం తప్ప అపీల్ కోర్టులా వ్యవహరించబోం"అని స్పష్టం చేసింది. సీజేఐ ధర్మాసనంలో న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విక్రంనాథ్, జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ ఏఎస్ చందూర్కర్ ఉన్నారు.

ఎన్డీయే అభ్యర్థిగా రాధాకృష్ణన్ నామినేషన్

హాజరైన ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు

న్యూఢిల్లీ: ఉప రాష్ట్రపతి ఎన్నికలో అధికార ఎన్డీయే అభ్యర్థిగా పోటీపడుతున్న సి.పి.రాధాకృష్ణన్ బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. నాలుగు సెట్ల నామినేషన్ పత్రాలను ప్రధాని మోదీ రాజ్యసభ సెక్రెటరీ జనరల్, రిటర్నింగ్ అధికారి పి.సి.మోదీకి స్వయంగా అందజేశారు. రాధాకృష్ణన్ అభ్యర్థిత్వాన్ని ప్రతిపాదిస్తూ నామినేషన్ పత్రాలపై ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా, జేడీ(యూ) నేత రాజీవ్ రంజన్ సింగ్ సంతకాలు చేశారు. నామినేషన్ దాఖలు చేసే సమయంలో రాధాకృష్ణన్ వెంట పలువురు కేంద్ర మంత్రులు, ఎన్డీయే సీనియర్ నేతలు ఉన్నారు. అంతకుముందు రాధాకృష్ణన్ పార్లమెంట్ ప్రాంగణంలోని ప్రేరణ స్థల్‌లో మహాత్మా గాంధీతోపాటు పలువురు జాతీయ నాయకులకు నివాళులర్పించారు. సెప్టెంబర్ 9న ఉప రాష్ట్రపతి ఎన్నిక జరుగనుంది. మొత్తం 781 మంది సభ్యులున్న ఎలక్టోరల్ కాలేజీలో అధికార ఎన్డీయేకు స్పష్టమైన మెజార్టీ ఉంది. ఎన్డీయేలో లేని కొన్ని పార్టీలు సైతం రాధాకృష్ణన్‌కు మద్దతు ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఆయన విజయం లాంఛనమేనని చెప్పొచ్చు.

'అగ్ని-5' క్షిపణి పరీక్ష సక్సెస్

న్యూఢిల్లీ/బాలాసోర్: వ్యూహాత్మక సైనిక శక్తి సామర్థ్యాలను చాటడంలో భాగంగా భారత్ తన 'అగ్ని-5' బాలిస్టిక్ క్షిపణిని విజయవంతంగా పరీక్షించింది. ఏకంగా 5,000 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను సైతం ఛేదించగల మధ్యశ్రేణి ఖండాంతర బాలిస్టిక్ క్షిపణి 'అగ్ని-5'ను విజయవంతంగా పరీక్షించినట్లు రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. బుధవారం ఒడిశాలోని చాందీపూర్‌లో ఉన్న సమీకృత పరీక్షకేంద్రం నుంచి ఈ మిస్సైల్‌ను ప్రయోగించినట్లు తెలిపింది. ఇది అన్ని పరామితులను అత్యంత ఖచ్చితత్వంతో సాధించిందని రక్షణశాఖ పేర్కొంది. అగ్ని-5 లక్ష్య పరిధిలోకి దాదాపు ఆసియా ఖండంలోని భూభాగమంతా వస్తుంది. యూరప్‌లోని కొన్ని ప్రాంతాలు సైతం దీని లక్ష్యపరిధిలోనే ఉండటం గమనార్హం. ఆపరేషన్ సిందూర్ పేరిట పాక్‌లోని ఉగ్రస్థావరాలతోపాటు సైనిక స్థావరాలను భారత వాయుసేన నేలమట్టంచేసిన దాదాపు మూడున్నర నెలల తర్వాత అగ్ని-5 క్షిపణి పరీక్షను భారత్ చేపట్టింది. అగ్ని-5ను చివరిసారిగా గత ఏడాది మార్చినెలలో విజయవంతంగా పరీక్షించారు.

రష్యాపై ఒత్తిడి కోసమే భారత్‌పై ఆంక్షలు

స్పష్టంచేసిన అమెరికా

వాషింగ్టన్: ఉక్రెయిన్‌తో యుద్ధానికి తెర దించేందుకు రష్యాను ఒప్పించేలా భారత్‌పై ఒత్తిడి పెంచడమే తాజా సుంకాల మోత లక్ష్యమని అమెరికా వెల్లడించింది. భారత్‌పై సుంకాలను ఇటీవల ఏకంగా 50 శాతానికి పెంచుతూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆకస్మిక నిర్ణయం తీసుకోవడం తెలిసిందే. వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలినా లెవిట్ బుధవారం స్పష్టత ఇచ్చారు. ఉక్రెయిన్ యుద్ధానికి తక్షణం తెర దించి శాంతి నెలకొల్పడమే అధ్యక్షుని ఉద్దేశమని చెప్పారు.

నిందమాటున ప్రభుత్వాలు కూల్చేస్తారా?

మొదటి పేజీ తరువాయి


ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, కేంద్ర, రాష్ట్రమంత్రులను పదవి నుంచి తొలగించేందుకు ఉద్దేశించిన మూడు బిల్లులను లోక్‌సభలో కేంద్రం ప్రవేశపెట్టింది. వెనువెంటనే విపక్ష పార్టీలపాలిత రాష్ట్రాల్లో ప్రభుత్వాలను కూలదోసేందుకే మోదీ సర్కార్ ఇలా అత్యంత వివాదాస్పద మూడు బిల్లులను తీసుకొచ్చిందంటూ బుధవారం లోక్‌సభలో విపక్షపార్టీల ఎంపీలు తీవ్ర ఆందోళనకు దిగారు. ఒకదశలో బిల్లు ప్రతులను చింపేసి ఆ ముక్కలను హోంమంత్రి అమిత్‌షా వైపు విసిరేశారు. ఐదేళ్లు, అంతకంటే ఎక్కువ శిక్ష పడే తీవ్రమైన నేరారోపణలు ఎదుర్కొంటూ అరెస్టయి, కస్టడీలో ఏకధాటిగా 30 రోజులుగా ఉన్న సందర్భాల్లో ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, కేంద్ర, రాష్ట్ర మంత్రులను పదవి నుంచి తొలగించేందుకు ఉద్దేశిస్తూ 'గవర్నమెంట్ ఆఫ్ యూనియన్ టెరిటరీస్(సవరణ)బిల్లు, 2025, రాజ్యాంగం (130వ సవరణ)బిల్లు, 2025, జమ్మూకశ్మీర్ పునర్‌వ్యవస్థీకరణ(సవరణ)బిల్లు, 2025'బిల్లులను అమిత్‌షా లోక్‌సభలో ప్రవేశపెట్టగానే గొడవ మొదలైంది.

అమిత్ షా, వేణుగోపాల్ మధ్య మాటల యుద్ధం

బిల్లు ప్రవేశపెట్టగానే అమిత్‌షానుద్దేశిస్తూ కాంగ్రెస్ సీనియర్ సభ్యుడు కేసీ వేణుగోపాల్ మాటలతో విరుచుకుపడ్డారు. "రాజ్యాంగ మౌలికసూత్రాలను ఈ బిల్లులు ఉల్లంఘిస్తున్నాయి. 2010లో సోహ్రాబుద్దీన్ షేక్ నకిలీ ఎన్‌కౌంటర్ కేసులో ఆనాడు రాష్ట్ర హోం మంత్రిగా పదవి వెలగబెడుతూనే అమిత్‌షా అరెస్టయ్యారు. సీబీఐ అరెస్ట్‌తో మూడు నెలలు జైళ్లోనే గడిపారు. మరి ఈ నైతికత ఆనాడు మీకు లేదా?"అని వేణుగోపాల్ సూటి ప్రశ్న వేశారు. దీనికి ఇతర సభ్యులు గొంతు కలిపారు. దీంతో అమిత్‌షా దీటుగా బదులిచ్చారు. "అదొక తప్పుడు కేసు. అయినాసరే అరెస్టయిన వెంటనే పదవికి త్యజించి నా నైతికతను నిరూపించుకున్నా. పదవికి రాజీనామా చేశా. కేసులో నిర్దోషిగా బయటపడే దాకా ఎలాంటి చట్టబద్ధ పదవిని చేపట్టలేదు"అని అన్నారు. మధ్యాహ్నం సభ రెండుగంటలకు మళ్లీ మొదలయ్యాక ఈ మూడు బిల్లులను సంయుక్త పార్లమెంట్ కమిటీకి సిఫార్సుచేస్తూ తీర్మానం చేసి మూజువాణి ఓటుతో ఆమోదించిన సందర్భంలో విపక్షసభ్యులు మళ్లీ లేచి నిలబడి నినాదాలుచేశారు. అప్పటికే ఈ మూడు బిల్లుల ప్రతులను కాంగ్రెస్ ఎంపీలు జ్యోతిమణి, ప్రణీత షిండే తోటి ఎంపీలకు పంచారు. తమ చేతికొచ్చిన బిల్లుల ప్రతులను తృణమూల్ కాంగ్రెస్ నేత కళ్యాణ్ బెనర్జీసహా పలువురు విపక్షసభ్యులు చింపేసి అమిత్‌షా వైపు విసిరేశారు. కొన్ని షా సీటు వద్ద పడ్డాయి. షా ముందున్న మైక్రోఫోన్‌ను లాగిపడేసేందుకు బెనర్జీ విఫలయత్నంచేశారు. దీంతో షాకు రక్షణగా కేంద్ర మంత్రి రవ్‌నీత్ సింగ్ బిట్టూ, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజులు షా సీటు వద్దకు వచ్చి అడ్డుగా నిలబడ్డారు. వెల్‌లోకి దూసుకొచ్చిన టీఎంసీ మహిళానేత మహువా మొయిత్రాసహా విపక్ష నేతల నినాదాలతో సభ మార్మోగింది. కొందరు బీజేపీ సభ్యులు సైతం వెల్‌లోకి దూసుకొచ్చి విపక్ష సభ్యులతో వాగ్వాదానికి దిగారు. వీరిని బీజేపీ సభ్యుడు నిషికాంత్ దూబే వారించి తమతమ సీట్ల వద్దకు పంపించారు. వివాదాస్పద బిల్లులను ప్రవేశపెట్టడాన్ని తీవ్రంగా తప్పుబడుతూ ఎంఐఎం నేత అసదుద్దీన్ ఒవైసీ, కాంగ్రెస్ నేత మనీశ్ తివారీ, ఆర్‌ఎస్‌పీ నేత ఎన్‌కే ప్రేమచంద్రన్, కాంగ్రెస్ నేత కేసీ వేణుగోపాల్, ఎస్పీ నేత ధర్మేంద్ర యాదవ్ మాట్లాడారు. తర్వాత సభ మూడు గంటలకు మొదలయ్యాక అమిత్ షాకు రక్షణగా పార్లమెంట్ సెక్యూరిటీ సర్వీస్ నుంచి 12 మంది మార్షల్స్ వచ్చి పక్కనే నిలబడ్డారు. అయినాసరే విపక్షసభ్యులు బిల్లుల వ్యతిరేక నినాదాలను కొనసాగించారు. యావత్ ఘటనపై స్పీకర్ తీవ్రవిచారం వ్యక్తంచేశారు. ఇలాంటి ఉదంతాలు సభ గౌరవాన్ని తగ్గిస్తున్నాయని ఓం బిర్లా ఆవేదన వ్యక్తంచేశారు. ఎల్లవేళలా తెలుపురంగు టీ-షర్ట్ ధరించే లోక్‌సభలో విపక్షనేత రాహుల్‌గాంధీ మూడు బిల్లులను వ్యతిరేకిస్తూ అందుకు నిరసనగా నలుపురంగు టీ-షర్ట్ ధరించారు.



అమిత్ షా



వేణుగోపాల్

పోలీస్ రాజ్యంగా మారుస్తున్నారు

"ఇలా మూడు అక్రమ చట్టాలను తెచ్చి భారత్‌ను పోలీస్ రాజ్యంగా మార్చాలనుకుంటున్నారు. సీబీఐ, ఈడీ వంటి ఏజెన్సీలు ఇష్టారీతిన అరెస్ట్‌చేసేందుకు మోదీ సర్కార్ మరింత స్వేచ్ఛనిస్తోంది. ఈ ఏజెన్సీలే జడ్జీలుగా, కార్యనిర్వాహక వ్యవస్థలుగా సొంత నిర్ణయాలు తీసుకుంటున్నాయి. ఈ పోకడ ఎన్నికల ద్వారా కొలువుతీరిన ప్రభుత్వాలకు మరణశాసనం వంటిది. ఈ మూడు బిల్లులు హిట్లర్ పాలనలో నాజీ సైన్యం అధికారిక రహస్య పోలీస్ విభాగాన్ని గుర్తుకుతెస్తున్నాయి. విపక్షాలపాలిత రాష్ట్రప్రభుత్వాలను అస్థిరపరిచేందుకే బిల్లులను తెచ్చారు"

- ఎంఐఎం నేత అసదుద్దీన్ ఒవైసీ

రాజ్యాంగ స్వరూపాన్ని నాశనం చేస్తున్నారు

"రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని సర్వనాశనం చేసేలా ఈ మూడు బిల్లులను తీసుకొచ్చారు. సీబీఐ, ఈడీ వంటి దర్యాప్తు సంస్థలను ప్రభుత్వం ఇప్పటికే దుర్వినియోగపరుస్తోంది. ఇక ఈ మూడు బిల్లులు చట్టాలుగా మారితే ఈ రాజకీయ దుర్వినియోగ వరదకు గేట్లు ఎత్తినట్లే అవుతుంది. ఈ ధోరణిని ఇప్పటికే సర్వోన్నత న్యాయస్థానం సైతం తూర్పారబట్టింది. కొత్త బిల్లులు రాజ్యాంగపరిరక్షణ అస్త్రాలను నిర్వీర్యంచేస్తున్నాయి"

- కాంగ్రెస్ నేత మనీశ్ తివారీ

'జైలు'పాలనపై నిర్ణయం ప్రజలదే

"తమ పీఎం, సీఎం, మంత్రులు తీవ్ర నేరారోపణలతో అరెస్టయి జైలు ఉండి అక్కడి నుంచే పరిపాలించడం ఎంతవరకు సబబో ప్రజలే నిర్ణయించుకోవాలి. ప్రజాజీవితం గడిపే పాలకుల్లో తగ్గుతున్న నైతికతకు చెక్‌పెట్టేందుకే ఈ మూడు బిల్లులన తెచ్చాం. రాజకీయాలకు మళ్లీ సమగ్రత తేవడమే బిల్లుల లక్ష్యం. భవిష్యత్తులో పాలకులు తీవ్రనేరాలతో జైలుపాలైనా అక్కడి నుంచే పరిపాలిస్తారని రాజ్యాంగ నిర్ణేతలు ఆనాడు రాజ్యాంగ రచన సమయంలో ఊహించి ఉండరు"

- బీజేపీ అగ్రనేత అమిత్ షా

మధ్యయుగాలకు మోసుకెళ్తాయి

ఈ మూడు బిల్లులు మళ్లీ దేశాన్ని మధ్యయుగాల నాటి దురవస్థకు తీసుకెళ్తాయి. ఈ బిల్లులు చట్టాలు మారితే ఖచ్చితంగా మనం మధ్యయుగాలకు వెళ్తాం. అక్కడ రాజు తనకు నచ్చని వ్యక్తులను పదవుల నుంచి పక్కకు తప్పిస్తాడు. ఆ పదవిలోని వ్యక్తి ముఖం కూడా నచ్చలేదంటే ఈడీ రంగప్రవేశంచేసి అరెస్ట్‌చేస్తుంది. నేరారోపణ రుజువుకాకపోయినా కేవలం 30 రోజులుగా జైళ్లో ఉన్నాడన్న కారణం చూపి.. ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన వ్యక్తి ప్రభుత్వాన్ని కూలదోస్తారు"

- విపక్షనేత రాహుల్‌గాంధీ

అంత తొందరెందుకు?

'అత్యున్నత పదవుల్లోని నేతలను తొలగించేందుకు ఉద్దేశించిన ఇంతటి కీలకమైన బిల్లులను ఎందుకు హడావిడిగా ప్రవేశపెడుతున్నారు? బిల్లుల గురించి ముందస్తు సమాచారం లేదు. హడావిడిగా బిల్లుల ప్రతులను సభలో నామమాత్రం కొద్దిమందికి పంపిణీ చేసి వెంటనే బిల్లులను లోక్‌సభ ముందుకు తెచ్చారు. సభా నిబంధనలను ఈ బిల్లుల విషయంలో అస్సలు పాటించలేదు"

- ఆర్‌ఎస్‌పీ పార్టీ సభ్యుడు, ఎంపీ ఎన్‌కే ప్రేమ్‌చంద్రన్

ప్రజాస్వామ్యానికి పాతరేసే కుట్ర

"భారత్‌లో ప్రజాస్వామ్య శకానికి ముగింపు పలికే దురుద్దేశంతో ప్రభుత్వం ఈ మూడు బిల్లులు తెచ్చింది. బిల్లులను తేవడం చూస్తుంటే సూపర్ ఎమర్జెన్సీ పీడకలను ప్రభుత్వ పెద్దలు సాకారం చేసుకునేందుకు వేసిన తొలి అడుగులా తోస్తోంది. దేశ న్యాయవ్యవస్థ స్వతంత్రను కాలరాసేందుకు ఈ బిల్లులను తెచ్చారు. ప్రజాస్వామ్యం, సమాఖ్య స్ఫూర్తిని సర్వనాశనంచేసే కుట్ర ఇది. ప్రజాస్వామ్య పరిరక్షణకు ఎంతకైనా తెగించి ఈ బిల్లులు చట్టాలుగా మారకుండా అడ్డుకుందాం"

- టీఎంసీ చీఫ్ మమతా బెనర్జీ

ఇంగిత జ్ఞానానికి సంబంధించింది

"మీరు 30రోజులపాటు కస్టడీలో ఉండి కూడా మంత్రిగా పదవిలో కొనసాగుతానని వాదించడం ఎంత వరకు సమర్థనీయం? ఇది పూర్తిగా ఇంగితజ్ఞానానికి సంబంధించిన విషయం. ఈ మూడు బిల్లుల్లో నాకైతే ఎలాంటి తప్పు కనిపించట్లేదు. ఈ అంశం మినహా బిల్లుల్లో లోతైన అంశాలు ఉంటే మాత్రం సంయుక్త పార్లమెంట్ కమిటీలో చర్చించాల్సిందే. ప్రయోజనకర అంశాలు ఉన్నాయో లేదో తేల్చాలి"

- తిరువనంతపురం కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్

భారత్ ఉత్పత్తులకు ద్వారాలు తెరిచాం

- అమెరికాకు వెళ్లకపోతే రష్యాకు మళ్లించవచ్చు
- భారత్ మా నుంచి చమురు కొంటే తప్పేమిటి?
- రష్యా దౌత్యవేత్త రొమన్ బాబుష్కిన్ వ్యాఖ్యలు

మాస్కో: భారత్-రష్యా సంబంధాలు ఎలాంటి అవాంతరాలు లేకుండా నానాటికీ బలపడుతున్నాయని రష్యా సీనియర్ దౌత్యవేత్త, డిప్యూటీ చీఫ్ ఆఫ్ మిషన్ రొమన్ బాబుష్కిన్ చెప్పారు. భారత ఉత్పత్తులకు తమ మార్కెట్ ద్వారాలు తెరిచి ఉన్నట్లు స్పష్టంచేశారు. ఆయన బుధవారం మీడియా సమావేశంలో పాల్గొన్నారు. తొలుత హిందీలో మాట్లాడారు. 'ఇక ప్రారంభిద్దాం.. శ్రీగణేషుడే ప్రారంభిస్తున్నాడు' అని విలేకరులను ఉద్దేశించి చెప్పారు. భారత్-రష్యా సంబంధాలకు పరస్పర విశ్వాసమే మూలస్తంభమని పరోక్షంగా స్పష్టంచేశారు. అమెరికాతోపాటు పశ్చిమ దేశాల ఆధిపత్యాన్ని సవాలు చేయడానికి రష్యా-ఇండియా-చైనా(ఆర్‌ఐసీ) మధ్య చర్చలు, పరస్పర సహకారాన్ని పునరుద్ధరించుకొనే అవకాశం ఉందని సంకేతాలిచ్చారు. 'మిత్రులను' అవమానించేందుకు కూడా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెనుకాడడం లేదని మండిపడ్డారు. "రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేస్తే తప్పేమిటో పశ్చిమ దేశాలే చెప్పాలి. భారత్ మాకు చాలా ముఖ్యమైన దేశం. భారత్‌కు చమురు సరఫరాను తగ్గించే ప్రతిపాదన ఏదీ లేదు" అని బాబుష్కిన్ తేల్చిచెప్పారు.

ఢిల్లీ సీఎం రేఖా గుప్తాపై దాడి

- చేతికి, తలకు స్వల్పగాయాలు
- నివాసంలో 'జన్ సున్వాయి' నిర్వహిస్తుండగా ఘటన

న్యూఢిల్లీ: సమస్యలు విన్నవించుకునేందుకు వచ్చిన జనం, కట్టుదిట్టమైన పోలీసు భద్రత నడుమ ఢిల్లీ మహిళా ముఖ్యమంత్రి రేఖా గుప్తాపై ఓ ఆగంతకుడు దాడికి పాల్పడటం దేశ రాజధానిలో కలకలం సృష్టించింది. తల, చేయి, భుజంపై కొట్టడంతో సీఎం గాయపడ్డారు. అనూహ్య పరిణామంతో హుతాశులైన ఆమె వ్యక్తిగత సిబ్బంది, ఢిల్లీ పోలీసులు వెంటనే ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతడిని 41 ఏళ్ల గుజరాత్ వాసి సక్రియా రాజేశ్‌భాయ్ ఖీమ్జీభాయ్‌గా గుర్తించారు. హత్యాయత్నం నేరం కింద అతడిని అరెస్ట్‌చేసి విచారణ మొదలెట్టారు. ముఖ్యమంత్రిని అంతమొందించే కుట్రలో భాగంగా అతను దాడిచేశాడా? అన్న కోణంలో ఇంటెలిజెన్స్‌బ్యూరో, ఢిల్లీ పోలీస్ ప్రత్యేక విభాగం అధికారులు అతడిని కూలంకషంగా ప్రశ్నిస్తున్నారని సీనియర్ పోలీస్ అధికారి వెల్లడించారు. ఢిల్లీ సివిల్ లైన్స్ ప్రాంతంలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో ఉదయం 8.15 గంటలకు ఈ దాడి ఘటన జరిగింది. ప్రజారంజకంగా పరిపాలన చేస్తుంటే కక్షపెంచుకున్న శక్తులే నాపై దాడి చేసి ఉంటాయని గాయపడిన సీఎం రేఖా గుప్తా తర్వాత ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఏం జరిగిందంటే?

ప్రజా సమస్యలను ఆలకించి, వెంటనే పరిష్కరించడానికి ముఖ్యమంత్రి ప్రతివారం తన క్యాంప్ కార్యాలయం 'జన్ సున్వాయి' కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా బుధవారం ఉదయం సైతం కార్యక్రమం మొదలైంది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. కార్యక్రమం మొదలయ్యాక సక్రియా అనే వ్యక్తి కొన్ని డాక్యుమెంట్లు, వినతిపత్రంతో సీఎం వద్దకు వచ్చాడు. జైలులో ఉన్న తమ బంధువు విడుదలకు సాయపడాలంటూ ఒక వినతి పత్రాన్ని ఆమెకు అందజేశాడు. రెప్పపాటుకాలంలో ఆమెను సమీపించి చెంప చెళ్లుమనిపించాడు. తర్వాత ఆమెను తోసేశాడు. అయితే వెనకవైపు గోడ ఉండటంతో ఆమె పడిపోకుండా ఆ గోడకు గుద్దుకున్నారు. దాంతో మళ్లీ ఆమెపై దాడి చేసేందుకు జడ పట్టుకుని లాగాడు. దీంతో వెంటనే తేరుకున్న సెక్యూరిటీ సిబ్బంది అతడిపై దాడిచేసి అతని చేతుల నుంచి జడ విడిపించారు. అరుస్తూ ఆమెపై దాడి చేయడంతో తల, చేయి, భుజానికి గాయాలైనట్లు తెలుస్తోంది. వెంటనే సీఎంకు ప్రాథమిక చికిత్స చేశారు.

పాత నేరస్తుడి పనే

దాడికి పాల్పడిన వ్యక్తికి నేరచరిత్ర ఉందని ఢిల్లీ పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తేలింది. కత్తితో దాడి సహా పలు నేరాలకు ఇప్పటికే సక్రియాపై గుజరాత్‌లోని భక్తినగర్ పోలీస్‌స్టేషన్‌లో పోలీసులు ఐదు కేసులు నమోదు చేసినట్లు వెల్లడైంది. సక్రియా సొంతూరు రాజ్‌కోట్. దాడికి రెండ్రోజుల ముందే అతను ఢిల్లీకి చేరుకుని సీఎం క్యాంప్ ఆఫీస్ ప్రాంతంలో రెక్కీ నిర్వహించినట్లు అక్కడి సీసీటీవీ ఫుటేజీలో రికార్డయింది.

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా
గురువారం । 21 । ఆగస్టు । 2025



అన్నదానానికి రూ.లక్ష విరాళం

ఇంద్రకీలాద్రి: దుర్గమ్మ నిత్యాన్నదానానికి విజయవాడ సీతారాంపురానికి చెందిన ఆర్.మురళీ, నాగ సౌజన్య దంపతులు తమ కుమారుడు ప్రణవ్‌అర్జున్ పేరిట రూ.1,00,116 విరాళం సమర్పించారు.



బాస్కెట్ బాల్ విజేత హిందుస్థాన్ జట్టు

ఆల్ ఇండియా ఇన్విటేషనల్ పురుషుల బాస్కెట్ బాల్ టోర్నమెంట్ ఫైనల్స్ బుధవారం రాత్రి జరిగాయి. హిందుస్థాన్ జట్టు విజేతగా నిలిచింది.

-8లో▸

నగరంలో నభానటేష్ సందడి



సినీ తార నభా నటేష్ బుధవారం బెజవాడ నగరంలో సందడి చేశారు. ఎన్టీఆర్ కాంప్లెక్స్‌లో ఏర్పాటైన బ్యాటరీ, మొబైల్ యాక్సెసరీస్ రిటైల్ షోరూంను ఆమె ప్రారంభించారు.

న్యూస్‌రీల్

జెడ్పీ ఉద్యోగులకు ప్రమోషన్లు



చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లా పరిషత్ యాజమాన్యానికి సంబంధించి వివిధ కార్యాలయాల్లో సీనియర్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న ఉద్యోగులకు పరిపాలనాధికారులుగా ఉద్యోగోన్నతులు కల్పిస్తూ జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక బుధవారం నియామకపత్రాలు అందజేశారు. ఆరుగురు సీనియర్ అసిస్టెంట్లను పరిపాలనాధికారులుగా నియమిస్తూ ఆయా ప్రాంతాలకు బదిలీ చేస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ కె.కన్నమనాయుడు, డెప్యూటీ సీఈఓ ఆర్.సి.ఆనంద్ కుమార్ పాల్గొన్నారు.

గణపతి నవరాత్రులకు అనుమతులు తప్పనిసరి



కోనేరుసెంటర్(మచిలీపట్నం): గణపతి నవరాత్రుల నిర్వహణకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని కృష్ణా జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు స్పష్టంచేశారు. తన కార్యాలయంలో ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. పందిళ్లు ఏర్పాటు చేసే ఉత్సవ కమిటీలు పోలీసు, విద్యుత్, మునిసిపాలిటీతో పాటు గ్రామాల్లో పంచాయతీల నుంచి అనుమతులు తీసుకోవాలని సూచించారు. పందిళ్ల వద్ద సీసీ కెమెరాలతో పాటు అగ్ని ప్రమాద నివారణ పరికరాలు, ఫస్ట్ ఎయిడ్ బాక్స్‌లను ఉంచాలని పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితి ఏర్పడితే తక్షణమే పోలీసులతో పాటు అగ్నిమాపకశాఖకు సమాచారం అందించాలని సూచించారు. ఐదు నుంచి పది మంది వలంటీర్లు విధులు నిర్వర్తించేలా చూడాలని, కమిటీ నిర్వాహకులు 24 గంటలు అందుబాటులో ఉండాలని సూచించారు. నిమజ్జనం ఊరేగింపుల రూట్ మ్యాప్‌లను పోలీసులకు కచ్చితంగా తెలియజేయాలన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగేలా మండపాలు ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

దుర్గమ్మ అన్నదానంలో ప్రక్షాళన

సాక్షి ఎఫెక్ట్..

సాక్షి ప్రతినిధి, విజయవాడ: ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో నిత్యాన్నదానం పథకం అమలులో జరుగుతున్న అవకతవకలపై ఆలయ ఈఓ శీనానాయక్ దృష్టి సారించారు. ఈ నెల 11న 'అమ్మ సన్నిధిలో లెక్కల్లోనే భోజనం' శీర్షికన ప్రచురితమైన కథనానికి ఈఓ స్పందించారు. అన్నదానం సంబంధించిన ప్రదేశాలను స్వయంగా తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. ఈ పథకంపై ఈఓ దృష్టి సారించడంతో రికార్డుల్లో భక్తుల సంఖ్య నమోదు గణనీయంగా తగ్గింది. ఈ తేడాను గమనించిన ఈఓ బాధ్యులైన సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్నదానాన్ని పారదర్శకంగా, సమర్థవంతంగా అమలు చేయకపోతే కఠిన చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు. ఇందులో కీలక పాత్రధారిగా వ్యవహరిస్తున్న జూనియర్ అసిస్టెంట్ లక్ష్మణ స్వామిని డోనర్ సెక్షన్‌కు బదిలీ చేశారు. ఈఓ తీసుకొంటున్న చర్యపై భక్తులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. అన్నదానంలో జరిగిన అవకతవకల్లో మరో ఉద్యోగి పాత్ర ఉందని, అతడిని కూడా అక్కడి నుంచి తప్పిస్తే పూర్తి స్థాయి ప్రక్షాళన జరుగుతుందన్న భావన సిబ్బందిలో వ్యక్తమవుతోంది.

పరిశోధన అంశాలు ప్రజలకు ఉపయోగపడాలి



లబ్బీపేట(విజయవాడతూర్పు): వైద్య రంగంలో పీహెచ్‌డీ స్కాలర్స్ చేసే పరిశోధనా అంశాలు ప్రజలకు ఉపయోగపడేలా ఉండాలని డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వ విద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ పి.చంద్రశేఖర్ సూచించారు. ఉపయోగకరమైన పరిశోధనలు, ప్రచురణల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లడం అనే అంశంపై బుధవారం హెల్త్ యూనివర్సిటీలో ఆన్‌లైన్ సదస్సు జరిగింది. ఈ సదస్సులో యూనివర్సిటీ పరిధిలోని వైద్య కళాశాలల నుంచి టీచింగ్ వైద్యులు, పోస్టు గ్రాడ్యుయేట్లు, సూపర్ స్పెషాలిటీ స్టూడెంట్లు 637 మంది పాల్గొన్నారు. ఈ సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న గురుగావ్ నుంచి వచ్చిన నటాషా గులాటీ మాట్లాడుతూ.. పీహెచ్‌డీలు చేసే వారు ఏదో డిగ్రీ కోసం కాకుండా, నూతన వైద్య విధానాలు, పద్ధతులు, వైద్యం పరంగా ప్రజలకు ఉపయోకరమైన అంశాలను ఎన్నుకోవాలన్నారు. పీహెచ్‌డీ స్కాలర్స్ సమర్పించిన పత్రాలను ప్రచురణల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లినప్పుడే వాటికి సార్థకత లభిస్తుందన్నారు. ఈ సదస్సులో రిజిస్ట్రార్ డాక్టర్ వి.రాధికారెడ్డి, రీసెర్చ్ అండ్ పబ్లికేషన్స్ డైరెక్టర్ డాక్టర్ సుధ, సిబ్బంది పాల్గొన్నారు.

ఎడ్లంకకు గుండెకోత

- వరదలు వచ్చినప్పుడల్లా కోతకు గురవుతున్న భూమి
- గత ఏడాది కంటే వందడుగుల మేర కోత
- వంతెనపై అమలుకాని పవన్‌కల్యాణ్ హామీ
- ఆందోళనకు సిద్ధమవుతున్న గ్రామస్తులు



ఈ ఫొటోలో కనిపిస్తున్నది ఎడ్లంక గ్రామంలోని తిరుపతమ్మ ఆలయం. గత ఏడాది వచ్చిన వరదలకు వంద మీటర్లకు పైగా భూభాగం కృష్ణానదిలో కొట్టుకుపోవడంతో ఆలయం దగ్గరకల్లా కోతకు గురైంది.



'ఈ ఫొటోలో కనిపిస్తున్నదీ తిరుపతమ్మ ఆలయమే. ఈ సారి వరదలకు సగం ఆలయం కోతకు గురవడంతో ఏ క్షణానైనా కృష్ణా నదిలో కలసిపోయేందుకు సిద్ధంగా ఉంది.

కృష్ణా నదిలో కరిగిపోతున్న గ్రామం



వరదలకు నేల కోతకు గురవడంతో కూలిపోయిన కొబ్బరిచెట్టు

ఎడ్లంక(అవనిగడ్డ): కృష్ణాజిల్లా అవనిగడ్డ మండలంలోని ఎడ్లంక గ్రామం వరదలు వచ్చినప్పుడల్లా కోతకు గురవుతోంది. గత ఎన్నికల్లో వంతెన నిర్మిస్తామని అవనిగడ్డ బహిరంగ సభలో జనసేన అధ్యక్షుడు, ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హామీలు గుప్పించారు. కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది దాటిపోయినా గ్రామాన్ని పట్టించుకున్నవారే లేరు. ఇదే పరిస్థితి కొనసాగితే మరికొద్ది కాలానికి ఎడ్లంక కనుమరుగయ్యే ప్రమాదం ఉందని స్థానికులు వాపోతున్నారు.

కనుమరుగవుతున్న ఊరు

అవనిగడ్డ మండలంలోని ఎడ్లంక గ్రామం కృష్ణానది పాయ మధ్యలో ఉంటుంది. ఈ గ్రామంలో ఎస్సీ, బీసీ (మత్స్యకార) సామాజిక వర్గానికి చెందిన 284 కుటుంబాలకు చెందిన 800 మంది నివసిస్తున్నారు. పదేళ్లలో వచ్చిన వరదలకు గ్రామంలోని 22 ఇళ్లు నదిలో కొట్టుకుపోయాయి. 800 మీటర్ల మేర భూభాగం కోతకు గురైంది. ఈసారి వరదకు మరి కొన్ని ఇళ్లు నదిలో కలిసేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే ఐదారేళ్లకు ఈ గ్రామం కనుమరుగయ్యే ప్రమాదముంది.

వంతెన, రివిట్‌మెంట్‌తోనే పరిష్కారం

గత ఎన్నికల సమయంలో ప్రచారానికి అవనిగడ్డ వచ్చిన జనసేన అధ్యక్షుడు, ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే ఎడ్లంకకు వంతెన నిర్మిస్తామని హామీ ఇచ్చారు. కూటమి అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా వంతెన నిర్మాణాన్ని పట్టించుకున్న దాఖలాలు లేవని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వరద వచ్చిన ప్రతిసారీ నాయకులు, అధికారులు గ్రామానికి రావడం, ఇళ్లు ఖాళీ చేయమనడం పరిపాటయిందని, మిగిలిన సమయంలో తమ గ్రామం వైపు ఎవరూ కన్నెత్తి చూడరని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. పులిగడ్డ వైపు నుంచి నేరుగా వచ్చే వరద నీరు గ్రామానికి తన్నడంతో ఎక్కువగా కోతకు గురవుతోందని పేర్కొన్నారు. గ్రామం చుట్టూ క్రాస్‌బండలు ఏర్పాటు చేయడం, లేదా రివిట్‌మెంట్ కట్టడం, వంతెన నిర్మించడమే శాశ్వత పరిష్కారమని గ్రామస్తులు పేర్కొంటున్నారు. తమ గ్రామాన్ని అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడంతో విసుగు చెందిన గ్రామస్తులు ఆందోళన చేసేందుకు సిద్ధమవుతున్నారు.



పడవపై ప్రయాణిస్తున్న విద్యార్థులు

నదిలో దిగి.. పడవ ఎక్కి రాకపోకలు

గ్రామానికి వెళ్లాలంటే కృష్ణానదిలో వేసిన కాజ్‌వేనే శరణ్యం. గతంలో నిర్మించిన రహదారి వరదలకు కొట్టుకుపోయింది. ఒక లక్ష క్యూసెక్కుల వరద వచ్చిన ప్రతి సారీ ఈ గ్రామానికి ఉన్న కాజ్‌వే రహదారి కోతకు గురై కొట్టుకుపోతోంది. ఇలా వరద వచ్చిన ప్రతిసారీ రహదారి లేక గ్రామస్థులు పడే ఇబ్బందులు వర్ణనాతీతం. కొంత దూరం నదిలో దిగివెళ్లి పడవ ఎక్కి రాకపోకలు సాగించేందుకు మహిళలు, వృద్ధులు, విద్యార్థులు నరక యాతన పడుతున్నారు.



పులిగడ్డ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న కృష్ణమ్మ

ఇళ్ల స్థలాలు ఇస్తే గ్రామాన్ని ఖాళీ చేసేస్తాం

దివిసీమ వద్ద కృష్ణా నదిలో వరద ఉధృతి కొనసాగుతోంది. మండలంలోని ఎడ్లంక గ్రామాన్ని వరద మరింత చుట్టేసింది. దీంతో ఈ గ్రామంలోని కొన్ని ఇళ్లు కోతకు గురై కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. సగం నదిలో కలసిపోయిన తిరుపతమ్మ ఆలయం ఏ క్షణానైనా కృష్ణలో కలసిపోనుంది. పులిగడ్డ అక్విడెక్టు వద్ద ఉధృతంగా వరద ప్రవహిస్తోంది. వరద పరిస్థితిని గ్రామస్థులకు వివరించేందుకు తహసీల్దార్ నాగమల్లేశ్వరరావుతో పాటు పలువురు అధికారులు బుధవారం ఎడ్లంక గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పల్లెపాలెంనకు చెందిన కొంతమంది మహిళలు, వృద్ధులు మాట్లాడుతూ వేగంగా స్పీడుగా కోతకు గురవడం గతంలో ఎప్పుడూ చూడలేదని, తమకు అవనిగడ్డలో ఇళ్ల స్థలాలు ఇచ్చి, ఇళ్లు నిర్మిస్తే గ్రామాన్ని శాశ్వతంగా ఖాళీ చేస్తామని చెప్పారు. ఎస్సీ కాలనీకి చెందిన కొంతమంది మాట్లాడుతూ.. తమ గ్రామం కోతకు గురవకుండా రక్షణ గోడ నిర్మించాలని కోరారు.



వరద ఉధృతితో ఎడ్లంకలో నదిలో కూలేందుకు సిద్ధంగా ఉన్న ఇల్లు

పంచాయతీలో తలదాచుకుంటున్నా



రూపాయి రూపాయి కూడగట్టి నిర్మించుకున్న ఇల్లు గతంలో వచ్చిన వరదకు కొట్టుకుపోయింది. పక్కనే వేరొక ఇంట్లో తలదాచుకుంటుంటే ఆ ఇంటి దగ్గరకు కూడా వరద వచ్చింది. చేసేదిలేక పంచాయతీ కార్యాలయంలో తలదాచుకుంటున్నా. మాకు అవనిగడ్డలో స్థలాలు ఇచ్చి ఇళ్లు నిర్మించి ఆదుకోవాలి.

– పెమ్మసాని నాంచారమ్మ, ఎడ్లంక

అరచేతిలో ప్రాణాలు



నాలుగు సంవత్సరాల్లో ఎంతమేర కోతకు గురైందో ఈ రెండేళ్లలో అంతకంటే ఎక్కువ నేల కోసుకుపోయింది. నాయకులు మా గ్రామానికి వస్తున్నారే గానీ పట్టించుకున్నవారు లేరు. ప్రాణాలు అరచేతిలో పట్టుకుని ఉంటున్నాం. కోతకు గురవకుండా యుద్ధప్రాతిపదికన రక్షణ బండలు నిర్మించాలి. లేదంటే ఎడ్లంక ఉండదు.

– యార్లగడ్డ రంగారావు, ఎడ్లంక

నదిలో ఎకరం పొలం కలిసిపోయింది



గతంలో వచ్చిన వరదలకు నా ఎకరం భూమి నదిలో కలసి పోయింది. మా ఇంటికి రేవుకు గతంలో 40 మీటర్ల దూరం ఉండేది. ఇప్పుడు 15 మీటర్లకు తగ్గిపోయింది. మా ఇల్లు కోతకు గురైతే బాలకోటేశ్వరస్వామి ఆలయం కూడా నదిలో కలిసిపోతుంది. ఇంత స్పీడుగా గతంలో ఎప్పుడూ నది ఒడ్డు కోతకు గురైన దాఖలాలు లేవు.

– పోలవరపు వెంకటేశ్వరరావు, ఎడ్లంక

ఎమ్మెల్యేకు సమస్య తెలుసు



మా ఊరి గురించి అన్ని విషయాలు ప్రస్తుత అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్‌కు తెలుసు. గతంలో వంతెన నిర్మిస్తామని హామీ ఇచ్చారు. రక్షణ గోడ నిర్మిస్తామన్నారు. ఏదీ లేదు. నాకు అధికారం ఇవ్వండి ఊరిని రక్షిస్తానన్నారు. మా ఊరి దుస్థితిని చెప్పుకోవడానికి వెళ్తే ఆయన అసహనం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఎడ్లంకు వంతెనతో పాటు రక్షణ గోడ నిర్మించాలి.

– దోవా గోవర్ధన్, ఎడ్లంక

అద్దె గర్భం.. అక్రమాల ప్రసవం

- దారి తప్పుతున్న సరోగసీ ఉద్దేశం
- సంచలనంగా మారిన సృష్టి ఫెర్టిలిటీ కేసు
- విజయవాడలోనూ సృష్టి కార్యకలాపాలు
- ఎన్టీఆర్ జిల్లాలో 9 సరోగసీ కేంద్రాలు



లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రతి మహిళకు మాతృత్వం ఒక వరం. అందుకే పిల్లల కోసం ప్రతి మహిళా తపన పడుతుంది. జన్యు పరమైన లోపాలు, జీవన శైలి వంటి అనేక కారణాలతో పిల్లలు లేని దంపతుల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది. ఈ తరుణంలో ఐవీఎఫ్ కేంద్రాలు, సరోగసీ సెంటర్లు పుట్టగొడుగుల్లా పుట్టు కొస్తున్నాయి. పిల్లల కోసం దంపతుల తపనను అసరాగా చేసుకుని ఈ కేంద్రాలు అడ్డంగా దోపిడీ చేస్తున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సరోగసీ (అద్దె గర్భం) కోసం ప్రయత్నించే దంపతులను మోసం చేస్తున్న ఘటనలూ వెలుగు చూస్తున్నాయి. రెండు తెలుగు రాష్ట్రాల్లో వివాదాస్పదంగా మారిన సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ వ్యవహారమే నిదర్శనం. అధికారులను సైతం తప్పుదారి పట్టించేలా సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ నిర్వాహకులు వ్యవహరించిన తీరు జుగుప్సాకరంగా ఉంది.

అనుమతులు తప్పనిసరి

ఎన్టీఆర్ జిల్లాలో తొమ్మిది సరోగసీ కేంద్రాలు ఉన్నాయి. ఈ కేంద్రాలకు వద్దకు వచ్చిన దంపతులకు పిల్లలు పుట్టే అవకాశం లేదని తెలియజేస్తూ వైద్య రికార్డులను ఆయా కేంద్రాల నిర్వాహకులు జిల్లా కమిటీ ముందు ఉంచుతారు. ఈ కమిటీలో డీఎంహెచ్‌ఓతో పాటు గైనకాలజిస్టు, రేడియాలజిస్టు, పెథాలజిస్టు, కమ్యూనిటీ మెడిసిన్ విభాగం వైద్యుడు, ఒక స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి ఉంటారు. ఈ పత్రాలను వారు పరిశీలించి అన్నీ సక్రమంగా ఉంటే జిల్లా కలెక్టర్‌కు సమర్పిస్తారు. అక్కడి నుంచి అనుమతి పొందిన తర్వాత న్యాయస్థానం నుంచి అద్దె గర్భం కోసం ముందుకొచ్చిన మహిళ వివరాలతో దంపతులు అనుమతి పొందాల్సి ఉంటుంది. అక్కడ అనుమతి తర్వాత మళ్లీ డీఎంహెచ్‌ఓకు రిపోర్టు చేస్తారు.

అక్రమ మార్గాన్ని అనుసరిస్తూ..

ప్రస్తుతం సరోగసీ విధానానికి నిబంధనలు కఠినతరంగా ఉండటంతో సృష్టి ఫెర్టిలిటీ సెంటర్‌తో పాటు మరిన్ని సంస్థలు అక్రమ మార్గాన్ని అనుసరిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నారు. దంపతుల నుంచి సేకరించిన అండం, స్పెర్మ్‌ను సైతం పక్కన పడేసి, పేద గర్భిణులకు డబ్బు ఆశ చూపి, వారికి నెలలు నిండాక కాన్పు చేసి పుట్టిన శిశువును సరోగసీ కోసం వచ్చిన దంపతులకు ఇస్తుండటం ప్రస్తుతం వివాదాస్పదంగా మారింది. సృష్టి వ్యవహారంలో సుమారు 80 మంది దంపతులను మోసం చేసినట్లు తెలిసింది. సరోగసీ అంటూ రూ.20 లక్షల నుంచి రూ.25 లక్షల వరకూ వసూలు చేయడం, పేద గర్భిణులకు రూ.లక్ష ఇస్తామంటూ ఆశ చూపి శిశువును ఆ దంపతులకు ఇచ్చేవారు. అలా అక్రమంగా సంపాదిస్తూ, అడ్డంగా దొరికిపోయారు. ఆ కేసులో ఇప్పటికే 40 మందికి పైగా అరెస్టవగా, మరింత మంది నిందితులు ఉన్నారని సమాచారం. సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ కేంద్ర బిందువు విజయవాడే కావడం విశేషం. గతంలో సూర్యారావుపేటలో సృష్టి పేరుతో ఉండగా వివాదాలు కూడా ఉన్నాయి. ప్రస్తుతం గాయత్రీ నగర్‌లో పేరుమార్చి నిర్వహిస్తున్నారు. వారే కాకుండా నగరంలో అనుమతులు పొందిన వారిలో కొందరు అదే మార్గంలో నడిచారా అనే అనుమానాలు వస్తున్నాయి. ఇప్పుడు సరోగసీ అంటే దంపతులు సైతం వెనుకాడే పరిస్థితులు నెలకొన్నాయి.



సరోగసీ కేంద్రంలో వైద్యాధికారుల తనిఖీలు (ఫైల్)

నిబంధనలు పాటించాలి



ఏఆర్‌టీ సెంటర్లు, సరోగసి కేంద్రాల నిర్వాహకులు కచ్చితంగా నిబంధనలు పాటించాలి. అన్ని అనుమతులు పొందాలి. ఆయా కేంద్రాల్లో పనిచేసే సిబ్బంది వివరాలను మాకు తెలపాలి. ఒకవేళ ఎవరైనా సిబ్బంది కొత్త వారు వస్తే, వెంటనే సమాచారం ఇవ్వాలి. సరోగసి కోసం వచ్చిన దంపతులకు వీడియో కౌన్సెలింగ్‌లో అన్ని విషయాలను వివరించాలి. సరోగసీ సెంటర్‌లో అందించే సేవలు, వాటికి వసూలు చేస్తే ధరలను బోర్డుపై ప్రదర్శించాలి. మేము తనిఖీలు నిర్వహించిన సమయంలో నియమ నిబంధనలు పాటించనట్లు గుర్తిస్తే చర్యలకు ప్రభుత్వానికి సిఫార్సు చేస్తాం.

– డాక్టర్ మాచర్ల సుహాసిని, డీఎంహెచ్‌ఓ, ఎన్టీఆర్ జిల్లా

సరోగసీ అంటే..

ఐవీఎఫ్ విధానంలో కూడా పిల్లలు పుట్టే అవకాశం లేని దంపతులు సరోగసీ పద్ధతిని అనుసరిస్తారు. అందుకోసం భార్య నుంచి అండాన్ని, భర్త స్పెర్మ్‌ను ఫలదీకరించి వేరొక మహిళ గర్భం (అద్దె గర్భం)లో ప్రవేశ పెడతారు. ఆ మహిళకు గర్భిణి సమయంలో అవసరమయ్యే అన్ని వైద్య సేవలను సరోగసీ సెంటర్‌లో అందిస్తారు. ఆ మహిళ ప్రసవించిన తర్వాత శిశువును అసలు తల్లిదండ్రులకు అప్పగిస్తారు. ఒకప్పుడు అద్దె గర్భం (సరోగసీ) కోసం పేద మహిళలకు ఆశ చూపేవారు. ప్రస్తుతం మారిన నిబంధనల ప్రకారం ఆ దంపతులకు సమీప బంధువు, తెలిసిన వారై, స్వచ్ఛందంగా అంగీకారం తెలపాలి.

ధాన్యం సేకరణకు సంసిద్ధం కావాలి




అధికారులతో మాట్లాడుతున్న కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ

కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ

చిలకలపూడి(మచిలీపట్నం): కృష్ణా జిల్లాలో రైతులు పండించిన ధాన్యాన్ని సేకరించేందుకు సంబంధిత అధికారులు సంసిద్ధం కావాలని కలెక్టర్ డి.కె. బాలాజీ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో బుధవారం సాయంత్రం జేసీ గీతాంజలి శర్మతో కలిసి ధాన్యం సేకరణపై సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో రైతులు పండించిన ధాన్యాన్ని సేకరించేందుకు అన్ని ఏర్పాట్లను ఇప్పటి నుంచే పకడ్బందీగా చేయాలన్నారు. నవంబర్ మొదటి వారానికి పంట చేతికొచ్చే అవకాశం ఉన్నందున, ఆ సమయానికి రైతు సేవా కేంద్రాలు, మిల్లర్లు, గోనెసంచులు, రవాణా చేసే వాహనాలను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. గతంలో జరిగిన ఇబ్బందులు పునరావృతం కాకుండా చూడాలని స్పష్టంచేశారు. జిల్లాలోని మిల్లర్లతో సమావేశం నిర్వహించి ధాన్యం సేకరణకు సహకరించాలని కోరాలన్నారు. వారు సహకరించని పక్షంలో చుట్టుపక్కల ఉన్న జిల్లాల మిల్లర్లతో కూడా సంప్రదించి సిద్ధం చేయాలని సూచించారు. జిల్లాలోని రైతులకు కూడా ధాన్యం సేకరణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఎఫ్‌సీఐ గోడౌన్ల నుంచి ధాన్యం నిల్వలు ఉంచుకునేందుకు ముందుగానే అనుమతులు పొందాలన్నారు. రవాణా చేసేందుకు వాహన యజమానులతో సమావేశం నిర్వహించి, ఆ వాహనాలకు జీపీఎస్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. సహకార సంఘాలు, పౌర సరఫరాల, వ్యవసాయాధికారులు, గ్రామ వ్యవసాయ సహాయకులు, సిబ్బందితో ముందుగా సమావేశమై ధాన్యం సేకరణకు పక్కా ప్రణాళికను రూపొందించుకోవాలన్నారు. ఈ సమావేశంలో పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ టి.శివరామప్రసాద్, ఏఎస్‌ఓ జి.మోహన్‌బాబు, జిల్లా వ్యవసాయాధికారి మనోహర రావు, జిల్లా సహకారశాఖ అధికారి చంద్రశేఖరరెడ్డి, జిల్లా రవాణాధికారి మురళీధర్ పాల్గొన్నారు.

నేరస్తుల కదలికలపై నిఘా పెట్టండి

నేరసమీక్ష సమావేశంలో కృష్ణా జిల్లా ఎస్పీ



మాట్లాడుతున్న ఎస్పీ గంగాధరరావు, చిత్రంలో ఏఆర్ ఏఎస్పీ సత్యనారాయణ

కోనేరుసెంటర్(మచిలీపట్నం): కృష్ణా జిల్లాలో నేరాలను నియంత్రించేందుకు మరిన్ని చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులను ఎస్పీ ఆర్.గంగాధరరావు ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని సమావేశపు హాలులో జిల్లాలోని పోలీసు అధికారులతో బుధవారం నేరసమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లాలో ఉన్న నేరస్తుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలన్నారు. జిల్లావ్యాప్తంగా డ్రోన్ కెమెరాల వినియోగం మరింత పెంచాలన్నారు. రోడ్డు ప్రమాదాలు, హత్యలు, చోరీలు జరిగిన వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని అక్కడి పరిస్థితులను పరిశీలించాలన్నారు. రాత్రి గస్తీ నిర్వహించే సిబ్బంది అనుక్షణం అప్రమత్తంగా ఉండాలన్నారు. మహిళలు, పిల్లలపై జరిగే నేరాల విషయంలో పోలీసులు వెంటనే స్పందించి కేసులు నమోదుచేయాలని స్పష్టంచేశారు. మహిళల భద్రత కోసం ఏర్పాటు చేసిన శక్తి టీం బృందాలు మరింత చురుగ్గా పని చేయాలని సూచించారు. ప్రతి ఒక్కరి మొబైల్‌లో శక్తి యాప్ ఉండేలా చూడాలన్నారు. యాప్ ద్వారా ఫిర్యాదు అందితే తక్షణమే స్పందించాలన్నారు. వాహనాల తనిఖీలు నిరంతరం నిర్వహించాలన్నారు. సైబర్ నేరాలు అధికంగా జరుగుతున్న నేపథ్యంలో జిల్లాలో ప్రత్యేక సైబర్ క్రైమ్ టీం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి అధికారి తమ గ్రామాల్లో పల్లెనిద్రలు చేస్తూ అక్కడి పరిస్థితులపై పూర్తి అవగాహన పెంచుకోవాలని సూచించారు. అనంతరం విధినిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీస్ అధికారులకు సిబ్బందికి రివార్డులు అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సమావేశంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ బి.సత్యనారాయణ, జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

15 వరకు ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు అవకాశం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఏపీ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో 2025–2026 విద్యా సంవత్సరానికి సంబంధించిన ప్రవేశాలకు రూ.200 అపరాధ రుసుంతో సెప్టెంబర్ 15వ తేదీ వరకూ అవకాశం కల్పిస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి యు.వి.సుబ్బారావు తెలిపారు. పదో తరగతితోపాటు ఇంటర్మీడియెట్ తగతుల ప్రవేశానికి అవకాశం ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రవేశం కోసం అభ్యర్థులు ఏపీ ఆన్‌లైన్, మీ–సేవ కేంద్రాలతో పాటుగా గ్రామ/వార్డు సచివాలయాల ద్వారా ఆన్‌లైన్‌లో మాత్రమే ఫీజు చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి యు.వి.సుబ్బారావు సూచించారు.

క్లుప్తంగా

ఏఐఎస్‌జీఈఎఫ్ ఉపాధ్యక్షుడు విద్యాసాగర్‌కు స్వాగతం



విమానాశ్రయం(గన్నవరం):అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య జాతీయ ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన ఏపీ ఎన్జీవో అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్, జాతీయ కార్యవర్గ సభ్యుడైన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీవీ రమణకు ఆ సంఘ నేతలు గన్నవరం విమానాశ్రయంలో ఘనస్వాగతం పలికారు. జాతీయ సమావేశానికి హాజరైన ఈ ఇరువురు న్యూఢిల్లీ నుంచి గన్నవరం విమానాశ్రయానికి మంగళవారం రాత్రి చేరుకున్నారు. విమానాశ్రయంలో వీరికి ఎన్టీఆర్ జిల్లా సంఘ అధ్యక్షుడు డి.సత్యనారాయణరెడ్డి, కార్యదర్శి పి.రమేష్, కోశాధికారి సతీష్, కార్యనిర్వాహక కార్యదర్శి రమణ, ఉపాధ్యక్షులు రామకృష్ణ, రాజబాబు, విజయవాడ నగర అధ్యక్షుడు సీవీఆర్ ప్రసాద్, గన్నవరం తాలుకా యూనిట్ అధ్యక్షుడు సాంబశివరావు తదితరులు స్వాగతం పలికారు.

బధిరులకు టచ్ ఫోన్లకు దరఖాస్తులు ఆహ్వానం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విభిన్న ప్రతిభావంతుల, వయో వృద్ధుల సహాయ సంస్థ ద్వారా బధిరులకు (మూగ, చెవిటి వారికి) టచ్ ఫోన్లు ఉచితంగా అందజేస్తామని సంస్థ జిల్లా మేనేజర్ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం అర్హులనుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. 18 ఏళ్లు ఆపై వయస్సు కలిగి ఇంటర్మీడియెట్ పాసై, సైగల భాష వచ్చిన వారు, 40 శాతం ఆపై వైకల్యం కలిగి, కుటుంబ ఆదాయం రూ.3 లక్షలు లోపు ఉన్న వారు అర్హులని పేర్కొన్నారు. సంస్థ వెబ్ సైట్ ద్వారా మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సదరం సర్టిఫికెట్, ఆధార్ కార్డు, టెన్త్, ఇంటర్ ఉత్తీర్ణత పత్రం, ఆడియాలజిస్ట్ లేదా బధిరుల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నుంచి సైగల భాష ధ్రువీకరణ పత్రం, కుల ధ్రువీకరణ పత్రం, పాస్ పోర్టు సైజు ఫొటో, ప్రస్తుత ఆదాయ ధ్రువీకరణ పత్రం, తెలుపు రేషన్ కార్డు జత చేయాలని సూచించారు. టచ్ ఫోన్లు జీవిత కాలంలో ఒక పర్యాయం మాత్రమే ఇస్తారని తెలిపారు.

దసరాలో పరిమితంగానే ఆర్జిత సేవలు

- ఉత్సవ ఏర్పాట్లపై దేవదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సమీక్ష
- దుర్గా ఘాట్‌లో మరింత వైభవంగా కృష్ణమ్మ హారతులకు ఏర్పాట్లు
- టీటీడీ సహకారంతో అమ్మవారి ఆలయ బంగారు తాపడం పనులు
- కుమ్మరిపాలెంలో టీటీడీ స్థలాన్ని దుర్గగుడికి తీసుకునేందుకు చర్చలు



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): అమ్మవారి సన్నిధిలో జరిగే ఉత్సవాలు అంటేనే పూజలకు ఓ ప్రత్యేకత ఉంటుంది. అసలు పూజలు లేకుండా ఉత్సవాలు ఏంటి...అయితే అన్ని పూజలు కలిపి 3 వేలకు అటు ఇటుగా పెట్టండి అంటూ దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి దుర్గగుడి అధికారులను ఆదేశించారు. శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో సెప్టెంబర్ 22వ తేదీ నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు నిర్వహించే దసరా మహోత్సవాల ఏర్పాట్లపై బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. బ్రాహ్మణ వీధిలోని జమ్మిదొడ్డి ఆవరణలో బోర్డు మీటింగ్ హాల్‌లో సమీక్ష సమావేశం నిర్వహించగా, దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, విజయవాడ పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు, మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్, పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి, దేవదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్, దుర్గగుడి ఈవో శీనా నాయక్‌తో పాటు వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన ముఖ్య అధికారులు హాజరయ్యారు. సమీక్ష సమావేశంలో దసరా ఉత్సవాల ఏర్పాట్లు, భక్తులకు కల్పిస్తున్న సదుపాయాలు, గతంలో చోటు చేసుకున్న పలు అంశాల గురించి వీడియో ప్రజెంటేషన్ జరగ్గా, ఆ తర్వాత ఈ ఏడాది చేస్తున్న ఏర్పాట్లు, ఇతర మౌలిక సదుపాయాలపై చర్చ సాగింది. అయితే ప్రధానంగా ఈ ఏడాది ఆర్జిత సేవలను పరోక్షంగా నిర్వహించాలని దేవదాయ శాఖ చేసిన ప్రతిపాదనకు దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో నిర్వహించే దసరా ఉత్సవాలు అంటేనే ఇంద్రకీలాద్రి గుర్తుకు వస్తుందని, అటువంటిది ఆర్జిత సేవలు లేకుండా ఉత్సవాలు ఏంటని ప్రశ్నించారు. అయితే ప్రత్యేక ఖడ్గమాలార్చన, చండీహోమం, లక్ష కుంకుమార్చన, శ్రీచక్ర నవార్చనలన్నీ కలిపి మూడు నుంచి మూడున్నర వేల టికెట్లు భక్తులకు అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. గత ఏడాది దసరా ఉత్సవాల వీడియో ఫుటేజీలను పరిశీలించిన మంత్రి, దేవాదాయ శాఖ అధికారులు కొన్ని కీలక అంశాల గురించి చర్చించారు. దుర్గాఘాట్‌లో నిర్వహిస్తున్న కృష్ణమ్మ హారతులను మరింత వైభవంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని, కుమ్మరిపాలెంలోని టీటీడీకి చెందిన రెండున్నర ఎకరాల స్థలాన్ని దుర్గగుడికి ఇచ్చేందుకు కొన్ని ఇబ్బందులు ఉన్నాయని, వాటి గురించి టీటీడీతో మాట్లాడినట్టు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. అమ్మవారి ఆలయ బంగారు తాపడం పనులను టీటీడీ సహకారంతో త్వరలోనే చేపట్టేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. సమావేశంలో దేవస్థాన స్థానాచార్య శివప్రసాద్ శర్మ, ప్రధాన అర్చకుడు ఎల్‌డీ ప్రసాద్, వైదిక కమిటీ సభ్యులు కోట ప్రసాద్, శ్రీధర్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

మీడియా సమావేశం లేకుండానే ముగింపు

దుర్గగుడిలో జరిగే దసరా ఉత్సవాల ఏర్పాట్లపై నిర్వహించిన సమీక్ష సమావేశానికి మీడియాకు ఆహ్వానం లేదని సిబ్బంది బహిరంగంగా పేర్కొనడం గమనార్హం. గతంలో ఎన్నడూ లేని విధానానికి దుర్గగుడి అధికారులు తెర లేపారు. సమీక్ష సమావేశం ముగిసిన తర్వాత దేవస్థానమే ఫొటోలు, వీడియోలు పంపుతుందని ముందుగానే మీడియా ప్రతినిధులకు సమాచారం అందించారు. కనీసం సమీక్ష సమావేశం హాల్ వద్దకు కూడా మీడియా ప్రతినిధులు రాకుండా కట్టుదిట్టంగా ఏర్పాట్లు చేశారు. సుమారు రెండున్నర గంటల పాటు సాగిన సమీక్ష సమావేశ వివరాలను రెండు ముక్కల్లో తేల్చివేశారు.

సిద్ధార్థలో రోబో ఎక్స్ 2కె25 హాకథాన్ పోటీలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైస్ చాన్సలర్ వెంకటేశ్వరరావు, ప్రో వైస్‌చాన్సలర్ రత్నప్రసాద్ తదితరులు

పెనమలూరు: కానూరు సిద్ధార్థ డీమ్డ్ టు బి యూనివర్సిటీలో జాతీయ స్థాయిలో రోబో ఎక్స్ 2కె25 హాకథాన్ పోటీలు నిర్వహిస్తున్నామని వైస్‌చాన్సలర్ డాక్టర్ పి.వెంకటేశ్వరరావు తెలిపారు. వర్సిటీలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. సెప్టెంబర్ 18, 19 తేదీల్లో జాతీయ స్థాయిలో రోబోటిక్స్ పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ పోటీల ద్వారా విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యం పెంపొందించటమే కాకుండా యువ ఇంజినీర్ల ఆవిష్కరణలకు వేదికగా ఉంటుందన్నారు. ఈ పోటీలు ప్రధానంగా ఇండస్ట్రీస్ 4.0, స్మార్ట్ ఆటోమేషన్, మెకాట్రోనిక్స్, ఏఐ ఇంటిగ్రేటెడ్ సిస్టమ్స్‌పై ఉంటాయన్నారు. ప్రో వైస్ చాన్సలర్ డాక్టర్ ఏవీ రత్నప్రసాద్ మాట్లాడుతూ మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా విద్యార్థులకు నైపుణ్యం పెంచే విధంగా చర్యలు చేపట్టామన్నారు.నూతన విద్యా విధానంలో భాగంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నామని వివరించారు. మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ ఎస్.రవికుమార్ మాట్లాడుతూ ఆరు సాంకేతిక పోటీలతో కార్యక్రమం ఉంటుందన్నారు. గెలుపొందిన వారికి రూ.2 లక్షల విలువ చేసే బహుమతులు ఇస్తామన్నారు. అన్ని విభాగాలకు చెందిన విద్యార్థులు పాల్గొనవచ్చని అన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ ఎం.రవిచంద్ర, ఐటీ హెడ్ ఎం.సునీత, ఫ్యాకల్టీ కోఆర్డినేటర్‌లు డాక్టర్ దిల్లీబాబు, డాక్టర్ ఎం.సుమలత, డాక్టర్ బి.సుప్రజరెడ్డి, విద్యార్థుల కోఆర్డినేటర్ జె.తేజఅమరేశ్వర్, ఫయాజ్, ఎం.ప్రవల్లిక, ఎస్.హర్షిత పాల్గొన్నారు.

పత్తి చేలల్లో నిల్వ ఉన్న నీటిని బయటకు పంపాలి

గరికపాడు కేవీకే శాస్త్రవేత్తలు రాజశేఖర్, శివప్రసాద్



పెనుగంచిప్రోలులో పత్తి పంటను రైతులతో కలసి పరిశీలిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

పెనుగంచిప్రోలు: పత్తి చేలల్లో వర్షపునీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని గరికపాడు కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్తలు డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ శివప్రసాద్ రైతులకు సూచించారు. మండలంలోని వెంకటాపురం, శనగపాడు, పెనుగంచిప్రోలు గ్రామాల్లో బుధవారం పత్తి పంటలను పరిశీలించారు. పత్తి చేలల్లో వర్షపునీరు బయటకు పంపించిన వెంటనే 20 కేజీల యూరియా, 15 కేజీల పొటాష్‌ను కలిపి ఎకరాకు బూస్టర్ డోస్‌గా వేసుకోవాలని చెప్పారు. దీంతో పంట పెరుగుదల వస్తుందని తెలిపారు. నీరు తగ్గిన తర్వాత 19:19:19: ఎరువుల మిశ్రమాన్ని ఎకరానికి 1 కేజీ స్ప్రే చేసుకోవాలని, ఎండు తెగుల నివారణ కోసం కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములను నీటితో కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. రసం పీల్చు పురుగులైన పేనుబంక, మైట్స్, త్రిప్స్ ఉన్నట్లయితే వేప నూనె 1000 పీపీఎం మందును 1 లీటర్ నీటితో కలిపి పిచికారీ చేయాలన్నారు. వరి పంటలో 25 కేజీల యూరియా 15 కేజీల పొటాష్‌ను కలిపి వేసుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి బి.రామసుబ్బారెడ్డి, ఏఈఓ, వీఏఏలు రైతులు పాల్గొన్నారు.

ఉండవల్లిలో నవ వధువు ఆత్మహత్య



తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని ఉండవల్లిలో పారాణి ఆరకముందే ఓ నవ వధువు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ ఖాజావలి తెలిపిన వివరాల ప్రకారం .. ఉండవల్లికి చెందిన రంగనాయకమ్మ (24)కు ఈ నెల 17వ తేదీన ఉండవల్లి సెంటర్‌లో నివాసం ఉంటున్న జితేంద్రతో వివాహం చేశారు. బుధవారం జితేంద్ర తన భార్య ఉన్న గదిలో నుంచి బయటకు వచ్చాడు. పది నిమిషాల అనంతరం తిరిగి లోనికి వెళ్లేందుకు రాగా గదికి గడియ పెట్టి ఉంది. జితేంద్ర తలుపులు పగలగొట్టగా.. రేకుల గదిలోని ఇనుప రాడ్‌కు చున్నీతో రంగనాయకమ్మ ఉరి వేసుకుని కనిపించింది. ఏడాదిగా కడుపునొప్పితో బాధ పడుతోందని, దానివల్లే ఆత్మహత్య చేసుకుందని తల్లి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

తెలుగు రాష్ట్రాల నుంచి భారత్ గౌరవ్ పర్యాటక రైలు

బైద్యనాథ్ ధామ్‌తో సహా అయోధ్య–కాశీ పుణ్యక్షేత్ర యాత్ర



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల యాత్రికుల కోసం బైద్యనాథ్ ధామ్‌తో సహా అయోధ్య–కాశీ పుణ్యక్షేత్ర పేరుతో భారత్ గౌరవ్ ప్రత్యేక పర్యాటక రైలును నడపనున్నట్లు ఐఆర్‌సీటీసీ అధికారులు ప్రకటించారు. సెప్టెంబర్ 9వ తేదీ ఉదయం 11 గంటలకు సికింద్రాబాద్ నుంచి ఈ రైలు బయలుదేరనుంది. తొమ్మిది రాత్రుళ్లు, పది రోజులు సాగే ఈ యాత్రలో పూరిలోని జగన్నాథ ఆలయం, కోణార్క్ సూర్య దేవాలయం, డియోఘర్‌లోని బాబా బైద్యనాథ్ ఆలయం వారణాసిలోని కాశీ విశ్వనాథ్ ఆలయం , పరిసర పుణ్యక్షేత్రాలు, కాశీ విశాలాక్షి, అన్నపూర్ణ దేవి ఆలయం, గంగా హారతి, అయోధ్యలోని రామ జన్మభూమి, హనుమాన్ గర్హి, ప్రయోగ్‌రాజ్‌లోని త్రివేణి సంగమ సందర్శన ఉంటుంది. తెలంగాణలోని కాజీపేట జంక్షన్, వరంగల్లు, ఖమ్మం, ఆంధ్రలోని విజయవాడ, గుడివాడ, భీమవరం టౌన్, తణుకు, నిడదవోలు, రాజమండ్రి, సామర్లకోట, తుని, దువ్వాడ, పెందుర్తి, విజయనగరం స్టేషన్‌లలో బోర్డింగ్/డీబోర్డింగ్ సదుపాయం కల్పించారు. ఈ యాత్రలో ఆన్‌బోర్డు/ఆఫ్‌బోర్డులో ఉదయం, మధ్యాహ్నం, రాత్రి అల్పాహారం, భోజనం, పర్యాటక ప్రదేశాలను సందర్శించేందుకు రోడ్డు మార్గంలో రవాణా సదుపాయం, రాత్రుళ్లు హోటళ్లలో బస తదితర ఏర్పాట్లతో పాటు కోచ్‌లలో సీసీ కెమెరాలతో నిరంతరం భద్రత ఏర్పాట్లు, టూర్ ఎస్కార్టులు అందుబాటులో ఉంటారని తెలిపారు.

ప్యాకేజీ ధరలు...

ఈ యాత్రలో ఎకానమి (స్లీపర్ క్లాస్) పెద్దలకు ఒక్కొక్కరికి రూ.17,000, పిల్లలకు రూ.15,800, స్టాండర్డ్ (3 ఏసీ)లో పెద్దలకు రూ.26,700, పిల్లలకు రూ.25,400, కంఫర్ట్ (2 ఏసీ) పెద్దలకు రూ.35,000, పిల్లలకు రూ.33,300 టికెట్ ధర నిర్ణయించారు. ఆసక్తి కలిగిన వారు ఆర్‌ఆర్‌సీటీసీ వెబ్ సైట్ లేదా 9701360701, 9281030712 ఫోన్ నంబర్‌ల ద్వారా టికెట్ బుక్ చేసుకోవాల్సిందిగా సూచించారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

మొగల్రాజపురం (విజయవాడ తూర్పు): జిల్లాలోని ప్రభుత్వ, ప్రయివేటు ఐటీఐ కళాశాలల్లో చేరేందుకు మూడో విడత కౌన్సెలింగ్ ప్రక్రియలో భాగంగా విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.కనకారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతితో పాటుగా 8వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఐటీఐలో చేరవచ్చునని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ నెల 26వ తేదీలోగా ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్ సైట్ లోగాని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రాలకు స్వయంగా వచ్చి గాని దరఖాస్తు చేసుకోవచ్చునని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఈ నెల 27వ తేదీన దరఖాస్తు చేసుకున్న కళాశాలకు స్వయంగా వెళ్లి సర్టిఫికెట్లను పరిశీలన చేయించుకోవాలని తెలియజేశారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తి అయిన వారు మాత్రమే కౌన్సెలింగ్‌లో హాజరు అవడానికి అర్హులని తెలిపారు. ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో చేరే విద్యార్థులకు ఈ నెల 29వ తేదీన, ప్రవేటు ఐటీఐ కళాశాలలో చేరే విద్యార్థులకు ఈ నెల 30వ తేదీన కౌన్సెలింగ్ నిర్వహిస్తామని కనకరావు వివరించారు. ఇతర వివరాలకు 0866-2475575, 94906 39639, 77804 29468 నంబర్లలో సంప్రదించాల్సిందిగా ఆయన కోరారు.

గూడూరు-విజయవాడ సెక్షన్‌లో డీఆర్‌ఎం తనిఖీలు



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): విజయవాడ రైల్వే డీఆర్‌ఎం మోహిత్ సోనాకియా బుధవారం గూడూరు–విజయవాడ సెక్షన్‌లో విస్తతంగా తనిఖీలు చేపట్టారు. నెల్లూరు స్టేషన్‌లో అమృత్ భారత్ పథకంలో జరుగుతున్న స్టేషన్ పునరాభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షించారు. ముందుగా అధికారులతో కలసి డీఆర్‌ఎం గూడూరు స్టేషన్‌లోని ప్లాట్‌ఫాంలు, స్టేషన్ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ప్రయాణికులకు అందుతున్న సౌకర్యాలు, భద్రతా చర్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. పలు సూచనలు చేశారు. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందిస్తూ సకాలంలో పనులను పూర్తిచేయాలని ఆదేశించారు. అక్కడ నుంచి నెల్లూరు స్టేషన్‌కు చేరుకుని స్టేషన్ ఆధునికీకరణ పనులను పర్యవేక్షించారు. నూతన భవన నిర్మాణాలు, ప్లాట్‌ఫాం పనులను పర్యవేక్షించి సకాలంలో పూర్తిచేయాలన్నారు. స్థానిక సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా ప్రత్యేక ప్రవేశ ద్వారాలు నెల్లూరు స్టేషన్‌కు ఆకర్షణగా నిలుస్తాయని తెలిపారు. అనంతరం బిట్రగుంట, సింగరాయకొండ, ఒంగోలు స్టేషన్‌లను సందర్శించి సిబ్బందికి అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. డివిజన్‌లో గూడూరు–విజయవాడ సెక్షన్ అత్యంత కీలకమైనదన్నారు. ఈ సెక్షన్‌లో ప్రపంచ స్థాయి ఆధునిక సౌకర్యాల దిశగా అమృత్ భారత్ స్టేషన్ పథకంలో పనులు వేగంగా చేపట్టినట్లు తెలిపారు. ఈ పనులు త్వరితగతిన పూర్తిచేసి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు.

తండ్రి మందలించాడని యువకుడు ఆత్మహత్య



మనోజ్ (ఫైల్)

నందిగామ టౌన్: ఇంటిలోని ఫ్యాన్‌కు ఉరేసుకుని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పట్టణంలో బుధవారం చోటు చేసుకుంది. సేకరించిన సమాచారం మేరకు పట్టణంలోని పాతబస్టాండ్ ప్రాంతానికి చెందిన కాసర్ల లక్ష్మయ్యకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు మనోజ్ (24) జేసీబీ ఆపరేటర్‌గా పని చేస్తూ మద్యానికి బానిసై నిత్యం మద్యం తాగుతుండటంతో పలుమార్లు తండ్రి మందలించాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి కూడా మద్యం తాగి తండ్రితో వాగ్వాదానికి దిగగా తండ్రి మందలించాడు. దీంతో మనస్తాపం చెందిన మనోజ్ గదిలోకి వెళ్లి తలుపు వేసుకున్నాడు. ఉదయం లేచి చూసేసరికి మనోజ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుని ఉండటాన్ని గమనించిన తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అక్కడకు చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వైవీఎల్ నాయుడు తెలిపారు. మృతుని తండ్రి లక్ష్మయ్య కొంతకాలంగా పక్షవాతంతో బాధపడుతున్నాడు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



కృష్ణలంక(విజయవాడతూర్పు): అనుమానాస్పద స్థితిలో గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు బెంజిసర్కిల్ సమీపంలోని ఐరా హోటల్ ముందు సోమవారం రాత్రి 8 గంటల సమయంలో ఒక వ్యక్తి మద్యం తాగి తూలుతూ నడుస్తూ రోడ్డు పక్కన పడిపోయాడు. కాళ్లు, చేతులు కొట్టుకుంటుండగా చుట్టుపక్కల వారు అతనిని 108 అంబులెన్స్ ద్వారా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మృతిచెందాడు. మృతుని వద్ద ఊరు, పేరుకు సంబంధించి ఎటువంటి ఆధారాలు లభించలేదని, వయస్సు 45 నుంచి 50 సంవత్సరాల మధ్య ఉండవచ్చని తెలిపారు. హోటల్ వాచ్‌మన్ నర సింహారావు బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మృతుని ఆచూకీ తెలిసిన వారు కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో పండ్ల వ్యాపారి మృతి

మధురానగర్(విజయవాడసెంట్రల్): వేగంగా వచ్చిన ద్విచక్రవాహనం ఢీ కొట్టడంతో పండ్ల వ్యాపారి మృతి చెందిన ఘటన గుణదల పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బుడమేరు మధ్య కట్ట లెనిన్‌నగర్‌కు చెందిన పాగిరి శ్రీనివాస్(41) మాచవరంలో పండ్ల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈయన మంగళవారం రాత్రి తన ద్విచక్రవాహనంపై నున్న బైపాస్ వైపు నుంచి గుణదల వైపు వస్తుండగా గుణదల రైల్వేగేటు సమీపంలో ఎదురుగా వేగంగా వచ్చిన ద్విచక్రవాహనం ఢీ కొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన శ్రీనివాస్‌ను చుట్టుపక్కలవారు చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో పరీక్షించిన వైద్యులు శ్రీనివాస్ అప్పటికే మృతి చెందాడని ధ్రువీకరించారు. శ్రీనివాస్ భార్య పాగిరి రమాదేవి ఫిర్యాదు మేరకు గుణదల పోలీసులు బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వేగంగా వచ్చి ఢీకొట్టిన ద్విచక్రవాహన చోదకుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

వేర్వేరు కేసుల్లో బంగారం దొంగలు అరెస్ట్



పటమట పోలీస్‌స్టేషన్‌లో వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ దామోదర్, సీఐ పవన్ కిషోర్

పటమట(విజయవాడతూర్పు): అత్యాశకు పోయి యజమాని ఇంటిలో బంగారు దొంగిలించిన వేర్వేరు కేసుల్లో నిందితులను పటమట పోలీసులు అరెస్ట్ చేశారు. దీనిపై విజయవాడ కమిషనరేట్ సెంట్రల్ డివిజన్ ఏసీపీ దామోదర్, సీఐ పవన్ కిషోర్ విలేకరుల సమావేశం నిర్వహించారు. గురునానక్‌నగర్‌లోని కనకదుర్గ గెజిటెట్ ఆఫీసర్స్ కాలనీలో నివాసం ఉండే దేవరకొండ తేజశ్రీ(24) శ్రీనివాసనగర్ బ్యాంక్ కాలనీలోని 5వ క్రాస్‌రోడ్డులో ఉండే అసుసుమిల్లి శివలీల ఇంటిలో పనిమనిషిగా చేరింది. ఇటీవల ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంట్లో ఉన్న రూ.13లక్షల విలువ చేసే 40 గ్రాముల డైమండ్ గాజులు, 114 ఆభరణాలను దొంగిలించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు నిందితురాలిపై పటమట పోలీసులు నిఘా పెట్టగా ఆమె వద్ద ఉన్న నగలను స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేశారు. – అశోక్ నగర్, వెంకటప్పయ్య వీధిలో నివాసం ఉండే బైసాని జనార్దన్ కుటుంబసభ్యులు కుమారుడి వివాహం అనంతరం జూలై 31వ తేదీన శ్రీశైలం వెళ్లగా, ఆగస్టు 1వ తేదీన ఇంటి తలుపులు బద్దలు కొట్టి ఉన్నాయని పనిమనిషి సమాచారంతో పటమట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై క్షుణ్ణంగా దర్యాప్తు చేయగా బెంజ్ సర్కిల్, నర్మదా లాడ్జ్ దగ్గరలో, ఫ్లైఓవర్ పిల్లర్ నెంబర్:3, ఎన్‌హెచ్–16 సర్వీస్ రోడ్డు మార్జిన్ లో నిందితుడిని అదుపులో తీసుకున్నామని పోలీసులు తెలిపారు. గుంటూరు అడవి తక్కెళ్లపాడుకు చెందిన ఉప్పల సురేష్ ఇంటి తలుపులు బద్దలు కొట్టి ఇంట్లో ఉన్న 30 గ్రాముల బంగారు ఆభరణాలు, 2.5 కేజీల వెండి వస్తువులు చోరీ చేయగా అతని వద్ద గుంటూరు జిల్లా పట్టాభిపురంలో దొంగతనం చేసిన 60 గ్రాముల బంగారు ఆభరణాలు, పల్నాడు జిల్లా వినుకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో దొంగతనం చేసిన 300 గ్రాముల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడు పాత నేరస్తుడని, అతనిపై ఉమ్మడి కృష్ణా జిల్లా, గుంటూరు జిల్లాలో పలు కేసులు ఉన్నాయని, నిందితుడు జల్సాలకు అలవాటు పడి సుమారు 20 నేరాలకు పాల్పడ్డాడని చెప్పారు. సమావేశంలో మహిళా ఎస్‌ఐలు దుర్గా దేవి, రేవతి, ఏఎస్‌ఐ వి.గోపి, హెచ్.సి అబ్దుల్ రషీద్ కానిస్టేబుల్ నరేశ్, మహిళా కానిస్టేబుల్ సునీత పాల్గొన్నారు.

బాస్కెట్ బాల్ విజేత హిందుస్థాన్ జట్టు



లయోలా చెన్నై (పసుపు షర్ట్) , హిందుస్థాన్ యూనివర్సిటీ, చెన్నై (రెడ్ షర్ట్) జట్ల మధ్య పోటీ

మొగల్రాజపురం (విజయవాడ తూర్పు):సిద్ధార్థ అకాడమీ స్వర్ణోత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న ఆల్ ఇండియా ఇన్విటేషనల్ పురుషుల బాస్కెట్ బాల్ టోర్నమెంట్ ఫైనల్స్ బుధవారం రాత్రి సిద్ధార్థ కళాశాల మైదానంలో జరిగాయి. లయోలా కళాశాల(చెన్నై), హిందూస్తాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్(చెన్నై) జట్ల మధ్య ఫైనల్స్ పోటీ రసవత్తరంగా సాగింది. లయోలా జట్టుపై హిందుస్థాన్ జట్టు విజయం సాధించింది. హిందుస్థాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ జట్టు 81 పాయింట్లు సాధించి విజేతగా నిలిచింది. 46 పాయింట్లతో లయోలా కళాశాల రన్నరప్‌గా నిలిచింది. విజేత జట్టుకు రూ.75 వేల నగదు, రన్నరప్ జట్టుకు రూ.50 వేల నగదును సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు మలినేని రాజయ్య, అకాడమీ సభ్యులు కలిసి అందజేశారు. ఏపీ సీఐడీ డీజీపీ రవిశంకర్ అయ్యన్నార్, శాప్ చైర్మన్ ఎ.రవినాయుడు, సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్, అకాడమీ అడ్వయిజర్ ప్రొఫెసర్ ఎల్‌కే మోహనరావు, శాప్ మాజీ చైర్మన్ అంకమ్మ చౌదరి, సిద్ధార్థ కళాశాల క్రీడా విభాగాధిపతి డాక్టర్ బాలకృష్ణారెడ్డి క్రీడాకారులను అభినందించారు.



ఆత్కూరు గ్రామ శివారులో చింతచెట్టు కొమ్మపై కూర్చొని చిగురు కోస్తున్న వృద్ధురాలు రాజమ్మ

అరవై లోనూ

అలవోకగా...


అరవై ఏళ్లు దాటితే నేమి...అలవోకగా చింత చెట్టు ఎక్కి చిటారు కొమ్మపై నిలబడుతుందామె... చింతచిగురు కోసి అమ్ముకుని ఎవరి మీద ఆధారపడకుండా తన కాళ్లపై తాను నిలబడగలుగుతుంది. ఒంట్లో ఓపిక ఉన్నంత కాలం తన స్వశక్తితోనే జీవనం సాగించాలనే పట్టుదల ఆమెది. ఎన్టీఆర్ జిల్లా, జి.కొండూరు మండల పరిధి కందులపాడు గ్రామానికి చెందిన సుఖబోగి రాజమ్మ(60) భర్త ప్రసాద్ అనారోగ్యంతో రెండేళ్ల క్రితం మృతి చెందాడు. ఆమెకు ఇద్దరు కుమారులు. రాజమ్మ తన ఒంట్లో ఓపిక ఉన్నంత కాలం ఒకరి మీద ఆధారపడకూడదనే ఉద్దేశంతో తనకు వచ్చే పింఛన్‌తో పాటు సీజనల్‌గా పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. తొలకరి వర్షాలు ప్రారంభం అయితే చాలు రాజమ్మ చింతచెట్ల నుంచి చిగురును సేకరించి విక్రయించడం జీవనోపాధిగా ఎంచుకుంది. ఇరవై ఏళ్లుగా తాను ఈ విధంగా చింత చిగురు కోసి విక్రయిస్తున్నానని రాజమ్మ చెబుతోంది. జి.కొండూరు మండల పరిధి ఆత్కూరు గ్రామ శివారులో చెట్టుపై ఒక కొమ్మ మీద నుంచి మరో కొమ్మ మీదకు సైతం వేగంగా కదలడం చూసి చిన్న వయసు వారే ఆశ్చర్యపోతుంటారు. శభాష్ రాజమ్మ అని అభినందిస్తుంటారు.

–జి.కొండూరు

వరద కష్టాలకు అడ్డుగోడ

విజయవాడ నగరానికి రక్షణ ఛత్రంలా రిటైనింగ్ వాల్

- కరకట్ట వాసులను వీడిన వరద భయం
- ప్రశాంతంగా నిద్రపోతున్న స్థానికులు
- మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి నీరాజనాలు పలుకుతున్న వైనం


కృష్ణలంకలోని తారకరామనగర్, భూపేష్‌గుప్తానగర్‌కు రక్షణగా నిలిచిన రిటైనింగ్ వాల్(5 లక్షల క్యూసెక్కుల వరద)

కృష్ణలంక(విజయవాడతూర్పు): అక్కడ నివసించే వారంతా రోజు వారీ కూలీ పనులు, ఇళ్లల్లో పనులు, ముఠా పనులు చేసుకుంటూ జీవించే పేదవారే. వర్షాకాలం ప్రారంభమైతే చాలు.. వారి గుండెల్లో రైళ్లు పరుగెత్తేవి. భయం.. భయంగా గడిపేవారు. కృష్ణానదికి వరదలు వస్తే చాలు వారి ఇళ్లన్నీ నీట మునిగేవి. తట్టాబుట్టా సర్దుకుని సురక్షిత ప్రాంతాలకు వెళ్లి తలదాచుకునేవారు. ఆర్థికంగా నష్టపోయేవారు. వరద ఎప్పుడు తగ్గుతుందా అని రోజుల తరబడి నిరీక్షించేవారు. అయితే ఇప్పుడు వారికి ఆ భయం పోయింది. ఆందోళన లేదు. విలువైన వస్తువులు పోతాయనే టెన్షన్ అసలే లేదు. ఎందుకంటే గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తమ కోసం నిర్మించిన రిటైనింగ్ వాల్ వారిని గొప్పగా ఆదుకొని ఇబ్బందుల నుంచి తప్పిస్తోంది.

అప్పట్లో కాళ రాత్రులే..

కృష్ణానదికి వరదలు వస్తున్నాయంటే చాలు కృష్ణలంక పరిధిలోని వరద ముంపు ప్రాంతాలైన రణదీవెనగర్, తారకరామనగర్, భూపేష్‌గుప్తానగర్ వాసులు హడలెత్తిపోయేవారు. ప్రకాశం బ్యారేజీ నుంచి మూడు లక్షల క్యూసెక్కుల వరదను కిందకు వదిలితే చాలు ఆయా ప్రాంతాలను వరద ముంచెత్తేది. ఇళ్లన్నీ నీట మునిగిపోయేవి. కూడబెట్టుకున్న ఆస్తులు, కష్టించి నిర్మించుకున్న ఇల్లు వరదలు పాలవడంతో కొన్ని వస్తువులు, దుస్తులు తీసుకుని కరకట్ట మీదకు చేరుకునేవారు. కొందరు


వాల్ నిర్మించక ముందు మూడు లక్షల క్యూసెక్కుల వరదకు నీటమునిగిన తారకరామనగర్(ఫైల్)

పరదాలు కట్టుకుని అక్కడే ఉండేవారు.. మరికొందరు ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలివెళ్లేవారు. వరద ఎప్పుడు తగ్గుతుందా అని ఎదురు చూసేవారు. ఈ పరిస్థితి నుంచి తమను బయట పడేయాలని ప్రభుత్వాలను వేడుకున్నా.. వరద వచ్చినప్పుడల్లా పునరావాస కేంద్రాలకు తరలించి చాలీచాలని ఆహారం అందజేసి తూతూమంత్రంగా ఆర్థిక సహాయంతో కాలం వెళ్లదీసేవారు. దీంతో విసిగి వేశారిపోయిన ఆ ప్రాంత వాసులు తమకు పరిష్కారం ఎవరు చూపిస్తారా అని ఎదురు చూస్తుండేవారు.

ధైర్యంగా అక్కడే..

ఇప్పుడు కరకట్ట ప్రాంత వాసులు గుండెలపై చేయి వేసుకొని ధైర్యంగా నిద్రపోతున్నారు. ప్రస్తుతం కృష్ణానదికి ఐదారు లక్షల క్యూసెక్కుల వరద వస్తున్నా ఆందోళన లేకుండా జీవిస్తున్నారు. వరద ముంపు నుంచి శాశ్వత పరిష్కారంగా రిటైనింగ్ వాల్‌ను నిర్మించి జగన్‌మోహన్‌రెడ్డి చేసిన సాయాన్ని గుర్తు చేసుకుంటూ ఆయనకు నీరాజనాలు పలుకుతున్నారు. క్షేత్రస్థాయిలో 'సాక్షి' వారిని పలకరించగా ఆనందంతో జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

'నేను విన్నాను.. నేనున్నాను' అంటూ..

ఈ సమయంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వారి బాధలను కళ్లారా చూసిన అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చలించిపోయారు. కృష్ణానదికి 12 లక్షల క్యూసెక్కుల వరద వచ్చినా వరద ఇళ్లల్లోకి రాకుండా ఉండే విధంగా రెండు విడతల్లో రిటైనింగ్ వాల్ నిర్మాణం చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వెంటనే రిటైనింగ్ వాల్ నిర్మాణానికి సుమారు రూ.400 కోట్లు మంజూరు చేశారు. మొదటి విడతలో కోటినగర్ నుంచి వారధి వరకు, రెండో విడతలో వారధి నుంచి పద్మావతి ఘాట్ వరకు రిటైనింగ్ వాల్‌ను నిర్మించారు. కేవలం రెండేళ్లలోనే రెండు రిటైనింగ్ వాల్‌ల నిర్మాణం పూర్తి చేసి, కరకట్ట ప్రాంత వాసులకు వరదల భయం లేకుండా చేసి, వారి కళ్లల్లో ఆనందం నింపారు.

డ్రెయినేజీ సమస్య కూడా తీరేదే?

కృష్ణానదికి వరదలు వచ్చినప్పుడల్లా రణదీవెనగర్, తారకరామానగర్, భూపేష్‌గుప్తానగర్ ప్రాంతాలలో ఎక్కడికక్కడే డ్రెయినేజీ నీరు, వరద నీరు నిలిచిపోతుంది. దీంతో రోడ్లన్నీ జలమయం అవుతున్నాయి. జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అయి ఉంటే డ్రెయినేజీ సమస్య కూడా తీర్చి తమకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చేసే వారని స్థానికులు అంటున్నారు.

ప్రశాంతంగా నిద్రపోతున్నాం...



నేడు భార్య పిల్లలతో ప్రశాంతం నిద్రపోతున్నామంటే అది జగనన్న పుణ్యమే. గతంలో కృష్ణానదికి వరదలు వస్తున్నాయంటే కొన్ని సామాన్లు నెత్తిన పెట్టుకుని పునరావాస కేంద్రాలకు తరలిపోయే వాళ్లం. సరైన తిండి లేని, నిద్ర లేక చాలా ఇబ్బందులు పడేవాళ్లం. కానీ ఇప్పుడు 10లక్షల క్యూసెక్కుల వరద వచ్చినా అలాంటి దుస్థితి లేదు. రిటైనింగ్ వాల్ నిర్మించి వరద ముంపు ప్రాంత ప్రజల గుండెల్లో జగనన్న చిరస్థాయిగా నిలిచిపోయారు. – బాదా సురేష్‌నాయుడు, రణదీవెనగర్, కృష్ణలంక

జీవితాంతం గుర్తుంచుకుంటాం..



మేం 23 ఏళ్లగా కృష్ణలంక, తారకరామనగర్‌లో నివాసం ఉంటున్నాం. గతంలో కృష్ణానదికి మూడు లక్షల క్యూసెక్కుల వరదలు వచ్చినప్పుడల్లా ఇళ్లన్నీ నీట మునిగిపోయి రోడ్డున పడేవాళ్లం. విలువైన వస్తువులు తీసుకునే అవకాశం కూడా ఉండేది కాదు. ఆర్థికంగా నష్ట పోయేవాళ్లం. మా బాధలను గుర్తించిన జగనన్న కృష్ణానదికి రక్షణ గోడ నిర్మించారు. చాలా సంతోషంగా ఉంటున్నాం. మాకు చేసిన మేలు జీవితాంతం గుర్తుంచుకుంటాం. – అబ్బిరెడ్డి లక్ష్మి, తారకరామనగర్, కృష్ణలంక

క్లుప్తంగా

కన్నబాబును పరామర్శించిన అవినాష్



లబ్బీపేట(విజయవాడతూర్పు): మాజీ మంత్రి కురసాల కన్నబాబు తండ్రి సత్యనారాయణ ఇటీవల మృతి చెందగా, బుధవారం కాకినాడలో కన్నబాబును వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ చిత్రపటానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

కాపు కల్యాణ మండపం నిర్మించాలి



కృష్ణలంక(విజయవాడతూర్పు): తూర్పు నియోజకవర్గంలో కాపు కల్యాణమండపం నిర్మించాలని, పేద కాపు మహిళకు పెళ్లి కానుక పథకం ప్రవేశపెట్టాలని ప్రజా కాపునాడు సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యర్రంశెట్టి అంజిబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆయన కృష్ణలంక, 20వ డివిజన్‌కు ప్రజా కాపునాడు సంక్షేమ సంఘం నూతన కమిటీకి నియామక పత్రాలు అందజేశారు. 20వ డివిజన్ అధ్యక్షుడిగా దారపు శ్రీమన్నారాయణ, ఉపాధ్యక్షుడిగా రామిశెట్టి రాఘవరావు, ప్రధానకార్యదర్శిగా అప్పికట్ల సత్యనారాయణను నియమించారు. అనంతరం అంజిబాబు మాట్లాడుతూ కాపులంతా ఐక్యంగా ఉండాలని, కాపుల అభివృద్ధికి, సంక్షేమానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో వెన్నా శంకర్, ఎం.నాగేశ్వరరావు, నిమ్మల జ్యోతిక, బాస రవి, ఉండి రవి తదితరులు పాల్గొన్నారు.

స్వీయరక్షణపై అవగాహన



పటమట(విజయవాడతూర్పు): బాలికలు, మహిళల చట్టాలపై అందరూ అవగాహన ఉండాలని, శక్తి యాప్ ద్వారా ఆపద సమయాల్లో రక్షణ పొందవచ్చని శక్తి బృందం సభ్యులు వివరించారు. బుధవారం నగరంలోని వివిధ కళాశాలలు, విద్యాసంస్థల్లో మహిళా చట్టాలు, స్వీయ రక్షణ.. బాలికలకు గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అదే విధంగా అనుమానిత ప్రదేశాలపై నిఘా పటిష్టం చేయడంతోపాటు విరివిగా ఆయా ప్రదేశాలను తనిఖీ చేయడం, బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగేవారిని అదుపులోకి తీసుకోవడంతో వారికి మత్తు పదార్థాలను తాగడం వల్ల కలిగే అనర్థాల గురించి అవగాహన కల్పిస్తామని బృంద సభ్యులు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



కృష్ణలంక(విజయవాడతూర్పు): కృష్ణలంకలోని గంగానమ్మ గుడి వద్ద ఫిక్కీ ఫ్లో విజయవాడ చాప్టర్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో వివిధ రకాల రక్తపరీక్షలు, బీపీ, గ్లూకోలేట్, బ్రెస్ట్‌కు సంబంధించిన పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫిక్కీ ఫ్లో విజయవాడ చాప్టర్ చైర్‌పర్సన్ అమృత కుమారి మాట్లాడుతూ పీ4లో భాగంగా కృష్ణలంకలోని 200మంది పేద ప్రజలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించామన్నారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశామన్నారు. ఫిక్కీ ఫ్లో విజయవాడ చాప్టర్ వైస్ చైర్‌పర్సన్ సుప్రియ మలినేని, కార్యదర్శి సుమ అట్లూరి, సభ్యులు పాల్గొన్నారు.

వినాయక చవితికి రాటా ఏర్పాటు



కృష్ణలంక(విజయవాడతూర్పు): కృష్ణలంకలోని సత్యంగారి హోటల్ సెంటర్ ఫ్రెండ్స్ సర్కిల్ గణేష్ మహోత్సవ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం వినాయక చవితి పందిరి నిర్మాణానికి రాటాను ఏర్పాటు చేశారు. కమిటీ సభ్యులు రాటాకు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ నెల 27వ తేదీ నుంచి సెప్టెంబర్ 6వ తేదీ వరకు వినాయక చవితి మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

గ్రంథాలయ రంగానికి స్ఫూర్తి 'పాతూరి'


మాట్లాడుతున్న జంధ్యాల శంకర్

పటమట(విజయవాడతూర్పు): స్వాతంత్ర్యానికి పూర్వం, అక్షరాస్యత తక్కువగా ఉన్న రోజుల్లోనే పటమట ప్రాంతంలో బంధువుల సహాయంతో గ్రంథాలయ సంఘానికి స్థల సేకరణ చేసి, హరి సర్వోత్తమరావు పేరుతో ఒక భవనాన్ని నిర్మించి సంఘ కార్యక్రమాలకు స్థిరత్వం కల్పించిన ధన్యజీవి పాతూరి నాగభూషణం అని విజయవాడ పూర్వ మేయర్ డాక్టర్ జంధ్యాల శంకర్ అన్నారు. గ్రంథాలయోద్యమ నాయకులు పాతూరి నాగభూషణం జయంతిని పురస్కరించుకొని బుధవారం పాతూరి నాగభూషణం గ్రంథాలయ శిక్షణాలయం, పాతూరి ఫౌండేషన్ ఆధ్వర్యాన సర్వోత్తమ గ్రంథాలయంలో ప్రత్యేక సభ నిర్వహించారు. సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని రాష్ట్ర వ్యాప్తంగా గ్రంథాలయోద్యమానికి ఆదర్శప్రాయమైన సేవలందించారని కొనియాడారు. ఆదర్శ గ్రంథపాలకులుగా గుర్తింపు పొంది, ఉద్యోగ విరమణ చేసిన నాగభూషణం శిష్యులు మొవ్వా సుబ్బారావు (తెనాలి), ఎస్.రంగమ్మ(కొణకంచి) తమ జ్ఞాపకాలను వివరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన క్విజ్ పోటీలకు మొత్తం 12 కళాశాలలు పోటీ పడగా ప్రథమ, ద్వితీయ, తతీయ స్థానాలను ఆదిత్య డిగ్రీ కళాశాల, పాతూరి నాగభూషణం గ్రంథాలయ శిక్షణాలయం, సిద్ధార్థ మహిళా కళాశాలలు కైవసం చేసుకొన్నాయి. హనుమంతరాయ గ్రంథాలయం కమిటీ అధ్యక్షుడు డోకిపర్తి శంకరరావు, ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘ ఉపాధ్యక్షుడు వి.కేశవరావు, ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ గుమ్మా సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

24న శ్రమైక జీవనం చిత్ర ప్రదర్శన


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మురళీకృష్ణ తదితరులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 24వ తేదీన శ్రమైక జీవనం చిత్ర ప్రదర్శన, వర్తమాన పరిస్థితులలో చిత్రకారుని పాత్ర అనే అంశంపై సెమినార్ నిర్వహిస్తున్నామని ఎం.బి.విజ్ఞాన కేంద్రం కార్యదర్శి పి.మురళీకృష్ణ పేర్కొన్నారు. బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో సెమినార్‌కు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ ఎం.బి.విజ్ఞాన కేంద్రం, ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్, కళాయజ్ఞ సంయుక్త ఆధ్వర్యంలో చిత్రకారుల రాష్ట్ర స్థాయి సెమినార్ జరుగుతుందన్నారు. 24న ఉదయం 10 గంటలకు రాష్ట్రంలోని ప్రముఖ చిత్రకారులు 48 మంది శ్రమైక జీవనంపై వేసిన చిత్రాలతో కూడిన ఎగ్జిబిషన్‌ను చిత్రకళావధాన్ మార్లపూడి ఉదయ్‌కుమార్ ప్రారంభిస్తారని చెప్పారు. ఉదయం 11 గంటలకు వర్తమాన పరిస్థితులలో చిత్రకారుని పాత్ర అనే అంశంపై సదస్సు ప్రారంభమవుతుందన్నారు. సదస్సులో ప్రఖ్యాత కార్టూనిస్ట్ శ్రీధర్, యోగి వేమన విశ్వవిద్యాలయం ఫైన్ ఆర్ట్స్ డిపార్ట్‌మెంట్ డాక్టర్ మృత్యుంజయరావు, సంప్రదాయ చిత్రకళ అధ్యాపకుడు డాక్టర్ సాగర్ గిన్నె, ప్రముఖ చిత్రకారుడు వై.శేషబ్రహ్మం, తెలుగు భాషోద్యమ సంస్థ నాయకుడు ప్రొఫెసర్ గారపాటి ఉమామహేశ్వరావు పాల్గొంటారని తెలిపారు. చిత్రకారులు, చిత్రకళాభిమానులు పాల్గొని తమ అభిప్రాయాలను పంచుకోవాలని కోరారు. సమావేశంలో అరసవిల్లి గిరిధర్, ఎ.సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తింపు కార్డు ఉంటేనే వ్యాపారానికి అనుమతి

వీధి వ్యాపారులకు వెండింగ్ సర్టిఫికెట్లు

పటమట(విజయవాడతూర్పు): గుర్తింపు కార్డు ఉంటేనే వీధిలో వ్యాపారం చేసుకునేందుకు అనుమతి ఉంటుందని, వీధి విక్రయదారులకు గుర్తింపు కార్డులు, వెండింగ్ సర్టిఫికెట్లు జారీ చేస్తున్నట్లు విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వీధి విక్రయదారుల చట్టం 2014 ప్రకారం నగరంలో వివిధ రకాల వీధి వ్యాపారాలు చేస్తున్న వ్యాపారస్తులందరూ గుర్తింపు కార్డు, వెండింగ్ సర్టిఫికెట్లను పొందాలన్నారు. అందుకు మెప్మా రిసోర్స్ పర్సన్స్, వార్డు సంక్షేమ అభివృద్ధి కార్యదర్శుల ద్వారా సర్వేలో పాల్గొనాలన్నారు. అనంతరం రూ.200 చెల్లించాలని అన్నారు. ఈ మొత్తాన్ని కమిషనర్ వీఎంసీ టౌన్ వెండింగ్ కమిటీ పేరుతో ఉన్న ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ విజయవాడ బ్రాంచ్ ఖాతా నంబర్ 010101000025000, ఐఎఫ్ఎస్సీ కోడ్ ఐవోబీ ఏ0000101 నకు జమచేసి చెల్లించి, తగు రసీదు /చలానా/కౌంటర్ ఫాయిల్, యూపీఏ ద్వారా పేమెంట్ చేసేవారు ఫోన్ స్క్రీన్ షాట్ ప్రింట్ కాపీలను వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని యూసీడీ విభాగంలో సమర్పించాలన్నారు. గుర్తింపు కార్డులు పంపిణీ జరిగిన తర్వాత నగరంలోని ఆయా ప్రాంతాల్లో ఉన్న వీధుల్లో వ్యాపారం చేయగలరని, లేకపోతే వీధివ్యాపారం చేసుకునేందుకు అనుమతి ఉండదని స్పష్టం చేశారు.

23, 24 తేదీల్లో లైఫ్ సైన్సెస్‌పై సెమినార్


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కళాశాల ప్రతినిధులు

మొగల్రాజపురం (విజయవాడ తూర్పు): స్థానిక పీబీ సిద్ధార్థ కళాశాల ఆవరణలోని వెబ్‌నార్ హాలులో లైఫ్ సైన్సెస్ ఇన్ ట్రైల్‌బ్లేజింగ్ పాత్ వేస్(థింక్ ఏహెడ్) అంశంపై ఈ నెల 23, 24వ తేదీల్లో జాతీయ స్థాయి సదస్సును నిర్వహిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్ చెప్పారు. కళాశాల ఆవరణలోని సెమినార్ హాలులో సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. అనంతరం రమేష్ మాట్లాడుతూ మానవ వ్యాధులు నివారణ, రోగ నిర్ధారణ–చికిత్స అంశాలతో పాటుగా ప్రత్యేకమైన జన్యు అలంకరణ, పర్యావరణానికి అనుగుణంగా చికిత్సలు, జన్యు చికిత్స, కణ చికిత్సలు, వ్యాక్సిన్‌ల గురించి ఈ సదస్సులో చర్చిస్తామన్నారు. సదస్సులో హైదరాబాద్‌లోని బయోఫౌలింగ్ అండ్ బయోఫిల్మ్ ప్రాసెస్ సెక్షన్(బీబీపీఎస్) సైంటిఫిక్ ఆఫీసర్ డాక్టర్ వై.నాంచారయ్య, సైంటిస్ట్ డాక్టర్ బి.కిరణ్‌కుమార్, ప్రొఫెసర్ నరేష్ సేపూరి, ప్రొఫెసర్ డాక్టర్ కె.నాగమోహన్ రిసోర్స్ పర్సన్‌గా హాజరవుతారని తెలిపారు. కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు, డీన్ రాజేష్ సి.జంపాల, వైస్ ప్రిన్సిపాల్ మనోరంజనితో పాటుగా అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దోమల నిర్మూలనపై అవగాహన అవసరం

వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర


ర్యాలీలో పాల్గొన్న కమిషనర్ ధ్యానచంద్ర, డీఎంహెచ్‌వో సుహాసిని, వీఎంసీ అధికారులు


దోమల నివారణపై ర్యాలీ నిర్వహిస్తున్న విజయవాడ రూరల్ వైద్య సిబ్బంది

పటమట(విజయవాడతూర్పు): ప్రపంచ దోమల దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం ఉదయం నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర, జక్కంపూడి కమ్యూనిటీ హాల్ వద్ద డెంగీ, మలేరియా నివారణ అవగాహన ర్యాలీని ప్రారంభించారు. ఇంటి లోపల, పరిసర ప్రాంతాల్లో నీటి నిల్వలు ఉన్న చోట్ల లార్వా గుర్తింపు నిర్వహించి, వ్యాధుల సంక్రమణపై అవగాహన కల్పించారు. మలేరియా, డెంగీ వ్యాధులకు కారకాలైన దోమల నిర్మూలనపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించే కరపత్రాలు ఇంటింటికీ పంపిణీ చేశారు.

నీరు నిల్వ ఉండకూడదు..

ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడుతూ మలేరియా, డెంగీ వ్యాప్తికి కారకాలైన దోమల ప్రబలకుండా వాటి వ్యాప్తిని అరికట్టాలని కమిషనర్ చెప్పారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త వహించాలని, కూలర్లు, ఫ్లవర్ వాజులు, పూల కుండీల్లో నీటిని తరచూ మార్చాలన్నారు. తాగి వదిలేసిన కొబ్బరి బొండాలు, పాత టైర్లు ఖాళీ డబ్బాలలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. ఇంటి కిటికీలు, తలుపులకు దోమతెరలు వాడడం ద్వారా దోమకాటు నుంచి రక్షణ పొందవచ్చని కమిషనర్ సూచించారు. దోమల రకాలు, జీవిత చరిత్ర, వాటి నివారణకు తీసుకునే చర్యలు, దోమల నివారణకు ఉపయోగించే యంత్ర సామగ్రి, డ్రోన్లు కటింగ్ మిషన్లు తదితర సామగ్రి ప్రదర్శనను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం. సుహాసిని, నగరపాలక సంస్థ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె. అర్జునరావు, ఇన్‌చార్జి జోనల్ కమిషనర్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జె. శ్రీనివాస్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ, బయాలజిస్ట్ కామేశ్వరరావు పాల్గొన్నారు.

దోమల నివారణతో జ్వరాల నియంత్రణ

లబ్బీపేట(విజయవాడతూర్పు): దోమలను నిర్మూలిద్దాం.. డెంగీ, మలేరియా జ్వరాలను అరికడదాం.. అంటూ వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది బుధవారం నగరంలోని పలు ప్రాంతాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఆడ ఎనాఫిలిస్ దోమ కుట్టడం వల్ల మనుషులకు మలేరియా జ్వరం వస్తుందని 1897 ఆగస్టు 20 సర్ రోనాల్డ్ రాస్ కనుగొన్నారు. ఆ రోజును గుర్తు చేస్తూ ఏటా ఆగస్టు 20న దోమల నిర్మూలన దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు. అందులో భాగంగా వైద్య ఆరోగ్యశాఖ, మలేరియా విభాగం సిబ్బంది విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. విజయవాడ రూరల్ వైద్యాధికారి డాక్టర్ నిరంజన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలలో నీరు నిల్వకుండా చూసుకోవాలన్నారు. ఇంట్లోని ఫ్రిడ్జ్, కూలర్, ఆవరణలో ఉండే పూలకుండీల్లో నీరు ఉంటే వ్యాధికారక దోమలు వృద్ధి చెందుతాయన్నారు.

ఆటో డ్రైవర్లకు సత్కారం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని అట్కిన్సన్ విద్యాసంస్థకు విద్యార్థులను చేరవేస్తున్న ఆటో డ్రైవర్లను ఆ సంస్థ యజమాన్యం బుధవారం ఘనంగా సత్కరించింది. అట్కిన్సన్ విద్యాసంస్థ 125 సంవత్సరాల వేడుకల్లో భాగంగా పాఠశాలకు విద్యార్థులను చేరవేస్తున్న సుమారు 200 మంది ఆటోడ్రైవర్లను పాఠశాల యజమాన్యం బుధవారం ఆ సంస్థ వేదికపైకి ఆహ్వానించి గౌరవించింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ రజిత మాట్లాడుతూ తమ విద్యాసంస్థ విద్యార్థులను ఎంతో బాధ్యతయుతంగా చేరవేస్తున్న ఆటోడ్రైవర్ సోదరులను సత్కరించటం తమ బాధ్యతగా భావించి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఆటో డ్రైవర్ల సంఘ నేతలు పసుపులేటి కోటేశ్వరరావు, ఆర్. శ్రీనివాస్, ఎం. కిరణ్‌కుమార్, ఎస్‌కే హుస్సేన్, పడాల నాగరాజు, బుజ్జి, సూరిబాబు తదితరులు పాఠశాల యజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.

బుడమేరు సక్రమంగా పారేలా చూడండి

వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర


బుడమేరులో వ్యర్థాల తొలగింపుపై అధికారులకు సూచనలిస్తున్న వీఎంసీ కమిషనర్

పటమట(విజయవాడతూర్పు): బుడమేరుకు ప్రవాహానికి అడ్డంకిగా ఉన్న అన్ని వ్యర్థాలను వెంటనే తొలగించాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. నగర పర్యటనలో భాగంగా ఆయన బుధవారం కృష్ణలంక, ఇన్నర్ రింగ్ రోడ్డు, రామవరప్పాడు బుడమేరు వంతెన, 33 తూములు, గుణదల గేటు, భరతమాత కాలనీ ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ బుడమేరులో తీస్తున్న పూడికలలో భాగంగా భరతమాత కాలనీలో లాంగ్ పొక్లయినర్‌తో తీస్తున్న వ్యర్థాలను పరిశీలించారు. బుడమేరు కాలువ చిట్టచివరి వరకు ఎలాంటి అవాంతరాలు లేకుండా సక్రమంగా నీటి ప్రవాహం ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వంతెనల వద్ద పేరుకుపోయిన వ్యర్థాలను బోట్ల సహాయంతో తొలగిస్తున్న తీరును పరిశీలిస్తూ ఇంజినీరింగ్ అధికారులు డ్రోన్‌తో బుడమేరు ప్రవాహాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలని, బుడమేరుకు ఇరువైపులా ఉన్న ఎలక్ట్రిసిటీ పోల్స్ ప్రమాదకరమైన స్థితిలో ఉన్నాయని, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా ఉండేందుకు, ఏపీ సీపీడీసీఎల్ వారికి లేఖ రాయాలని చీఫ్ ఇంజినీర్‌ని ఆదేశించారు.

చెట్లు పెంచాలి..

విజయవాడ నగరంలో పెరుగుతున్న కాలుష్యం, జనాభాకి తగ్గట్టుగా మొక్కల శాతాన్ని పెంచాలని, రోడ్డులకు ఇరువైపులా ఎవెన్యూ ప్లాంటేషన్ చేయాలని, ఖాళీగా ఉన్న డివైడర్ల పైన మొక్కలను మార్చాలని, నగర ప్రజలకు ఆరోగ్యకరమైన గాలిని అందించాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో ఎగ్జిక్యూటివ్ జూనియర్ శ్రీనివాసరెడ్డి డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సింధూర, ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం మత్తులో డ్రైవింగ్.. ఆరుగురికి జైలు శిక్ష

లబ్బీపేట(విజయవాడతూర్పు): మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ఆరుగురికి జైలు శిక్ష, 43 మందికి జరిమానా విధిస్తూ 7వ అడిషనల్ జ్యూడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు తీర్పు చెప్పింది. నగరంలోని 3వ ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 49 మందిని గుర్తించి వారిపై కేసులు నమోదు చేశారు. అనంతరం వారిని కోర్టులో హాజరు పర్చగా న్యాయమూర్తి ఆర్‌వీఎస్ శర్మ ఆరుగురికి 7 రోజుల జైలుశిక్షణ, 43 మందికి ఒక్కొక్కరికీ రూ.10వేలు జరిమానా విధించారు.

దుర్గగుడిలో అంతర్గత బదిలీలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో చేపట్టిన అంతర్గత బదిలీలు సర్వత్రా చర్చనీయాంశంగా మారాయి. దసరా ఉత్సవాలకు మరో నెల రోజులు ఉండగా, ఆలయంలోని కీలక విభాగాల్లో సూపరింటెండెంట్, సీనియర్ అసిస్టెంట్‌లతో పాటు 31 మందికి అంతర్గత బదిలీలు చేస్తూ ఈవో శీనానాయక్ బుధవారం ఆదేశాలు జారీ చేశారు. అయితే ఈ దఫా నిర్వహించిన ఉద్యోగుల బదిలీలలో దేవస్థానానికి సంబంధించిన దత్తత సంస్థకు బదిలీపై వచ్చిన ఓ అధికారి కీలక పాత్ర పోషించినట్లు దేవస్థానంలో ప్రచారం జరుగుతోంది. సూపరింటెండెంట్లలో పి. భాగ్యజ్యోతి ప్రసాదాల తయారీ నుంచి అన్నదానానికి, వి. సూర్యనారాయణమూర్తి వేద పాఠశాల, దత్తత దేవాలయాలు, సత్రాలు, ప్రొటోకాల్ విధులు నిర్వర్తిస్తుండగా, ఆ విధుల నుంచి తప్పించారు. కె. శ్రీనివాసరావుకు ప్రొటోకాల్, డోనర్‌సెల్, కొండపై కౌంటర్లు, డీసీఆర్ స్టాక్ రిజిస్టర్ పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. సీహెచ్ నరసింహారావుకు ల్యాండ్స్, లీజెస్, లీగల్ విభాగాలతో పాటు ఈవో పేషీ సూపరింటెండెంట్ బాధ్యతలు అదనంగా అప్పగించారు. కొర్లె శ్రీనివాసరావుకు ప్రసాదం తయారీ, కొండ దిగువన ప్రసాదాల కౌంటర్ల నిర్వహణ బాధ్యతలు, ఎల్.శ్రీనివాసరావుకు కేశ ఖండనశాల, శానిటేషన్, దుర్గాఘాట్ నిర్వహణ, హారతుల నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. ఐటీ, జీఎస్టీ, రిటన్స్, టోల్ ఫ్రీ కౌంటర్ల నిర్వహణ బాధ్యతలు నిర్వర్తిస్తున్న పి.సునీతకు అదనంగా ధర్మపథం, దాతల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకునే బాధ్యతలు అప్పగించారు.

క్లుప్తంగా...

స్టీల్ ప్లాంట్‌ను విలీనం చేయాలని విన్నవించాం

ఏపీ బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్



శ్రీకాకుళం న్యూకాలనీ: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని బీజేపీ రాష్ట్ర శాఖ తరఫున కేంద్రానికి సూచించినట్లు ఏపీ బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తెలిపారు. బుధవారం శ్రీకాకుళం పర్యటనలో ఆయన మీడియాతో మాట్లాడారు. కొత్త పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు. పలాస జీడిపప్పుకు బ్రాండింగ్ తీసుకొస్తామని పేర్కొన్నారు.

రిటైర్డు ఎస్‌ఈసీ ఇళ్లలోపనివాళ్లు, ఫోను బిల్లులకు రూ.60 వేలు

ఏడాదికి ఐదు శాతం చొప్పున పెంపు

సాక్షి, అమరావతి: రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌లుగా పనిచేసిన వారికి పదవీ విరమణ అనంతరం ప్రయోజనాలను కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పదవీ విరమణ అనంతరం వారి ఇళ్లలో పనివారి నియామకానికి నెలకు రూ.45 వేలు, సెల్‌ఫోన్/ల్యాండ్ లైన్ ఫోన్, ఇంటర్‌నెట్ వసతితో పాటు కాపలాదారులకు నెలకు మరో రూ.15 వేల చొప్పున మొత్తంగా నెలకు రూ.60 వేలు చెల్లించేలా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మొత్తాలను ఏటా ఐదు శాతం చొప్పున పెంచనున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా పనిచేసిన వారు మరణానంతరం వారి భార్య/భర్తకు కూడా ఈ ప్రయోజనాలు దక్కుతాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పశుసంవర్ధక శాఖలో 67 మందికి విశిష్ట సేవ పురస్కారాలు

సాక్షి, అమరావతి: పశుసంవర్ధక శాఖలోని వివిధ విభాగాల్లో గడిచిన ఏడాదిలో ఉత్తమ పనితీరు కనపరిచిన 67 మంది అధికారులు, సిబ్బందికి ఆ శాఖ డైరెక్టర్ డాక్టర్ టి.దామోదర నాయుడు అవార్డులు అందజేశారు. విజయవాడ, వెట్ హోమ్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పశుపోషకుల ఉన్నతి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల ఫలాలను మారుమూల ప్రాంత పశుపోషకులకు అందేలా కృషి చేయాలన్నారు. అవార్డులు అందుకున్న వారిని డైరెక్టర్ దామోదర నాయుడు శాలువాలు కప్పి ప్రత్యేక ప్రశంసాపత్రాలతో సత్కరించారు.

తప్పతాగిన శ్రీశైలం ఎమ్మెల్యే అటవీ సిబ్బందిపై దాడి

టీడీపీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి అరాచకం



అటవీశాఖ సిబ్బందిని దూషిస్తున్న టీడీపీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, కర్నూలు/యర్రగొండపాలెం/పెద్ద దోర్నాల: శ్రీశైలం టీడీపీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి మద్యం మత్తులో అరాచకం సృష్టించారు. తాను ఎక్కడ ఉన్నానో, ఏం చేస్తున్నానో అనే కనీస స్పృహ లేకుండా అటవీ సిబ్బందిని కిడ్నాప్ చేసి, వారిపై దాడికి దిగారు. మద్యం సేవించి పవిత్ర పుణ్యక్షేత్రం శ్రీశైలం అతిథి గృహంలో బసచేసి దిగజారి ప్రవర్తించారు. దీనికి సంబంధించి సీసీ కెమెరా దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. మంగళవారం అర్ధరాత్రి జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. దోర్నాల–శ్రీశైలం ఘాట్‌రోడ్డు రాత్రి 9 గంటలకు మూసేస్తారు. ఉదయం 6 గంటలకు తిరిగి వాహనాలను అనుమతిస్తారు. శ్రీశైలంలోని శిఖరం వద్ద కూడా ఇదే సమయాన్ని అటవీ అధికారులు పాటిస్తారు. మంగళవారం రాత్రి ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ రామానాయక్, బీట్‌ఆఫీసర్లు మోహన్‌కుమార్, గురవయ్య, డ్రైవర్ కరీం రాత్రి గస్తీ చేపట్టారు. చిన్నారుట్ల బీట్ సమీపంలో శిఖరం చెక్‌పోస్టు సమీపంలో రెండు వాహనాలు రోడ్డుపై ఆగి ఉండటాన్ని గమనించి హారన్ కొడుతూ వాటివద్దకు వెళ్లినా వాహనాలు కదల్లేదు. ఆ వాహనాల్లో శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి తన అనుచరులతో ఉండటాన్ని చూసి ఎమ్మెల్యేకు సెల్యూట్ చేశారు. మద్యం మత్తులో ఊగిపోతున్న ఎమ్మెల్యే తన వాహనాల వద్దకు వచ్చి హారన్ కొట్టడంపై అటవీ సిబ్బందిపై బూతులతో రెచ్చిపోయారు. 'మీరంతా ప్రకాశం జిల్లా ఫారెస్టోళ్లు. శ్రీశైలం నా పరిధి. ఇక్కడ సిబ్బంది వద్దకు వచ్చి డబ్బులు తీసుకుని వాహనాలు పంపిస్తూ నాకు చెడ్డపేరు తెస్తారా?' అంటూ పరుష పదజాలంతో విరుచుకుపడ్డారు. గడువు దాటిన తర్వాత కూడా శిఖరం చెక్‌పోస్టు నుంచి వాహనాలను ఎమ్మెల్యే ముందుకు పంపించారు. 'ఇది టైగర్ జోన్. వాహనాలను పంపకూడదు' అని అటవీ సిబ్బంది చెబుతున్నా ఎమ్మెల్యే వినిపించుకోలేదు. శిఖరం తమ పరిధిలోకి రాదని, ఆత్మకూరు రేంజ్ పరిధిలోకి వస్తుందని, తమకు సంబంధం లేదని చెబుతున్నా వినిపించుకోకుండా వారిపై చేయి చేసుకున్నారు. అటవీ సిబ్బంది ఐడీ, ఆధార్ కార్డులు, పర్సులను ఎమ్మెల్యే అనుచరులు లాగేసుకున్నారు. అటవీ అధికారుల వాహనంలో ఇద్దరు సిబ్బందిని, తన వాహనంలో మరో ఇద్దరు అటవీ సిబ్బందిని బలవంతంగా కూర్చోబెట్టారు. అటవీ వాహనాన్ని తానే డ్రైవ్ చేసుకుని సిబ్బందిని కిడ్నాప్ చేసి శ్రీశైలంలోని ఓ అతిథి గృహంలో నిర్బంధించారు. అక్కడికి జనసేన నాయకుడు అశోక్‌కుమార్, ఎమ్మెల్యే అనుచరుడు రవుత్ చేరుకుని అటవీ అధికారులు, సిబ్బందిపై దాడికి దిగారు. అర్ధరాత్రి తర్వాత వారిని విడిచిపెట్టారు.

ఎమ్మెల్యేపై కేసు నమోదు

ఈ ఘటనపై అటవీ శాఖ అధికారులు మార్కాపురం డీఎఫ్‌ఓకు వివరించారు. అధికార పార్టీ ఎమ్మెల్యేతోపాటు దాడి చేసిన వారిలో జనసేన నాయకుడు ఉన్నారని చెప్పారు. దీనిపై అటవీ శాఖ మంత్రి, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌కు ఫిర్యాదు చేస్తే ప్రభుత్వం ఎలా స్పందిస్తుందో అని తొలుత భయపడ్డారు. చివరకు ఎమ్మెల్యే దాడి చేసిన దృశ్యాలతో పాటు ఘటన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో ప్రభుత్వ పెద్దల సూచనతో శ్రీశైలం వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో అటవీ శాఖ అధికారులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు టీడీపీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి, జనసేన నేత అశోక్‌పై కేసు నమోదు చేశారు.

మద్యం సేవించి శ్రీశైలంలో బస!

శ్రీశైలంలో మద్యపానం పూర్తిగా నిషేధం. కానీ.. ఎమ్మెల్యే, వారి అనుచరులు పూటుగా మద్యం సేవించి అటవీ సిబ్బందిపై బూతులతో విరుచుకుపడి, దాడి చేయడమే కాకుండా శ్రీశైలంలోని ఓ అతిథి గృహంలో బస చేశారు. ఒక బాధ్యతాయుతమైన ఎమ్మెల్యే, అదీ తన సొంత నియోజకవర్గం శ్రీశైలంలో మద్యం మత్తులో బస చేయడాన్ని భక్తులు తీవ్రంగా తప్పుబడుతున్నారు. సనాతన ధర్మాన్ని రక్షిస్తానని చెప్పే అటవీశాఖ మంత్రి, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తన సిబ్బందిపై ఎమ్మెల్యే దాడి చేయడం, మద్యం సేవించి శ్రీశైలంలో బస చేయడంపై ఎలాంటి చర్యలు తీసుకుంటారోనని చర్చ జరుగుతోంది.

ఉపేక్షించేది లేదు: అటవీశాఖ డీడీ

తమ సిబ్బందిపై దాడి చేసిన వారు ఎవరైనా ఉపేక్షించేది లేదని ప్రకాశం జిల్లా మార్కాపురం అటవీ శాఖ డిప్యూటీ డైరెక్టర్ సందీప్ కృపాకర్ పేర్కొన్నారు. తనను కలిసిన విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. మంగళవారం రాత్రి శ్రీశైలంలో ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, ఆయన అనుచరులు అటవీశాఖ సిబ్బందిపై దాడి ఘటనను ఆయన ఖండించారు. ఇటువంటి దాడులకు పాల్పడటం సరైన పద్ధతి కాదన్నారు. బాధిత సిబ్బంది శ్రీశైలం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్నారని, ఆ ఫిర్యాదుతో పాటు తాము శాఖాపరంగా విచారణ జరుపుతామన్నారు. బాధితుల్లో ఎస్టీ, ఎస్సీ, మైనార్టీలకు చెందిన వారున్నారని, దోషులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులతో పాటు దాడులు, కిడ్నాప్, దోపిడీ లాంటి కేసులు నమోదయ్యే అవకాశాలు ఉంటాయన్నారు.

తక్షణం చర్యలు తీసుకోవాలి: ఫారెస్ట్ అధికారుల సంఘం

అటవీ శాఖాధికారిపైన, సిబ్బందిపైన దాడికి పాల్పడిన శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, ఆయన అనుచరులపై తక్షణ చర్యలు తీసుకోవాలని ఏపీ జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్ మార్కాపురం ప్రాంత అధ్యక్షుడు పి.కరీముల్లా డిమాండ్ చేశారు. ప్రకాశం జిల్లా యర్రగొండపాలెంలో ఫారెస్ట్ అధికారి కార్యాలయంలో బుధవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ.. మంగళవారం రాత్రి విధులు నిర్వర్తిస్తున్న అటవీ శాఖ నెక్కంటి డిప్యూటీ రేంజ్ అధికారి డి.రామానాయక్, ఎఫ్ఎస్ఓ జె.మోహన్‌కుమార్, ఎఫ్‌బీఓ టీకే గురువయ్య, డ్రైవర్ షేక్ కరీముల్లాను శ్రీశైలం శిఖరం వద్ద అటకాయించి శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, దాదాపు 30 మంది అనుచరులు దాడి చేశారన్నారు. సిబ్బందిని వాహనంలో కిడ్నాప్ చేసి తీవ్ర హింసలకు గురిచేశారని ఆరోపించారు. సిబ్బంది వద్ద ఉన్న వాకీటాకీలు, మొబైల్ ఫోన్లు, నగదు, వ్యక్తిగత వస్తువులు కూడా అపహరించారని వివరించారు. తెల్లవారుజామున 4 గంటలకు ఫారెస్ట్ సిబ్బందిని విడిచి పెట్టారని, దాడికి గురైన వారంతా ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు చెందిన వారేనని ఆయన తెలిపారు. ఈ ఘటనపై డిప్యూటీ సీఎం, అటవీ శాఖ మంత్రి పవన్‌కళ్యాణ్ తక్షణమే స్పందించాలని, సీఎం చంద్రబాబు శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. రాజశేఖర్ రెడ్డి తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయకపోతే తీవ్ర పరిణామాలు తప్పవని, దాడికి పాల్పడిన వారు తమ సిబ్బందికి క్షమాపణ చెప్పాలని, వారికి చట్టపరమైన శిక్ష పడేవరకు తాము విధులను బహిష్కరిస్తామని ఆయన హెచ్చరించారు. సమావేశంలో సంఘం సభ్యులు డి.శివశంకర్, జె.ఫిలిప్, జి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అటవీ సిబ్బందిపై శ్రీశైలం ఎమ్మెల్యే దాడి వీడియో కోసం క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

అశ్లీల నృత్యాలు చేస్తున్న బృందం అరెస్ట్

పట్టుబడ్డ వారంతా టీడీపీ నేతలే..

నల్లజర్ల: తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం ఘంటావారిగూడెం శివార్లో ఉన్న ఓ టీడీపీ నాయకుడి ఫాంహౌస్‌లో మంగళవారం రాత్రి 25 మంది పురుషులు ముగ్గురు డ్యాన్సర్లతో అశ్లీల నృత్యాలు చేస్తుండగా నల్లజర్ల సీఐ బాలశౌరి తమ సిబ్బందితో దాడిచేసి అరెస్ట్ చేసినట్టు కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్ వెల్లడించారు. బుధవారం ఆయన నల్లజర్ల పోలీస్ స్టేషన్ వద్ద విలేకరులతో మాట్లాడారు. ఉంగుటూరు మండలం నారాయణపురానికి చెందిన గుణ్ణం సురేష్, వెజ్జు వెంకట దుర్గా సుబ్బారావు, ఆగస్తిన నాగ వెంకట దుర్గా ప్రసాద్, కిలపర్తి దుర్గా శ్రీనివాసరావు మరో 21మంది తాడేపల్లిగూడెం, రాజమహేంద్రవరానికి చెందిన ముగ్గురు యువతులు గుణ్ణం సురేష్ పుట్టిన రోజు సందర్భంగా ఈ ఫాంహౌస్‌లో పార్టీ ఏర్పాటు చేసుకున్నారు. తమ సిబ్బంది దాడి చేసే సమయంలో వీరంతా మద్యం తాగుతూ ఉండగా మహిళలు అశ్లీల నృత్యాలు చేస్తున్నారని డీఎస్పీ పేర్కొన్నారు. వారి వద్ద నుంచి రూ.10వేల నగదు, 4 మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. గత ఏడాది ఆగస్టు 16న ఇదేవిధంగా నిర్వహిస్తున్న పార్టీపై పోలీసులు దాడిచేసి కేసు నమోదు చేశారన్నారు. వీరిలో వెజ్జు వెంకటదుర్గా సుబ్బారావుపై ఉంగుటూరు పోలీస్ స్టేషన్‌లో రౌడీషీట్ ఉందన్నారు. వీరందరినీ అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చినట్టు చెప్పారు.

పరువుపోతుందని...

కాగా పట్టుబడిన వారంతా ఉంగుటూరు మండలంలో టీడీపీ నాయకులని, అక్కడ అశ్లీల నృత్యాలు చేస్తే పరువు పోతుందన్న కారణంగా ఇక్కడ ఏర్పాటు చేసినట్టుగా చెబుతున్నారు. ఈ పార్టీలో పాలొన్న వారి నుంచి రూ.5వేల చొప్పున వసూలు చేసినట్టు తెలిసింది. ఇక్కడ దాడి చేసిన పోలీసులు ఆ వివరాలను వెల్లడించడానికి దాదాపు 4 గంటల సమయం తీసుకున్నారు. ఈలోగా ఉంగుటూరు నియోజకవర్గ నేత కేసు లేకుండా చేయాలంటూ ఫోన్లో పోలీసులపై ఒత్తిడి తెచ్చినట్టుగా చెబుతున్నారు. అప్పటికే మీడియా పోలీస్ స్టేషన్‌కు చేరుకోవడం, కొన్ని చానళ్లలో ప్రసారం కావడంతో గత్యంతరం లేని స్థితిలో అరెస్ట్ చేశారని అంటున్నారు.

దివ్యాంగుల బతుకులతో సదరంగం



పెద్దారవీడు: కూటమి ప్రభుత్వం దివ్యాంగుల బతుకులతో చదరంగం ఆడుతోందని, సదరం సర్టిఫికెట్ల మాయాజాలంతో పింఛన్లకు భారీగా కోత వేస్తోందని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సర్కారు తీరును నిరసిస్తూ బుధవారం ప్రకాశం జిల్లా పెద్దారవీడు మండల పరిషత్ కార్యాలయం ఎదుట దివ్యాంగులు ఆందోళనకు దిగారు. ఏళ్ల తరబడి పింఛన్లు తీసుకుంటున్న అర్హులైన దివ్యాంగులకు అన్యాయం చేయడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో చాలామంది పింఛన్లు తీసేశారని మండిపడ్డారు. తక్షణం తొలగించిన పింఛన్లు పునరుద్ధరించాలని, లేకుంటే తమ ఉసురు ఈ సర్కారుకు తప్పక తగులుతుందని శాపనార్థాలు పెట్టారు. అనంతరం ఎంపీడీఓకు వినతి పత్రం అందజేశారు. దివ్యాంగులకు వైఎస్సార్ సీపీ ఇంటలెక్చువల్ విభాగం జిల్లా అధ్యక్షుడు, సర్పంచ్ అంగిరేకుల ఆదినారాయణ మద్దతు పలికారు.

వైఎస్సార్‌సీపీ సానుభూతిపరురాలి దివ్యాంగ పింఛన్ తొలగింపు



ముండ్లమూరు (దర్శి): ప్రకాశం జిల్లా ముండ్లమూరుకు చెందిన తాతపూడి సుశీల దివ్యాంగురాలు. ఎక్కడికి వెళ్లాలన్నా నెట్టుడు బండిపై తీసుకుపోవాల్సిందే. దళిత కుటుంబానికి చెందిన ఆ మహిళకు నెలనెలా వచ్చే దివ్యాంగ పింఛనే ఆధారం. కూటమి ప్రభుత్వం తన పింఛన్ తీసేశారని తెలిసి బుధవారం నెట్టుడు బండి మీదే అతికష్టం మీద స్థానిక ఎంపీడీవో కార్యాలయానికి వచ్చి తన గోడు వెళ్లబోసుకుంది. వైఎస్సార్‌సీపీ సానుభూతిపరురాలన్న కారణంతోనే తన పింఛన్ తీసేశారని ఆమె వాపోయింది.

విశాఖ ఉక్కు కోసం మహోద్యమం

- ప్లాంట్‌ను కాపాడుకోవడమే వైఎస్సార్ సీపీ తొలి ప్రాధాన్యం
- త్వరలో ఉద్యమ కార్యాచరణ
- శాసనమండలి వైఎస్సార్‌సీపీ పక్ష నేత బొత్స సత్యనారాయణ



విజయనగరం: విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటుపరం కాకుండా కాపాడుకోవడం కోసం మహోద్యమానికి సిద్ధమని శాసనమండలి వైఎస్సార్ సీపీ పక్షనేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు. తమతో కలిసి వచ్చే వారిని కలుపుకుని త్వరలో ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని వెల్లడించారు. విజయనగరంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బొత్స మాట్లాడారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో 32 విభాగాలను ప్రైవేటుపరం చేస్తుంటే కూటమి సర్కారు ఏం చేస్తోందని ప్రశ్నించారు. ఉక్కు కర్మాగారం కోసం ఎంతటి ఉద్యమానికైనా సిద్ధపడతామని, ఇదే తమ పార్టీ విధానమని స్పష్టం చేశారు. ఎన్నికలకు ముందు స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ కానివ్వబోమని ప్రగల్భాలు పలికిన చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ ఇప్పుడు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. ప్లాంట్‌కు రూ.14వేల కోట్ల ప్యాకేజీ ఇచ్చినప్పుడే మోసం జరుగుతోందని, ప్రైవేటీ కరణలో భాగంగా ప్యాకేజీ ఇస్తున్నట్లు తాము చెప్పామని, అయినా కూటమి నేతలు పట్టించుకోలేదని విమర్శించారు. రెండుసార్లు ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించిన ప్రధాని ఎందుకు స్టీల్ ప్లాంట్‌పై స్పందించలేదని ప్రశ్నించారు. సీఎం చంద్రబాబు ఇప్పటివరకు 16 సార్లు ఢిల్లీ వెళ్లినా స్వప్రయోజనాలు చూసుకున్నారే తప్ప ఉక్కు కర్మాగారం కోసం ఒత్తిడి తేలేదని, దీనిపై సీఎం జవాబివ్వాలని బొత్స డిమాండ్ చేశారు. ఇప్పుడు తీరా 32 విభాగాల ప్రైవేటీకరణకు కేంద్రం అడుగులు వేస్తుంటే వైఎస్సార్‌సీపీపై బురద జల్లేందుకు కూటమి నేతలు యత్నిస్తున్నారని ధ్వజమెత్తారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ, హామీల అమలుపై ప్రశ్నిస్తే చర్యలు తీసుకుంటామంటూ మంత్రులు చేస్తున్న ప్రకటనలపై బొత్స మండిపడ్డారు. కూటమి నేతల తాటాకు చప్పుళ్లకు భయపడేవారు ఎవరూ లేరని స్పష్టం చేశారు.

పాలన గాలికొదిలేసి..: రాష్ట్రంలో కూటమి సర్కారు పరిపాలనను పూర్తిగా గాలికొదిలేసిందని, ముఖ్యమంత్రి నుంచి ఎమ్మెల్యేల వరకు అవినీతిలో కూరుకుపోయారని బొత్స సత్యనారాయణ విమర్శించారు. శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలపై లైంగిక దాడులు, పిల్లల కిడ్నాప్‌లు, హత్యలు యథేచ్ఛగా జరుగుతున్నాయని, డ్రగ్స్, గంజాయి, రేషన్ మాఫియాలు చెలరేగిపోతున్నాయని విమర్శించారు. గత ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో, 14 నెలల కూటమి పాలనలో జరిగిన క్రైమ్ రేటును పరిశీలిస్తే ఈ విషయం తెలుస్తోందని స్పష్టం చేశారు. ప్రస్తుతం పోలీసులు కూటమి పార్టీ తొత్తులుగా మారారని విమర్శించారు. ప్రజా రక్షణను వారు గాలికొదిలేశారని మండిపడ్డారు. ఎన్నికలకు ముందు ప్రతి మహిళలకు నెలకు రూ.1,500 చొప్పున ఏడాదికి రూ.18,000 ఇస్తామని ప్రకటించిన ఆడబిడ్డనిధి పథకాన్ని నీరుగార్చేందుకే పీ–4 అంటూ డ్రామా మొదలెట్టారని బొత్స మండిపడ్డారు. ఉపాధి హామీ పథకం వేతనాల బకాయిలు చెల్లించకపోవడంతో కూలీలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా రైతులకు అవసరమైన ఎరువులు సరఫరా చేయలేక ప్రభుత్వం చతికిలపడిందని బొత్స విమర్శించారు.

పోక్సో కేసులో దోషికి 20 ఏళ్ల జైలు.. ఒంగోలు కోర్టు తీర్పు

ఒంగోలు: ప్రేమ పేరుతో బాలికను మభ్యపెట్టి పలుమార్లు అత్యాచారం చేసిన కేసులో దోషికి 20 ఏళ్ల జైలుశిక్ష విధిస్తూ ఒంగోలు పోక్సో కోర్టు న్యాయాధికారి కానుగుల శైలజ బుధవారం తీర్పు చెప్పారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గొట్టిపాటి శ్రీనివాసరావు తెలిపిన మేరకు.. ప్రకాశం జిల్లా కొత్తపట్నం మండలానికి చెందిన బాలిక తల్లిదండ్రులతో కలిసి ప్రతి ఆదివారం అల్లూరు గ్రామంలో చర్చికి వెళ్లేది. ఆ చర్చిలో మైకు ఏర్పాటుచేసే బత్తుల చంటి అలియాస్ విల్సన్ బాలికతో పరిచయం పెంచుకున్నాడు. ఇంటర్ చదువుతున్న ఆ బాలికను మభ్యపెట్టి ఆమె ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో పలుమార్లు అత్యాచారం చేశాడు. ఈ విషయం బయటకు చెబితే చంపేస్తానని బెదిరించాడు. కొన్నాళ్లకు బాలిక అనారోగ్యంగా ఉంటుండడంతో తల్లిదండ్రులు ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యపరీక్షలు చేయించారు. బాలిక గర్భం దాల్చినట్లు వెల్లడైంది. తల్లిదండ్రులు నిలదీయడంతో బాలిక చంటి అలియాస్ విల్సన్ గురించి చెప్పింది. బాలిక తల్లిదండ్రులు 2019 ఆగస్టు 6న కొత్తపట్నం పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేయడంతో అప్పటి ఎస్.ఐ. మేడా శ్రీనివాసరావు కేసు నమోదు చేశారు. అప్పటి డీఎస్పీ కె.వి.వి.ఎన్.వి.ప్రసాద్ కేసు దర్యాప్తు చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. కోర్టులో ఇరువైపుల వాదనలు విన్న న్యాయాధికారి నిందితుడు చంటి అలియాస్ విల్సన్‌పై నేరారోపణ రుజువైందని ప్రకటించారు. దీంతో దోషికి 20 ఏళ్ల జైలుశిక్ష, రూ.10 వేల జరిమానా విధించారు. బాధితురాలికి రూ.3 లక్షలు, ఆమె బిడ్డకు రూ.3 లక్షలు అందేలా చూడాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థను ఆదేశించారు.

'గుట్టు' రట్టు కాకుండా అరుణ అరెస్ట్

నన్ను అన్యాయంగా అరెస్ట్ చేశారు
- చంపేస్తారేమో.. భయంగా ఉంది
- కారు డిక్కీలోంచి అరుణ సెల్ఫీ వీడియో
- సిఫార్సు లేఖ ఇచ్చింది నిజమేనన్న గూడూరు ఎమ్మెల్యే
- శ్రీకాంత్‌కు పెరోల్ కోసం హోం శాఖలో ముఖ్యులొకరికి రూ.2 కోట్లు



అరుణ

సాక్షి టాస్క్‌ఫోర్స్: నెల్లూరు సెంట్రల్ జైల్లో జీవిత ఖైదీగా ఉన్న శ్రీకాంత్ పెరోల్ వ్యవహారం గుట్టు రట్టు కాకుండా అత్యవసరంగా ఈ ఎపిసోడ్‌కు ఫుల్ స్టాప్ పెట్టడంలో భాగంగా శ్రీకాంత్ సన్నిహితురాలు నిడిగంటి అరుణను ప్రభుత్వం ఆగమేఘాలపై అరెస్ట్ చేయించింది. కోవూరులో బిల్డర్ నుంచి అపార్ట్‌మెంట్ కొనుగోలు వ్యవహారంలో అరుణ.. శ్రీకాంత్ స్నేహితులను అడ్డుపెట్టుకుని బలవంతంగా రిజిస్ట్రేషన్ చేయించేందుకు ప్రయత్నించిందని మూడేళ్ల క్రితం ఇచ్చిన ఫిర్యాదుపై ఇప్పుడు కేసు నమోదు చేయించింది. హైదరాబాద్‌కు వెళ్తున్న ఆమెను బాపట్ల జిల్లా అద్దంకిలో పోలీసులు అరెస్ట్ చేశారు. న్యాయమూర్తి రిమాండ్ విధించడంతో ఒంగోలు జైలుకు తరలించారు. అంతకు ముందు అరుణను అరెస్ట్ చేసిన పోలీసులు ఆమెను కారు డిక్కీలో వేశారు. 'నన్ను అన్యాయంగా అరెస్ట్ చేస్తున్నారు. నా కారులో గంజాయి పెట్టాలని నా కారు డ్రైవర్‌కు చెబుతున్నారు. నన్ను అక్రమంగా నిర్బంధించారు. నాపై ఏమేమి కేసులు పెడుతున్నారు? నేను చేసిన తప్పేంటి? నన్ను చంపుతారేమోనని భయంగా ఉంది. మీడియా నన్ను కాపాడాలి' అంటూ డిక్కీలోంచి సెల్ఫీ వీడియో తీసి బయటకు పంపింది. ఈ వీడియో వైరల్ కావడంతో ప్రభుత్వ పెద్దలు బెంబేలెత్తుతున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఆమెపై మరిన్ని కేసులు నమోదు చేసి.. ఇప్పుడప్పుడే బయటకు రాకుండా చేసేందుకు పోలీస్ శాఖ ప్రయత్నిస్తోంది.

అవును.. సిఫార్సు లేఖ ఇచ్చాను

జీవిత ఖైదు అనుభవిస్తున్న శ్రీకాంత్ పెరోల్‌కు తాను సిఫార్సు లేఖ ఇచ్చింది నిజమేనని గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ బుధవారం విలేకరుల సమావేశంలో స్పష్టం చేశారు. జైలులో శిక్ష అనుభవిస్తున్న తన కుమారుడిని చూడాలని ఉందంటూ తనకు ప్రజా విజ్ఞప్తుల్లో ఓ మహిళ వినతి పత్రం ఇచ్చారన్నారు. ఆ తర్వాత పెరోల్ రద్దు కావడం తెలిసిందేనని చెప్పారు. ఈ క్రమంలో ఇటీవల తాను నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి నివాసానికి వెళ్లిన సమయంలో అక్కడ అరుణ అనే మహిళ ఉందని, దీనిని ఆసరాగా చేసుకుని పెరోల్‌కు తామే సహకరించినట్లు ఆరోపణలు చేయడం సబబు కాదన్నారు. పెరోల్ రద్దుతో వివాదం సమసిపోయిందన్నారు.

రూ.2 కోట్లు ఎవరికి ఇచ్చినట్లు?

శ్రీకాంత్ 2014లో టీడీపీ హయాంలో జైలు నుంచి తప్పించుకుని నాలుగేళ్ల పాటు డాన్‌గా ఎదిగాడు. వంద మందికి పైగా రౌడీషీటర్లను సైనికుల్లా పెట్టుకుని టీడీపీ ఎమ్మెల్యేల సహకారంతో నెల్లూరులో సెటిల్‌మెంట్లు, దందాలు, హత్యాకాండలు సాగించాడు. నాలుగేళ్ల తర్వాత స్వచ్ఛందంగా లొంగిపోయాక కూడా అదే తరహాలో జైలు నుంచే అన్ని కార్యక్రమాలు నిర్వహించాడు. ఇవన్నీ తెలిసి కూడా కూటమి ప్రభుత్వం అతడికి పెరోల్ మంజూరు చేసి.. అతని నేరాలకు రాచబాట వేసింది. పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో పెరోల్‌ను రద్దు చేసింది. ఈ నేపథ్యంలో తమను వాడుకుని వదిలేశారని, అందరి గుట్టు విప్పుతానని శ్రీకాంత్ సన్నిహితురాలు అరుణ పెట్టిన పోస్ట్ సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది. దీంతో పెరోల్ వెనుక అసలు గుట్టుతోపాటు అతని నేర చరిత్రలో భాగస్వాములుగా ఉన్న ఎమ్మెల్యేలు, మంత్రుల అసలు రంగు బయట పడుతుందని ప్రభుత్వం బెంబేలెత్తిపోయి హడావుడిగా ఆమెను అరెస్ట్ చేయించింది. కాగా, పెరోల్ కోసం హోం శాఖలో ముఖ్యులొకరికి అరుణ రూ.2 కోట్లు ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. ఇంతకూ ఆ డబ్బును ఎవరు తీసుకున్నారో విచారణలో తేలుస్తారా?

ముగ్గురు ఏఆర్ కానిస్టేబుళ్ల సస్పెన్షన్

జీవిత ఖైదీ శ్రీకాంత్ హాస్పిటల్‌లో ఉన్న సమయంలో విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ముగ్గురు ఏఆర్ కానిస్టేబుళ్లను సస్పెండ్ చేస్తూ ఎస్పీ జీ కృష్ణకాంత్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతేడాది డిసెంబర్‌లో శ్రీకాంత్ జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో చేరారు. నెల రోజులకు పైగా అయన హాస్పిటల్లో ఉన్నారు. ఆ సమయంలో సన్నిహితురాలు అరుణతో మసాజ్ చేయించుకుంటూ, డ్యాన్స్‌లు చేసిన వీడియోలు ఇటీవల సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ విషయం రాష్ట్ర వ్యాప్తంగా కలకలం సృష్టించడంతో దీనిపై విచారణ జరిపిన ఎస్పీ.. ఆ సమయంలో అక్కడ విధుల్లో ఉన్న ఏఆర్ కానిస్టేబుళ్లు సుబ్బారావు, ఖాజా మొహిద్దీన్, ఖలీల్‌ను విధుల నుంచి తొలగించారు. శ్రీకాంత్, అరుణ వ్యవహారంలో ఇంకా ఎవరెవరు వారికి సహకరించారో ఉన్నతాధికారులు ఆరా తీస్తున్నారు.

బతుకు పోరాటం.. ఆహారం కోసం ఆరాటం



ఎగువ నుంచి వస్తున్న వరద నీటితో విజయవాడ ప్రకాశం బ్యారేజీ వద్ద కృష్ణమ్మ నిండు కుండను తలపిస్తోంది. సందర్శకులు సైతం బ్యారేజీపై నుంచి జలసిరిని చూసేందుకు పెద్ద ఎత్తున తరలి వస్తున్నారు. గేట్ల నుంచి ఎగసి పడుతున్న నీటి నుంచి ఎగురుతున్న చేపలను ఆహారాన్వేషణలో ఉన్న పక్షులు నోట కరచుకునేందుకు ఇదిగో ఇలా పోటీ పడుతున్నాయి. ఈ సన్నివేశాన్ని సందర్శకులు ఆసక్తిగా తిలకించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

క్రేన్ నుంచి పడి ఉక్కు ఉద్యోగి మృతి

ఉక్కునగరం (విశాఖ): స్టీల్ ప్లాంట్ స్టీల్ మెల్ట్ షాప్–2 విభాగంలో క్రేన్ నుంచి పడిన ఘటనలో విభాగం ఉద్యోగి మృతి చెందారు. స్టీల్ మెల్ట్ షాప్–2 విభాగంలో టెక్నీషియన్‌గా పనిచేస్తున్న కర్రి పైడికొండ (45) బుధవారం సుమారు 60 అడుగుల ఎత్తులో ఉన్న క్రేన్‌పై పని చేస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడ్డారు. తీవ్ర గాయాలైన పైడికొండను వెంటనే ఉక్కు జనరల్ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. స్టీల్ ప్లాంట్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వన్యప్రాణులపై నేరాల్లో తగ్గుదల



దేశంలో వన్యప్రాణుల అక్రమ రవాణా, చంపడం వంటి నేరాలకు సంబంధించిన కేసులు గత 5 ఏళ్లలో గణనీయంగా తగ్గాయి. 2020లో 800కుపైగా కేసులు నమోదైతే.. 2024లో ఆ సంఖ్య 400లోపే కావడం విశేషం. ఉత్తరప్రదేశ్, హర్యానా వంటి రాష్ట్రాల్లో భారీగా తగ్గుదల కనిపించింది. ఇక, తెలుగు రాష్ట్రాల విషయానికొస్తే.. 2024లో ఏపీలో 17 కేసులు నమోదు కాగా, తెలంగాణలో ఎలాంటి కేసులూ నమోదు కాలేదు.

రాష్ట్రం	కేసులు
పశ్చిమ బెంగాల్	73
అండమాన్ నికోబార్	36
యూపీ	30
హర్యానా	26
అస్సాం	26

ఆధారం: కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ

డీఎస్సీలో డొంక తిరుగుడు!

మెరిట్ లిస్ట్ ప్రకటించకుండానే ఎంపిక చేసే కుట్ర



సాక్షి, అమరావతి

మెగా డీఎస్సీ.. 'దగా డీఎస్సీ'గా మారనుందా..? ఉపాధ్యాయ పోస్టులను అంగట్లో అమ్మకానికి పెట్టారా..? పారదర్శకంగా మెరిట్ లిస్ట్ వెల్లడించకుండా ఎంపికైన అభ్యర్థుల ఫోన్లకు మెసేజ్ పంపిస్తాం.. మీరే చూసుకోండి అని గుంభనంగా వ్యవహరించడం ఏమిటి? అనే అనుమానాలు ఉపాధ్యాయ అభ్యర్థుల్లో రేకెత్తుతున్నాయి. కూటమి ప్రభుత్వం తీరు చూస్తుంటే తమకు కావాల్సిన అభ్యర్థులకు లబ్ధి చేకూర్చేందుకు అడ్డదారులు ఎంచుకుందా? అనే సందేహాలు కలుగుతున్నాయని మండిపడుతున్నారు. గతానికి భిన్నంగా డీఎస్సీ అభ్యర్థుల మెరిట్ లిస్ట్ వెల్లడించకుండా నేరుగా ఎంపికైన అభ్యర్థుల ఫోన్లకు మెస్సేజ్ పంపించేందుకు ఏర్పాట్లు చేయడం వెనుక పెద్ద కుట్రే దాగుందన్న అభిప్రాయం అభ్యర్థుల్లో కలుగుతోంది.

ఏ డీఎస్సీలోనూ లేని రీతిలో..

సాధారణంగా డీఎస్సీ పరీక్షలు జిల్లా స్థాయిలో నిర్వహించి మెరిట్ లిస్ట్ ప్రకటించి ర్యాంకుల ఆధారంగా పోస్టింగ్స్ ఇవ్వాలి. కానీ 2018లో నాటి టీడీపీ ప్రభుత్వం రాష్ట్ర స్థాయిలో ఉమ్మడి పరీక్షలకు శ్రీకారం చుట్టింది. దీంతో అభ్యర్థులు తమకు జరిగిన అన్యాయంపై హైకోర్టును ఆశ్రయించారు. దాంతో నియామకాలు నిలిచిపోగా తర్వాత అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్ ప్రభుత్వం న్యాయ వివాదాలను పరిష్కరించి పోస్టింగ్స్ ఇచ్చిన విషయం తెలిసిందే. అయితే, 2018 డీఎస్సీ కంటే దారుణమైన తప్పులు 2025 డీఎస్సీలో చోటు చేసుకున్నట్లు అభ్యర్థులు పేర్కొంటున్నారు. లిస్ట్, సెలక్షన్ లిస్ట్ లేకుండా నేరుగా 'సెలెక్టెడ్' అభ్యర్థుల ఫోన్లకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ కోసం మెసేజ్‌లు పంపుతామని ప్రభుత్వం చెబుతుండటంతో అభ్యర్థులు నివ్వెరపోతున్నారు.

తప్పులు సరిచేయకుండానే మార్కుల వెల్లడి

3,36,307 మంది అభ్యర్థులు 5,77,694 దరఖాస్తులు సమర్పించగా ఈ ఏడాది జూన్ 6 నుంచి జూలై 2వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించారు. అనంతరం విడుదలైన ఫైనల్ కీ చూసి అభ్యర్థులు కంగుతిన్నారు. అనేక తప్పులు ఉన్నట్లు గుర్తించినా, దీనిపై అభ్యంతరాలు తీసుకునేది లేదని విద్యాశాఖ ప్రకటించడంతో ఫైనల్ కీలో తప్పులపై విద్యాభవన్ హెల్ప్‌లైన్ నంబర్లకు ఫిర్యాదులు చేశారు. 'సాక్షి' ఈ విషయాన్ని డీఎస్సీ కన్వీనర్ దృష్టికి తీసుకెళ్లగా ఫైనల్ కీలో ఎలాంటి తప్పులు లేవంటూనే నిపుణులతో పరిశీలన చేయిస్తున్నట్లు చెప్పారు. తీరా ఆ తప్పులను సరిచేయకుండానే అభ్యర్థుల మార్కులు ప్రకటించారు.

టెట్ మార్కుల నమోదులోనూ నిర్లక్ష్యం

టెట్ మార్కులకు డీఎస్సీలో 20 శాతం వెయిటేజీ కల్పించారు. టెట్‌లో అత్యధిక మార్కులు సాధించిన అభ్యర్థులు డీఎస్సీ పరీక్షలో సాధించిన వాటికి అదనంగా కలవడంతో మెరిట్ లిస్ట్‌లో ఉంటారు. ఇప్పటి వరకు జరిగిన టెట్ వివరాలు, అభ్యర్థుల డేటా, ఎవరికి ఎన్ని మార్కులు వచ్చాయో సదరు అభ్యర్థి ఆధార్, ఫోన్ నంబర్లతో లింక్ అయ్యి ఉంటాయి. ఫోన్ నంబర్లు మారినా ఆధార్ మారే అవకాశం లేదు. కానీ డీఎస్సీ 2025 నిర్వహణలో కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది.

ఎన్నో అనుమానాలు..!

నార్మలైజేషన్ అనంతరం ఆగస్టు 11న ఫలితాలను ప్రకటించగా సవరించిన టెట్ మార్కులతో ఈనెల 13న స్కోర్ కార్డులను విడుదల చేశారు. టెట్ మార్కుల్లో తప్పులు ఉంటే అభ్యర్థులే స్వయంగా సవరించుకోవాలంటూ ఒకరోజు అవకాశం కల్పించారు. అభ్యర్థులే టెట్ మార్కులు తప్పుగా నమోదు చేశారంటూ పాఠశాల విద్యాశాఖ నెపం వారిపై నెడుతోంది. మరి విద్యాశాఖ వద్ద అభ్యర్థుల 'టెట్' డేటా ఉంటే అభ్యర్థులే సవరించుకోవాలని ఎందుకు చెప్పినట్లు? డీఎస్సీ దరఖాస్తును ఆన్‌లైన్‌లో సమర్పించే క్రమంలోనే అభ్యర్థి పేరు, పుట్టిన తేదీ, ఆధార్ వివరాలు నమోదు చేయగానే టెట్ మార్కులు వచ్చేలా ఎందుకు చేయలేదు? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

మెరిట్ అభ్యర్థులకు అన్యాయం..!

1990 నుంచి 2019 స్పెషల్ డీఎస్సీ వరకు ఫలితాలను ప్రకటించేటప్పుడు రూల్ ఆఫ్ రిజర్వేషన్, రోస్టర్‌ను పరిగణనలోకి తీసుకుని అభ్యర్థులకు వచ్చిన మార్కులతో మెరిట్ లిస్ట్ విడుదల చేశారు. డీఎస్సీ 2025లో మాత్రం అభ్యర్థుల మెరిట్ లిస్ట్‌ను ప్రభుత్వం ప్రకటించకపోవడం సందేహాలకు దారి తీస్తోంది. దీనివల్ల ఏ అభ్యర్థికి ఎన్ని మార్కులు వచ్చాయి? మెరిట్ లిస్ట్‌లో ఏ స్థానంలో ఉన్నామో అంతు చిక్కని పరిస్థితి నెలకొంది. ఈ విధానం తమకు కావాల్సిన వారికి లబ్ధి చేకూర్చేందుకేనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే డీఎస్సీలో చోటుచేసుకున్న తప్పులపై కొందరు అభ్యర్థులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఎక్స్ సర్వీస్‌మెన్ కోటా ఎత్తివేయడంపై ఆయా అభ్యర్థులు కూడా న్యాయ పోరాటానికి సిద్ధమవుతున్నారు.

డీఎస్సీ ఫలితాల్లో గూడుపుఠాణీ!

టీచర్ పోస్టుల భర్తీకి నిర్వహించిన మెగా డీఎస్సీ ఫలితాల వెల్లడిలో అభ్యర్థులను దగా చేసేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైందని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం అధ్యక్షుడు పానుగంటి చైతన్య, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ.రవిచంద్ర మండిపడ్డారు. డీఎస్సీ ఫలితాలు ప్రకటించే సమయంలో మెరిట్ లిస్ట్‌లను తొక్కిపెట్టడం వెనుక భారీ కుట్ర దాగి ఉందన్నారు. పారదర్శకతకు పాతర వేస్తూ మెరిట్ అభ్యర్థుల నోట్లో మట్టి కొట్టేందుకు మంత్రి నారా లోకేశ్ ప్రయత్నిస్తున్నారని ధ్వజమెత్తారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో బుధవారం వారు మీడియాతో మాట్లాడారు. ఫలితాలు వెలువడే ముందు దాదాపు 60 వేల మందికి టెట్ మార్కుల సవరణకు అవకాశం ఇవ్వడం అభ్యర్థుల్లో అనుమానాలు రేకెత్తిస్తోంది. అభ్యర్థుల జీవితాలతో చెలగాటం ఆడే ఈ విధానాలకు తక్షణం స్వస్తి పలకాలి అని డిమాండ్ చేశారు.

క్లుప్తంగా...

ఏపీ నిట్‌లో సర్టిఫికెట్ల పరిశీలన



నిట్‌లో విద్యార్థులకు ప్రవేశ పత్రాలు అందిస్తున్న అధికారులు

తాడేపల్లిగూడెం: పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలోని ఏపీ నిట్‌లో బీటెక్ కోర్సుల్లో చేరేందుకు సర్టిఫికెట్ల పరిశీలన బుధవారం ప్రారంభమైంది. నిట్‌లోని ఎనిమిది కోర్సుల్లో 484 సీట్లు ఉన్నాయి. వీటిలో 50 శాతం సీట్లను రాష్ట్ర విద్యార్థులతో, మిగిలిన సీట్లను ఇతర రాష్ట్రాల విద్యార్థులతో జోసా, సీ శాబ్ కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేస్తున్నారు. 2025–26కి సంబంధించి జోసా నిర్వహించిన కౌన్సెలింగ్‌లో అన్ని సీట్లకు అలాట్‌మెంట్లు పూర్తయ్యాయి. విద్యార్థులు సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం ఫీజు చెల్లించి కోర్సుల్లో చేరారు. ఈనెల 23 వరకు ఈ కార్యక్రమం కొనసాగనుంది. బుధవారం 83 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారు. నిట్ అధికారులు వారికి ప్రవేశ పత్రాలను అందజేశారు.

నిరుద్యోగులకు సర్కారు కొలువులు ఎండమావే!

- రిటైర్డ్ ఉద్యోగులకు ఏడాదికి మించి నియామకాలు

సాక్షి, అమరావతి: కూటమి ప్రభుత్వం నిరుద్యోగ యువత పొట్టకొట్టే చర్యలకు పూనుకుంది. యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని, అప్పటి వరకు నెలకు రూ.3000 చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తామని ఇచ్చిన హామీని ఇప్పటికే సీఎం చంద్రబాబు తుంగలో తొక్కారు. పదవీ విరమణ చేసిన ప్రభుత్వ ఉద్యోగులను తిరిగి సర్కారు కొలువుల్లో ఏడాది పాటు నియామకానికి గత ఏడాది ఆగస్టు నెలలో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పుడు ఆ ఉత్తర్వులకు సవరణలు చేస్తూ ఏడాదికి మించి రిటైర్డ్ ఉద్యోగులను కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్‌లో నియామకాలు చేయాలని సాధారణ పరిపాలన శాఖ (రాజకీయ) ముఖ్యకార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో నిరుద్యోగ యువతకు ఇక సర్కారు కొలువులనేది ఎండమావిగానే మిగలనున్నాయని నిరుద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆసియా కప్ భారత జట్టుకు మేనేజర్‌గా ప్రశాంత్



విశాఖ స్పోర్ట్స్: ఆసియా కప్ టీ20 టోర్నమెంట్‌లో పాల్గొనే భారత క్రికెట్ జట్టుకు మేనేజర్‌గా విశాఖకు చెందిన పి.వి.ఆర్. ప్రశాంత్ వ్యవహరించనున్నారు. సెప్టెంబర్ 9 నుంచి 28 వరకు దుబాయ్ వేదికగా ఈ పోటీలు జరగనున్నాయి. ఈ మేరకు బీసీసీఐ ప్రశాంత్ ఎంపికను బుధవారం ప్రకటించింది. గతంలో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్(ఏసీఏ) అపెక్స్ కౌన్సిల్‌లో ఉపాధ్యక్షుడిగా ప్రశాంత్ సేవలందించారు. సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్సీలో బరిలోకి దిగుతున్న భారత జట్టుకు కోచ్ గౌతమ్ గంభీర్‌తో కలిసి ప్రశాంత్ పనిచేయనున్నారు. ఈ సందర్భంగా ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ అధ్యక్ష, కార్యదర్శులు కేశినేని శివనాథ్, సానా సతీష్ బాబు ప్రశాంత్‌ను అభినందించారు.

ఎంబీబీఎస్ యాజమాన్య కోటా తాత్కాలిక మెరిట్ జాబితా విడుదల

సాక్షి, అమరావతి: 2025–26 విద్యా సంవత్సరానికి ఎంబీబీఎస్ యాజమాన్య కోటాలో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల తాత్కాలిక మెరిట్ జాబితాను ఆరోగ్య విశ్వవిద్యాలయం బుధవారం విడుదల చేసింది. విద్యార్థులు అభ్యంతరాలను శుక్రవారం సా.5 గంటల్లోపు తెలియజేయడానికి వర్సిటీ అవకాశం కల్పించింది.

స్టార్టప్@ రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్

- రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌ను ప్రారంభించిన సీఎం చంద్రబాబు

సాక్షి, అమరావతి: ఆవిష్కరణలకు కేంద్రంగా ఏపీ మారుతుందని సీఎం చంద్రబాబు వెల్లడించారు. యువ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, స్టార్టప్‌లకు ఊతమిచ్చేలా రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ పని చేస్తుందని స్పష్టం చేశారు. బుధవారం మంగళగిరిలోని మయూరి టెక్ పార్కులో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ను టాటా సన్స్ చైర్మన్ చంద్రశేఖరన్ తో కలిసి చంద్రబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ''175 నియోజకవర్గాల్లో ఇన్నోవేషన్ కేంద్రాలు ఉండాలని నిర్ణయించాం. యువత వినూత్న ఆలోచనలను క్రోడీకరించి ప్రోత్సహించేలా ఇన్నోవేషన్ హబ్ పనిచేస్తుంది'' అని తెలిపారు. ''కమ్యూనిజం, క్యాపిటలిజం ఏమీ ఉండదు. టూరిజమే ఉంటుంది. ఇది అత్యధిక ఉపాధి కల్పించే రంగం. ప్రతి నియోజకవర్గంలో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేయడమే లక్ష్యం'' అని సీఎం పేర్కొన్నారు.

- యువ పారిశ్రామికవేత్తలు అవకాశాలను వినియోగించుకోవాలని చంద్రబాబు అన్నారు. క్వాంటమ్ వ్యాలీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విప్లవాత్మక అంశాలుగా మారబోతున్నాయి అని చంద్రబాబు చెప్పారు.
- టాటా సన్స్ చైర్మన్ చంద్రశేఖరన్ మాట్లాడుతూ...'ఇన్నోవేషన్ కేంద్రాల ద్వారా ఆరోగ్యం, రక్షణ, వ్యవసాయం ఇలా వేర్వేరు రంగాల్లో అనేక అంశాల్లో పరిష్కారాలకు అవకాశాలున్నాయి. స్థానిక, ప్రాంతీయ, దేశీయ, అంతర్జాతీయ స్థాయిలో అంశాలకు పరిష్కారం దొరుకుతుంది. ఆలోచనల సమాహారంగా ఈ రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ మారుతుందని ఆశిస్తున్నా'' అని తెలిపారు.
- ఏపీలో ఇన్నోవేషన్, బిజినెస్ స్టార్టప్ ల కోసం 1,67,321 రిజిస్ట్రేషన్లు జరిగాయి. 24 గంటల్లోనే ఈస్థాయి రిజిస్ట్రేషన్లు జరగడంతో ఏపీ ఇన్నోవేషన్ సొసైటీ గిన్నిస్ వరల్డ్ రికార్డులోకి ఎక్కింది. గిన్నిస్ వరల్డ్ రికార్డును ఆ సంస్థ ప్రతినిధులు సీఎం చంద్రబాబుకు అందజేశారు.

అంతర్ జిల్లాల బదిలీలకు షెడ్యూల్

స్పౌజ్, మ్యూచువల్‌కు మాత్రమే అవకాశం

సాక్షి, అమరావతి: ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులకు జీవిత భాగస్వామి (స్పౌజ్), పరస్పర (మ్యూచువల్) అంతర్ జిల్లా బదిలీలు చేపట్టేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు బుధవారం పాఠశాల విద్యాశాఖ మార్గదర్శకాలతో కూడిన షెడ్యూల్‌ను విడుదల చేసింది. ప్రభుత్వ, జెడ్పీ, మండల పరిషత్, మున్సిపల్, కార్పొరేషన్ స్కూళ్లల్లో పనిచేస్తూ ఈ ఏడాది జూలై 31 నాటికి రెండేళ్ల సర్వీసు ఉన్నవారికి మాత్రమే అవకాశం కల్పించారు. దరఖాస్తుదారులు ప్రస్తుతం పనిచేస్తున్న జిల్లా, బదిలీ కోరుకుంటున్న జిల్లా వివరాలకు సంబంధించి రెండు రకాల ఫార్మాట్లలో గురువారం నుంచి ఈ నెల 24లోగా ఉపాధ్యాయులు లీప్ యాప్‌లో ఆన్‌లైన్ దరఖాస్తులు సమర్పించాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు ఆదేశించారు. దరఖాస్తుల ప్రింట్ కాపీలను స్థానిక ఎంఈవోలకు అందించాలని, వీటిపై డీఈవో పరిశీలన చేసి ఈనెల 27 నాటికి డైరెక్టరేట్‌కు పంపించాలన్నారు. మ్యూచువల్, స్పౌజ్ కేటగిరీ ఉపాధ్యాయులు రాష్ట్రవ్యాప్తంగా 2 వేల మంది వరకు ఉండవచ్చని అంచనా. తాజా బదిలీల్లో మెడికల్ గ్రౌండ్స్ కింద అవకాశం ఇవ్వకపోవడంతో ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. వ్యక్తిగతం, మెడికల్ గ్రౌండ్స్ కింద కూడా అంతర్ జిల్లా బదిలీలకు అనుమతించాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు. అలాగే, మిగులు ఉపాధ్యాయులకు సైతం అంతర్ జిల్లా బదిలీలు చేపట్టాలని కోరుతున్నారు.

టెట్ మార్కుల సవరణకు ఆఖరి అవకాశం

సాక్షి, అమరావతి: డీఎస్సీ రాసిన అభ్యర్థులు టెట్ మార్కుల్లో ఏమైనా అభ్యంతరాలుంటే సవరించుకునేందుకు ఎడిట్ ఆప్షన్ ఇచ్చామని, ఇది ఆఖరి అవకాశంగా భావించి గురువారం మ.12లోపు సరిచేసుకోవాలని డీఎస్సీ కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కాగా, టెట్ మార్కుల సవరణకు ఇప్పటికే మూడుసార్లు (ఈనెల 17 వరకు) అవకాశం ఇవ్వగా, తాజాగా నాలుగోసారి ఎడిట్ అవకాశం కల్పించారు.

ఉగ్రదాడి బాధితులకు నాలుగు ఎంబీబీఎస్ సీట్లు

రిజర్వ్ చేసిన కేంద్రం

సాక్షి, అమరావతి: ఈ విద్యా సంవత్సరం సెంట్రల్ పూల్‌లోని 4 ఎంబీబీఎస్ సీట్లను ఉగ్రవాద దాడి బాధితులకు కేంద్ర ప్రభుత్వం రిజర్వ్ చేసింది. బిహార్‌లోని ఏఎన్ మగధ్, ముంబైలోని గ్రాంట్ మెడికల్ కాలేజీలో ఒకటి చొప్పున, రాయ్‌పూర్‌లోని జేఎన్ఎం మెడికల్ కాలేజీలో రెండు సీట్లను రిజర్వ్ చేసినట్లు కేంద్ర హోం శాఖ ప్రకటించింది. రాష్ట్రంలో అర్హులైన వారు ఈ నెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని, రాష్ట్ర సచివాలయంలోని రెండో బ్లాక్‌కు పంపించాలని ఆరోగ్య విశ్వవిద్యాలయం బుధవారం సూచించింది.

మోడల్ స్కూళ్లలో టీచర్ల సర్దుబాటు

సాక్షి, అమరావతి: ఏపీ మోడల్ హైస్కూళ్లలో టీచర్ల సర్దుబాటుకు పాఠశాల విద్యా శాఖ ఆదేశాలు జారీ చేసింది. వివిధ స్కూళ్లలో పనిచేస్తున్న టీచర్లను.. బోధన సిబ్బంది లేని సమీప స్కూళ్లకు తాత్కాలికంగా సర్దుబాటు చేయనున్నట్టు తెలిపింది. నిర్దిష్ట సబ్జెక్టుల్లో తగినంత మంది సిబ్బంది లేని స్కూళ్లకు డిప్యూటేషన్ వేయనున్నట్లు వెల్లడించింది. బోధన సిబ్బంది లేకపోవడంతో విద్యార్థులు ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్లు అడుగుతున్నారని.. ఈ దృష్ట్యా పని సర్దుబాటు చేస్తున్నట్లు పాఠశాల విద్యాశాఖ డైరక్టర్ విజయ్ రామరాజు బుధవారం తెలిపారు.

ఐసీఎంఆర్ పరిశోధనలకు పాడేరు వైద్య విద్యార్థుల ఎంపిక

సాక్షి, పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా): ప్రతిష్టాత్మక ఐసీఎంఆర్ (భారత వైద్య పరిశోధన మండలి) ప్రాజెక్టు పరిశోధనకు పాడేరు ప్రభుత్వ మెడికల్ కళాశాల వైద్య విద్యార్థులు నలుగురు ఎంపికయ్యారు. తట్టు టీకా వేసుకున్న గిరిజన చిన్నారుల్లో రోగ నిరోధక శక్తి నిర్ధారించడంపై పరిశోధనకు శశిముఖి.. గిరిజన విద్యార్థుల్లో పౌష్టికాహార లోపం, అంటువ్యాధుల పరిశోధనకు పి.ఆదిత్య.. గిరిజనులలో మధుమేహం సోకడంపై పరిశోధనకు దిలీప్‌రెడ్డి.. గిరిజన యువతలో మత్తు పదార్థాల వాడకం పెరగడం, వ్యసన నిర్మూలన పరిశోధనకు లక్ష్మీనారాయణ ఎంపికయ్యారు. వీరిని ప్రిన్సిపాల్ డాక్టర్ డి. హేమలతాదేవి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పాపారత్నం, ఇతర వైద్యులు అభినందించారు.

ఎట్టకేలకు డిగ్రీ ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల

సాక్షి, అమరావతి: సంప్రదాయ డిగ్రీ విద్యలో ప్రవేశాలకు ఉన్నత విద్యా మండలి ఎట్టకేలకు బుధవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నెల 26 వరకు విద్యార్థుల రిజిస్ట్రేషన్లకు అవకాశం ఇచ్చింది. 25 నుంచి 28 మధ్య ప్రత్యేక కేటగిరీ వెరిఫికేషన్, 24 నుంచి 28 వరకు వెబ్ ఆప్షన్ల ఎంపిక, 29న ఆప్షన్ల మార్పులు చేర్పులకు గడువు ఇచ్చింది. 31న తుది సీట్ల కేటాయింపు చేపట్టనుంది. సెప్టెంబర్ 1నుంచి తరగతులు ప్రారంభిస్తున్నట్టు పేర్కొంది. https://oamdc.ucanapply.com వెబ్‌సైట్ ద్వారా రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని వివరించింది.

వైఎస్సార్‌సీపీ అభిమాని కావడం.. పిన్నెల్లి ఫొటో పెట్టుకోవడమే పాపం!

పల్నాడు జిల్లా కండ్లకుంట యువకుడిని అక్రమంగా నిర్బంధించి చావబాదిన పోలీసులు

- కాలు విరిగేలా కొట్టిన ట్రైనీ ఎస్‌ఐ, ఇతరులు
- రెడ్‌బుక్ అకృత్యాలపై హైకోర్టును ఆశ్రయించిన బాధితుడు
- పిటిషనర్ ఫిర్యాదుపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డీజీపీకి ఆదేశం

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ అభిమాని కావడం, మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి చిత్రాన్ని వాట్సాప్ డీపీగా పెట్టుకోవడమే ఆ యువకుడు చేసిన పాపం. రెడ్‌బుక్ సేవలో తరిస్తున్న పల్నాడు జిల్లా పోలీసులకు అది ఆగ్రహం తెప్పించింది. అంతే.. ఆ యువకుడిని పోలీస్‌స్టేషన్‌లో అక్రమంగా నిర్బంధించారు. వెల్దుర్తి ఎస్‌ఐ షమందర్ వలీ, ట్రైనీ ఎస్‌ఐ రాంబాబు గౌడ్, కానిస్టేబుల్ వెంకటనాయక్ కలిసి విచక్షణారహితంగా చావబాదారు. కాలు విరిగేలా కొట్టారు. తీవ్ర గాయాల పాలైన బాధితుడు దీన్ని డీజీపీ, జిల్లా ఎస్పీ దృష్టికి తేవడంతో మరింత రెచ్చిపోయిన వెల్దుర్తి పోలీసులు బెదిరింపులకు దిగారు. దీన్ని భరించలేక బాధితుడు పొనుగంటి నాగిరెడ్డి హైకోర్టును ఆశ్రయించాడు. తనను కస్టడీలో తీవ్రంగా హింసించిన పోలీసులపై శాఖాపరమైన చర్యలకు ఆదేశించడంతో పాటు బాధ్యులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకునేలా డీజీపీ, ఎస్పీలను ఆదేశించాలని అభ్యర్థిస్తూ అత్యవసరంగా లంచ్‌మోషన్ రూపంలో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై స్పందించిన హైకోర్టు ఈ నెల 12వతేదీ నుంచి 14 వరకు వెల్దుర్తి పోలీస్ స్టేషన్‌లోని సీసీ టీవీ పుటేజీని భద్రపరచాలని ఎస్‌హెచ్‌వోను ఆదేశించింది. పిటిషనర్ వినతి పత్రాన్ని పరిగణనలోకి తీసుకుని చట్ట ప్రకారం తగిన నిర్ణయం తీసుకోవాలని డీజీపీని ఆదేశించింది. ఈ వ్యవహారంలో పూర్తి వివరాలను తమ ముందుంచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

45 నిమిషాల పాటు చిత్రహింసలు..!

అంతకుముందు పిటిషనర్ తరఫు న్యాయవాది సానేపల్లి రామలక్ష్మణరెడ్డి వాదనలు వినిపించారు. 'వెల్దుర్తి పోలీస్‌స్టేషన్ ట్రైనీ ఎస్‌ఐ రాంబాబు గౌడ్ ఈనెల 12వ తేదీ ఉదయం 9 గంటలకు పిటిషనర్ నాగిరెడ్డిని ఇంటి నుంచి పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఎందుకు తీసుకొచ్చారో కూడా చెప్పలేదు. సాయంత్రం 4 గంటల నుంచి దాదాపు 45 నిమిషాల పాటు నాగిరెడ్డిని ట్రైనీ ఎస్‌ఐ రాంబాబు, ఎస్‌ఐ వలీ, కానిస్టేబుల్ నాయక్ కలిసి కర్రలు, బెల్టుతో చావబాదారు. కాళ్లు, చేతులు మెలిబెట్టి అదే పనిగా కొట్టారు. రాత్రి 11 గంటల వరకు నాగిరెడ్డిని స్టేషన్‌లో కూర్చోబెట్టిన పోలీసులు రూ.15 వేలు డిమాండ్ చేసి తీసుకున్నారు. నాగిరెడ్డి ప్రభుత్వాసుపత్రికి వెళ్లగా కాలు విరిగినట్లు వైద్యులు నిర్ధారించారు. అనంతరం మళ్లీ స్టేషన్‌కు రప్పించి కూర్చోబెట్టారు. హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన తరువాత పిటిషనర్ నాగిరెడ్డి తల్లిదండ్రులను కూడా పోలీసులు బెదిరించారు. ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకు వెల్దుర్తి పోలీస్‌స్టేషన్‌లోని సీసీటీవీ పుటేజీని పరిశీలిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయి. బాధితుడి వినతి పత్రాన్ని పరిగణనలోకి తీసుకునేలా డీజీపీని ఆదేశించాలి' అని రామలక్ష్మణరెడ్డి హైకోర్టును అభ్యర్థించారు. పోలీసుల తరఫున హోంశాఖ న్యాయవాది ఏ.జయంతి వాదనలు వినిపిస్తూ నాగిరెడ్డి బైక్‌పై నుంచి పడి కాలు విరగ్గొట్టుకున్నారని, ఇందులో పోలీసులకు ఎలాంటి సంబంధం లేదన్నారు.



పుటేజీ భద్రపరచడానికి ఏం ఇబ్బంది?

ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి, సీసీటీవీ పుటేజీ భద్రపరచడానికి ఇబ్బంది ఏముంటుందని ప్రశ్నించారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ప్రతి పోలీస్‌స్టేషన్‌లో సీసీ టీవీ ఉండి తీరాలని గుర్తు చేశారు. వెల్దుర్తి పోలీస్‌స్టేషన్‌లో ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకు సీసీటీవీ పుటేజీని తగిన అధికారికి అందించేందుకు వీలుగా భద్రపరచాలని ఎస్‌హెచ్‌వోను ఆదేశిస్తూ తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేశారు.

ఏపీకి అదనంగా యూరియా కేటాయించండి

కేంద్ర వ్యవసాయశాఖ మంత్రికి వైఎస్సార్‌సీపీ ఎంపీ వై.వి.సుబ్బారెడ్డి లేఖ



సాక్షి, న్యూఢిల్లీ: ఖరీఫ్‌లో రైతులకు యూరియా అందక అనేక ఇబ్బందులు పడుతున్నారని వైఎస్సార్‌సీపీ కేంద్రం దృష్టికి తీసుకెళ్లింది. రాష్ట్రంలో అదనపు యూరియా అవసరమని తెలిపింది. ఈ మేరకు యూరియా కేటాయించాలని కోరింది. వైఎస్సార్‌సీపీ ఎంపీ వై.వి.సుబ్బారెడ్డి కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు బుధవారం లేఖ రాశారు. నేషనల్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ ఇటీవల విడుదల చేసిన టెండర్ ద్వారా 20 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా కోసం ఏర్పాట్లు చేసిన నేపథ్యంలో ప్రస్తుత కేటాయింపునకు మించి ఏపీకి కేటాయించాలని కోరారు.

సిబ్బంది లేకుండా ఐఐఎం నడిచేదెలా?

వైఎస్సార్‌సీపీ ఎంపీ బాబురావు

సాక్షి, న్యూఢిల్లీ: ఏపీలోని విశాఖపట్నంలో మాజీ సీఎం వైఎస్ జగన్ కృషి ఫలితంగా ఏర్పాటైన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం) బోధన సిబ్బంది లేకుండా ఎలా నడుస్తుందని వైఎస్సార్‌సీపీ ఎంపీ గొల్ల బాబురావు కేంద్రాన్ని ప్రశ్నించారు. ది ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం) సవరణ బిల్లు–2025పై బుధవారం రాజ్యసభలో జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. ఈ సంస్థలో బోధన సిబ్బంది కొరత ఉందని చెప్పారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని వెంటనే ఖాళీలను భర్తీచేయాలని ఆయన డిమాండ్ చేశారు.

ఆక్వా సంక్షోభాన్ని పరిష్కరించండి

రాజ్యసభలో వైఎస్సార్‌సీపీ ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్



సాక్షి, న్యూఢిల్లీ: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ టారిఫ్ ప్రకటనతో ఏపీలో ఆక్వా కల్చర్ రైతులు తీవ్ర సంక్షోభం ఎదుర్కొంటున్నట్లు వైఎస్సార్‌సీపీ ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్ చెప్పారు. ఆయన బుధవారం రాజ్యసభలో జీరో అవర్‌లో ఈ సమస్యను ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఏడాది నుంచి వనామీ రొయ్యల ధరలు అంతర్జాతీయ మార్కెట్‌లో పెరిగిన ప్రతిసారీ ఏదో ఒక సమస్య ఎదురవుతోందని , ధరలు పడిపోవడం సాధారణ అంశంగా మారిందని చెప్పారు. ఎటువంటి సమస్యలు లేకపోయినా, స్థానిక కొనుగోలుదారులు ధరలు తగ్గిస్తూ, ఆక్వా రైతులను నష్టపరుస్తున్నారన్నారు. ఇటీవలి ట్రంప్ ప్రకటనతో మళ్లీ వనామీ రొయ్యల ధరలు పడిపోయాయని చెప్పారు. ఏప్రిల్ మొదటి వారం ట్రంప్ టారిఫ్ ప్రకటించగానే అక్కడ దిగుమతులను నిలిపేయడంతో ధర ఒక్కో కౌంట్ రూ.60 వరకు తగ్గించారని, అమెరికా టారిఫ్ అమలును వాయిదా వేస్తామనటంతో ధర ఒక్కో కౌంట్‌కు కేవలం రూ.15 మాత్రమే పెంచారని వివరించారు. ఆంధ్రప్రదేశ్ నుంచి అమెరికాకు వనామీ రొయ్యలు ఎక్కువగా ఎగుమతి అవుతున్నట్లు చెప్పారు. గతంలో బాక్సులపై సుంకం 4.5 శాతం ఉండేదని, తర్వాత 5 శాతం మేకింగ్‌తో కలిపి మొత్తం 9.5 శాతం అయిందని చెప్పారు. ఇప్పుడు అమెరికా అదనంగా 25 శాతం టాక్స్ విధించటంతో మొత్తం పన్ను భారం 34.9 శాతం అయిందన్నారు. ఈ కారణంగా రైతులు తాత్కాలికంగా రొయ్యల సాగు ఆపక తప్పని పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం తక్షణం చర్యలు తీసుకుని ఈ సమస్యను పరిష్కరించాలని ఆయన కోరారు.


ఏపీ ఇన్ పార్లమెంట్



లోక్‌సభ

విశాఖ రీసెర్చ్ సెంటర్‌లో కొత్త క్యాంపస్

లోక్‌సభలో వైఎస్సార్‌సీపీ ఎంపీ గురుమూర్తి ప్రశ్నకు కేంద్రం జవాబు



సాక్షి, న్యూఢిల్లీ: విశాఖపట్నంలో బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్ కొత్త క్యాంపస్‌ని ఏర్పాటు చేసిందని ప్రధానమంత్రి కార్యాలయ సహాయమంత్రి డాక్టర్ జితేంద్రసింగ్ చెప్పారు. లోక్‌సభలో బుధవారం వైఎస్సార్‌సీపీ ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి ప్రశ్నకు మంత్రి జవాబిచ్చారు. కేంద్ర బడ్జెట్–2025లో ప్రారంభించిన అణుశక్తి కార్యక్రమం కింద చిన్న అణు రియాక్టర్ల పరిశోధన, అభివృద్ధి కోసం రూ.20 వేల కోట్లు కేటాయించినట్లు చెప్పారు.

అమరావతికి రైలుమార్గం



అమరావతికి రైలు కనెక్టివిటీ కోసం రూ.2,047 కోట్లతో 57 కిలోమీటర్ల మేర ఎర్రుపాలెం–అమరావతి–నంబూరు రైలుమార్గం మంజూరు చేసినట్లు కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ప్రశ్నకు మంత్రి జవాబిచ్చారు. అమరావతి, విజయవాడ ప్రాంతాలకు కనెక్టివిటీని మెరుగుపరిచేందుకు ఇటీవల విజయవాడ–గుడివాడ–నర్సాపూర్, గుడివాడ–మచిలీపట్నం, భీమవరం–నిడదవోలు డబ్లింగ్ పనులు ప్రారంభించినట్లు చెప్పారు.

రాజ్యసభ

రాయ్‌పూర్–విశాఖ ఆరులేన్ల రోడ్డుకు భూసమస్య

రాజ్యసభలో వైఎస్సార్‌సీపీ ఎంపీ బాబురావు ప్రశ్నకు కేంద్రం జవాబు



సాక్షి, న్యూఢిల్లీ: ఏపీలోని ఎన్‌హెచ్–130సీడీ (ప్యాకేజీ–2)లోని రాయ్‌పూర్–విశాఖపట్నం రోడ్డును 24.30 కిలోమీటర్ల మేర రూ.663.60 కోట్లతో ఆరులేన్ల రహదారిగా 2021లో మంజూరు చేసినట్లు కేంద్ర రోడ్లు, జాతీయ రహదారులశాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. రాజ్యసభలో బుధవారం వైఎస్సార్‌సీపీ ఎంపీ గొల్ల బాబురావు ప్రశ్నకు మంత్రి జవాబిచ్చారు. 2024 మార్చి 29కి 24.025 కి.మీ.పనులు పూర్తయ్యాయని, భూసేకరణ సమస్య కారణంగా 0.275 కి.మీ.రోడ్డు పూర్తి కాలేదని చెప్పారు.

రోజుకు 38.05 లక్షల లీటర్ల పాల ప్రాసెసింగ్ సామర్థ్యం

ఏపీలో పాల ప్రాసెసింగ్ సామర్థ్యం రోజుకు దాదాపు 38.05 లక్షల లీటర్లని గొల్ల బాబురావు మరో ప్రశ్నకు కేంద్ర మత్స్య, పశుసంవర్ధకశాఖ సహాయమంత్రి ఎస్.పి.సింగ్ భగేల్ జవాబిచ్చారు. ఇది దేశంలోని పాడి సహకార సంస్థల మొత్తం వ్యవస్థాపిత సామర్థ్యంలో దాదాపు 3.5 శాతం అని చెప్పారు. నేషనల్ ప్రోగ్రామ్ ఫర్ డెయిరీ డెవలప్‌మెంట్ పథకం కింద ఏపీలో 1960 పాడి సహకార సంఘాలకు మద్దతు ఇచ్చినట్లు తెలిపారు.



● సుధారెడ్డితో మిస్ వరల్డ్ ఓపల్ సుచాత, మిస్ ఏషియా క్రిష్టా గ్రావిడెజ్

బ్రెస్ట్ క్యాన్సర్ అవగాహనే ఔషధం

బ్రెస్ట్ క్యాన్సర్...

అంతర్జాతీయ స్థాయిలో మహిళల ఆరోగ్యానికి పెనుముప్పుగా మారిన మహమ్మారి. రొమ్ము క్యాన్సర్‌పైన ప్రతి ఒక్కరికీ అవగాహన పెరగాల్సిన అవసరముంది.

ఈ నేపథ్యంలో సుధారెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్థాయిలో రొమ్ము క్యాన్సర్‌పైన అవగాహన కల్పించడానికి సెప్టెంబర్ 28న పింక్ పవర్ రన్ 2.0ను నిర్వహిస్తున్నారు. కిందటేడాది మొదటిసారిగా నిర్వహించిన ఈ రన్ అంతర్జాతీయంగా అవగాహన కల్పించడంతో గిన్నిస్ బుక్ వరల్డ్ రికార్డు సైతం సొంతం చేసుకుంది. ఈ యేడాది నిర్వహించే పవర్ రన్‌కు సంబంధించిన ప్రారంభ కార్యక్రమాన్ని సంస్థ వ్యవస్థాపకులు సుధారెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్ ట్రైడెంట్ వేదికగా నిర్వహించి, రన్‌కు సంబంధించిన టీషర్ట్‌ను ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమంలో మిస్ వరల్డ్ - 2025 విజేత ఓపల్ సుచాత, మిస్ ఏషియా-2025 క్రిష్టా గ్రావిడెజ్ ముఖ్య అతిథులుగా పాల్గొని ఈ అవగాహనకు మరింత శక్తిని జోడించారు. ఓపల్ సుచాత క్యాన్సర్ సర్వైవర్ కావడం, అంతర్జాతీయ స్థాయిలో తన సొంత ప్రాజెక్టులో భాగంగా బ్రెస్ట్ క్యాన్సర్‌పైన అవగాహన కల్పించడం విశేషం. ఈ కార్యక్రమం సందర్భంగా వీరు 'సాక్షి'తో పంచుకున్న విశేషాలు ...

ఇదొక ఉద్యమం

మొదటి ఎడిషన్ అందించిన ప్రోత్సాహంతో 2 ఎడిషన్ పింక్ పవర్‌రన్ 2.0ను మరింత భారీ స్థాయిలో నిర్వహిస్తున్నాం. ఇది మారథాన్ రన్ మాత్రమే కాదు.. ఇదొక ఉద్యమం. మహిళల స్వీయ సంరక్షణ, ముందస్తు జాగ్రత్త, బ్రెస్ట్‌క్యాన్సర్‌పై అవగాహన పొందడానికి అంతర్జాతీయ వేదిక. ఈ రన్‌లో గ్లోబల్ రన్నర్స్, ప్రముఖ స్ఫూర్తిదాయక మహిళలు, గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే మహిళలు పాల్గొంటున్నారు. రొమ్ము క్యాన్సర్ బారిన పడిన మహిళల అవస్థలు మాటల్లో వర్ణించలేం. అలాంటి వారికి మద్దతుగా నిలవడానికి సీఎస్ఆర్ బాధ్యతగా మా ఫౌండేషన్ ఆధ్వర్యంలో 10కే, 5కే, 3కే విభాగాల్లో రన్ నిర్వహిస్తున్నాం. దీనికి మెయిల్ ఫౌండేషన్ భాగస్వామిగా మద్దతును అందిస్తోంది. మా ప్రయత్నానికి సమాజంలోని అన్నివర్గాల నుంచి ప్రోత్సాహం లభిస్తోంది. కిందటేడాది 18 ఏళ్ల నుంచి 89 ఏళ్ల మహిళల వరకు ఈ రన్‌లో పాల్గొనడం సంతోషాన్నిచ్చింది. ఇందులో పాల్గొనే వారికి ఉచిత ట్రాన్స్‌పోర్ట్, రిజిస్ట్రేషన్ కల్పిస్తున్నాం. అంతేకాదు, వారికి మారథాన్ టెక్నిక్స్, బ్రీతింగ్ కంట్రోల్‌పై శిక్షణా అందిస్తున్నాం. పింక్ పవర్ రన్ 2.0 కోసం దాదాపు 150 మంది 6 నెలలుగా విశేష కృషి చేస్తున్నారు. రన్నింగ్ ఈవెంట్ రోజు ఎమర్జెన్సీ మెడికల్ సేవలూ అందుబాటులో ఉంటాయి. సోషల్ మీడియా వేదికగా టోల్ ఫ్రీ నంబర్లను సైతం అందుబాటులో ఉంచాం. మా ప్రయత్నానికి మద్దతుగా మిస్ వరల్డ్ విన్నర్ ఓపల్ సుచాత ముందుకు రావడం అభినందనీయం. తన ప్రయాణం ఈ తరానికి స్ఫూర్తి. ఈ వేదిక పైన ప్రముఖ బ్రెస్ట్ క్యాన్సర్ ఆంకాలజిస్ట్ డా.ప్రజ్ఞ చిగురుపాటి పాల్గొని ముందస్తుగా రొమ్ము కేన్సర్ గుర్తించడం ప్రాముఖ్యతను తెలియజేయడం మా అందరిలో స్ఫూర్తి నింపింది. ప్రతి మహిళ ఈ మహమ్మారిని గుర్తించే మామోగ్రామ్ అంటే ఏంటో తెలుసుకోవాలి. గ్రామీణ ప్రాంతాల్లో సైతం క్యాన్సర్ డిటెక్టింగ్ మొబైల్ బస్సులు సైతం అందుబాటులో ఉన్నాయి. ఈ సేవలు వినియోగించుకోవాలి. నా ఈ ప్రయాణంలో నా భర్త మేఘా క్రిష్టారెడ్డి, నా పిల్లలు అందిస్తున్న ప్రోత్సాహం మరువలేనిది.

- సుధారెడ్డి, సుధారెడ్డి ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు

తమను తాము సంరక్షించుకోవడం అవసరం

ప్రపంచసుందరిగా నేను గుర్తింపు పొందింది ఈ నేలపైనే. మళ్లీ ఇదే నేలపైన రొమ్ము క్యాన్సర్ పైన అవగాహన కల్పించే మహోన్నత కార్యక్రమంలో భాగం కావడం సంతోషంగా ఉంది. ఇక్కడికి రావడం నా మరో ఇంటికి వచ్చినట్టే ఉంది. నా దేశంలో థాయ్‌లాండ్ లేదా భారత్‌లోనో కాదు యావత్ ప్రపంచమంతా ఈ రొమ్ము క్యాన్సర్ పెనుప్రమాదంగా మారుతోంది. 16 ఏళ్ల వయస్సులో నేనూ ఈ బ్రెస్ట్ క్యాన్సర్ బారిన పడిన వ్యక్తినే. కానీ దానిని జయించి ఇప్పుడు ప్రపంచం ముందు మిస్ వరల్డ్‌గా నిలవగలిగాను. ఆ అవస్థలు, మానసిక వేదన ప్రస్తుత జీవితాన్ని ఎలా గడపాలో నేర్పింది. దీనిపైన అవగాహన పెరగాల్సిన అవసరం ఉంది. కుటుంబానికి, సమాజానికి జీవితాన్నే త్యాగం చేసే మహిళలకు తమను తాము సంరక్షించుకోవడం కూడా చాలా అవసరం. ముందస్తుగా దీనిని గుర్తించగలిగితే బయటపడగలమని చాలామంది మహిళలకు తెలియదు. ఈ వ్యాధి చూట్టూ ఎన్నో భయాలను పెంచుకున్నారు. బ్రెస్ట్ క్యాన్సర్ పైన అవగాహన కల్పించడం కోసం నేను మొదలు పెట్టిన ప్రాజెక్ట్‌లో భాగంగా థాయ్‌లాండ్‌లో మొదటి సారి కలిసిన ఒక మహిళ నాకెంతో స్ఫూర్తిని నింపింది. ఆమె నా కథను స్ఫూర్తిగా తీసుకున్నాను అని చెప్పడం ఎప్పటికీ మర్చిపోలేను. ఆత్మస్థైర్యంతో నెవర్ గివప్ అంటూ ఆమె క్యాన్సర్‌ను జయించి ప్రస్తుతం ఆరోగ్యంగా ఉంది. మరొకరు నా అభిమాని తల్లి.. ఆమెకు గతంలో రొమ్ము క్యాన్సర్ వచ్చి నయమై కొన్నేళ్ల తరువాత మళ్లీ వచ్చింది. తానొక టీచర్... అందరి భవిష్యత్‌లు తీర్చిదిద్దిన ఆమె తన భవిష్యత్ ఏమవుతుందో అని భయపడలేదు. చికిత్స తీసుకునే పరిస్థితిలేని రోజులను దాటుకుని ఇప్పుడు క్యాన్సర్‌ను జయించి ఆరోగ్యంగా ఉంది. చాలాసార్లు నా మాటలతో మానసిక తోడ్పాటునందించాను. తనను కలిసి మాట్లాడిన ప్రతిసారీ నాలో ఓ కొత్త స్ఫూర్తి నింపుకుంటున్నాను. మహిళలెవ్వరూ ఈ రొమ్ము క్యాన్సర్ బారిన పడి ప్రాణాలు కోల్పోకుండా అవగాహన పెంచాల్సిన బాధ్యతను స్వచ్ఛందంగా స్వీకరించాను.

- ఓపల్ సుచాత, మిస్ వరల్డ్- 2025

మార్పు రావాలి

ప్రపంచంలోని ఏ మహిళా మొదటగా తనకు తాను ప్రాధాన్యతనిచ్చుకోదు. కానీ బ్రెస్ట్ క్యాన్సర్ విషయంలో మార్పు రావాలి. 40 ఏళ్లు దాటిన ప్రతి మహిళా ప్రాథమిక పరీక్ష చేసుకోవాలి. దీనికి సంబంధించిన టెక్నిక్స్ తెలుసుకోవాలి. అంతర్జాతీయంగా ప్రభావితం చేసే బ్రెస్ట్ క్యాన్సర్ అవగాహన కార్యక్రమాలు జరుగుతుండటం అభినందనీయం. ఇలాంటి ప్రయత్నంలో ప్రతి సెలిబ్రెటీ పాల్గొనాల్సిన అవసరం ఉంది.

-క్రిష్టా గ్రావిడెజ్, మిస్ ఏషియా- 2025

- హనుమాద్రి శ్రీకాంత్, సాక్షి హైదరాబాద్, ఫొటోలు: ఎస్.ఎస్.ఠాకూర్

● మన(సు)లో మాట

పూనకాలు నిజమేనా?

నాకో సందేహం ఉంది డాక్టరు గారూ... గత 6 నెలలనుంచి మా ఇంటి పక్కన ఉండే ఆవిడకి దేవత పూనుతోంది. ఆ సమయంలో ఆమెకి అమ్మవారు పూని భవిష్యత్తు చెప్పడం, అలాగే ఇతరుల సమస్యలకి సమాధానం / పరిష్కారాలు చెబుతుంది. వారంలో 3 రోజులు ఇలా జరుగుతుంది. దాంతో మా ప్రాంతం అంతా ఒక జాతరలా తయారైంది. ఆమెను అడిగితే తనకి ఏమీ గుర్తులేదు అని చెప్తుంది. వారంలో మిగిలిన రోజులు మామూలుగానే ఉంటుంది. భర్త తాగుబోతు, పిల్లలు ఏమీ పనిచేయరు. ఈమే కూలి పని చేసి వాళ్ళని పోషించాలి. భర్త తాగివచ్చి ప్రతిరోజు హింసించేవాడు. ఎప్పటినుంచి ఆమెకు పూనడం మొదలైందో, అప్పటినుండి అతను తాగడం మానేసి పనికి వెళ్తున్నాడు. పిల్లలు ఆమె మాట వింటున్నారు. భక్తులు ఇచ్చే కానుకలతో వాళ్ళ ఆర్థిక పరిస్థితి కూడా కాస్త మెరుగైంది. అసలు పూనకాలనేవి నిజంగా ఉంటాయా? లేక ఆవిడ కావాలనే ఇలా చేస్తోందా? చాలా సందర్భాలలో పూనకాల గురించి విన్నాను కానీ ప్రత్యక్షంగా చూడటం ఇదే. దయచేసి నా సందేహాలకు సమాధానం చెప్పగలరు.

- తిరుపతి, వరంగల్

ఎవరైనా ఒక వ్యక్తి విపరీతమైన ఒత్తిడికి, దీర్ఘకాలంగా అణిచివేతకు గురైనపుడు, లేదా మనసులో ఏదైనా తీరని కోర్కెలు, ఆలోచనలు ఉన్నప్పుడు. వారికి తెలియకుండానే ఇలా ఒక వేరే వ్యక్తిలా లేదా దేవత పూనినట్లు ప్రవర్తించే అవకాశం ఉంది. దీన్ని వైద్య పరిభాషలో 'డిసోసియేటివ్ ట్రాన్స్' లేదా 'పొసెషన్ స్టేట్' అంటారు. ఇలాంటి స్థితిలో ఆ వ్యక్తులు ఎలాంటి భయాలూ, ఒత్తిళ్లూ లేకుండా ఫ్రీగా మాట్లాడగలుగుతారు. ఆత్మన్యూనతా భావం ఉండే వారిలో కూడా, ఈ 'పొసెషన్ స్టేట్' ఎక్కువగా కనబడుతుంది. అయితే కొంతమంది తమ స్వార్థం లేదా లాభాపేక్ష కోసం, ఇలా పూనకం వచ్చినట్లు నటించొచ్చు, అయితే వాటిని 'ట్రాన్స్ స్టేట్' కింద పరిగణించలేము. అలాంటి వారి పట్ల జాగ్రత్తగా ఉండాలి. మన సమాజంలో ఇలా దేవుడు ఆవహించిన వారిని ప్రత్యేకంగా గౌరవిస్తారు. హారతులు ఇవ్వడం, కొబ్బరి కాయలు కొట్టడం, దండలు వేయడం వంటి వాటితో వారిని ప్రత్యేకంగా కూడా చూస్తారు. దీనివల్ల ఆ వ్యక్తికి కొంతయినా ఒక ప్రత్యేక గుర్తింపు లభిస్తుంది. వారిలో మానసిక ఒత్తిడి తగ్గుతుంది. అణిచివేతకు గురయిన వాళ్ళలో ఒక పవర్ వచ్చిన భావన కూడా కలుగుతుంది. ఎక్కువగా స్త్రీలు ఇలాంటి ఇబ్బందులకు గురవుతారు, ఓర్పు, సహనం వంటి వాటిని కూడా స్త్రీలలో ఎక్కువగా చూస్తుంటాము. రోజు తాగి వచ్చి కొట్టే ఆమె భర్త ఇప్పుడు ఆమెలోని దేవతకి, భక్తితోను, భయంతోనూ గౌరవిస్తూ మారాడు. పిల్లలు మారి తన మాట వింటున్నారు. నిజానికి ప్రతి స్త్రీ ఒక శక్తి స్వరూపిణి, సమాజంలో, కుటుంబంలో ఆమెకు గౌరవం స్థానం కల్పిస్తే వారిలో వచ్చే అనేక మానసిక సమస్యలను నివారించవచ్చు. మీ పక్కింటావిడకి దేవత రావడం వల్ల ఏదైనా ఇబ్బందిగా అన్పించినా, లేదా తన ఇష్టానికి వ్యతిరేకంగా పూనకం వచ్చినా వారు పరీక్షించి డిప్రెషన్ లేదా ఇతర మానసిక సమస్యలు ఏదైనా ఉండి ఆమెకి సహాయం కావాలని అన్పించినా వెంటనే సైకియాట్రిస్ట్‌ని కలిస్తే కౌన్సెలింగ్, తగిన చికిత్స అందిస్తారు. ఆల్ ది బెస్ట్!



డా. ఇండ్ల విశాల్ రెడ్డి,
సీనియర్ సైకియాట్రిస్ట్, విజయవాడ.
మీ సమస్యలు, సందేహాలు పంపవలసిన మెయిల్ ఐడీ: sakshifamily3@gmail.com

సాక్షి సినిమా

కఠిన చర్యలు తప్పవు



● ప్రభాస్

● ప్రభాస్ తాజా చిత్రం ఫొటో లీక్‌పై యూనిట్ హెచ్చరిక

ప్రభాస్ హీరోగా రూపొందుతోన్న తాజా చిత్రం 'ఫౌజి' (ప్రచారంలో ఉన్న టైటిల్). 'సీతారామం' మూవీ ఫేమ్ హను రాఘవపూడి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంలో ఇమాన్వీ హీరోయిన్‌గా నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. తాజాగా ఈ సినిమా సెట్స్ నుంచి వింటేజ్ లుక్‌లో కనిపిస్తున్న ప్రభాస్ లుక్ లీక్ అయింది. విడుదలైన కొద్ది క్షణాల్లోనే ఆ ఫొటో వైరల్ అయింది. పలువురు నెటిజన్లు షేర్ చేశారు. ప్రభాస్ లుక్ ట్రెండింగ్‌లోకి రావడంతో మూవీ టీమ్ సీరియస్‌గా స్పందించింది. ''మా సినిమా గురించి ఎంతో మంది ఎదురు చూస్తున్నారని మాకు తెలుసు. మీకు అద్భుతమైన విజువల్స్ అందించేందుకు యూనిట్ ఎంతో కష్టపడుతోంది. చిత్రీకరణ సమయంలో సెట్స్ నుంచి ఓ ఫొటో లీక్ అయిన విషయం మా దృష్టికి వచ్చింది. ఇలాంటి లీక్‌లు మా విశ్వసనీయత, నైతికతను దెబ్బతీస్తాయి. అనధికారికంగా ఎవరైనా ప్రభాస్ లుక్ లీక్ చేసినా, షేర్ చేసినా వాళ్ల ఐడీలు బ్లాక్ చేయడంతో పాటు సైబర్ క్రైమ్ నేరం కింద పరిగణించి కేసులు పెట్టి, కఠిన చర్యలు తీసుకుంటాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. పీరియాడికల్ యాక్షన్ డ్రామాగా రూపొందుతోన్న ఈ చిత్రానికి సంగీతం: విశాల్ చంద్రశేఖర్.

ఘాటీల జీవన శైలితో...



● విక్రమ్ ప్రభు, అనుష్క

అనుష్క శెట్టి, విక్రమ్ ప్రభు ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ఘాటి'. 'వేదం' (2010) వంటి హిట్ మూవీ తర్వాత అనుష్క, డైరెక్టర్ క్రిష్ జాగర్లమూడి కాంబినేషన్‌లో రూపొందిన ద్వితీయ చిత్రమిది. యూవీ క్రియేషన్స్ సమర్పణలో ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై రాజీవ్ రెడ్డి, సాయిబాబు జాగర్లమూడి నిర్మించారు. ఈ చిత్రం తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో సెప్టెంబరు 5న విడుదల కానుంది. నాగవెల్లి విద్యాసాగర్ సంగీతం అందించిన ఈ సినిమా నుంచి 'దస్సోరా...' అంటూ సాగే రెండో పాటని బుధవారం రిలీజ్ చేశారు. ఈఎస్ మూర్తి సాహిత్యం అందించిన ఈ పాటని గీతా మాధురి, సాకేత్, శృతి రంజని పాడారు. ''దస్సోరా...' పాట ఘాటీల జీవితాలు, ఇబ్బందులు, పట్టుదలని రిఫ్లెక్ట్ చేస్తుంది. ఘాటీల జీవన శైలి, వారి సంస్కృతిని ఈ పాట అద్భుతంగా చూపెడుతుంది. మనోజ్ రెడ్డి కాటసాని సినిమాటోగ్రఫీ, తోట తరణి అద్భుతమైన సెట్‌లు, సాయి మాధవ్ బుర్రా డైలాగ్స్, చాణక్య రెడ్డి తూర్పు, వెంకట్ ఎస్. స్వామి ఎడిటింగ్, రామ్‌కృష్ణన్ మాస్టర్ యాక్షన్ ఈ సినిమాకి అదనపు బలాలు'' అని చిత్రబృందం పేర్కొంది.

పదిహేను కోట్ల ఇంట్లో...



● ఎన్టీఆర్

'దేవర' వంటి బ్లాక్‌బస్టర్ మూవీ తర్వాత ఎన్టీఆర్ సోలో హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'ఎన్టీఆర్ నీల్' (వర్కింగ్ టైటిల్). 'కేజీఎఫ్, సలార్' వంటి హిట్ చిత్రాల తర్వాత డైరెక్టర్ ప్రశాంత్ నీల్ తెరకెక్కిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ బ్యానర్స్‌పై కల్యాణ్ రామ్ నందమూరి, నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి, హరికృష్ణ కొసరాజు పాన్ ఇండియా స్థాయిలో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమాకి 'డ్రాగన్' అనే టైటిల్ పరిశీలనలో ఉందని ఫిల్మ్‌నగర్ టాక్. ఇదిలా ఉంటే... ఈ చిత్రానికి సంబంధించిన ప్రతిదీ టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా మారుతోంది. ఇప్పటికే మూడువేల మంది జూనియర్ ఆర్టిస్టులతో చిత్రీకరించిన ఓ భారీ యాక్షన్ ఎపిసోడ్ అలాగే సుమారు 2000 మందితో తెరకెక్కించిన ఓ పాట... ఇలా అన్నీ హైలెట్‌గా మారాయి. తాజాగా ఈ చిత్రం కోసం హైదరాబాద్ సమీపంలోని ఓ స్టూడియోలో సుమారు పదిహేను కోట్ల రూపాయలతో ఎన్టీఆర్ ఇంటి సెట్‌ని నిర్మించారనే వార్తలు వస్తున్నాయి. ఈ భారీ సెట్‌లో యాక్షన్ సీక్వెన్స్‌తో కొత్త షెడ్యూల్‌ని ప్రారంభిస్తారట. సినిమాలో ఈ ఇంటి సెట్ ప్రధాన ఆకర్షణల్లో ఒకటిగా నిలుస్తుందట. కళా ఖండాలు, వాల్ హ్యాంగింగ్... ఇలా ఈ సెట్‌కి సంబంధించిన ప్రతి విషయంలో ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకున్నారట మేకర్స్. అందుకే సెట్‌కే దాదాపు రూ. 15 కోట్లు ఖర్చు చేశారని సమాచారం. ప్రస్తుతం షూటింగ్‌కి చిన్న విరామం ఇచ్చిన ఎన్టీఆర్ వినాయక చవితి తర్వాత సెప్టెంబర్ మొదటి వారం నుంచి షూటింగ్‌లో పాల్గొంటారని టాక్. ఈ కొత్త షెడ్యూల్ నెల పాటు జరగనుందని తెలిసింది. ఈ చిత్రం 2026 జూన్ 25న విడుదల కానుంది.

చర్చలు నేటికి వాయిదా!

కార్మికుల వేతనాలు 30 శాతం పెంచాలంటూ తెలుగు సినీ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 4వ తేదీ నుంచి కార్మికులు సమ్మె చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ బంద్ బుధవారానికి 17వ రోజుకి చేరుకుంది. వేతనాల పెంపు విషయంపై తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి, నిర్మాతలు, ఫెడరేషన్ మధ్య చర్చలు జరుగుతున్నప్పటికీ సమ్మెపై ఎలాంటి తుది నిర్ణయం వెలువడలేదు. బుధవారం ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్, ఫెడరేషన్ మధ్య జరగాల్సిన చర్చలు నేటికి వాయిదా పడ్డాయి. ఇదిలా ఉంటే... సినీ కార్మికుల సమ్మెపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుంది. ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్, ఫెడరేషన్ నాయకులతో చర్చించి ఈ సమస్యకు ఓ పరిష్కారం చూపాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులను ఆదేశించారట. హైదరాబాద్‌లో కేవలం తెలుగు సినిమాలే కాదు... ఇతర భాషల సినిమా షూటింగ్స్ కూడా నిలిచిపోవడంతో ప్రభుత్వం అప్రమత్తమైందని సమాచారం. హైదరాబాద్‌ను సినిమా హబ్‌గా తీర్చిదిద్దాలనే ప్రభుత్వ ఆలోచనకు ఈ సమ్మె అడ్డంకిగా మారిందన్నది అధికారుల అభిప్రాయంగా తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులతో ప్రభుత్వ ఉన్నతాధికారులు చర్చలు జరిపారు. అలాగే ఫెడరేషన్ నాయకులతోనూ చర్చించనున్నారు. కార్మికుల సమ్మెపై తెలంగాణ ప్రభుత్వం జోక్యం చేసుకోవడంతో కార్మిక సంఘాలు బుధవారం అత్యవసర సమావేశం నిర్వహించాయి. 'తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయీస్ ఫెడరేషన్' సెక్రటరీ అమ్మి రాజు, కోశాధికారి అలెగ్జాండర్ ఆధ్వర్యంలో ఈ సమావేశం జరిగిందని తెలిసింది. బుధవారంతో సమ్మె సమస్య ముగుస్తుందనే నేపథ్యంలో నేటికి చర్చలు వాయిదా పడ్డాయి. మరి.., ఈరోజైనా సమ్మెకి శుభం కార్డు పడుతుందో? లేదో చూడాలి.

పాటతో ప్రారంభం



● రోహిత్, రియా, విజయ్

రోహిత్ వర్మ, రియా సుమన్ హీరో హీరోయిన్లుగా ఓ కొత్త సినిమా రానుంది. గోవిందరెడ్డి చంద్ర దర్శకత్వంలో క్రేజీ కింగ్స్ స్టూడియోస్ ఎల్ఎల్‌పీ పతాకంపై నజీర్ జమాల్ నిర్మిస్తున్నారు. హైదరాబాద్‌లో పూజా కార్యక్రమాలతో ఈ చిత్రం ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి సీనియర్ దర్శకుడు రామ్‌ప్రసాద్ కెమెరా స్విచ్చాన్ చేయగా, దర్శకుడు విజయ్ కనకమేడల క్లాప్ ఇచ్చారు. మల్లికార్జున గౌరవ దర్శకత్వం వహించారు. అనంతరం రోహిత్ వర్మ మాట్లాడుతూ - ''ఈ సినిమాతో తెలుగులోకి రావడం చాలా సంతోషంగా ఉంది. ఈ చిత్రం కోసం తెలుగు బాగా నేర్చుకుంటున్నాను. ఇది అందరూ మెచ్చే చిత్రం అవుతుంది'' అని తెలిపారు. ''తెలుగులో నాకు ఇది తొలి చిత్రం. కథ నచ్చి, ఈ సినిమా చేస్తున్నాను'' అని తెలిపారు నజీర్ జమాల్. ''మాంటేజ్ సాంగ్‌తో బుధవారం ఈ సినిమా షూటింగ్ ప్రారంభించాం'' అని పేర్కొన్నారు రియా సుమన్. ''క్రేజీ కథతో రాబోతున్నాం. పక్కా కమర్షియల్ సినిమా ఇది'' అన్నారు గోవిందరెడ్డి చంద్ర.

టీజర్ ఆసక్తిగా అనిపించింది

- సిద్ధు జొన్నలగడ్డ



● సిద్ధు జొన్నలగడ్డ, మధుశాలిని, శశికిరణ్ తిక్క

''కన్యాకుమారి' టీజర్ చూసిన వెంటనే ఆసక్తిగా అనిపించి, ఈవెంట్‌కి రావాలనుకున్నాను. టీజర్, ట్రైలర్‌లో ఓ వైబ్ ఉంది. సినిమా కచ్చితంగా బాగుంటుందనే అనుభూతి కలిగింది. మధుశాలిని ఎప్పటి నుంచో నాకు తెలుసు. తను ఒక సినిమాని సమర్పిస్తోందంటే తప్పకుండా అందులో మంచి కంటెంట్ ఉంటుంది. ఇది చాలా మంచి చిత్రం అవుతుందనే నమ్మకం కలిగింది. అందరూ థియేటర్స్‌కి వచ్చి, టీమ్‌ని ప్రోత్సహించాలి'' అని హీరో సిద్ధు జొన్నలగడ్డ అన్నారు. గీత్ సైని, శ్రీచరణ్ రాచకొండ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'కన్యాకుమారి'. నటి మధుశాలిని సమర్పణలో సృజన్ అట్టాడ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన ఈ సినిమా ఈ నెల 27న విడుదల కానుంది. బుధవారం నిర్వహించిన ఈ చిత్రం ట్రైలర్ లాంచ్, ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి సిద్ధు జొన్నలగడ్డ, డైరెక్టర్ శశికిరణ్ తిక్క అతిథులుగా హాజరయ్యారు. శశికిరణ్ తిక్క మాట్లాడుతూ- ''కన్యాకుమారి' ట్రైలర్ చాలా నచ్చింది. ఈ చిత్రం కచ్చితంగా మంచి విజయం సాధిస్తుందనిపించింది. చాలా సహజంగా ఉన్న ఈ సినిమాని థియేటర్‌కి వెళ్లి, టికెట్ కొని చూస్తాను'' అని చెప్పారు. ''సినిమా చాలా అద్భుతంగా వచ్చింది. బన్నీ వాసుగారి సపోర్ట్‌తో రిలీజ్ చేస్తున్నాం'' అన్నారు మధుశాలిని. ''బన్నీ వాసుగారు లేకపోతే మా సినిమా థియేటర్స్‌లోకి వచ్చేది కాదు. ఈ నెల 27న ఏదైనా సినిమా చూడాలనుకుంటే మా 'కన్యాకుమారి' కూడా ఉందని పరిగణించండి'' అని సృజన్ అట్టాడ కోరారు. ''మా చిత్రాన్ని ప్రేక్షకులు థియేటర్స్‌లో చూసి ఎంజాయ్ చేయాలని కోరుకుంటున్నాం'' అని గీత్ సైని, శ్రీ చరణ్ అన్నారు.

చాయ్‌వాలా ప్రేమకథ



● శివ కందుకూరి, తేజు అశ్విని

''చాయ్‌వాలా' సినిమా చూసిన ప్రేక్షకులు కచ్చితంగా తమ తండ్రితో కాసేపు మాట్లాడతారు. ఈ చిత్రం చూశాక థియేటర్ నుంచి ఓ మంచి భావోద్వేగంతో బయటికొస్తారని మాత్రం కచ్చితంగా చెప్పగలను'' అని శివ కందుకూరి తెలిపారు. ప్రమోద్ హర్ష రచన, దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'చాయ్‌వాలా'. శివ కందుకూరి, తేజు అశ్విని జోడీగా నటించారు. రాధా విజయలక్ష్మి, వెంకట్ ఆర్. పాపుడిప్పు నిర్మించారు. బుధవారం జరిగిన ఈ సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్‌లో శివ కందుకూరి మాట్లాడుతూ- ''ఈ ప్రయాణంలో నాకు ప్రమోద్ మంచి స్నేహితుడిగా మారిపోయారు. నిర్మాత వెంకట్‌గారికి సినిమా పట్ల ఎంతో ప్యాషన్ ఉంది. మా చిత్రం ప్రేక్షకులందర్నీ ఆకట్టుకునేలా ఉంటుంది'' అని చెప్పారు. ''చాయ్‌వాలా' ఎమోషనల్‌గా అందరికీ కనెక్ట్ అవుతుంది'' అని నిర్మాత రాజ్ కందుకూరి అన్నారు. ప్రమోద్ హర్ష మాట్లాడుతూ- ''నేను రాసుకున్న పాత్రలు, కథ నుంచే 'చాయ్‌వాలా' టైటిల్‌ను తీసుకున్నాను. ప్రతి మనిషి జీవితంలో జరిగే ఘటనలే మా చిత్రంలో ఉంటాయి'' అని చెప్పారు. ''మా సినిమాలోని కొన్ని సన్నివేశాలు చూసినప్పుడు కన్నీళ్లు వచ్చాయి. ఇదొక సున్నితమైన ప్రేమకథ'' అని వెంకట్ ఆర్. పాపుడిప్పు పేర్కొన్నారు. ''తెలుగులో 'చాయ్‌వాలా' నా మొదటి చిత్రం. ఈ సినిమా అందరికీ నచ్చుతుంది'' అన్నారు తేజు అశ్విని. ''ఈ కథ వినోదాత్మకంగా, అలాగే భావోద్వేగంగా ఉంటుంది. మా 'చాయ్‌వాలా' అందరికీ నచ్చుతుందని ఆశిస్తున్నాను'' అని నటుడు రాజీవ్ కనకాల తెలిపారు. నటుడు రాజ్‌కుమార్ కసిరెడ్డి మాట్లాడారు.

నేనెవరు



● శ్యామల

రాజేంద్రప్రసాద్, సాయికిరణ్, జోగిని శ్యామల ముఖ్య పాత్రల్లో రూపొందిన చిత్రం 'నేనెవరు?'. జై చిరంజీవ మూవీ మేకర్స్ పతాకంపై సరికొండ మల్లికార్జున్ సమర్పణలో అండేకర్ జగదీశ్‌బాబు, సకినాన భూలక్ష్మి నిర్మించారు. చిరంజీవి తన్నీరు దర్శకత్వం వహించిన ఈ చిత్రంతో వైజాగ్ సత్యానంద్ శిష్యులు అభిలాష్, సాయిచెర్రి హీరోలుగా పరిచయమవుతున్నారు. దీపిక, సోనాక్షి, జబర్దస్త్ రాజమౌళి నటించిన ఈ చిత్రం విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా సినీ ప్రముఖులు కేఎల్ దామోదర్ ప్రసాద్, రేలంగి నరసింహారావు, వి. సముద్రలతో టైటిల్ లోగోను ఆవిష్కరింపజేశారు. క్రైమ్ థ్రిల్లర్ కథాంశంతో ఈ చిత్రాన్ని రూపొందించారు.

సాక్షి బిజినెస్
గురువారం
21-8-2025

స్టాక్ మార్కెట్లు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
213	70
81,858	25,051

విదేశీ సూచీలు

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	21,098	▽	217
డోజోన్స్	44,891	▽	31
ఎఫ్‌టీఎస్‌ఈ 100	9,296	△	106
డాక్స్	24,285	▽	188
షాంఘై	3,766	△	39
నికాయ్	42,889	▽	658

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	86.75	87.77
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	116.50	119.46
€	యూరో	ఎస్‌బీఐ	100.10	102.90
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	58.41	59.90
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	55.06	57.29
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	65.46	69.11
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.33	23.83
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.81	24.07
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.26	13.08

లక్షల ఉద్యోగాలకు ముప్పు!!

- వేల కోట్ల పెట్టుబడులకు విఘాతం
- 400 కంపెనీలు మూతపడే ప్రమాదం
- రియల్ మనీ గేమ్స్ మీద నిషేధంపై పరిశ్రమవర్గాల ఆందోళన
- తక్షణం జోక్యం చేసుకోవాలని హోం మంత్రి అమిత్ షాకి విజ్ఞప్తి



న్యూఢిల్లీ: రియల్ మనీ గేమ్స్ అన్నింటిపైనా నిషేధం విధించే బిల్లుపై పరిశ్రమ వర్గాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. దీనివల్ల లక్షల కొద్దీ ఉద్యోగాలు, వేల కోట్ల పెట్టుబడులకు విఘాతం ఏర్పడుతుందని తెలిపాయి. కోట్ల మంది యూజర్లు చట్టవిరుద్ధమైన విదేశీ బెట్టింగ్, గ్యాంబ్లింగ్ ప్లాట్‌ఫాంల వైపు మళ్లే ప్రమాదం ఉందని పేర్కొన్నాయి. ఈ బిల్లు విషయంలో అత్యవసరంగా జోక్యం చేసుకోవాలని కేంద్ర హోంమంత్రి అమిత్ షాకి విజ్ఞప్తి చేశాయి. యూజర్లు, పరిశ్రమను పరిరక్షిస్తూ బాధ్యతాయుతమైన గేమింగ్‌కి తోడ్పడే పరిష్కార మార్గాలపై చర్చించేందుకు, తమ అభిప్రాయాలను కూడా తెలిపేందుకు సమావేశమయ్యే అవకాశం కల్పించాలని కోరాయి. ఆలిండియా గేమింగ్ ఫెడరేషన్ (ఏఐజీఎఫ్), ఈ–గేమింగ్ ఫెడరేషన్ (ఈజీఎఫ్), ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఫ్యాంటసీ స్పోర్ట్స్ (ఎఫ్ఐఎఫ్ఎస్) ఈ నెల 19న సంయుక్తంగా ఆయనకు లేఖ రాశాయి. దీని ప్రకారం .. దాదాపు రూ. 2 లక్షల కోట్ల వేల్యుయేషన్, రూ. 31,000 కోట్ల వార్షికాదాయంతో ఆన్‌లైన్ స్కిల్ గేమింగ్ పరిశ్రమ ఇప్పుడిప్పుడే ఎదుగుతోంది. ప్రభుత్వానికి ప్రత్యక్ష, పరోక్ష పన్నుల రూపంలో ఏటా రూ. 20,000 కోట్ల ఆదాయం సమకూరుస్తోంది. 20 శాతం వార్షిక వృద్ధి రేటుతో 2028 నాటికి పరిశ్రమ రెట్టింపు స్థాయికి చేరనుంది. 2022 జూన్ వరకు పరిశ్రమలోకి రూ. 25,000 కోట్ల వరకు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) వచ్చాయి. దీనితో ప్రత్యక్షంగా, పరోక్షంగా రెండు లక్షల మందికి పైగా ఉపాధి లభిస్తోంది. దేశీయంగా 2020లో 36 కోట్లుగా ఉన్న ఆన్‌లైన్ గేమర్స్ సంఖ్య 2024 నాటికి 50 కోట్లకు చేరింది. వేల కొద్దీ స్టార్టప్‌లు, యువ ఇంజనీర్లు, కంటెంట్ క్రియేటర్లు ఈ వ్యవస్థపై ఆధారపడి ఉన్నారు.

యూజర్లకు కూడా హాని..

చట్టబద్ధమైన, పెద్ద ఎత్తున ఉపాధి కల్పిస్తున్న పరిశ్రమపై గంపగుత్తగా నిషేధం విధించడం వల్ల దేశీ యూజర్లకు, పౌరులకు పెను హాని జరుగుతుందని పరిశ్రమ వర్గాలు తెలిపాయి. నిషేధం వల్ల పెట్టుబడులు నిల్చిపోయి, ఇన్వెస్టర్ల సెంటిమెంటు దెబ్బతింటుందని.. 400 పైగా కంపెనీలు మూతబడే ముప్పు ఉందని ఆందోళన వ్యక్తం చేశాయి. డిజిటల్ ఆవిష్కర్తగా భారత్ స్థానం కూడా బలహీనపడుతుందని వివరించాయి. 'ఈ బిల్లు ఆమోదం పొందితే యూజర్లు, పౌరులకు తీవ్ర హాని జరుగుతుంది. నియంత్రణల పరిధిలో కార్యకలాపాలు సాగిస్తున్న, బాధ్యతాయుత దేశీ ప్లాట్‌ఫాంలను మూయించి, కోట్ల మంది ప్లేయర్లను చట్ట విరుద్ధ మట్కా నెట్‌వర్క్‌లు, ఆఫ్‌షోర్ గ్యాంబ్లింగ్ వెబ్‌సైట్లు, రాత్రికి రాత్రి పారిపోయే మోసపూరిత ఆపరేటర్ల వైపు మళ్లించినట్లవుతుంది' అని పేర్కొన్నాయి.

ప్రజలకు రూ. 20 వేల కోట్ల నష్టం: ప్రభుత్వ అంచనాలు

ప్రభుత్వ అంచనాల ప్రకారం ఆన్‌లైన్ రియల్ మనీ గేమింగ్ వల్ల, ఏటా 45 కోట్ల మంది దాదాపు రూ. 20,000 కోట్లు నష్టపోతున్నారని అధికారిక వర్గాలు తెలిపాయి. సమాజానికి ఇది పెను సమస్యగా మారిందని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలిపాయి. ఈ నేపథ్యంలో ఆదాయాన్ని కోల్పోయినా సరే ప్రజలకు మేలు చేసే ఉద్దేశంతోనే రియల్ మనీ గేమింగ్‌ని నిషేధించాలన్న నిర్ణయం తీసుకుందని వివరించాయి. గత మూడున్నరేళ్లుగా పరిశ్రమను నియంత్రించేందుకు ప్రభుత్వం ఎన్ని చర్యలు తీసుకున్నా, రియల్ మనీ గేమింగ్ సంస్థలు వాటిని పట్టించుకోవడం లేదని పేర్కొన్నాయి. అయితే, ఆన్‌లైన్ గేమ్స్ అన్నింటిపైనా నిషేధం ఉండదని .. ఈస్పోర్ట్స్, ఆన్‌లైన్ సోషల్ గేమ్స్‌ని ప్రమోట్ చేసేలా బిల్లులో ప్రతిపాదనలు ఉన్నాయని ఒక అధికారి చెప్పారు. ఇందుకోసం ప్రత్యేకంగా బడ్జెట్, స్కీములు మొదలైనవి ఉంటాయని వివరించారు. దీనితో ఆన్‌లైన్ గేమింగ్ పరిశ్రమలో ఉద్యోగావకాశాలు వస్తాయని పేర్కొన్నారు.

పాలసీదారులకు శుభవార్త

హెల్త్, లైఫ్ ఇన్సూరెన్స్ ప్రీమియంపై జీఎస్టీకి గుడ్‌బై!



న్యూఢిల్లీ: వ్యక్తిగత జీవిత బీమా, ఆరోగ్య బీమా పాలసీలకు వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) నుంచి మినహాయింపునివ్వాలని కేంద్రం ప్రతిపాదించింది. దీనిపై దాదాపు అన్ని రాష్ట్రాలు సానుకూలంగా స్పందించాయి. బీమాపై వివిధ రాష్ట్రాల మంత్రులతో ఏర్పాటైన 13 సభ్యుల బృందం (జీవోఎం) ఈ ప్రతిపాదనపై చర్చించింది. జీఎస్టీ రేట్ల కోత ప్రయోజనాలు కంపెనీలకు కాకుండా కస్టమర్లకు బదిలీ అయ్యేలా తగు విధానాన్ని రూపొందించాలని జీఎస్టీ కౌన్సిల్‌ను కోరినట్లు తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. వ్యక్తిగత బీమా పాలసీలకు జీఎస్టీ నుంచి మినహాయింపునివ్వడం వల్ల ఏటా రూ. 9,700 కోట్ల నష్టం వాటిల్లుతుందని అంచనాలు ఉన్నాయని వివరించారు. మంత్రుల అభిప్రాయాలు, అభ్యంతరాలను పొందుపర్చిన నివేదికను జీఎస్టీ కౌన్సిల్‌కి సమర్పించనున్నట్లు బీమాపై జీవోఎం కన్వీనరు, బిహార్ డిప్యూటీ సీఎం సామ్రాట్ చౌదరి తెలిపారు. అక్టోబర్ ఆఖరు నాటికి జీవోఎం తుది నివేదిక సమర్పించనుంది. ప్రస్తుతం ఆరోగ్య, జీవిత బీమా ప్రీమియంలపై 18 శాతం జీఎస్టీ వర్తిస్తోంది. 2023–24లో కేంద్రం, రాష్ట్రాలు హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియంపై రూ. 8,263 కోట్లు, హెల్త్ రీఇన్సూరెన్స్ ప్రీమియంపై రూ. 1,484 కోట్లు జీఎస్టీ రూపంలో సమీకరించాయి.

జూలైలో నెమ్మదించిన మౌలికం

2 శాతానికి చేరిక



న్యూఢిల్లీ: కీలకమైన ఎనిమిది మౌలిక రంగాల గ్రూప్ వృద్ధి జూలైలో నెమ్మదించింది. రెండు నెలల కనిష్టమైన రెండు శాతానికి తగ్గింది. బుధవారం విడుదల చేసిన అధికారిక డేటా ప్రకారం బొగ్గు, ముడిచమురు, రిఫైనరీ ఉత్పత్తులు, సహజ వాయువు ఉత్పత్తి క్షీణించడం ఇందుకు కారణం. విద్యుత్, ఎరువుల ఉత్పత్తి వరుసగా 2 శాతానికి, 0.5 శాతానికి నెమ్మదించింది. అదే సమయంలో ఉక్కు, సిమెంట్ ఉత్పత్తి వరుసగా 12.8%, 11.7% మేర పెరిగింది. ఎనిమిది మౌలిక రంగాల వృద్ధి గతేడాది జూలైలో 6.3 శాతంగా నమోదైంది. ఇక ఈ ఏడాది జూన్‌లో ఇది 2.2 శాతంగా ఉంది. ఈ ఏప్రిల్–జూలై మధ్య కాలంలో ఈ గ్రూప్ వృద్ధి గతేడాది ఇదే వ్యవధితో పోలిస్తే 6.3% నుంచి 1.6 శాతానికి నెమ్మదించింది.

మొక్కజొన్నలో కలుపు నివారణకు

గోద్రెజ్ 'అషితాకా'

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మొక్కజొన్న పంటలో గడ్డి, వెడల్పాటి ఆకుల కలుపు నివారణ కోసం గోద్రెజ్ ఆగ్రోవెట్ తాజాగా 'అషితాకా' ఉత్పత్తిని ఆవిష్కరించింది. ఎకరానికి సరిపడే కలుపు నివారణ మందు ధర రూ. 1,800 కాగా, కలుపు జాతి మొక్కలు 2–4 ఆకుల దశలో ఉన్నప్పుడు దీన్ని ఉపయోగించాల్సి ఉంటుందని గోద్రెజ్ ఆగ్రోవెట్ క్రాప్ ప్రొటెక్షన్ బిజినెస్ సీఈవో ఎన్‌కే రాజావేలు తెలిపారు. ఐఎస్‌కే జపాన్‌తో కలిసి దీన్ని రూపొందించినట్లు వివరించారు. రబీ సీజన్‌లో ముందుగా తమిళనాడు మార్కెట్లో, అక్టోబర్‌లో తెలుగు రాష్ట్రాల్లో అందుబాటులోకి తేనున్నట్లు చెప్పారు. ప్రాథమికంగా దాదాపు లక్ష ఎకరాలను లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు పేర్కొన్నారు. 4–5 ఏళ్లలో ఈ ప్రొడక్టుపై రూ. 200 కోట్ల ఆదాయాన్ని అంచనా వేస్తున్నట్లు రాజావేలు తెలిపారు.



ఐదో రోజూ అదే జోరు

- ఐటీ, ఎఫ్ఎంసీజీ షేర్లకు డిమాండ్
- మళ్లీ 25,000 స్థాయిపైకి నిఫ్టీ
- సెన్సెక్స్ 213 పాయింట్లు ప్లస్

ముంబై: ఐటీ, ఎఫ్ఎంసీజీ షేర్లకు డిమాండ్ లభించడంతో స్టాక్ సూచీలు ఐదో రోజూ లాభపడ్డాయి. సెన్సెక్స్ 213 పాయింట్లు పెరిగి 81,858 వద్ద నిలిచింది. నిఫ్టీ 70 పాయింట్లు బలపడి 25,051 వద్ద స్థిరపడింది. ఉదయం ఫ్లాటుగా మొదలైన సూచీలు రోజంతా పరిమిత శ్రేణిలో లాభాల్లో ట్రేడయ్యాయి. సెన్సెక్స్ 341 పాయింట్లు పెరిగి 81,985 వద్ద, నిఫ్టీ 107 పాయింట్లు బలపడి 25,089 వద్ద ఇంట్రాడే గరిష్టాలు అందుకున్నాయి.

- రంగాల వారీగా బీఎస్ఈ ఇండెక్సుల్లో ఐటీ 3%, టెక్ 2.22%, ఎఫ్ఎంసీజీ 1.36%, రియల్టీ, టెలికమ్యూనికేషన్ 0.68% రాణించాయి. మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు 0.39%, 0.30% పెరిగాయి. బ్యాంకులు, చమురు, ఫైనాన్స్ సర్వీసెస్, ఇంధన షేర్లు అమ్మకాల ఒత్తిడికిలోనయ్యాయి.
- ఆన్‌లైన్ గేమింగ్ కంపెనీల షేర్లు డీలాపడ్డాయి. రియల్ మనీ గేమింగ్ వ్యాపారంతో ప్రత్యక్ష సంబంధం లేదంటూ కంపెనీ వివరణ ఇచ్చినప్పటికీ.., నజరా టెక్నాలజీస్ షేరు 13% పతనమై రూ.1,222 వద్ద స్థిరపడింది. ఆన్‌మొబైల్ గ్లోబల్స్ షేరు 3.53% నష్టపోయి రూ.53.27 వద్ద నిలిచింది.
- రీగల్ రిసోర్సెస్ షేరు లిస్టింగ్ రోజే భారీ లాభాలు పంచింది. బీఎస్ఈలో ఇష్యూ ధర(రూ.102)తో పోలిస్తే 39% ప్రీమియంతో రూ.142 వద్ద లిస్టయ్యింది. ఇంట్రాడేలో 43% ఎగసి రూ.146 వద్ద గరిష్టాన్ని నమోదు చేసింది. చివరికి 29% లాభంతో రూ.132 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.1,352 కోట్లుగా నమోదైంది.

యూఐడీఏఐతో స్టార్‌లింక్ జట్టు



న్యూఢిల్లీ: శాటిలైట్ కమ్యూనికేషన్స్ సేవల సంస్థ స్టార్‌లింక్ .. కస్టమర్ల గుర్తింపు ధ్రువీకరణ కోసం ఆధార్‌ను ఉపయోగించనుంది. ఇందుకోసం విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ యూఐడీఏఐతో చేతులు కలిపింది. స్టార్‌లింక్ శాటిలైట్ కమ్యూనికేషన్ సంస్థను సబ్–ఆథెంటికేషన్ యూజర్ ఏజెన్సీగా, సబ్–ఈకేవైసీ యూజర్ ఏజెన్సీగా నియమించినట్లు యూఐడీఏఐ ఒక ప్రకటనలో పేర్కొంది. దీనితో కస్టమర్ల వెరిఫికేషన్ ప్రక్రియ సులువుగా, సురక్షితంగా ఉంటుందని తెలిపింది. ప్రస్తుతం స్టార్‌లింక్ భారత్‌లో సుమారు 20 లక్షల మంది కస్టమర్లను చేర్చుకోవచ్చు. దేశీయంగా సర్వీసులు అందించేందుకు భారతి ఎయిర్‌టెల్, రిలయన్స్ జియోతో స్టార్‌లింక్ జట్టు కట్టింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
ఐపీవోకు 5 కంపెనీలు రెడీ | వేర్‌బుల్స్ మార్కెట్ డౌన్

సాక్షి స్పోర్ట్స్



తన్మయ్ తడాఖా... హైదరాబాద్ గెలుపు

చెన్నై: బుచ్చిబాబు ఇన్విటేషనల్ క్రికెట్ టోర్నమెంట్‌లో డిఫెండింగ్ చాంపియన్ హైదరాబాద్ జట్టు శుభారంభం చేసింది. పంజాబ్‌తో జరిగిన మూడు రోజుల మ్యాచ్‌లో నాలుగు వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. ఈ హోరాహోరీ పోరులో హైదరాబాద్ ఓపెనర్ తన్మయ్ అగర్వాల్ (127 బంతుల్లో 163; 12 ఫోర్లు, 5 సిక్స్‌లు) భారీ సెంచరీతో చెలరేగాడు. పంజాబ్ తొలి ఇన్నింగ్స్‌లో 90 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 348 పరుగులు చేయగా... హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్‌లో 90 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 355 పరుగులు చేసింది. అనంతరం పంజాబ్ 39.5 ఓవర్లలో 298/8 వద్ద రెండో ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. హైదరాబాద్ బౌలర్లలో రవితేజ 3 వికెట్లు పడగొట్టగా... తనయ్, నిశాంత్ చెరో 2 వికెట్లు తీశారు. అనంతరం 292 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన హైదరాబాద్ జట్టు 41 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 294 పరుగులు చేసి గెలిచింది. తన్మయ్‌కు హిమతేజ (44 బంతుల్లో 50; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) సహకరించాడు.

హర్మన్‌ప్రీత్ సారథ్యంలో...

ఆసియాకప్ హాకీ టోర్నీ బరిలో భారత జట్టు



న్యూఢిల్లీ: స్వదేశంలో ఈనెల 29 నుంచి జరిగే ఆసియాకప్ పురుషుల హాకీ టోర్నమెంట్‌లో పాల్గొనే భారత జట్టును బుధవారం ప్రకటించారు. 18 మంది సభ్యులతో కూడిన భారత జట్టుకు 'డ్రాగ్ ఫ్లికర్' హర్మన్‌ప్రీత్ సింగ్ నాయకత్వం వహిస్తాడు. సెప్టెంబర్ 7వ తేదీ వరకు జరిగే ఈ టోర్నీలో ఎనిమిది దేశాలు పోటీపడతాయి. విజేతగా నిలిచిన జట్టు వచ్చే ఏడాది బెల్జియం–నెదర్లాండ్స్‌లలో జరిగే ప్రపంచకప్ టోర్నీకి నేరుగా అర్హత సాధిస్తుంది. చైనాతో ఈనెల 29న జరిగే గ్రూప్ 'ఎ' మ్యాచ్‌తో భారత్ తమ టైటిల్ వేటను మొదలుపెడుతుంది. అనంతరం ఆగస్టు 31న జపాన్‌తో, సెప్టెంబర్ 1న కజకిస్తాన్‌తో భారత్ ఆడుతుంది. గ్రూప్ 'బి'లో కొరియా, మలేసియా, చైనీస్ తైపీ, బంగ్లాదేశ్ జట్లు ఉన్నాయి. లీగ్ దశ ముగిశాక రెండు గ్రూప్‌లలో తొలి రెండు స్థానాల్లో నిలిచిన నాలుగు జట్లు 'సూపర్–4' దశకు చేరుకోనున్నాయి. 'సూపర్–4'లో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు సెప్టెంబర్ 7న ఫైనల్లో తలపడతాయి.

భారత పురుషుల హాకీ జట్టు: కృషన్ పాఠక్, సూరజ్ (గోల్ కీపర్లు), సుమిత్, జర్మన్‌ప్రీత్, సంజయ్, హర్మన్‌ప్రీత్, జుగ్‌రాజ్, అమిత్ (డిఫెండర్లు), రాజిందర్, రాజ్‌కుమార్ పాల్, హార్దిక్, మన్‌ప్రీత్, వివేక్ ప్రసాద్ (మిడ్‌ఫీల్డర్లు), మన్‌దీప్, శిలానంద్ లాక్రా, అభిషేక్, సుఖ్‌జీత్ సింగ్, దిల్‌ప్రీత్ సింగ్ (ఫార్వర్డ్స్).

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో



తపస్య

తపస్య 'పసిడి పట్టు'

ప్రపంచ అండర్–20 రెజ్లింగ్ చాంపియన్‌షిప్



సృష్టి

సమోకోవ్ (బల్గేరియా): ప్రపంచ అండర్–20 రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్ ఖాతాలో తొలి స్వర్ణ పతకం చేరింది. మహిళల ఫ్రీస్టయిల్ విభాగంలో తపస్య (57 కేజీలు) భారత్‌కు మొదటి బంగారు పతకాన్ని అందించింది. బుధవారం జరిగిన ఫైనల్లో తపస్య 5–2 పాయింట్ల తేడాతో ఫెలిసిటాస్ దొమయెవా (నార్వే)పై విజయం సాధించింది. సెమీఫైనల్లో తపస్య 4–3తో సొవాకా ఉచిద (జపాన్)పై, క్వార్టర్ ఫైనల్లో 9–0తో రొమైసా (ఫ్రాన్స్)పై, ప్రిక్వార్టర్ ఫైనల్లో 6–0తో డొల్జాన్ (రష్యా)పై గెలుపొందింది. భారత్‌కే చెందిన సృష్టి రజత పతకాన్ని సొంతం చేసుకుంది. 68 కేజీల ఫైనల్లో సృష్టి 0–7తో రే హోషినో (జపాన్) చేతిలో ఓడిపోయింది. మరోవైపు భారత్‌కే చెందిన రీనా (55 కేజీలు), ప్రియ (76 కేజీలు) కూడా స్వర్ణ పతకాల కోసం పోటీపడనున్నారు. వీరిద్దరూ తమ కేటగిరీల్లో ఫైనల్లోకి ప్రవేశించారు. బుధవారం జరిగిన సెమీఫైనల్స్‌లో రీనా 11–1తో అలెగ్జాండ్రా వాయిసులెస్కు(రొమేనియా)పై, ప్రియ 10–0తో ఎవెలిన్ ఉజెల్లి (సెర్బియా)పై విజయం సాధించారు. అంతకుముందు రీనా క్వార్టర్ ఫైనల్లో 8–2తో జెర్దా టెరెక్ (హంగేరి)పై, ప్రిక్వార్టర్ ఫైనల్లో 11–6తో ఖాలియున్ బ్యామ్‌బసురెన్ (మంగోలియా)పై... ప్రియ క్వార్టర్ ఫైనల్లో 4–0తో డయానా టిటోవా (రష్యా)పై, తొలి రౌండ్‌లో 10–0తో వెరోనికా నికోస్ (హంగేరి)పై గెలుపొందారు. నేడు జరిగే ఫైనల్స్‌లో నదియా సాకోలోవ్‌స్కా (ఉక్రెయిన్)తో ప్రియ; ఎవరెస్ట్ లెడెకర్ (అమెరికా)తో రీనా తలపడతారు.

అనంత్ అదరహో...

ఆసియా చాంపియన్‌షిప్ స్కీట్ ఈవెంట్‌లో స్వర్ణం నెగ్గిన భారత షూటర్



షిమ్‌కెంట్ (కజకిస్తాన్): ఆసియా షూటింగ్ చాంపియన్‌షిప్ సీనియర్ విభాగంలో భారత్‌కు తొలి స్వర్ణ పతకం లభించింది. బుధవారం జరిగిన పురుషుల స్కీట్ ఈవెంట్‌లో భారత షూటర్ అనంత్ జీత్ సింగ్ నరూకా పసిడి పతకాన్ని సొంతం చేసుకున్నాడు. రాజస్తాన్‌కు చెందిన అనంత్‌కు ఆసియా చాంపియన్‌షిప్ చరిత్రలో ఇదే తొలి వ్యక్తిగత స్వర్ణ పతకం కావడం విశేషం. ఆరుగురు షూటర్ల మధ్య ఎలిమినేషన్ పద్ధతిలో జరిగిన ఫైనల్లో 27 ఏళ్ల అనంత్ 60 పాయింట్లకుగాను 57 పాయింట్లు స్కోరు చేసి విజేతగా అవతరించాడు. ఆసియా క్రీడల చాంపియన్ మన్సూర్ అల్ రషీది (కువైట్) 56 పాయింట్లు సాధించి రజత పతకం నెగ్గాడు. 43 పాయింట్లతో అల్ ఇషాక్ అలీ అహ్మద్ (ఖతర్) కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నాడు. 46 మంది షూటర్లు పోటీపడ్డ క్వాలిఫయింగ్‌లో అనంత్ 119 పాయింట్లు సాధించి మూడో స్థానంలో నిలిచి ఫైనల్‌కు అర్హత పొందాడు. క్వాలిఫయింగ్‌లో టాప్–6లో నిలిచిన వారికి ఫైనల్ బెర్త్‌లు లభిస్తాయి. 2023 ఆసియా చాంపియన్‌షిప్ టీమ్ విభాగంలో, మిక్స్‌డ్ టీమ్ విభాగంలో స్వర్ణ పతకాలు గెలిచిన అనంత్ హాంగ్జౌ ఆసియా క్రీడల్లో వ్యక్తిగత విభాగంలో రజతం సాధించాడు. మరోవైపు మహిళల స్కీట్ టీమ్ విభాగంలో భారత బృందానికి కాంస్య పతకం లభించింది. మహేశ్వరి చౌహాన్ (113 పాయింట్లు), గనీమత్ సెఖోన్ (109 పాయింట్లు), రైజా ఢిల్లాన్ (107 పాయింట్లు)లతో కూడిన భారత జట్టు 329 పాయింట్లు సాధించి మూడో స్థానంలో నిలిచింది. వ్యక్తిగత విభాగంలో మహేశ్వరి చౌహాన్ 35 పాయింట్లతో నాలుగో స్థానంతో సరిపెట్టుకుంది.

సురుచి–సౌరభ్ జోడీకి కాంస్యం



ఎయిర్ పిస్టల్ 10 మీటర్ల మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో సురుచి సింగ్–సౌరభ్ చౌదరీ జోడీ భారత్‌కు కాంస్య పతకం అందించింది. కాంస్య పతక మ్యాచ్‌లో సురుచి–సౌరభ్ 17–9 పాయింట్లతో లియు హెంగ్ యు–సెయి సియాంగ్ చెన్ (చైనీస్ తైపీ)లపై విజయం సాధించారు. ఇదే వేదికపై జరుగుతున్న ఆసియా జూనియర్ చాంపియన్‌షిప్‌లో 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో వన్షిక చౌధరీ–జొనాథన్ గావిన్ ఆంటోనీ ద్వయం భారత్ ఖాతాలో స్వర్ణ పతకాన్ని జమ చేసింది. ఫైనల్లో వన్షిక–జొనాథన్ 16–14తో కిమ్ యెజిన్–కిమ్ డూయోన్ (దక్షిణ కొరియా)లపై గెలుపొందింది. సీనియర్, జూనియర్, యూత్ విభాగాల్లో కలిపి ప్రస్తుత చాంపియన్‌షిప్‌లో భారత్ ఏడు స్వర్ణాలు, ఐదు రజతాలు, ఐదు కాంస్యాలతో కలిపి 17 పతకాలతో అగ్రస్థానంలో ఉంది.



జొకోవిచ్, డానిలోవిచ్

స్టార్ జోడీలు తొలి రౌండ్‌లోనే అవుట్

యూఎస్ ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్ ఈవెంట్

న్యూయార్క్: సింగిల్స్‌లో మేటి క్రీడాకారులుగా ఉన్న వారిని జోడీలుగా మార్చి... మిక్స్‌డ్ డబుల్స్ ఆడించాలని యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీ నిర్వాహకులు తీసుకున్న నిర్ణయం అంతగా సక్సెస్ కాలేదు. స్టార్ ఆటగాళ్లతో నిర్వహించిన మిక్స్‌డ్ డబుల్స్ ఈవెంట్‌లో అనూహ్య ఫలితాలు వచ్చాయి. సెర్బియా దిగ్గజం, ప్రపంచ ఏడో ర్యాంకర్ జొకోవిచ్... ప్రపంచ రెండో ర్యాంకర్ అల్‌కరాజ్ (స్పెయిన్)... ప్రపంచ మూడో ర్యాంకర్ జ్వెరెవ్ (జర్మనీ) మిక్స్‌డ్ డబుల్స్‌లో తమ తొలి మ్యాచ్‌లలోనే పరాజయం పొందగా... ఆరో ర్యాంకర్ బెన్ షెల్టన్ (అమెరికా) క్వార్టర్ ఫైనల్లో వెనుదిరిగాడు. జొకోవిచ్–డానిలోవిచ్ (సెర్బియా) జంట 2–4, 3–5తో మెద్వెదెవ్–మిరా ఆంద్రీవా (రష్యా) ద్వయం చేతిలో ఓడిపోయింది. అల్‌కరాజ్ –ఎమ్మా రాడుకాను (బ్రిటన్) జంట 2–4, 2–4తో జెస్సికా పెగూలా (అమెరికా)–జేక్ డ్రేపర్ (బ్రిటన్) జోడీ చేతిలో ఓటమి పాలైంది. జ్వెరెవ్–బెలిండా బెన్‌చిచ్ (స్విట్జర్లాండ్) ద్వయం 0–4, 3–5తో డానియెలా కొలిన్స్–క్రిస్టియన్ హారిసన్ (అమెరికా) జోడీ చేతిలో పరాజయం చవిచూసింది.



రాడుకాను, అల్‌కరాజ్

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP).,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794.



మోడల్	CF 125	NS 125	150 SD	NS 160	NS 200
ఎక్స్-షోరూమ్ ధర	₹93 613/-*	₹99 994/-*	₹1 12 659/-*	₹1 30 483/-*	₹1 42 502/-*
హాట్-ట్రిక్ సేవింగ్	₹4 000/-*	₹2 500/-*	₹3 000/-*	₹5 000/-*	₹5 000/-*



పోడుసాగు.. సొగసు చూడు

కనుచూపు మేర పచ్చని కొండలు... కొండలపై నుంచి జాలువారే నీటిని ఒడిసిపట్టి గిరిజన రైతులు కొండ వాలులో సాగుచేసిన వరి పైరు.. విజయనగరం జిల్లా పాచిపెంట మండలం కుడుమూరు వెళ్లే వారికి కనువిందు కలిగిస్తోంది. ఇటీవల కురిసిన వర్షాలకు వరిచేను పచ్చపడింది. కొండకు పచ్చబొట్టులా ఆకర్షిస్తోంది.

– పాచిపెంట

గుంతలు ఉన్నాయ్ జాగ్రత్త!



కలెక్టర్ కార్యాలయానికి వెళ్లే రహదారిలో భారీ గుంతలు



ఆళ్లగడ్డ వైపు వెళ్లే జాతీయ రహదారిపై ఇలా...



కుందూ పాత వంతెనపై భయపెట్టే గుంతలు

గుంతల్లేని రహదారులను అందుబాటులోకి తెస్తామని ప్రగల్భాలు పలికిన కూటమి నేతలు కనీసం శిథిల రోడ్ల వైపు కన్నెత్తి చూడటం లేదు. ఈ చిత్రాల్లో కనిపించే గుంతలు ఎక్కడివో కాదు. నంద్యాల జిల్లా కేంద్రం నంద్యాల పట్టణంలోని ప్రధాన రహదారుల పరిస్థితి ఇది. అడుగడుగున గుంతలు ఉండటంతో వాహనదారులు బెంబేలెత్తుతున్నారు. నూనెపల్లె, నందమూరినగర్ రోడ్డు, ఎన్‌కేరోడ్డు తదితర ప్రధాన రహదారుల్లో గుంతలు పడ్డాయి. అదే విధంగా ఎన్‌జీఓస్ కాలనీ, ఎస్‌బీఐ కాలనీ, హౌసింగ్‌బోర్డు, హనీఫ్‌నగర్, ఎంఎస్‌నగర్, సలీంనగర్, బైటిపేట తదితర ప్రాంతాల్లో అధిక రహదారులు గుంతల మయంగా మారాయి. నూనెపల్లె కోవెలకుంట్ల జంక్షన్ వద్ద లోతైన గుంతలు పడటంతో భారీ వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నందమూరినగర్‌కు వెళ్లే రహదారిలోని కుందూ పాత వంతెనపై ఉన్న గుంతలను తప్పించేందుకు వాహనదారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణిస్తున్నారు. ప్రభుత్వం రహదారుల అభివృద్ధికి ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో రోడ్లు ఈ వర్షాలకు మరింత శిథిలమవుతున్నాయి. అధికారులు యుద్ధ ప్రాతి పదికన రహదారుల అభివృద్ధి చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

– నంద్యాల(అర్బన్)

క్లుప్తంగా...

కేంద్రాన్ని మొండిగా సమర్థిస్తున్న కూటమి

స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై సీపీఎం ఆందోళన

డాబాగార్డెన్స్ (విశాఖ): విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలను వేగవంతం చేసిందని, రాష్ట్ర కూటమి ప్రభుత్వం దీనికి సహకరించడం దారుణమని సీపీఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు అన్నారు. విశాఖలోని సీపీఎం కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ విషయంపై ఆందోళన వ్యక్తం చేశారు. స్టీల్‌ప్లాంట్‌ను 34 విభాగాలుగా విభజించి, వాటి నిర్వహణ, ఆపరేషన్ పనులను కొత్త కాంట్రాక్టర్లకు అప్పగించేందుకు కేంద్రం టెండర్లు పిలిచిందని ఆయన పేర్కొన్నారు. దీని వల్ల వేలాది మంది శాశ్వత ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు తమ ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ ప్రైవేటీకరణ వల్ల గాజువాక ప్రాంతం ఎడారిగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

పత్తిపై దిగుమతి సుంకాన్ని మినహాయించాలి

నల్లమడ రైతు సంఘం

చిలకలూరిపేట: ఇతర దేశాల నుంచి దిగుమతి అయ్యే పత్తి మీద అన్ని రకాల సుంకాలను మినహాయించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించటం దారుణమని నల్లమడ రైతు సంఘం కన్వీనర్ డాక్టర్ కొల్లా రాజమోహనరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో మీడియాతో మాట్లాడుతూ ఈ నిర్ణయంతో పత్తి రైతులకు మరణ శిక్ష విధించినట్లు అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సంయుక్త కిసాన్ మోర్చా కూడా ఇది రైతు వ్యతిరేక చర్య అని ఖండించిందని వెల్లడించారు. పత్తిపై దిగుమతి సుంకాన్ని తొలగించే ప్రభుత్వ నోటిఫికేషన్ పత్తి రైతులపై తీవ్ర దుష్ప్రభావం చూపుతుందన్నారు.

రెండు అకాడమీలకు చైర్మన్ల నియామకం

సాక్షి, అమరావతి: రాష్ట్ర సైన్స్ అండ్ టెక్నాలజీ అకాడమీ చైర్మన్‌గా మండలపు రవి, జానపద–సృజనాత్మకత అకాడమీ చైర్మన్‌గా వంపూరు గంగులయ్యను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు బుధవారం ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ ఉత్తర్వులు జారీ చేశారు. వీరు ఈ పదవిలో రెండేళ్లు కొనసాగుతారని పేర్కొన్నారు.

కేజీహెచ్‌లో జన్యు పరీక్ష కేంద్రం

సాక్షి, అమరావతి : సికిల్‌సెల్ అనీమియా స్థాయి తెలుసుకునేందుకు అవసరమైన జన్యు పరీక్ష కేంద్రం ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని రాష్ట్ర వైద్యశాఖ మంత్రి సత్యకుమార్ బుధవారం తెలిపారు. విశాఖ కేజీహెచ్‌లో సెంటర్ ఆఫ్ కాంపెటెన్స్ (సీఓసీ) ఏర్పాటుకు రూ. నాలుగు కోట్లు కేటాయించిందన్నారు. 3 నెలల్లో ఇది అందుబాటులోకి వస్తుందని.. ఏపీఎంఎస్ఐడీసీ ఇప్పటికే టెండర్ ఆహ్వానించిందని ఆయన చెప్పారు. గుంటూరు జీజీహెచ్‌లో కూడా ఓ కేంద్రం ఏర్పాటుకు ఆమోదం లభించిందన్నారు. 2047 నాటికి ఈ వ్యాధిని నివారించాలన్న లక్ష్యంతో కేంద్రం జాతీయ సికిల్ సెల్ అనీమియా మిషన్‌ను చేపట్టిందన్నారు.

క్రీడాకారులకు తగిన గుర్తింపు

శాప్ చైర్మన్ రవినాయుడు

సాక్షి, అమరావతి: క్రీడాకారులకు తగిన గుర్తింపు, గౌరవం కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తోందని శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు తెలిపారు. ఈనెల 29న విశాఖపట్టణం వేదికగా నేషనల్ స్పోర్ట్స్ డేను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఏఎన్‌యూలో బుధవారం జోనల్ స్థాయి క్రీడా పోటీలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ..క్రీడాకారులకు రాత పరీక్ష లేకుండా 3శాతం రిజర్వేషన్‌తో స్పోర్ట్స్ కోటా కింద అన్ని ప్రభుత్వ శాఖల్లోనూ ఉద్యోగవకాశాలు కల్పిస్తున్న ఘనత సీఎం చంద్రబాబుకు దక్కుతుందన్నారు.

పన్నుపోటు తగ్గేనా?



జీఎస్టీ తగ్గింపు ప్రకటనపై కొబ్బరి రైతుల ఆశలు / క్వింటాల్‌కు రూ.వెయ్యి వరకు వసూలు / ఆయిల్‌పై 15 కిలోలకు రూ.274 నుంచి రూ.945 వరకు పన్ను

సాక్షి, అమలాపురం: గూడ్స్ అండ్ సర్వీస్ టాక్స్ (జీఎస్టీ)(వస్తు సేవల పన్ను)లో సంస్కరణలు చేయడంతో పాటు, ముఖ్యమైన ఉత్పత్తులపై జీఎస్టీ తొలగిస్తామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేసిన ప్రకటన.. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని ఉద్యాన, వ్యవసాయ, మత్స్య ఉత్పత్తులు సాగు చేసే రైతుల్లో కొత్త ఆశలు రేకెత్తిస్తున్నాయి. వీటిపై ఇప్పటికే 5, 12, 18 శాతం చొప్పున జీఎస్టీని విధిస్తున్నారు. దీనివల్ల వీటిపై ఆధారపడిన వ్యాపారులకు ప్రత్యక్షంగా, రైతులపై పరోక్షంగా భారం పడుతోంది. వీటిపై జీఎస్టీ తొలగిస్తే విలువ ఆధారిత ఉత్పత్తులు పెరగడంతో పాటు, సాగు లాభసాటిగా మారుతుందని రైతులు చెబుతున్నారు.



కొబ్బరిపై ఐదు శాతం

గోదావరి జిల్లాల్లో వరి తర్వాత అతి పెద్ద సాగు కొబ్బరి. తూర్పు గోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో సుమారు 1.50 లక్షల ఎకరాల్లో కొబ్బరి సాగవుతోంది. ఏడాదికి సగటున 107 కోట్ల కాయల వరకు దిగుబడి వస్తోందని అంచనా. కొబ్బరి కాయ (పచ్చి కాయ)పై జీఎస్టీ లేదు. కానీ కొబ్బరి విలువ ఆధారిత ఉత్పత్తులపై ఎండు కొబ్బరి (తయారీ కొబ్బరి)పై ఐదు శాతం జీఎస్టీ విధించారు. జీఎస్టీ పరిధిలోకి వచ్చే వ్యాపారికి ఎండు కొబ్బరి క్వింటాల్‌పై ప్రస్తుత ధర (రూ.20 వేలు)ను బట్టి రూ.వెయ్యి వరకు భారం పడుతోంది.



గతంలో..

గతంలో ఎండు కొబ్బరిపై ఎటువంటి పన్ను ఉండేది కాదు. వాణిజ్య పన్నుల శాఖ ఎండు కొబ్బరిపై నాలుగు శాతం టాక్స్ విధించగా, 2002లో అప్పటి ప్రభుత్వం రెండు శాతానికి తగ్గించింది. తర్వాత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి రెండు శాతం పన్ను కూడా తొలగించారు. ఈ సమయంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో పెద్ద ఎత్తున ఎండు కొబ్బరి తయారయ్యేది. కేంద్రం జీఎస్టీ అమల్లోకి తెచ్చిన తర్వాత దీనిపై ఐదు శాతం జీఎస్టీ పడింది. నాటి నుంచి ఉమ్మడి జిల్లాలో ఎండు కొబ్బరి తయారీ తగ్గుతూ వస్తోంది. అలాగే కొబ్బరి నూనెపై ఐదు నుంచి 18 శాతం వరకు జీఎస్టీ ఉంది. 15 కిలోల కొబ్బరి నూనె డబ్బాపై రూ.265 నుంచి రూ.945 వరకు భారం పడుతోంది. దీంతో జీఎస్టీ భారం లేకుండా కొందరు అక్రమార్కులు దొడ్డి దారిన కల్తీ కొబ్బరి నూనె అమ్మకాలు చేస్తున్నారు. ఎండుకొబ్బరి, కొబ్బరి నూనెపై జీఎస్టీ తొలగిస్తే.. ఇవి స్థానికంగా ఉత్పత్తి అయి రైతులకు, తయారీ కార్మికులకు, వ్యాపారులకు ఉపాధి లభిస్తుంది.

పామాయిల్ పైనా..

ఆయిల్‌పామ్ రైతులు, వ్యాపారుల పరిస్థితి కూడా ఇంతే. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 55 వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగవుతోంది. రైతులు విక్రయించే ఆయిల్ పామ్ గెలలపై జీఎస్టీ లేదు. కానీ, ఆయిల్ పామ్ పండ్ల నుంచి తీసే పామాయిల్‌పై ఐదు శాతం జీఎస్టీ విధిస్తున్నారు. మార్కెట్‌లో ఉన్న ధరలు తగ్గించడం ద్వారా పరోక్షంగా ఈ భారం రైతుల పైనే కంపెనీలు మోపుతున్నాయి. మత్స్య ఉత్పత్తుల ఎగుమతిపై జీఎస్టీ లేకున్నా.. వీటిలో వినియోగించే మందులు, సాగుకు వినియోగించే వస్తువులపై జీఎస్టీ ఉంది. అంతే కాకుండా వ్యవసాయ, ఉద్యాన సాగులో ఎరువులు, పురుగు మందులు, ట్రాక్టర్, పవర్ వీడర్, మోటార్లు, ఉత్పత్తుల తయారీ యంత్రాలు వీటిపై కూడా ఐదు నుంచి 12, 18 శాతం జీఎస్టీలు శ్లాబ్‌లు ఉన్నాయి. వీటిని తొలగిస్తే వ్యవసాయం లాభసాటిగా మారుతుందని రైతులు అభిప్రాయపడుతున్నారు.

తొలగిస్తేనే రైతులకు మేలు



ఎండు కొబ్బరి, కొబ్బరి నూనె, ఇతర ఉద్యాన ఉత్పత్తులపై జీఎస్టీ మొత్తం ఎత్తి వేయాలి. దీనివల్ల కొబ్బరి విలువ ఆధారిత పరిశ్రమలు ఏర్పడతాయి. ఇదే జరిగితే ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో పరిశ్రమల లేనిలోటు కొంత వరకూ తీరి, స్థానికంగా ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి. గతంలో ఎండు కొబ్బరికి రాష్ట్ర ప్రభుత్వం పన్ను మినహాయింపు ఇచ్చింది. ఈ విషయాన్ని కేంద్రానికి నివేదించడం ద్వారా జీఎస్టీని ఎత్తివేసేలా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలి.

– మత్యాల జిమ్మి, నేషనల్ ప్లాంట్ హెల్త్ మేనేజ్ మెంట్ సభ్యుడు, అంబాజీపేట

డీఎస్సీ మెరిట్ లిస్ట్ తర్వాతే సెలెక్ట్ లిస్ట్ ఇవ్వాలి : డీవైఎఫ్ఐ

సాక్షి, అమరావతి: జిల్లాల వారీగా మొత్తం డీఎస్సీ అభ్యర్థుల మెరిట్ లిస్ట్, వారి ర్యాంకులు విడుదల చేసిన తర్వాతే సెలెక్ట్ లిస్ట్ విడుదల చేయాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈమేరకు విద్యాశాఖ మంత్రికి లేఖ రాసినట్టు ఓ ప్రకటనలో డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న పేర్కొన్నారు. డీఎస్సీ అభ్యర్థులను గందరగోళంలో నెట్టే విధంగా విద్యాశాఖ అధికారుల తీరు ఉందని, కేవలం 16,347 పోస్టులకు సమానమైన అభ్యర్థుల మెరిట్ లిస్ట్ మాత్రమే విడుదలకు ప్రభుత్వం సిద్ధం కావడం తీవ్ర అభ్యంతరకరమని విమర్శించారు.

డీఎస్సీ మెరిట్ జాబితా ప్రకటించాల్సిందే : ఏఐఎస్ఎఫ్

డీఎస్సీ నియామకాలు పాత విధానంలోనే చేపట్టాలని, మెరిట్ లిస్ట్ జాబితా విడుదల చేశాకే సెలెక్ట్ లిస్టు ప్రకటించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్‌జీ డిమాండ్ చేశారు. డీఎస్సీ టీచర్ల నియామకాల్లో రాష్ట్ర ప్రభుత్వం ఈసారి కొత్త విధానానికి ఎవరి ప్రయోజనాల కోసం శ్రీకారం చుట్టిందని, అభ్యర్థుల ఫోన్లకు మెస్సెజ్ వచ్చిన వారే సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కోసం జిల్లాలకు వెళ్లాలని చెప్పడం ఏమిటని ప్రశ్నించారు. గతంలోలా మెరిట్ లిస్టు విడుదల చేయకుంటే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

ఆయుష్ లైసెన్స్‌ల రెన్యూవల్‌కు ప్రత్యేక మేళాలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఆయుర్వేద, హోమియో, యునాని మందుల తయారీ యూనిట్లు, దుకాణాల లైసెన్స్ రెన్యూవల్ కోసం ఈ నెల 25 నుంచి ప్రత్యేక మేళాలు నిర్వహిస్తామని ఆయుష్ డైరెక్టర్ కె.దినేష్‌కుమార్ బుధవారం ప్రకటించారు. ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాల యజమానులు, విక్రేతలు ఏలూరులోని ఆయుష్ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయంలో ఈనెల 25, 26 తేదీల్లో, ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల వారు ఒంగోలులోని ఆయుష్ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయంలో సెప్టెంబర్ ఒకటి, రెండు తేదీల్లో సంప్రదించాలని పేర్కొన్నారు. ఉమ్మడి కర్నూలు, వైఎస్సార్, అనంతపురం, చిత్తూరు జిల్లాల వారు కడపలోని ఆయుష్ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయంలో సెప్టెంబర్ 8, 9 తేదీల్లో రెన్యూవల్ చేయించుకోవచ్చని వివరించారు.

వేడి పాలు ముక్కులో పడి చిన్నారి మృతి



శర్విల్ రెడ్డి

గుత్తి: అనంతపురం జిల్లా గుత్తి పట్టణంలోని కోట వీధిలో బుధవారం విషాదం చోటు చేసుకుంది. 15 నెలల శర్విల్ రెడ్డి అనే బాలుడి ముక్కు, నోటిలో వేడి పాలు పడటంతో ఊపిరాడక మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే... ప్రతాప్ రెడ్డి, మేనక దంపతులకు ఇద్దరు మగపిల్లలు (కవలలు) జన్మించారు. మొదటి వాడు శర్విల్ రెడ్డి గిన్నెలో ఉన్న వేడి పాలను తీసుకోవడానికి ప్రయత్నించాడు. ప్రమాదవశాత్తు వేడి పాలు శర్విల్ రెడ్డి ముక్కుతో పాటు నోట్లో పడ్డాయి. దీంతో ఊపిరాడక గిల గిలా కొట్టుకున్నాడు. తల్లిదండ్రులు గమనించి వెంటనే స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు బతికించడానికి శతవిధాలా ప్రయత్నించారు. అయితే ఊపిరాడక పరిస్థితి విషమించి మృతి చెందాడు. తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు. ఈ సంఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 30 కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూలైన్ సేవా సదన్ వద్దకు చేరుకుంది. శుక్రవారం అర్ధరాత్రి వరకు 76,033 మంది స్వామిని దర్శించుకున్నారు. 26,905 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.5.30 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనమవుతోంది.

సుందరగిరిలో వైభవంగా పవిత్రారోహణ

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చిన వెంకన్న క్షేత్ర దత్తత ఆలయమైన ఐఎస్ జగన్నాధపురంలోని సుందరగిరిపై కొలువైన శ్రీ కనకవల్లి సమేత లక్ష్మీనరసింహ స్వామివారి ఆలయంలో దివ్య పవిత్రోత్సవాలు అట్టహాసంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో రెండవరోజు బుధవారం పవిత్రారోహణ వేడుక కన్నులపండువగా జరిగింది. ముందుగా అర్చకులు, పండితులు ఆలయ యాగశాలలో ఉదయం మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, వేద మంత్రోచ్చరణల నడుమ మండప పూజలు, నిత్య హోమాలు, బలిహరణ, మూలవరులకు, ఉత్సవ మూర్తులకు అభిషేకాలు, అలంకరణలు జరిపారు. ఆ తరువాత స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను బంగారు శేష వాహనంపై ఉంచి పూజలు నిర్వహించి అనంతరం దివ్య పవిత్రాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఆ తరువాత స్వామివారి మూలవిరాట్, ఉత్సవ మూర్తులపై దివ్య పవిత్రాలను వేసి పవిత్రారోహణ వేడుకను కన్నులపండువగా నిర్వహించారు. సాయంత్రం మండప పూజలు, నిత్య హోమములు, మూలమంత్ర హోమములు, బలిహరణ, నీరాజన మంత్రపుష్పాలు నిర్వహించారు.



మాపై ఎందుకీ కక్ష?



ఏలూరు జీజీహెచ్ వద్ద నిర్ధారణ సర్టిఫికెట్ కోసం వచ్చిన వృద్ధులు, దివ్యాంగులు

కూటమి ప్రభుత్వం పింఛన్ల ఏరివేతలో భాగంగా దివ్యాంగులు, వృద్ధులకు నానా ఇక్కట్లకు గురిచేస్తోంది. దివ్యాంగుడు అవునో.. కాదో తెలుసుకునేందుకు డాక్టర్ సర్టిఫికెట్ తీసుకురావాలని లేకపోతే పింఛన్ తొలిగించాల్సి వస్తుందని అధికారులు చెప్పడంతో సదరం స్లాట్ బుక్ చేసుకుని ఏలూరు సర్వజన ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి ఇదిగో ఇలా అవస్థలు పడుతున్నారు. వృద్ధురాలికి కళ్లు కనిపించవు.. ఓ చిన్నారికి పూర్తిగా అంగవైకల్యం.. ఒక యువకుడు మానసిక వికలాంగుడు..ఇలా చెప్పుకుంటూ పోతే వారి బాధలు వర్ణనాతీతం. దూర ప్రాంతాల నుంచి ఆటోలు కట్టించుకుని వచ్చి ఆసుపత్రి వద్ద పడిగాపులు పడుతున్నారు. మధ్యాహ్నం 12 గంటలు దాటినా మానసిక వికలాంగత్వం ధ్రువీకరించే డాక్టర్ లేకపోవడంతో బాధితులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్/ఏలూరు



కూర్చోలేని స్థితిలో ఉన్న ఈ బాలికకు ప్రభుత్వం సర్టిఫికెట్ అడుగుతోంది..



మానసిక వికలాంగుడిని ఆసుపత్రికి తీసుకువస్తున్న దృశ్యం

నూతన విద్యా విధానంతో దేశాభివృద్ధి

తిరుపతి సిటీ: కేంద్రం ప్రవేశపెట్టిన నూతన విద్యావిధానంతో సత్వర దేశాభివృద్ధి చెందుతుందని ఎస్వీయూ వీసీ అప్పారావు తెలిపారు. ఏబీఆర్ఎస్ఎం, వాయిస్ ఆఫ్ తిరుపతి అకడమీషియన్స్ సంయుక్తంగా ఎన్ఈపీ-2020 విధానాన్ని ప్రవేశపెట్టి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా ఎస్వీయూ సెనేట్ హాల్‌లో బుధవారం ఎన్ఈపీ - 2020 ఎట్ ది రేట్ ఫైవ్ ఇయర్స్, పాలసీ, ప్రాక్టీస్ అండ్ ప్రోగ్రెస్ అన్న అంశంపై సదస్సు నిర్వహించారు. ఇందులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ కేంద్రం 2020లో నూతన విద్యావిధానాన్ని ప్రారంభించిందని తెలిపారు. గత ఐదేళ్లుగా కేజీ టూ పీజీ వరకు ఎన్ఈపీని అమలు చేస్తున్నారని తెలిపారు. ఏబీఆర్ఎస్ఎం జాతీయ సహ సంఘటనా కార్యదర్శి గుంతా లక్ష్మణ్ మాట్లాడుతూ చైనా, జపాన్, జర్మనీ వంటి దేశాల్లో ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత విద్య వరకు అంతా మాతృభాషలోనే జరుగుతుందని తెలిపారు.

రేపు జర్మన్ బాషపై శిక్షణ ప్రారంభం

తిరుపతి అర్బన్ : జర్మన్ భాషపై ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం తిరుపతిలోని శ్రీబాబు జగ్జీవన్ భవనంలో మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభిస్తున్నట్లు బుధవారం ఎస్సీ సంక్షేమ సాధికారిత అధికారి విక్రమకుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో వెల్లడించారు. కార్యక్రమానికి సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలావీరాంజనేయస్వామి, సాంఘికశాఖ సంచాలకులు లావణ్య వేణి హాజరు కానున్నారని చెప్పారు. ఎస్సీలు 25 మంది, ఎస్టీలు 25 మంది మహిళలకు ఉచిత వసతితో పాటు జర్మన్ బాషపై శిక్షణ ఉంటుందని చెప్పారు. సాంఘిక సంక్షేమశాఖతో పాటు గిరిజన సంక్షేమశాఖ, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారని వివరించారు.

ఐఐటీలో ఫ్యాకల్టీ సెన్సిటైజేషన్

ఏర్పేడు : తిరుపతి జిల్లా ఏర్పేడు సమీపంలోని తిరుపతి ఐఐటీలో బుధవారం ఐఐటీ డైరెక్టర్ డాక్టర్ కేఎన్ సత్యనారాయణ ఆధ్వర్యంలో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ సహకారంతో హాఫ్–డే ఫ్యాకల్టీ సెన్సిటైజేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం అధ్యాపకులు, పరిశోధనా పండితులు, విద్యార్థులలో ప్రామాణీకరణ కీలక పాత్ర, ప్రస్తుతం అందుబాటులో ఉన్న సహకార అవకాశాల గురించి అవగాహన కల్పించారు. ఐఐటీ డైరెక్టర్ మాట్లాడుతూ.. సివిల్ ఇంజినీరింగ్ అధ్యయనాల సమయంలో భారతీయ ప్రమాణాలను ఉపయోగించడంలో తన వ్యక్తిగత అనుభవాన్ని పంచుకున్నారు. అధ్యాపకులు, విద్యార్థులు ప్రామాణీకరణ పర్యావరణ వ్యవస్థకు తోడ్పడాలన్నారు.

పార్లమెంట్‌లో తెలంగాణం



తెలంగాణలో ప్రధానమంత్రి మాతృవందన యోజన అమలు కాలేదు

బీఆర్‌ఎస్ ఎంపీ సురేశ్‌రెడ్డి ప్రశ్నకు కేంద్రం లిఖితపూర్వక సమాధానం



సాక్షి, న్యూఢిల్లీ: ప్రధానమంత్రి మాతృ వందన యోజన (పీఎంఎంవీవై) పథకం తెలంగాణ రాష్ట్రంలో అమలు కావడం లేదని కేంద్ర ప్రభుత్వం రాజ్యసభలో స్పష్టం చేసింది. ఈ పథకం గురించి ఎంపీ కె.ఆర్.సురేశ్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి శాఖ సహాయ మంత్రి సావిత్రి ఠాకూర్ లిఖితపూర్వకంగా సమాధానమిచ్చారు. దేశంలోని 35 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఈ పథకం అమలవుతోందని, అయితే తెలంగాణ ప్రభుత్వం తమ రాష్ట్రంలో ఈ పథకాన్ని అమలు చేయడం లేదని మంత్రి తెలిపారు. దీంతో తెలంగాణలో ఈ పథకం కింద లబ్ధిదారులు, నిధులు వంటి వివరాలను ఇచ్చే అవకాశం లేదని సమాధానం ఇచ్చారు. ఈ సమాధానం ప్రకారం, తెలంగాణ ప్రభుత్వం సొంతంగా గర్భిణులకు ప్రయోజనాలు కల్పించే ఇతర పథకాలను అమలు చేస్తున్నందున, కేంద్ర పథకాన్ని అమలు చేయనవసరం లేదని భావిస్తున్నట్లు తెలుస్తోందన్నారు.

తెలంగాణలో మొబైల్ కనెక్టివిటీ బలోపేతానికి రూ.348 కోట్లు

తెలంగాణలో మొబైల్ సేవలను విస్తరించేందుకు కేంద్ర ప్రభుత్వం భారీగా నిధులు ఖర్చు చేసిందని.... డిజిటల్ భారత్ నిధి కింద ఈ ఏడాది జూన్ 30 నాటికి రాష్ట్రానికి రూ.348.06 కోట్లు కేటాయించి, మొబైల్ కనెక్టివిటీ ప్రాజెక్టులకు వినియోగించినట్లు కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద్ లోక్‌సభలో వెల్లడించారు. ఎంపీలు డీకే అరుణ, ఈటల రాజేందర్, చామల కిరణ్ కుమార్‌రెడ్డిలు అడిగిన ప్రశ్నలకు కేంద్రమంత్రి సమాధానం ఇస్తూ, గ్రామీణ ప్రాంతాల్లో మొబైల్ సేవలను బలోపేతం చేసేందుకు భారత్‌నెట్ ప్రాజెక్ట్ కింద బ్రాడ్‌బ్యాండ్ కనెక్టివిటీ అందిస్తున్నామని చెప్పారు. దేశవ్యాప్తంగా ఇప్పటివరకు 13.01 లక్షల ఫైబర్ టు ది హోమ్ కనెక్షన్లు ఇచ్చినట్లు వివరించారు. కేంద్రమంత్రి జితిన్ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం, దేశంలో గ్రామీణ ప్రాంతాల్లో 94.2% కుటుంబాలు, పట్టణాల్లో 97.1% కుటుంబాలకు మొబైల్/టెలిఫోన్ కనెక్షన్లు ఉన్నాయి. 15 ఏళ్లకు పైబడిన వారిలో గ్రామీణ ప్రాంతాల్లో 83.9%, పట్టణాల్లో 92.4% మంది మొబైల్ ఫోన్ వాడుతున్నారు. గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో కనెక్టివిటీ కోసం జూన్ 2025 నాటికి దేశంలో 21,748 కొత్త మొబైల్ టవర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అండమాన్, నికోబార్, లక్షద్వీప్ దీవులకు సబ్‌మెరైన్ ఆప్టికల్ ఫైబర్ కేబుల్ ద్వారా వేగవంతమైన ఇంటర్నెట్ అందిస్తున్నామని వెల్లడించారు. మొత్తం మీద, దేశవ్యాప్తంగా మొబైల్ కనెక్టివిటీ ప్రాజెక్టులకు ఇప్పటివరకు రూ.36,328.79 కోట్లు వినియోగించినట్లు కేంద్రం వెల్లడించింది.



హైదరాబాద్‌లో ల్యాప్‌టాప్ తయారీ యూనిట్లు లేవు

హైదరాబాద్‌లో ల్యాప్‌టాప్ తయారీ యూనిట్ల ఏర్పాటు కోసం కేంద్రం లేదా రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి అవగాహన ఒప్పందాలు కుదుర్చుకోలేదని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద్ లోక్‌సభలో స్పష్టం చేశారు. అయితే దేశంలో ఎలక్ట్రానిక్స్ రంగాన్ని ప్రోత్సహించేందుకు పలు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. బుధవారం లోక్‌సభలో బీజేపీ ఎంపీలు ఈటల రాజేందర్, డీకే అరుణలు అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి సమాధానం ఇస్తూ, 2014–15లో రూ.1.9 లక్షల కోట్ల విలువైన ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తి, 2024–25 నాటికి రూ.11.3 లక్షల కోట్లకు చేరిందని మంత్రి వివరించారు. ఇదే కాలంలో ఎగుమతులు రూ.0.38 లక్షల కోట్ల నుంచి రూ.3.3 లక్షల కోట్లకు పెరిగాయని వెల్లడించారు. అంతేగాక దేశవ్యాప్తంగా ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్లు, కామన్ ఫెసిలిటీ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. తెలంగాణలో 3 ఎలక్ట్రానిక్ మాన్యుఫాక్చరింగ్ క్లస్టర్లు, 1 కామన్ ఫెసిలిటీ సెంటర్లకు ఆమోదం లభించిందని తెలిపారు. ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్లెట్లు, సర్వర్ల తయారీని పెంచేందుకు పీఎల్‌ఐ 2.0 పథకం అమలు చేస్తున్నామని, ఎలక్ట్రానిక్స్ రంగంలో ఇప్పటివరకు సుమారు 25 లక్షల మందికి ఉపాధి లభించిందని కేంద్ర మంత్రి వెల్లడించారు.



పెద్దపల్లిలో రైల్వే ప్రాజెక్టులకు కొత్త ఊపు

కాంగ్రెస్ ఎంపీ గడ్డం వంశీకృష్ణ ప్రశ్నకు కేంద్రం సమాధానం

పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గంలో రైల్వే ప్రాజెక్టులు వేగంగా ముందుకు సాగుతున్నాయని కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ లోక్‌సభలో వెల్లడించారు. కాంగ్రెస్ ఎంపీ వంశీ కృష్ణ గడ్డం అడిగిన ప్రశ్నకు రాతపూర్వకంగా సమాధానం ఇస్తూ, డబ్లింగ్, ఆధునీకరణ, కార్గో టెర్మినల్స్, డిజిటల్ టికెటింగ్ వంటి పలు పనులు జరుగుతున్నాయని చెప్పారు. కాజీపేట–బల్హార్షా మూడో లైన్ పనులు జరుగుతున్నాయని... మొత్తం 202 కి.మీ. మూడో లైన్, విద్యుదీకరణ పనులు రూ.2,063 కోట్లతో జరుగుతున్నాయని, ఇప్పటికే 177 కి.మీ. పూర్తి అయ్యిందని మంత్రి వివరించారు. 2025–26 సంవత్సరానికి ఈ ప్రాజెక్టు కోసం రూ.186 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. భవిష్యత్తులో నాలుగో లైన్ కోసం కూడా సర్వే జరుగుతోందని వెల్లడించారు.

పెద్దపల్లి స్టేషన్ ఆధునీకరణ..

అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద పెద్దపల్లి జంక్షన్ అభివృద్ధి పనులు జరుగుతున్నాయని కేంద్ర మంత్రి తెలిపారు. ఇప్పటికే ప్లాట్‌ఫాం షెల్టర్, టాయిలెట్లు నిర్మించగా, స్టేషన్ భవనం, పార్కింగ్ ఏరియా, ఫుట్ ఓవర్ బ్రిడ్జి, దివ్యాంగుల సౌకర్యాలు వంటి పనులు కొనసాగుతున్నాయని మంత్రి తెలిపారు. పెద్దపల్లి–నిజామాబాద్ ప్రాజెక్టు 178 కి.మీ. డబ్లింగ్ కోసం సర్వే జరుగుతోందన్నారు. సింగరేణి గనుల బొగ్గు రవాణా కోసం పార్థసారథిపురం, బెల్లంపల్లి, భద్రాచలంలో గతి శక్తి కార్గో టెర్మినల్స్ నిర్మిస్తున్నామని... వీటిలో పార్థసారథిపురంలో గతిశక్తి కార్గో టెర్మినల్ ఇప్పటికే పూర్తయిందన్నారు. మొత్తమ్మీద, పెద్దపల్లి స్టేషన్‌తో పాటు తెలంగాణలోని 40 రైల్వే స్టేషన్లు అమృత్ భారత్ పథకం కింద అభివృద్ధి చెందుతున్నాయని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు.

సింగరేణికి రూ.42,739 కోట్ల బకాయిలు

సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్‌సీసీఎల్)కు తెలంగాణ రాష్ట్రంలోని విద్యుత్ సంస్థల నుంచి భారీ బకాయిలు ఉన్నాయని కేంద్రం స్పష్టం చేసింది. అయితే ఈ బకాయిలు రాష్ట్ర ప్రభుత్వం నేరుగా చెల్లించాల్సినవి కాదని, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల నుంచి రావాల్సినవని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి లోక్‌సభలో తెలిపారు. బుధవారం బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి లిఖితపూర్వకంగా ఇచ్చిన సమాధానంలో వివరాలు ఇచ్చారు.

విద్యుత్ సంస్థల బకాయిల వివరాలు..

టీఎస్‌జెన్‌కో: బొగ్గు సరఫరా కోసం రూ.18,064 కోట్లు (వడ్డీతో కలిపి రూ.1,695 కోట్లు) బకాయిలు ఉన్నాయి.
టీఎస్ ట్రాన్స్‌కో: విద్యుత్ సరఫరాకు రూ.24,675 కోట్లు (వడ్డీతో కలిపి రూ.11,806 కోట్లు) బకాయిలు ఉన్నాయి. ఈ రెండు సంస్థలు కలిపి మొత్తంగా రూ.42,739 కోట్లు సింగరేణికి బకాయిలుగా ఉన్నాయని కేంద్రం వెల్లడించింది.

రాష్ట్రానికి క్లీన్ చిట్..

సింగరేణి నుంచి కేంద్రానికి ఎలాంటి బకాయిలు రావాల్సినవి లేవని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. అలాగే, రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి లాభాలను దుర్వినియోగం చేసిందని, వాటాలను విక్రయించిందని, కార్మికుల బకాయిలను వినియోగించిందని వస్తున్న ఆరోపణలను ఆయన పూర్తిగా తోసిపుచ్చారు.

ఆ జీవో చట్టవిరుద్ధం.. నిలిపివేయండి

‘కొత్తగూడెం’ కార్పొరేషన్ జీవోను సవాల్ చేస్తూ పిల్ రిజిస్ట్రీ అభ్యంతరాలను పక్కకు పెట్టిన ధర్మాసనం

సాక్షి, హైదరాబాద్: కొత్తగూడెంను కార్పొరేషన్‌గా మారుస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో చట్టవిరుద్ధమని.. నిలిపివేయాలని కోరుతూ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. ఈ పిల్‌కు నంబర్ కేటాయించేందుకు రిజిస్ట్రీ నిరాకరించగా.. విచారణ చేపట్టిన ధర్మాసనం నంబర్ కేటాయించాలని ఆదేశించింది. తదుపరి విచారణ నాలుగు వారాలకు వాయిదా వేసింది. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగూడెంను కార్పొరేషన్‌గా మారుస్తూ.. పాల్వంచ మున్సిపాలిటీ, సుజాతనగర్ మండలంలోని ఏడు పంచాయతీలను విలీనం చేసింది. ఈ నిర్ణయంపై రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఈ జీవోను సవాల్ చేస్తూ పాల్వంచకు చెందిన న్యాయవాది, సామాజిక కార్యకర్త జె.శివరాంప్రసాద్ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. సుజాతనగర్ మండలంలోని ఏడు గ్రామ పంచాయతీలను కార్పొరేషన్‌లో విలీనం చేయడం చట్టవిరుద్ధమన్నారు. ఈ పిల్‌పై అభ్యంతరం తెలిపిన రిజిస్ట్రీ నంబర్ కేటాయించలేదు. ఫైలింగ్ నంబర్‌పై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ జీఎం మొహియుద్దీన్ ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ వాదనలు వినిపిస్తూ.. విలీనం రాజ్యాంగ ఉల్లంఘన, చట్టవిరుద్ధం, ఏకపక్షమన్నారు. ఎందుకంటే ఇందులో 74వ రాజ్యాంగ సవరణ వర్తించని షెడ్యూల్డ్ ప్రాంతాలు కూడా ఉన్నాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ చర్య.. రాజ్యాంగంలోని ఐదవ షెడ్యూల్, పంచాయతీ (షెడ్యూల్డ్ ప్రాంతాలకు పొడిగింపు) చట్టం–1996తోపాటు గిరిజనుల హక్కులను పరిరక్షించే అనేక సుప్రీంకోర్టు తీర్పులను ఉల్లంఘిస్తుందని వాదించారు. విలీనం ముందు గ్రామసభలతో ముందస్తు సంప్రదింపులు జరపలేదని, ప్రజల అభ్యంతరాలను కోరలేదని, తద్వారా సహజ న్యాయ సూత్రాలను ఉల్లంఘించారని నివేదించారు. కార్పొరేషన్‌లో ప్రధానంగా గిరిజన, గ్రామీణ ప్రాంతాలను చేర్చడంతో స్థానిక గ్రామస్తులు రాజ్యాంగ, జీవనోపాధి హక్కులను కోల్పోతారని పేర్కొన్నారు. జీవో నిలిపివేయాలని, కొత్త కార్పొరేషన్ కోసం వార్డుల పునర్విభజన, ఎన్నికలను ప్రభుత్వం కొనసాగించకుండా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. వాదనలు విన్న ధర్మాసనం.. రిజిస్ట్రీ లేవనెత్తిన అభ్యంతరాలను తోసిపుచ్చుతూ పిల్‌కు నంబర్ కేటాయించాలని ఆదేశించింది.

విపత్తు హెచ్చరికలకు పటిష్ట వ్యవస్థ

- రియల్ టైమ్‌లో సమాచార మార్పిడి జరుగుతోంది
- కాంగ్రెస్ ఎంపీ సురేశ్ షెట్కార్ ప్రశ్నకు లోక్‌సభలో వెల్లడించిన కేంద్ర ప్రభుత్వం

సాక్షి, న్యూఢిల్లీ: ప్రకృతి విపత్తుల సమయంలో హెచ్చరికలు జారీ చేయడంలో, సమాచారాన్ని క్షణాల్లో చేరవేయడంలో అత్యాధునిక వ్యవస్థను ఏర్పాటు చేశామని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. అయితే, భూకంపాలను తట్టుకునేలా ప్రభుత్వ భవనాలు, పాఠశాలలు, ఆస్పత్రులను పటిష్టం (రెట్రోఫిటింగ్) చేయడంలో మాత్రం తీవ్ర జాప్యం జరుగుతోందని అంగీకరించింది. విపత్తుల వేళ రియల్–టైమ్ డేటా షేరింగ్‌పై లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపీ సురేశ్ కుమార్ షెట్కార్ అడిగిన ప్రశ్నకు కేంద్ర శాస్త్ర, సాంకేతిక, భూవిజ్ఞాన శాఖ మంత్రి డా. జితేంద్ర సింగ్ బుధవారం ఇచ్చిన లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

క్షణాల్లో సమాచారం.. సమన్వయంతో ముందడుగు

విపత్తుల సమయంలో భారత వాతావరణ శాఖ (ఐఎండీ), ఇస్రో (ఐఎస్‌ఆర్‌ఓ), జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ (ఎన్‌డీఎంఏ), రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయంతో రియల్ టైమ్ సమాచార మార్పిడి జరుగుతోందని కేంద్రం తెలిపింది. తుఫాన్లు, భారీ వర్షాల సమాచారాన్ని ‘మౌసమ్’ యాప్ ద్వారా, సునామీ, సముద్రపు అలల హెచ్చరికలను ‘సముద్ర’ యాప్ ద్వారా, భూకంపాల వివరాలను ‘భూకంప్’ యాప్ ద్వారా ఎప్పటికప్పుడు ప్రజలకు, అధికారులకు చేరవేస్తున్నట్లు పేర్కొంది. వాట్సాప్, ఎస్సెమ్మెస్, ఈ–మెయిల్ వంటి మాధ్యమాల ద్వారా కూడా హెచ్చరికలు జారీ చేస్తున్నట్లు వివరించింది.

భవనాల పటిష్టతలో వైఫల్యం..

అయితే దేశంలో భూకంప తీవ్రత ఎక్కువగా ఉండే జోన్–4, 5లలో ప్రభుత్వ భవనాలు, స్కూళ్లు, ఆస్పత్రుల పటిష్టత చాలా నెమ్మదిగా సాగుతోందని కేంద్రం అంగీకరించింది. మార్గదర్శకాలు, బడ్జెట్ కేటాయింపులు ఉన్నప్పటికీ.. నిధుల కొరత, అధికారులలో సాంకేతిక నైపుణ్యం లేకపోవడం, స్థానిక స్థాయిలో ఈ అంశానికి తగిన ప్రాధాన్యత ఇవ్వకపోవడం, ప్రజల్లో, సంస్థల్లో అవగాహన లోపించడంవంటి కారణాలతో రెట్రోఫిటింగ్ పనులు వెనుకబడ్డాయని అంగీకరించింది. కాగా ప్రజల్లో అవగాహన పెంచేందుకు దేశవ్యాప్తంగా మాక్ డ్రిల్స్ నిర్వహిస్తున్నామని, ఒడిశాలోని 26 మత్స్యకార గ్రామాలకు ‘సునామీ రెడీ’ గుర్తింపు లభించిందని పేర్కొంది.



ఫీజు పెంపు.. ఆదాయం కోసమే

సాక్షి, హైదరాబాద్: మద్యం దరఖాస్తుల నాన్ రిఫండబుల్ ఫీజును రూ. 3 లక్షలుగా నిర్ణయించిన ప్రభుత్వం తద్వారా గతంలో కన్నా రూ. 1,000 కోట్ల అదనపు ఆదాయం సమకూర్చుకోవాలని భావిస్తోంది. 2023లో దరఖాస్తు ఫీజు రూ. 2లక్షలు ఉండగా, 2,620 దుకాణాలకుగాను 1,21,516 దరఖాస్తులు వచ్చాయి. మద్యం దుకాణాల కేటాయింపు ప్రక్రియలో భాగంగా దరఖాస్తుల ఫీజు రూపంలో దాదాపుగా 2,430 కోట్లకు పైగా ఆదాయం సమకూరింది. ఈసారి కూడా మద్యం దుకాణాల కోసం భారీ ఎత్తున దరఖాస్తులు వస్తాయని ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన మునిసిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధి విస్తరణ నేపథ్యంలో దుకాణాల సంఖ్య కూడా మద్యం దుకాణాల సంఖ్య పెరిగే అవకాశముంది. ఈ లెక్కన కేవలం దరఖాస్తుల విక్రయం ద్వారానే కనీసం 3,500 కోట్ల మేర ఆర్జించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం.

దుకాణాల సమయాల్లో మార్పు లేదు

కొత్త మద్యం పాలసీలో మద్యం దుకాణాలు తెరిచి ఉంచే సమయాల్లో కూడా మార్పులు చేయలేదు. జీహెచ్‌ఎంసీ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు తెరిచి ఉంచుతారు.

మార్జిన్‌లోనూ మార్పు లేదు

మద్యం దుకాణాల్లో విక్రయించే సాధారణ ఐఎంఎఫ్ఎస్ మద్యానికి 27 శాతం మార్జిన్‌గా నిర్ణయించారు. ప్రీమియర్ కేటగిరీలో విక్రయించే ఐఎంఎఫ్ఎల్, విదేశీ మద్యానికి 20 శాతం, బీర్లకు 20 శాతం మార్జిన్‌గా నిర్ణయించారు. అయితే వార్షిక ఫీజు కంటే 10 రెట్ల టర్నోవర్ దాటితే అందులో 10 శాతం టర్నోవర్ ట్యాక్స్‌గా వసూలు చేస్తారు. ప్రతి షాపులో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి. అన్ని లావాదేవీలు ఆటోమేషన్ ద్వారా ఆన్‌లైన్‌లో అప్‌డేట్ అవ్వాలి. దుకాణాల వద్ద పార్కింగ్, పరిశుభ్రతపై లైసెన్స్‌దారులు బాధ్యత వహించాలి. నూతన మద్యం విధానంలో భాగంగా ప్రభుత్వం మద్యపాన దుష్ప్రభావాలపై ప్రచారాన్ని ముమ్మరం చేయాలని నిర్ణయించింది. డీ–అడిక్షన్ సెంటర్లను కూడా ఏర్పాటు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొంది.

రాజీవ్ హయాంలోనే ఆధునిక భారతానికి పునాదులు

ఆయన జయంతి సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి నివాళులు



సాక్షి, న్యూఢిల్లీ: దేశ భవిష్యత్తు ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ తన హయాంలోనే ఆధునిక భారతానికి పునాదులు వేశారని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. రాజీవ్ గాంధీ జయంతి (సద్భావన్ దివస్)ని పురస్కరించుకుని బుధవారం ఢిల్లీలోని వీర్ భూమిలో రాజీవ్ గాంధీ సమాధి వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేశానికి రాజీవ్ చేసిన సేవలను స్మరించుకున్నారు. తక్కువ పదవీకాలంలోనే ఆయన భారతదేశ ఆర్థిక వ్యవస్థలో, సాంకేతికతలో ఎన్నో మార్పులు తీసుకొచ్చారని భట్టి కొనియాడారు. అలాగే పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్ కుమార్‌రెడ్డి, రఘురాంరెడ్డి, కడియం కావ్య, సురేశ్ షెట్కార్, గడ్డం వంశీకృష్ణ రాజీవ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గిరిజన రైతుల సమస్యలు పరిష్కరించాలి

అధికారులకు రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి ఆదేశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఆదివాసీ రైతులు అడవుల్లో ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం రైతు కమిషన్ కార్యాలయంలో గిరిజన రైతులు–సాగు సమస్యలపై సమావేశం జరిగింది. కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రధానంగా అటవీ భూములపై హక్కు పత్రాలు ఉన్నా బ్యాంకుల నుంచి పంట రుణాలు రావడం లేదని, సాగు భూముల్లో బోర్లు, కరెంట్ సౌకర్యం లేకపోవడం, చివరికి పండించిన పంటను సైతం మార్కెట్లో అమ్ముకునే పరిస్థితి లేదని గిరిజనలు తమ ఇబ్బందులు చెప్పుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 2.60 లక్షల గిరిజన రైతులకు పోడు పట్టాలున్నాయని, వీరు రుణాలు పొందడంలో ఇబ్బందులు పడుతున్నట్లు సభ్యులు కమిషన్ దృష్టికి తేగా.. అధికారులు భూభారతి చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు చర్యలు చేపట్టాలని చైర్మన్ కోదండరెడ్డి ఆదేశించారు.

భారీగా మున్సిపల్ కమిషనర్ల బదిలీ

సాక్షి హైదరాబాద్: రాష్ట్రంలో భారీగా మున్సిపల్ కమిషనర్లను బదిలీ చేస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. మొత్తం 47 మంది మున్సిపల్ కమిషనర్లను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. సెలక్షన్ గ్రేడ్ మున్సిపల్ కమిషనర్ మొదలుకొని మేనేజర్ల వరకు ఈ బదిలీల్లో చోటు కల్పించారు. మున్సిపల్ శాఖలోని కమిషనర్లను కాదని.. ఇతర శాఖల నుంచి వచ్చిన అధికారులకు మున్సిపల్ కమిషనర్లుగా పోస్టింగ్ ఇవ్వడంపై మున్సిపల్ అధికారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేయడం తెలిసిందే. ఈ నేపథ్యంలో పలు కీలక కార్పొరేషన్లకు కమిషనర్లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

యూరియా కొరతపై కేటీఆర్‌వి సన్నాయి నొక్కులు

చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



సాక్షి, హైదరాబాద్: యూరియా కొరతపై కేంద్రాన్ని నిలదీయడానికి బీఆర్‌ఎస్ నేత కేటీఆర్‌కు భయమెందుకో అర్థం కావడం లేదని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఎద్దేవా చేశారు. బీఆర్‌ఎస్ నాన్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్న ఆయన సన్నాయి నొక్కులు నొక్కుతున్నాడని ధ్వజమెత్తారు. సీఎల్పీ కార్యాలయంలో బుధవారం సత్యం మీడియా సమావేశంలో మాట్లాడుతూ యూరియా కేటాయించని కేంద్రాన్ని విమర్శిస్తే కేసులు పెట్టి అరెస్టు చేస్తారని కేటీఆర్‌కు భయం అని అన్నారు. యూరియా కేంద్రం పరిధిలో ఉన్న అంశం అని, కాంగ్రెస్ ఎంపీలు కేంద్రంపైన ఏకంగా పార్లమెంటు వేదికగా వీరోచిత పోరాటం చేస్తున్నారని తెలిపారు. అగ్రనేత ప్రియాంకా గాంధీ కూడా ఎంపీల ఆందోళనలో పాల్గొన్నారని, కానీ బీఆర్‌ఎస్ ఎంపీలు మాత్రం పార్లమెంట్‌లో మాట్లాడటం లేదని విమర్శించారు. యూరియా కేటాయింపు మీద తమ ముఖ్యమంత్రి, వ్యవసాయ శాఖ మంత్రి ఎన్నో విజ్ఞప్తులు చేశారని సత్యం గుర్తు చేశారు. బీఆర్‌ఎస్ నాయకులు కొందరు కావాలనే యూరియాను బ్లాక్ చేస్తూ, రైతులను ఆందోళనల వైపు ఉసిగొల్పుతున్నట్లు తమ వద్ద సమాచారం ఉందన్నారు. యూరియాను బ్లాక్ చేసేవారిపై అవసరమైతే పీడీ యాక్ట్ పెట్టి కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డిపైన కడుపుమంటతో రెండు నెలల కిందట కరువు వస్తుందని కేటీఆర్ ప్రచారం చేశాడని, ఇప్పుడు ప్రాజెక్టులు నిండడంతో కేటీఆర్ కళ్లలో నిప్పులు పోసుకుంటున్నాడని సత్యం ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ప్రజలు ఇబ్బందులు పడితే కేటీఆర్ రాక్షస, పైశాచిక ఆనందం పొందుతున్నాడని దుయ్యబట్టారు.

టీజీ ఫుడ్స్ మిషనరీ సేఫ్టీ ఆడిట్ తప్పనిసరి..

టీజీఫుడ్స్ సమీక్షలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖమంత్రి సీతక్క



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఫుడ్స్ కార్పొరేషన్ పరిధిలోని ఆహార తయారీ మిషనరీపై క్రమం తప్పకుండా సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ఈ విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించవద్దని టీజీ ఫుడ్స్ అధికారులను ఆమె ఆదేశించారు. మిషన్ భగీరథ సమావేశ మందిరంలో బుధవారం తెలంగాణ ఫుడ్స్ విభాగం కార్యకలాపాలపై సమీక్ష నిర్వహించారు. అంగన్‌వాడీల్లోని చిన్నారులకు ఇచ్చే బాలామృతాన్ని మరింత రుచికరంగా మార్చేందుకు.. అందులో చక్కెర శాతాన్ని తగ్గించి పాల శాతం పెంచాలని సూచించారు. టీజీ ఫుడ్స్ పరిధిలోని మిషనరీ వ్యవస్థను పూర్తిస్థాయిలో వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. టీజీ ఫుడ్స్ పరిశ్రమలో ప్రతినెల 2600 మెట్రిక్ టన్నుల బాలామృతం, బాలామృతం ప్లస్, స్నాక్స్ తయారు చేసే సామర్థ్యం ఉందన్నారు. టీజీ ఫుడ్స్ ద్వారానే ఫోర్టిఫైడ్ రైస్, అంగన్వాడీలకు రెడీ టు కుక్ బ్రేక్‌ఫాస్ట్ పౌడర్, చిక్కీలు తయారు చేసేలా కార్యాచరణ రూపొందించాలన్నారు. లక్షలాది మంది చిన్నారులు, తల్లులకు పోషకాహారాన్ని అందిస్తున్నందున అత్యంత అప్రమత్తంగా ఉండాలని, ఇందులో భాగంగా మిషనరీ సేఫ్టీ ఆడిట్ తప్పకుండా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ విభాగంలో పనిచేస్తున్న సిబ్బంది క్రమశిక్షణతో ఉండాలని, కొందరు ఉద్యోగులు యూనియన్ల పేరుతో విధులకు గైర్హాజరవుతున్నారని, అలాంటి వాటిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

రేపటి నుంచి పల్లెల్లో ‘పీఆర్ పనుల జాతర-2025’

సాక్షి, హైదరాబాద్: ఈ నెల 22వ తేదీ శుక్రవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా పల్లెల్లో ‘పనుల జాతర–2025’ ప్రారంభం కానుంది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ప్రజలకు ఉపాధి కల్పన, పల్లెల్లో మౌలిక సదుపాయాల విస్తరణ కోసం ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ఒకేసారి ఈ పనుల జాతర ప్రారంభం కానుంది. పనుల జాతరలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ.. ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలకు పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ప్రత్యేకంగా లేఖలు రాశారు.

తెలంగాణకు సీఆర్‌ఐఎఫ్ నిధులన్నీ విడుదల: కేంద్ర మంత్రి గడ్కరీ



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణకు సెంట్రల్ రోడ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ (సీఆర్‌ఐఎఫ్) నుంచి కేటాయించిన నిధులు విడుదల కాలేదన్న వార్తలను కేంద్ర ప్రభుత్వం ఖండించింది. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రాష్ట్రానికి కేటాయించిన రూ.335.59 కోట్లు పూర్తిగా జమ చేశామని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ రాజ్యసభలో స్పష్టం చేశారు. కాంగ్రెస్ ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ కేంద్ర మంత్రి నిధుల విడుదల వివరాలను వెల్లడించారు. మొదటి విడతలో జూన్ 20, 2024 వరకు రూ.141.77 కోట్లు, రెండో విడతలో డిసెంబర్ 17, 2024 వరకు రూ.141.78 కోట్లు, మూడో విడతలో మార్చి 29, 2025 వరకు రూ.5.59 కోట్లు, సేతు బంధన్ కింద జనవరి 26, 2025 వరకు రూ.46.45 కోట్లు విడుదల చేశామని కేంద్రమంత్రి గడ్కరీ తెలిపారు. ఈ మొత్తంలో ఒక రూపాయి కూడా బకాయి లేదని స్పష్టం చేసిన గడ్కరీ, ఈ నిధుల ద్వారా తెలంగాణ రోడ్లు, మౌలిక సదుపాయాల అభివృద్ధి ప్రాజెక్టులకు ఆర్థిక ఊతం లభిస్తుందని పేర్కొన్నారు.

క్యూలైన్‌లో ఉన్న రైతుపై లాఠీచార్జీ చేయడం ఏమిటి?

మాజీ మంత్రి హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్: ఎరువుల కోసం క్యూలో నిలుచున్న రైతుపై లాఠీ చార్జీ చేయడం ఏమిటని మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మహబూబాబాద్ జిల్లా నర్సింహులు పేట మండలంలో జరిగిన ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామని బుధవారం ఆయన ఎక్స్‌వేదికగా పేర్కొన్నారు. సకాలంలో రైతులకు ఎరువులు సరఫరా చేయకుండా ఇబ్బందులు పెట్టడమే కాకుండా, వారిని పోలీసులతో కొట్టించడం సిగ్గుచేటని, దీనికి ముక్కు నేలకు రాసి రైతులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేతకానితనంతోనే ఈ రోజు రైతులు రోడ్లపైకి వచ్చి రాత్రి, పగలు లైన్‌లో వేచి ఉండాల్సిన దుస్థితి వచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ‘ఎరువుల కోసం రైతులు ఇంకా ఎన్ని అవస్థలు పడాలి? ఎన్ని అవమానాలు ఎదుర్కోవాలి’ అని సీఎం రేవంత్ రెడ్డిని ఆయన ప్రశ్నించారు. ముఖ్యమంత్రే స్వయంగా హోం మంత్రిగా ఉంటూ.. పోలీసులతో రైతులపై లాఠీచార్జి చేయించడం అమానుషమన్నారు.

బీసీని ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ఎందుకు ఎంపిక చేయలేదు?

కాంగ్రెస్‌ను ప్రశ్నించిన బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు



సాక్షి, న్యూఢిల్లీ: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కోరుతున్న కాంగ్రెస్ పార్టీ ఉపరాష్ట్రపతి పదవికి బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని ఎందుకు ఎంపిక చేయలేదని మెదక్ బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు ప్రశ్నించారు. ఆ పదవి కోసం ఇండియా కూటమికి బీసీ అభ్యర్థి దొరకలేదా అని నిలదీశారు. బుధవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో రఘునందన్‌రావు విలేకరులతో మాట్లాడారు. గెలవని పదవులకు న్యాయ కోవిదులను పెట్టిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. తెలంగాణను అవమానిస్తున్నారని దుయ్యబట్టారు. ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థికి బీజేపీ ఎంపీలు మద్దతు ఇవ్వరని స్పష్టం చేశారు. చైనా నుంచి వస్తున్న యూరియా ఆలస్యం కావడం వల్ల యూరియా కొరత వచ్చిందన్న ఆయన.. రాష్ట్ర రైతాంగాన్ని దృష్టిలో ఉంచుకునే కేంద్ర ప్రభుత్వం యూరియా ఇస్తోందని స్పష్టం చేశారు. తమ ఆందోళన ఫలితంగానే కేంద్రం యూరియా ఇస్తున్నదని కాంగ్రెస్ ఎంపీలు చెప్పుకోవడాన్ని ఖండించారు. ఓట్ల చోరీ అంటూ రాహుల్ గాంధీ తప్పుడు ప్రచారం చేస్తున్నారని అందుకోసం తెలంగాణ హెలికాప్టర్లు వాడుతున్నారని రఘునందన్‌రావు మండిపడ్డారు.



శ్రీ కోట సత్తెమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణం

అభీష్ట... ఐశ్వర్య ప్రదాయిని
కోట సత్తెమ్మ

శంఖ చక్రగద అభయ హస్తయజ్ఞోపవీత ధారిణిగా ఏకశిలా స్వయంభూ విగ్రహంతో త్రిశక్తి స్వరూపిణిగా వెలిసిన అమ్మవారిని సందర్శించటానికి రెండు కళ్లూ చాలవేమోననిపిస్తుంది. ఈ ఆలయానికి క్షేత్రపాలకుడు పంచముఖ ఆంజనేయస్వామి. అమ్మవారి దర్శనం కోసం ఏటా సుమారు 5 నుంచి 6 లక్షల మంది భక్తులు వస్తుంటారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తుల సౌకర్యార్థం ఇక్కడ 65 గదులు ఉన్నాయి. ఆలయానికి ప్రతి ఆది, మంగళవారాలలో భక్తులు విశేషంగా తరలివచ్చి తమ మొక్కుబడులు తీర్చుకుంటారు.



శ్రీ కోట సత్తెమ్మ అమ్మవారు



చురుగ్గా సాగుతున్న 9 అంతస్తుల రాజగోపురం నిర్మాణం



ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు చేస్తున్న మహిళలు



శ్రీ కోట సత్తెమ్మ అమ్మవారి ఆలయం



సంతాన లక్ష్మీ చెట్టుకు ఊయలు కడుతున్న మహిళా భక్తులు

పశ్చిమగోదావరి జిల్లా నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం గ్రామంలో వేంచేసిన శ్రీ కోట సత్తెమ్మ అమ్మవారి దేవస్థానంలో భక్తుల పాలిట కొంగు బంగారం కోట సత్తెమ్మ అమ్మవారు విరజిల్లుతున్నారు. కోరిన కోర్కెలు తీర్చే చల్లని తల్లిగా ప్రసిద్ధి చెందింది. శ్రీకోట సత్తెమ్మ అమ్మవారి దేవస్థానానికి పురాతన చరిత్ర ఉంది. అమ్మవారి విగ్రహం 11వ శతాబ్దంలోని తూర్పు చాళుక్యుల కాలానికి చెందినదని పరిశోధనలు చెబుతున్నాయి. అప్పట్లో నిడదవోలును నిరవద్యపురంగా పిలిచేవారు. నిరవద్యపురాన్ని పాలించిన వీరభద్రుని కోటలోని అమ్మవారు శక్తి స్వరూపిణిగా పూజలందుకున్నారు. కాలక్రమేణా కనుమరుగై, 1934లో తిమ్మరాజుపాలెం గ్రామానికి చెందిన దేవులపల్లి రామసుబ్బరాయ శాస్త్రి పొలంలో వ్యవసాయ పనుల కోసం పొలం దున్నుతుండగా అమ్మవారి విగ్రహం బయటపడింది. భూమి యజమాని రామమూర్తి శాస్త్రికి వచ్చిన కలను అనుసరించి కోటసత్తెమ్మ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఆనాటి నుంచి నేటి వరకు భక్తుల కోరికలు తీర్చే కొంగుబంగారంగా, వరాలిచ్చే చల్లని తల్లిగా పేరుగాంచారు. ఈ ఆలయానికి ఎక్కువగా ఉభయగోదావరి, శ్రీకాకుళం, విశాఖపట్టణం, విజయనగరం, గుంటూరు, కృష్ణ, జిల్లాల భక్తులు అధికంగా విచ్చేస్తుంటారు. ఆలయంలో ఏటా దసరా ఉత్సవాలతో పాటు అమ్మవారి తిరునాళ్ళను వైభవంగా నిర్వహిస్తున్నారు. చుట్టు పక్కల గ్రామాలలో ప్రతి కుటుంబంలోనూ కోటసత్యనారాయణ, కోటసత్తెమ్మ అనే పేర్లు తప్పనిసరిగా పెట్టుకుంటారు. ఏటా శ్రావణమాసంలో చివరి శుక్రవారం నాడు సుమారు 1000 మంది ముత్తైదువలతో ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతాలను వైభవంగా నిర్వహిస్తారు. ఈ వ్రతాలకు నిడదవోలు పట్టణంతో పాటు వివిధ గ్రామాల నుండి మహిళలు తరలిరావడంతో సందడి నెలకొంటుంది. దేవస్థానం ఆధ్వర్యంలో మహిళలకు ఉచితంగా పసుపు, కుంకుమ, గాజులు, తమలపాకులు, లడ్డూ ప్రసాదాన్ని పంపిణీ చేస్తున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు రోజుకి సుమారు 100 మందికి శాశ్వత అన్నదాన ట్రస్టు ద్వారా అన్నదాన కార్యక్రమాన్ని చేపడుతున్నారు.

సంతాన వృక్షానికి పెరుగుతున్న భక్తుల తాకిడి

శ్రీ కోటసత్తెమ్మ అమ్మవారి దేవస్థానంలో గర్భాలయానికి నైరుతి వైపున ఉన్న సంతాన వృక్షానికి రోజు రోజుకు భక్తుల తాకిడి పెరుగుతుంది. సంతానం లేని దంపతులు ఈ వృక్షానికి ఊయల కట్టడం సాంప్రదాయం. సంతానం లేని దంపతులు ఈ వృక్షం దగ్గరకు చేరుకుని ఎర్రటి వస్త్రం, రెండు పూర్తిగా పండిన అరటి పండ్లను అమ్మవారికి సమర్పిస్తారు. అనంతరం ఒక అరటి పండును ఎర్రవస్త్రాన్ని తీసుకుని దంపతులు సంతాన వృక్షానికి ఊయల కట్టి, ఆ ఊయలలో పండును ఉంచి, 'అమ్మా... పండు కడుతున్నాను పండంటి బిడ్డను ప్రసాదించు తల్లీ' అంటూ వేడుకుంటారు. బిడ్డ పుట్టిన తరువాత అమ్మవారి సన్నిధికి తీసుకువచ్చి పేరుపెట్టుకోవడంతోపాటు బిడ్డ ఎత్తు నగదు, నాణేల రూపంలో, పటిక బెల్లం కాని తూకం సమర్పించుకుని, మొక్కుబడి తీర్చుకుంటారు.

ఆలయానికి వచ్చే మార్గం...

అమ్మవారి ఆలయానికి నిడదవోలు రైల్వేస్టేషన్ నుండి బస్టాండ్ మీదుగా గణపతిసెంటర్ నుంచి 3 కిలోమీటర్ల దూరంలో చేరుకోవచ్చు. తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రి నుండి 26 కిలోమీటర్లు, పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లి గూడెం నుండి 25 కిలో మీటర్ల దూరం ప్రయాణించి ఆలయానికి చేరుకోవచ్చు. దూరప్రాంతాల నుండి వచ్చే భక్తులు ముందుగా నిడదవోలు పట్టణం చేరకోవాలి. అక్కడ నుండి మూడు కిలోమీటర్ల దూరంలో అమ్మవారి ఆలయానికి చేరుకోవచ్చును..

● ధర్మసందేహం

ఉత్తరాయణం... దక్షిణాయనం ఏది ఉత్తమ కాలం?

సూర్యుడు మకరరాశిలో ప్రవేశించే సమయం ఉత్తరాయణ పుణ్యకాలం ఇక దక్షిణాయనం అంటే సూర్యుడు కర్కాటకంలో ప్రవేశించే సమయం ఉత్తరాయణాన్ని మాత్రమే పుణ్యకాలం అంటారు అలాగని దక్షిణాయనం పాప కాలమేమీ కాదు. అదీ పుణ్యప్రదమైనదే. ఎందుకంటే మన ప్రధాన పండుగలన్నీ దక్షిణాయనంలోనే వస్తాయి. శుభకార్యాలను ఉత్తరాయణంలోనే నిర్వహించే మనం... శక్త్యారాధన, రుద్రారాధన, పితృదేవతారాధన వ్రతం దక్షిణాయనంలోనే చేస్తాం.

అయితే దక్షిణాయనం అనేది దేవతలకు రాత్రికాలం కాబట్టి దేవతారాధనకు ఉత్తరాయణం, పితృదేవతారాధనకు దక్షిణాయనం ప్రశస్తమైనదని పెద్దలు చెబుతారు. వినాయక చవితి, దసరా, దీపావళి వంటి పండుగలు దక్షిణాయనంలోనే వస్తాయి.



శ్రీమహావిష్ణువు శయనించేది దక్షిణాయనంలోనే, రుద్రారాధన, గణనాయకుడైన వినాయకుని ఆరాధనతోపాటు పితృపక్షాలు, విశేషమైన దసరా, దీపావళి వంటి పండుగలన్నీ దక్షిణాయనంలో వస్తాయి. ప్రస్తుతం మనం దక్షిణాయనంలోనే ఉన్నాం.

వర్జ్యం అంటే ఏమిటి? ఈ కాలంలో ఏ పనులూ చేయకూడదా?

జ్యోతిష్యంలో వర్జ్యాన్ని నక్షత్రాన్ని బట్టి నిర్ణయిస్తారు. ప్రతి నక్షత్ర సమయంలో వర్జ్య కాలం ఉంటుంది. ఇంతకీ వర్జ్యం అంటే ఏమిటీ అంటే విడువ తగిన కాలం. వర్జ్యంలో ఎలాంటి శుభకార్యాలు ప్రారంభించడంగానీ, శుభకార్యాలకి బయలుదేరడం కాని చేయకూడదు. ఈ కారణంగానే పెద్దలు ఈ విషయంలో జాగ్రత్తగా వ్యవహరిస్తూ వుంటారు. ప్రతి నక్షత్రానికి వర్జ్యం 4 ఘడియలు లేదా 96 నిమిషాలు ఉంటుంది. వర్జ్యకాలంలోదైవారాధనకి సంబంధించిన అన్ని పనులతో పాటు, శక్తి కొద్దీ దానం దానాలు చేయడం వలన అనేక దోషాలు తొలగిపోతాయని శాస్త్రం చెబుతోంది. అంతే కాకుండా దేవుడి సేవకి సంబంధించిన వివిధ రకాల ఏర్పాట్లను చేసుకోవడం వల్ల ఆయా దోషాలు తొలగి కార్యానుకూలత కలుగుతుంది.

● రమణీయం

విచార సాగరం

భగవాన్ రమణ మహర్షి భక్తులలో ఒక భక్తుడి కొడుకు అకస్మాత్తుగా మరణించడంతో ఆ బాధను తీర్చగల సమర్థుడు రమణులే అని భావించి ఆయన వద్దకు వచ్చారు.

రమణ మహర్షిని కొన్ని ప్రశ్నలు వేశాడు. ఆ ప్రశ్నలలో అతని బాధ ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. రమణులు ఎప్పటిలాగా ఆత్మ గురించి విచారణ చేయమని, అసలు బాధపడుతున్నది ఎవరో తెలుసుకోమని సమాధానం చెప్పగా, ఆ సమాధానంతో ఆ భక్తుడు తృప్తి చెందలేదు. అప్పుడు రమణ మహర్షి నేను ఇప్పుడు 'విచారసాగరం' అనే కథ చెప్తా విను అంటూ చెప్పసాగారు. ఇద్దరు యువకులు వారు విదేశాలకు వెళ్ళి అక్కడ బాగా చదువుకుని డబ్బులు సంపాదిస్తామని వారివారి తల్లిదండ్రులకు నచ్చజెప్పి విదేశానికి వెళ్ళారు.

కొంతకాలానికి వారిద్దరిలో ఒకడు మరణించగా, మరొకడు బాగా చదువుకుని, మంచి జీవనం గడుపుతున్నాడు. కొంతకాలం గడించింది. అక్కడ ఉండే వ్యాపారి తన స్వదేశానికి వెళ్తున్నాడని తెలుసుకుని, తాను ఇక్కడ మంచి జీవనం గడుపుతున్నాని తన తల్లిదండ్రులకు చెప్పమని, వచ్చిన మిత్రుడు మరణించాడని అతని తల్లిదండ్రులకు చెప్పమని ప్రార్థిస్తాడు.

బతికున్న వాడి తల్లిదండ్రులకు తమ బిడ్డ మరణించాడని, చచ్చిపోయిన వ్యక్తి తల్లిదండ్రులకు తమ పిల్లాడు ఉన్నతమైన జీవనం గడుపుతున్నాడని పొరపాటుగా తప్పుడు సమాచారం చేరవేస్తాడు.

దాంతో జీవించి ఉన్నవాడి అమ్మనాన్నాలు తీవ్రంగా బాధ పడుతుంటారు. మరణించినవాడి తల్లిదండ్రులు తమ పిల్లాడు ఎప్పటికైనా తిరిగివస్తాడని సంతోషంగా కాలం గడుపుతుంటారు. నిజానికి ఈ తల్లిదండ్రులు ఇద్దరూ తమ పిల్లలను చూడనే లేదు. కాని ఒకరు సంతోష పడుతున్నారు, ఒకరు ఆవేదన చెందుతున్నారు. మనం కూడా అంతే. మనం మన మనసు చెప్పినవన్నీ నమ్మేస్తాం. అందుకే ఏది లేదో అదే ఉన్నదని, యథార్థానికి ఏది ఉన్నదో అదే లేదని భావిస్తాం.

మనం మనసుమాట వినకుండా, హృదయంలోనికి ప్రవేశించి అక్కడున్న పుత్రుని చూసుకుంటే, ఇక బయట ప్రత్యేకంగా పిల్లలను చూసుకుని ఆనందించవలసిన అవసరం లేదు అన్నారు రమణ మహర్షి. ఈ కష్టాలు, బాధలు, సంతోషాలు, బంధాలు, బంధుత్వాలు మొదలైనవన్నీ మనసుకే కానీ, ఆత్మకు కావు, ఆత్మయే చిదానంద స్వరూపం. ఆత్మ గురించి తెలుసుకుని, ఆత్మ స్థితిలో ఉండగలిగితే మనల్ని ఏవి బాధించలేవు.



● సువార్త

యేసు పాదముద్రలు

అత్యున్నతమైన పరలోకం నుండి ఈ భూమి మీదకు దిగి వచ్చి ఇలా దేవుని చేత పంపబడుట ద్వారా క్రీస్తు మానవాళికి చేసిన గొప్ప పరిచర్య అది ఏనాడూ వర్ణనకు అందనిది (యోహాను 21:25). క్రీస్తు ఈ భూమి మీద సువార్త ప్రకటించడం అన్న విషయాన్ని ఎంతగా చర్చించుకుంటే అంతగా భక్త శ్రేష్ఠులకు జీవము అంటుంది గ్రంథం (యోహాను 5:39). ఆయన సువార్తికులకే సువార్తికుడు అన్నది ఎప్పుడూ గుర్తుంచుకోవాలి. సువార్త ఎలా ప్రకటించాలో అపొస్తలులు అంతా క్రీస్తును చూసే నేర్చుకున్నారు. అట్టి నైపుణ్యం అపొస్తలులను, ఆదిమ సంఘమును చూసి మనం నేడు నేర్చుకోవలసి ఉంది.

ఆ రోజుల్లో యేసు క్రీస్తు వారు ఒక్క పడవ తప్ప ఏదీ ఉపయోగించలేదు. గుర్రాలను ఒంటెలను ఎద్దులను గాడిదలను తన కోసం తన పరిచర్య కోసం ప్రయాణ సాధనాలుగా వాడినట్లు బైబిలులో ఎక్కడ రాయలేదు. అవిశ్రాంతంగా మూడున్నర సంవత్సరాల కాలం పాటు సుదీర్ఘ పాదయాత్రలు చేస్తూ సువార్త ప్రకటించుట ద్వారా మానవాళికి గొప్ప పరిచర్య చేసాడు (మత్త 4:23).



ఆ పరామర్శ ఎందరికో మార్గదర్శకం

ఈ ఆధునిక యుగంలో ఎన్నో సౌకర్యవంతమైన ప్రయాణ సాధనాలు ఉన్నా బీదలను బాధితులను రోగులను పరామర్శించే వారే నేడు కరువయ్యారు. రిక్త హస్తాలతో ఈ భూమి మీద జీవించిన వాడు క్రీస్తు. రోమా ప్రభుత్వ అధికారులకు పన్ను కట్టలేని పరిస్థితి ఆయనది ఇక ఆ రోజుల్లో ధనవంతులు వాడుటను బట్టి ఖరీదైన గుర్రపు రథాలు ఎడ్ల బండ్లు ఒంటెల బండ్లు వంటివి వాడే అవకాశం యేసుకు లేదు. తన పాదాలకు పని చెప్పి ఏ భేదం లేకుండా బీదలైన దీనులకు, ధనికులకు ఆయన ఒకే సువార్తను ఇశ్రాయేలు దేశమంతటా సంచరిస్తూ ప్రకటించాడు. మానవాళి పట్ల ప్రేమతో ఆయన పరిచర్య కాలంలోనే కాక, జీవిత కాలం అంతటా కాలి నడకతోనే సంచారం చేసాడు. యేసు నడకే కాదు, యేసు పరామర్శయే కాదు, యేసు ప్రేమ కూడా నాయకత్వ లక్షణమే. ప్రేమను బట్టే నడక, ప్రేమను బట్టే పరామర్శ చేయడం కాబట్టి యేసు ప్రేమే నాయకత్వ లక్షణం.

పాద ముద్రలు ఇంకా సజీవంగా...

నేటికీ అవి నిలిచే ఉన్నాయి. ఆయన అడుగు జాడలలో నడుచుటకు దేవుడు తన కుమారుడను మానవాళి ముందు మాదిరిగా పెట్టాడు (అపొ 17: 31). క్రీస్తు కూడా తన తండ్రియైన దేవుని పట్ల భయభక్తులు కలిగి జీవించుట ద్వారా మానవాళికి మాదిరి అయ్యాడు (హెబ్రీ 4:15, 5:7,8, 12:1-3). యేసు అడుగుల ముద్రలు భౌతిక రూపంలో మన కంటికి కనబడవు. అయితే ఆ ముద్రలు ఎప్పటికీ సజీవమే అనుట గమనించదగ్గది.

క్రొత్త నిబంధనలో ఎన్నో క్రీస్తు అడుగుల గుర్తులు ఉన్ననూ పేతురు ఇక్కడ నాలుగు అడుగు జాడల గూర్చి మాత్రమే చెబుతున్నాడు. 1పేతురు 2:21 -23 వచనాలలో క్రీస్తు ప్రభువు వారి అడుగు జాడలు బహు తేటగా ముద్రించబడుట ద్వారా ఇందు నమోదు చేయబడుటను చూస్తాము.

ఆయన అడుగు జాడలు ఉన్నతం

- 'క్రీస్తు కూడ మీకొరకు బాధపడి, మీరు తన అడుగుజాడలయందు నడుచుకొనునట్లు మీకు మాదిరి ఉంచిపోయెను.
- ఆయన పాపము చేయలేదు. ఆయన నోటను ఏ కపటమును కనబడలేదు.
- ఆయన దూషింపబడియు బదులు దూషింపలేదు. ఆయన శ్రమ పెట్టబడియు బెదిరింపక న్యాయముగా తీర్పు తీర్చు దేవునికి తన్ను తాను అప్పగించుకొనెను'.

– జేతమ్

● ఇస్లాం వెలుగు

దేవుడు ఎలా ఉంటాడో తెలుసా?

ఒకసారి బాగ్దాదు నగరంలో గొప్ప ధార్మిక సభ జరుగుతోంది. వేలాది మంది ప్రజలు ఆ సభలో పాల్గొన్నారు. అనేక మంది పండితులు ప్రజలను ఉద్దేశించి ప్రవచనం చేస్తున్నారు. అంతలో ఒక వ్యక్తి సభలోకి ప్రవేశించి, పండితులకు ఒక సవాలు విసిరాడు. 'మీరు చెబుతున్న ప్రకారం, ఈ సృష్టి మొత్తానికి ఒక కర్త ఉన్నాడు. అయన అల్లాహ్, అంటే సృష్టికర్త. మరి ఆయనే సమస్తాన్ని సృష్టించినప్పుడు 'ఆయన్ని' ఎవరు సృష్టించారు? ఆయనకు ముందు ఎవరున్నారు?. 'అని ప్రశ్నించాడు.

సభలో ఒక్కసారిగా నిశ్శబ్దం ఆవరించింది. పండితులు అతని ప్రశ్నకు సమాధానం చెప్పారు. కాని అతను సంతృప్తి చెందలేదు. పండితులు తల పట్టుకున్నారు. అతనికి అర్థమయ్యేలా సంతృప్తికరమైన సమాధానం ఎలా చెప్పాలో వారికి అర్థం కాలేదు. ఆ వ్యక్తి గర్వంగా సభికుల వైపు చూశాడు. అంతలో సభికుల్లోంచి ఓ పదకొండేళ్ళ బాలుడు సమాధానం చెబుతానని ముందుకొచ్చాడు. ఆ వ్యక్తి బాలుణ్ణి చూసి,'నువ్వు సమాధానం చెబుతావా?' అంటూ వెటకారంగా నవ్వాడు. ఆ బాలుడు ఏమాత్రం తొణక్కుండా, 'అవును నేనే.. మీప్రశ్న మరోసారి వినిపించండి' అన్నాడు.



'అన్నిటికీ అల్లాయే అంటున్నారు గదా.. మరి అల్లాహ్‌కు ముందు ఎవరున్నారు? 'అని ప్రశ్నించాడు. అప్పుడా బాలుడు, 'మీకు ఒకటి, రెండు ఒంట్లు వచ్చుగదా..? ఒకటి నుండి పది వరకు లెక్కించండి'. అన్నాడు.

'ప్రశ్నకు సమాధానం చెప్పకుండా ఇదేమి పిచ్చి ప్రశ్న' అంటూనే ఒకటి నుండి పది వరకు లెక్కించాడు. 'పది తరువాత..?' అన్నాడా బాలుడు. 'పదకొండు..పన్నెండు..' ఇలా ఎంతవరకైనా వెళ్ళవచ్చు.' అన్నాడా వ్యక్తి. 'అవును కదా..! అలాగే పది నుండి వెనక్కి లెక్కించండి.' అన్నాడా బాలుడు. 'పది..తొమ్మిది.. ఎనిమిది.. ఇలా .. ఒకటి వరకు వచ్చి ఆగి పొయ్యాడు. 'తరువాత..? లెక్కించండి..' అన్నాడు బాలుడు. 'తరువాత ఇంకేముంటుంది. ఏమీలేదు.. సున్నా.. శూన్యం.' అన్నాడా వ్యక్తి. '..కదా..? అల్లాహ్‌కు ముందు కూడా ఏమీ లేదు.. అంతా శూన్యం. అన్నిటికీ కర్త ఆయనే..' అన్నాడు బాలుడు. సభలో కరతాళ ధ్వనులు మిన్నంటాయి. ప్రశ్నించిన వ్యక్తి ముఖం వాడిపోయింది.

– ముహమ్మద్ ఉస్మాన్ ఖాన్

● మంచి మాటలు

- మనిషి మంచివాడు కావాలంట, మంచి పనులు చేయక్కరలేదు, ఎదుటివారి గురించి ముందొక మాట, వెనుకొక మాట మాట్లాడకుంటే చాలు.!
- మితిమీరిన నమ్మకం చాలా ప్రమాదం... నమ్మకం ఎంత బలపడితే నమ్మకద్రోహం అంత గట్టిగా తగులుతుంది.!!
- కష్టాలు కన్నీళ్ళనే కాదు నిజాలను బయటకు రప్పిస్తుంది, దాపరికాల ముసుగును తొలగిస్తుంది... వాస్తవాలను వెలుగు చూసేలా చేస్తుంది... కష్టం కూడా ఒక మంచి స్నేహితుడే... మనలో ధైర్యాన్ని... మన సామర్థ్యాన్ని మనకు తెలియజేస్తుంది... మన భవిష్యత్తుకు... గమ్యాన్ని వెతికేలా చేస్తుంది.!!
- జీవితంలో ఎప్పుడూ మంచివాళ్ళను నొప్పించకు ఎందుకంటే... వాళ్ళు వజ్రం లాంటి వాళ్ళు... చేజారితే పగిలిపోరు... నీ జీవితం నుండి జారిపోతారు.!!
- కంటికి నచ్చే ఎన్నో విషయాల గురించి... పరుగులు తీస్తూ ఉంటాం... కానీ గుండెకు నచ్చే విషయం గురించి వెతకండి... నయనానందం క్షణికం... హృదయానందం శాశ్వతం...

● నిర్మల వాణి

ఇచ్ఛాశక్తి

658వ నామము వద్ద అమ్మవారిని ఇచ్ఛాశక్తి జ్ఞానశక్తి క్రియాశక్తి స్వరూపిణీ అని వర్ణిస్తారు. మానవుల సూక్ష్మ శరీరములో ఏడు చక్రములతో పాటు ఇడ, పింగళ, సుషుమ్న అనే మూడు నాడులు ఉంటాయి. మానవులలో కుండలినీ శక్తి ఈ మూడు నాడుల ద్వారా పైకి వచ్చినప్పుడు, ఇడా నాడి ఇచ్ఛాశక్తిని అనగా సంకల్ప శక్తిని, పింగళా నాడి క్రియా శక్తిని అనగా కార్యాచరణ శక్తిని, సుషుమ్నా నాడి జ్ఞాన శక్తి అనగా జ్ఞానానికి కారణమైన శక్తిని ప్రసాదిస్తాయి.



ఈ సూక్ష్మ శరీరంలో ఉండే షట్చక్రాలు చూడడానికి పద్మముల వలె కనిపిస్తాయి. అందువలన వీటిని పద్మములని కూడా అంటారు. ఒకొక్క చక్రమునకు అనగా ఒకొక్క పద్మముకు ఎన్నెన్ని దళములు ఉంటాయో కూడా వివరించబడింది. మూలాధార చక్రముకు 4, స్వాధిష్ఠాన చక్రముకు 6, మణిపూర చక్రానికు 10, అనాహత చక్రానికి 12, విశుద్ధి చక్రముకు 16, ఆజ్ఞా చక్రముకు 2 మరియు సహస్రార చక్రముకు 1000 దళాలు ఉంటాయి.

514వ నామం వద్ద అమ్మవారిని 'మూలాధారాంభుజారూఢా' అనగా మూలాధార పద్మములో అధివసించునది అని వర్ణిస్తారు. మూలాధార చక్రము వద్ద అమ్మవారి కృపతో సాధకునికి అమాయకత్వము, వివేకము, పవిత్రత మరియు ఆత్మ గౌరవము వంటి సద్గుణాలు లభిస్తాయి.

504వ నామం వద్ద అమ్మవారిని 'స్వాధిష్ఠానాంబుజగతా' అనగా స్వాధిష్ఠాన పద్మములో నివసించునది అని వర్ణిస్తారు. ఈ చక్రము మన పొట్ట దిగువ భాగంలో పొత్తి కడుపు ప్రాంతంలో ఉంటుందని, కుండలినీ శక్తి ఈ చక్రాన్ని దాటునప్పుడు మనిషిలో సజనాత్మకత నెలకొని విద్యలోను, అనేక కళల లోను రాణిస్తారు.

101 వ నామం వద్ద అమ్మవారిని 'మణిపూరాంతరుదితా' అనగా మణిపూర చక్రము లోపల నుండి ఉదయించునది అని వర్ణిస్తారు. ఈ మణిపూర చక్రము మన కడుపు దగ్గర నాభీ ప్రాంతములో ఉంటుంది. కుండలినీ శక్తి ఈ చక్రమును దాటినప్పుడు మనిషి లోపల శాంతి మరియు సంతప్తి నెలకొని, సమతుల్యమైన ధర్మబద్ధ జీవనం అలవడుతుంది.



485వ నామం వద్ద అమ్మవారిని 'అనాహతాబ్జ నిలయా' అని వర్ణిస్తారు. ఆహతము అనగా మన చెవులకు వినిపించే శబ్దం. అనాహతము అనగా మన చెవులకు వినిపించని శబ్దం. మన చెవులకు వినిపించని శబ్దం మన హదయ స్పందన. ఈ చక్రము మన హృదయం వద్ద ఉంటుంది కావున దీనికి అనాహత చక్రము అనే పేరు వచ్చింది. కుండలినీ శక్తి అనాహత చక్రాన్ని దాటునప్పుడు మనిషి లోపల ధైర్యం, నిర్భయత్వము మరియు సాటి మానవులందరి పట్ల నిష్కల్మషమైన ప్రేమ వంటి లక్షణాలు ఏర్పడతాయి.

– డా. పి. రాకేష్
సహజ యోగ సంస్థాపకురాలు, పరమ పూజ్య శ్రీ మాతాజీ నిర్మలా దేవి గారి ప్రవచనాల ఆధారంగా

బిజినెస్ రీల్

పసిడి, వెండి ధరలు డీలా

- 10 గ్రాముల బంగారం రూ. 400 డౌన్
- రూ. 1,500 క్షీణించిన కేజీ వెండి ధర



న్యూఢిల్లీ: బంగారం ధర స్థానిక మార్కెట్లో డీలా పడింది. 99.9 స్వచ్ఛతగల 10 గ్రాముల పసిడి రూ. 400 తగ్గి 1,00,200కు చేరింది. ఈ బాటలో 99.5 స్వచ్ఛతగల బంగారం 10 గ్రాముల ధర రూ. 350 తక్కువగా రూ. 99,700ను తాకింది. స్టాకిస్టుల నిరవధిక అమ్మకాల కారణంగా దేశ రాజధానిలో పసిడి ధరలు డీలా పడినట్లు ఆల్ ఇండియా సరఫా అసోసియేషన్ పేర్కొంది. ఆరు ప్రధాన కరెన్సీలతో మారకంలో యూఎస్ డాలరు మరోసారి నామమాత్రంగా బలపడి వారం రోజుల గరిష్టానికి చేరడం బంగారం ధరలపై ప్రతికూల ప్రభావాన్ని చూపినట్లు హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ కమోడిటీ నిపుణులు సౌమిల్ గాంధీ పేర్కొన్నారు. రాజకీయ, భౌగోళిక ఉద్రిక్తతలు ఉపశమించడం ఇందుకు జత కలిసినట్లు తెలియజేశారు. కాగా.. వెండి ధరలు సైతం కేజీకి రూ. 1,500 క్షీణించాయి. దీంతో కేజీ వెండి రూ. 1,12,500 వద్ద స్థిరపడింది. విదేశీ మార్కెట్లో స్పాట్ గోల్డ్ ఔన్స్ (31.1 గ్రాములు) దాదాపు యథాతథంగా 3,326 డాలర్ల వద్ద కదులుతోంది. ఈ బాటలో వెండి ఔన్స్ 1 శాతం నీరసించి 37.07 డాలర్లకు చేరింది. యూఎస్ కేంద్ర బ్యాంకు ఫెడరల్ రిజర్వ్ గత పాలసీ సమీక్షా వివరాలు(మినిట్స్) నేడు విడుదలకానున్న నేపథ్యంలో ట్రేడర్లు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నట్లు బులియన్ వర్గాలు పేర్కొన్నాయి.

పీఎస్‌యూ బ్యాంక్ చీఫ్‌లతో ఆర్థిక శాఖ సమావేశం

క్యూ1 ఆర్థిక ఫలితాలపై సమీక్ష



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంకుల చీఫ్‌లతో ఫైనాన్షియల్ సర్వీసెస్ సెక్రటరీ ఎం.నాగరాజు అధ్యక్షతన ఆర్థిక శాఖ మూడు గంటలపాటు సమావేశం నిర్వహించింది. తద్వారా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) తొలి త్రైమాసికం(ఏప్రిల్–జూన్)లో బ్యాంకుల ఆర్థిక ఫలితాలపై సమీక్ష చేపట్టారు. దీనిలో భాగంగా ఆర్థిక వ్యవస్థలో భాగమైన ఉత్పాదక రంగాలకు రుణాల విడుదలను పెంచవలసిందిగా బ్యాంకుల ఎండీలు, సీఈవోలను నాగరాజు కోరినట్లు తెలుస్తోంది. బ్యాంకింగ్ పీఎస్‌యూ దిగ్గజం స్టేట్‌బ్యాంక్‌సహా ప్రభుత్వ రంగ బ్యాంకులు ఈ ఏడాది తొలి త్రైమాసికం(క్యూ1)లో రూ. 44,218 కోట్ల నికర లాభం ఆర్జించాయి. వార్షికంగా ఇది 11 శాతం వృద్ధికాగా.. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 39,974 కోట్ల లాభం ఆర్జించాయి. ఈ ఏడాది క్యూ1లో ప్రభుత్వ బ్యాంకులు ఆర్జించిన రూ. 44,218 కోట్ల లాభాల్లో కేవలం ఎస్‌బీఐ 43 శాతం వాటా ఆక్రమించడం విశేషం!

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

21-8-2025

విశాఖ	520-00
చిత్తూరు	553-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	520-00
విజయవాడ	525-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	495-00
వరంగల్	497-00
రిటైల్ ధర	5.55

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
INFY	1,495.10	3.83
TCS	3,094.80	2.61
NESTLEIND	1,191.00	2.55
HINDUNILVR	2,668.00	2.43
NTPC	341.75	2

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
BEL	371.8	-2.17
SHRIRAMFIN	616.1	-1.64
BAJFINANCE	887.7	-1.62
TATAMOTORS	690	-1.46
INDUSINDBK	778	-0.95

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	6,902
ఎన్ఎస్ఈ	196,171
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,50,041
ఎఫ్ఐఐ	- 1,100
డీఐఐ	+ 1,806

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	62.74 (రాత్రి 11.30కు)	$ 61.77 (క్రితం ముగింపు)
బ్రెంట్	66.86 (రాత్రి 11.30కు)	$ 65.79 (క్రితం ముగింపు)

ఐపీవోకు 5 కంపెనీలు రెడీ

తాజాగా సెబీ గ్రీన్ సిగ్నల్

- జాబితాలో పార్క్ మెడీ వరల్డ్
- ఇన్నోవేటివ్యూ ఇండియా, రన్‌వాల్

న్యూఢిల్లీ: ఇటీవల జోరు చూపుతున్న ప్రైమరీ మార్కెట్ల ప్రభావంతో తాజాగా ఐదు కంపెనీలు పబ్లిక్ ఇష్యూలు చేపట్టేందుకు దారి ఏర్పడింది. క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ ఇందుకు అనుమతులు మంజూరు చేసింది. ఈ జాబితాలో ఇన్నోవేటివ్యూ ఇండియా, పార్క్ మెడీ వరల్డ్, రన్‌వాల్ ఎంటర్‌ప్రైజెస్, జినీకుషాల్ ఇండస్ట్రీస్, అడ్వాన్స్ ఆగ్రోలైఫ్ చేరాయి. ఈ కంపెనీలు 2025 ఫిబ్రవరి, ఏప్రిల్ మధ్య సెబీకి ప్రాస్పెక్టస్ దాఖలు చేశాయి. ఈ కేలండర్ ఏడాది(2025)లో ఇప్పటివరకూ మెయిన్‌బోర్డులో 48 కంపెనీలు లిస్టకావడం గమనార్హం! ఈ నెలలో ఇప్పటివరకూ 11 కంపెనీలు ఐపీవోకురాగా.. వచ్చేవారం మరికొన్ని కంపెనీల ఇష్యూలు ప్రారంభంకానున్నాయి. ఈ నేపథ్యంలో తాజా ఇష్యూల వివరాలు చూద్దాం..

సెక్యూరిటీ సొల్యూషన్లు

భద్రతా, నిఘా(సెక్యూరిటీ, సర్వీలెన్స్) సొల్యూషన్లు అందించే ఇన్నోవిటివ్యూ ఇండియా ఐపీవోకు రానుంది. ఇష్యూలో భాగంగా ప్రమోటర్లు రూ. 2,000 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను విక్రయానికి ఉంచనున్నారు. దీంతో ఇష్యూ నిధులు కంపెనీకికాకుండా పూర్తిగా ప్రమోటర్లకు చేరనున్నాయి.

ఆసుపత్రుల చైన్

ఆరోగ్యపరిరక్షణ రంగ సంస్థ పార్క్ మెడి వరల్డ్ ఐపీవో చేపట్టనుంది. పార్క్ బ్రాండ్‌తో ఆసుపత్రులను నిర్వహిస్తున్న కంపెనీ తద్వారా రూ. 1,200 కోట్లు సమీకరించనుంది. వీటిలో కొత్తగా ఈక్విటీ జారీ ద్వారా రూ. 900 కోట్లు సమకూర్చుకోనుండగా.. ప్రమోటర్ అజిత్ గుప్తా రూ. 300 కోట్ల విలువైన షేర్లను ఆఫర్ చేయనున్నారు. ఈక్విటీ జారీ నిధులను రుణ చెల్లింపులు, పెట్టుబడి వ్యయాలు(కొత్త ఆసుపత్రుల ఏర్పాటు), పరికరాల కొనుగోలుకి వెచ్చించనుంది. అనుబంధ సంస్థలు పార్క్ మెడిసిటీ(ఎన్‌సీఆర్), బ్లూహెవెన్స్ విస్తరణకు సైతం నిధులు వెచ్చించనుంది.



రియల్టీ సంస్థ

ఐపీవోకు రానున్న రియల్టీ అభివృద్ధి సంస్థ రన్‌వాల్ ఎంటర్‌ప్రైజెస్ రూ. 1,000 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను తాజాగా జారీ చేయనుంది. ఈ నిధులలో రూ. 200 కోట్లు రుణ చెల్లింపులకు, మరో రూ. 450 కోట్లు అనుబంధ సంస్థలలో పెట్టుబడులకు కేటాయించనుంది. మిగిలిన నిధులను భవిష్యత్ రియల్టీ ప్రాజెక్టుల అభివృద్ధి, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించనుంది.

మెషీన్ల కంపెనీ

చత్తీస్‌గఢ్‌కు చెందిన మెషీన్ల ఎగుమతి కంపెనీ జినీకుషాల్ ఇండస్ట్రీస్ ఐపీవోలో భాగంగా 86.5 లక్షల షేర్లను కొత్తగా జారీ చేయనుంది. వీటికి జతగా కంపెనీ ప్రమోటర్లు 10 లక్షల షేర్లను విక్రయానికి ఉంచనున్నారు. ఈక్విటీ జారీ నిధులను వర్కింగ్ క్యాపిటల్, కార్పొరేట్ అవసరాలకు వెచ్చించనుంది.

ఆగ్రోకెమికల్

జైపూర్ సంస్థ అడ్వాన్స్ ఆగ్రోలైఫ్ లిమిటెడ్ ఐపీవోకు రానుంది. దీనిలో భాగంగా 1.92 కోట్ల ఈక్విటీ షేర్లను తాజాగా జారీ చేయనుంది. ఇలా సమీకరించిన నిధులను వర్కింగ్ క్యాపిటల్‌తోపాటు.. సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించనుంది.

డిజిటల్ రుణాల ప్లాట్‌ఫామ్

డిజిటల్ రుణాల ప్లాట్‌ఫామ్ కిస్త్ మాతృ సంస్థ ఆన్‌ఈఎంఐ టెక్నాలజీ సొల్యూషన్స్ పబ్లిక్ ఇష్యూ బాట పట్టింది. ఇందుకు అనుగుణంగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్ దాఖలు చేసింది. దీనిలో భాగంగా రూ. 1,000 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. అంతేకాకుండా వీటికి జతగా మరో 88.79 లక్షల ఈక్విటీ షేర్లను ప్రస్తుత వాటాదారులు విక్రయానికి ఉంచనున్నారు. ఈక్విటీ జారీ నిధులలో రూ. 750 కోట్లు అనుబంధ సంస్థ సైక్రెవా మూలధన పటిష్టతకు కేటాయించనుంది. తద్వారా భవిష్యత్ పెట్టుబడి అవసరాలకు వినియోగించనుంది. మిగిలిన నిధులను సాధారణ కార్పొరేట్ అవసరాలకు వెచ్చించనుంది. 2016లో ప్రారంభమైన కంపెనీ వ్యక్తిగత అవసరాలకు అనుగుణంగా వేగవంత, సులభతర క్రెడిట్ సొల్యూషన్లు అందిస్తోంది. ప్రధానంగా యువతపై దృష్టిసారించింది. 2025 మార్చి31కల్లా 5.32 కోట్ల రిజిస్టర్డ్ యూజర్లను కలిగి ఉంది. 91 లక్షలకుపైగా కస్టమర్లకు సేవలు సమకూర్చింది. రూ. 4,087 కోట్ల నిర్వహణలోని ఆస్తులు(ఏయూఎం) కలిగి ఉంది. గతేడాది(2024–25) రూ. 1,337 కోట్ల ఆదాయం, రూ. 161 కోట్ల నికర లాభం ఆర్జించింది.

సైబర్‌స్కోప్ యూఎస్ లిస్టింగ్

పబ్లిక్ ఇష్యూకు బోర్డు ఆమోదం



చండీగఢ్: అనుబంధ సంస్థ సైబర్‌స్కోప్ వెబ్3 సెక్యూరిటీ ఇంక్‌ను యూఎస్‌లో లిస్ట్ చేయనున్నట్లు సైబర్‌సెక్యూరిటీ దాడులను అడ్డుకునే కంపెనీ టాక్ ఇన్ఫోసెక్ తాజాగా వెల్లడించింది. ఇందుకు అనుగుణంగా యూఎస్‌లో పబ్లిక్ ఇష్యూ చేపట్టేందుకు బోర్డు అనుమతించినట్లు పేర్కొంది. కొద్ది వారాల్లో యూఎస్ స్టాక్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్(ఎస్ఈసీ)కు ముసాయిదా రిజిస్ట్రేషన్ దాఖలు చేసే ప్రణాళికల్లో ఉన్నట్లు తెలియజేసింది. కేమన్ ఐలాండ్స్‌లో ఏర్పాటైన సైబర్‌స్కోప్ వెబ్3 సెక్యూరిటీ ఇంక్ బోర్డు ఇటీవలే సమావేశమైనట్లు టాక్ ఇన్ఫోసెక్ వెల్లడించింది. దీనిలో భాగంగా గోప్యతా విధానంలో ప్రాస్పెక్టస్(ఫారమ్–1) దాఖలు చేసే ప్రతిపాదనను ఆమోదించినట్లు పేర్కొంది. ఐపీవో విజయవంతమైతే నాస్‌డాక్ క్యాపిటల్ మార్కెట్లో అనుబంధ సంస్థ సైబర్‌స్కోప్ వెబ్3 సెక్యూరిటీ ఇంక్ లిస్టకానున్నట్లు టాక్ ఇన్ఫోసెక్ తెలియజేసింది. ఎస్ఈసీ సమీక్ష తదుపరి ఐపీవో సమయం, పరిమాణం, ఇష్యూ ధర తదితరాలను నిర్ణయించనున్నట్లు వెల్లడించింది.

ఫండ్స్ విదేశీ ఆస్తుల్లో 6% క్షీణత

2025 మార్చి నాటికి రూ.72వేల కోట్లు

- 95 శాతం యూఎస్, లగ్జెంబర్గ్, ఐర్లాండ్‌లోనే
- ఎన్ఆర్ఐల నుంచి పెరుగుతున్న పెట్టుబడులు

ముంబై: మ్యూచువల్ ఫండ్స్ నిర్వహణలోని విదేశీ పెట్టుబడుల (విదేశీ స్టాక్స్, ఇతర సెక్యూరిటీల్లో) విలువ గత ఆర్థిక సంవత్సంలో 5.6 శాతం తగ్గి 8.3 బిలియన్ డాలర్లుగా (రూ.72,210 కోట్లు సుమారు) ఉన్నట్టు ఆర్‌బీఐ ప్రకటించింది. 2024 మార్చి నాటికి మ్యూచువల్ ఫండ్స్ విదేశీ నిర్వహణ ఆస్తుల విలువ 8.81 బిలియన్ డాలర్లుగా ఉండడం గమనార్హం. గత ఆర్థిక సంవత్సరం చివరికి ఫండ్స్ నిర్వహణలోని యూఎస్ ఈక్విటీల విలువ 3.9 శాతం తగ్గి రూ.44,500 కోట్లుగా ఉన్నట్టు ఆర్‌బీఐ వార్షిక సర్వే నివేదిక తెలిపింది. ఐర్లాండ్, తైవాన్‌లోని పెట్టుబడుల విలువ సైతం ఇదే మాదిరి తగ్గింది. భారత మ్యూచువల్ ఫండ్స్ సంస్థల విదేశీ పెట్టుబడుల్లో 95 శాతం యూఎస్, లగ్జెంబర్గ్, ఐర్లాండ్‌లోనే ఉన్నట్టు ఆర్‌బీఐ డేటా తెలియజేస్తోంది. గత ఆర్థిక సంవత్సరంలో భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, అమెరికా కొత్త అధ్యక్షుడు ట్రంప్ చేపట్టిన వాణిజ్య విధానాలతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో అస్థిరతలు నెలకొనడం తెలిసిందే. ఇక గత ఆర్థిక సంవత్సరంలో దేశీ మ్యూచువల్ ఫండ్స్ ఈక్విటీ పథకాల్లోని పెట్టుబడులు 25 శాతం పెరిగి రూ.29.45 లక్షల కోట్లుగా ఉన్నట్టు చెబుతూ.. స్థానిక మార్కెట్‌పై ఇన్వెస్టర్లలో విశ్వాసం పెరిగినట్టు వివరించింది. గత ఆర్థిక సంవత్సరంలో మ్యూచువల్ ఫండ్స్ విదేశీ చెల్లింపుల బాధ్యతలు 20 శాతం పెరిగి 30.5 బిలియన్ డాలర్లకు చేరాయని.. ప్రవాస భారతీయుల పెట్టుబడులు పెరగడం వల్లేనని వివరించింది. భారత ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లో యూఏఈలోని ఎన్ఆర్ఐల పెట్టుబడులు రూ.52,549 కోట్లకు చేరాయి. ఫండ్స్ ఆస్తుల్లో యూఏఈ, యూఎస్ఏ, యూకే, సింగపూర్ ఎన్ఆర్ఐల వాటా అధికంగా ఉంది.



వేదాంతా విడదీత విచారణ వాయిదా

సెప్టెంబర్ 17న చేపట్టనున్న ఎన్‌సీఎల్‌టీ



ముంబై: డైవర్సిఫైడ్ దిగ్గజం వేదాంతా లిమిటెడ్ బిజినెస్‌ల విడదీత ప్రణాళిక ఆలస్యం కానుంది. ఈ అంశంపై విచారణను జాతీయ కంపెనీ చట్ట ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) తాజాగా సెప్టెంబర్ 17కు వాయిదా వేసింది. ఈ ప్రతిపాదనపై క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ-సెబీ పరిశోధన పూర్తికాకపోవడానికితోడు.. కేంద్ర ప్రభుత్వం కొన్ని అభ్యంతరాలను లేవనెత్తడంతో విచారణను ఎన్‌సీఎల్‌టీ వచ్చే నెలకు వాయిదా వేసింది. ఇప్పటికే బిజినెస్‌ల విడదీత అంశంపై కొంతవరకూ వాదనలు విన్న ఎన్‌సీఎల్‌టీ తదుపరి విచారణను గతంలో ఆగస్టు 20వ తేదీకి వాయిదా వేసింది.

20వ తేదీన వాదనల తీరిది...

- విడదీతకు వర్తించే నియంత్రణా నిబంధనలను వేదాంతా తగిన విధంగా అనుసరించిందా? లేదా అన్న అంశాలను పరిశీలిస్తున్నట్లు ట్రిబ్యునల్‌కు సెబీ తెలియజేసింది. దీంతో ప్రస్తుతానికి ఈ అంశంపై స్పందించలేమని పేర్కొంది.
- మరోపక్క వేదాంతా విడదీత ప్రతిపాదనకు ఎన్‌వోసీ జారీ చేసినట్లు నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ(ఎన్ఎస్ఈ) న్యాయవాది తెలిపారు.
- పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ తరఫు న్యాయవాది ట్రిబ్యునల్ ముందు తన వాదనలు వినిపిస్తూ, ఈ పథకంపై మంత్రిత్వ శాఖ అభిప్రాయాలను సమర్పించేందుకు అదనపు సమయం ఇవ్వాలని అభ్యర్థించారు. వేదాంతా విడదీత ప్రతిపాదనపై ఈ శాఖ జూలై 2న అభ్యంతరాలు వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే.
- తాజా పరిణామాలపై వేదాంత వ్యాఖ్యానిస్తూ, కంపెనీ న్యాయవాది తమ వాదనలను ఈ రోజు (ఆగస్ట్ 20) పూర్తిచేయలేకపోయారని పేర్కొంది. ఒకే విచారణలో ఈ వాదనలు ముగించడం సాధ్యం కాదని ట్రిబ్యునల్ కూడా వ్యాఖ్యానించిందని తెలిపింది. అన్ని పక్షాలతో చర్చించిన అనంతరం తదుపరి తేదీగా సెప్టెంబర్ 17ను నిర్ణయించిందని తెలిపింది.

ఈపీఎఫ్‌వో కొత్త సభ్యుల రికార్డ్

జూన్‌లో 21.89 లక్షలమంది జత

న్యూఢిల్లీ: ఉద్యోగుల భవిష్య నిధి.. ఈపీఎఫ్‌వోకు జూన్‌లో నికరంగా 21.89 లక్షలమంది సభ్యులు కొత్తగా జత కలిశారు. ఇది సరికొత్త రికార్డ్‌కాగా.. వార్షికంగా 13.5 శాతం వృద్ధి నమోదైంది. నెలవారీగా చూస్తే ఈ సంఖ్య 9.15 శాతం బలపడింది. కార్మిక శాఖ వెల్లడించిన ప్రొవిజనల్ గణాంకాలివి. వీటి ప్రకారం 2018 ఏప్రిల్‌లో ఈపీఎఫ్‌వో పేరోల్ గణాంకాల విడుదల ప్రారంభించాక గరిష్టస్థాయిలో సభ్యులు జత కలడం గమనార్హం! ఉద్యోగ అవకాశాలు పుంజుకోవడం, ఉద్యోగ లబ్ధిపై అవగాహన పెరగడానికితోడు ఈపీఎఫ్‌వో ప్రభావవంత కార్యక్రమాలు ఇందుకు దోహదపడినట్లు కార్మిక శాఖ పేర్కొంది. కాగా.. 2025 జూన్‌లో 10.62 లక్షలమంది కొత్త సబ్‌స్క్రయిబర్లు ఎన్‌రోల్ అయ్యారు. 2025 మేతో పోలిస్తే 12.7 శాతం అధికంకాగా.. వార్షికంగా 3.6 శాతం వృద్ధి ఇది. వీరిలో 18–25 మధ్య వయసు కలిగినవారి సంఖ్య 6.39 లక్షలమంది. అంటే 60 శాతానికిపైగా వాటా వీరిదే. ఈ గ్రూపులో నికర పేరోల్ జమలు 9.72 లక్షలుగా నమోదైంది. ఇంతక్రితం వైదొలగినవారు సుమారు 16.93 లక్షలమంది 2025 జూన్‌లో ఈపీఎఫ్‌వోకు జత కలిశారు. ఈ కాలంలో 3.02 లక్షలమంది మహిళలు ఈపీఎఫ్‌వో కొత్త సబ్‌స్కయిబర్లుగా చేరారు. 2025 మే నెలతో పోలిస్తే ఇది 15 శాతం అధికం. నికర పేరోల్ జమల్లో మహిళల సంఖ్య 4.72 లక్షలుగా నమోదైంది. రాష్ట్రాలవారీగా పేరోల్ గణాంకాలు చూస్తే 20 శాతంతో మహారాష్ట్ర అగ్రస్థానంలో నిలవగా.. తెలంగాణ, తమిళనాడు, గుజరాత్, ఉత్తరప్రదేశ్ తదితరాలు 5 శాతం చొప్పున వాటా ఆక్రమించాయి.



ఇక హోండా మోటార్ ఫైనాన్సింగ్

రిటైల్ విక్రయాలకు ఆర్థిక సేవలు



న్యూఢిల్లీ: జపనీస్ ఆటో రంగ దిగ్గజం హోండా మోటార్ కో తాజాగా ఫైనాన్సింగ్ సర్వీసుల యూనిట్‌కు తెరతీసింది. రిటైల్ అమ్మకాల ఫైనాన్సింగ్ సర్వీసులకు వీలుగా అనుబంధ సంస్థను ఏర్పాటు చేసింది. తద్వారా కస్టమర్లకు రుణాలు, లీజ్ సేల్స్ తదితర అవకాశాలను కల్పించనుంది. హోండా ఫైనాన్స్ ఇండియా ప్రయివేట్ లిమిటెడ్ పేరుతో ఏర్పాటైన సంస్థ దేశవ్యాప్తంగా కస్టమర్లకు కంపెనీ ప్రొడక్టులకు సంబంధించి ఆర్థిక సేవలు అందించనుంది. దేశీయంగా మోటార్‌సైకిళ్లు, ఆటోమొబైల్ మార్కెట్లు మరింత వృద్ధిని అందుకోనున్నట్లు అంచనా వేసింది. దీంతో రుణాల ద్వారా కార్లు, మోటార్‌సైకిళ్లు కొనుగోలు చేసే కస్టమర్ల సంఖ్య పెరగనున్నట్లు అభిప్రాయపడింది. దేశీయంగా వాహన రిటైల్ అమ్మకాలు సాధారణంగా స్థానిక ఫైనాన్షియల్ సంస్థల ద్వారా నమోదవుతుంటాయి. అయితే మార్కెట్ల ట్రెండ్‌కు అనుగుణంగా కంపెనీ దేశీ బిజినెస్‌ను మరింత పటిష్టపరచుకునే ప్రణాళికల్లో ఉంది. దీనిలో భాగంగా వాహన విక్రయాలకు సొంత ఫైనాన్సింగ్ సర్వీసులను అందించాలని అనుబంధ సంస్థ ఏర్పాటుకు ఉపక్రమించినట్లు హోండా మోటార్ పేర్కొంది. ఇందుకు అనుగుణంగా ఎన్‌బీఎఫ్‌సీ లైసెన్స్ కోసం హోండా ఫైనాన్స్ ఇండియా ప్రయివేట్ లిమిటెడ్ దరఖాస్తు చేయనున్నట్లు వెల్లడించింది.

వేరబుల్స్ మార్కెట్ డౌన్

ఏప్రిల్-జూన్‌లో 9.4 శాతం తగ్గుదల

- వరుసగా అయిదో క్వార్టర్‌లోనూ అమ్మకాల్లో క్షీణత
- తగ్గిన స్మార్ట్‌వాచీలు, వైర్‌లెస్ బడ్స్ విక్రయాలు
- ఐడీసీ నివేదిక

న్యూఢిల్లీ: దేశీయంగా వేరబుల్ మార్కెట్ వరుసగా అయిదో త్రైమాసికంలోనూ నెమ్మదించింది. స్మార్ట్ వాచీలు, ట్రూ వైర్‌లెస్ స్టీరియో ఇయర్‌బడ్స్ విక్రయాలు తగ్గడంతో ఏప్రిల్–జూన్ త్రైమాసికంలో అమ్మకాలు 9.4 శాతం క్షీణించి 2.67 కోట్లకు పరిమితమయ్యాయి. మార్కెట్ రీసెర్చ్ సంస్థ ఐడీసీ నివేదికలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. దీని ప్రకారం సరఫరా తగ్గినప్పటికీ వేరబుల్స్ సగటు విక్రయ ధర (ఏఎస్‌పీ) ఒక మోస్తరుగా 2.2 శాతం మేర పెరిగి 19.2 డాలర్లకు (సుమారు రూ. 1,700)కు చేరింది. 2025 ప్రథమార్ధంలో వేరబుల్ డివైజ్ మార్కెట్ వార్షికంగా 6.3 శాతం తగ్గి 5.16 కోట్ల యూనిట్లకు పరిమితమైంది. ఏఎస్‌పీ పెద్దగా మార్పులు లేకుండా 18.7 డాలర్ల (సుమారు రూ. 1,630) స్థాయిలో కొనసాగింది. స్మార్ట్ రింగ్స్, స్మార్ట్ గ్లాసెస్, స్మార్ట్ రిస్ట్‌బ్యాండ్స్‌లాంటి కొత్త రకం వేరబుల్స్‌కి డిమాండ్ పెరిగింది.



మరిన్ని ముఖ్యాంశాలు..

- అమ్మకాలు 4.8 శాతం తగ్గినప్పటికీ వేరబుల్స్ మార్కెట్లో 28 శాతం వాటాతో ఇమేజిన్ మార్కెటింగ్ (బోట్ బ్రాండ్) అగ్రస్థానంలో ఉంది.
- 13.1 శాతం వాటాతో నాయిస్ రెండో స్థానంలో నిల్చింది. విక్రయాలు 8.6 శాతం తగ్గాయి.
- గోబోల్ట్ (గతంలో బోల్ట్) అమ్మకాలు 21.8 శాతం పెరిగాయి. 10.9 శాతం మార్కెట్ వాటా ఉంది. ఒప్పో, వన్‌ప్లస్ వాటా చెరి 8 శాతంగా, రియల్‌మి వాటా 6.5 శాతంగా ఉంది.
- ఇక స్మార్ట్‌వాచీల అమ్మకాలు వరుసగా ఆరో త్రైమాసికంలోనూ క్షీణించాయి. జూన్ క్వార్టర్‌లో 28.4 శాతం తగ్గి 66 లక్షల యూనిట్లకు పరిమితమయ్యాయి. మొత్తం వేరబుల్స్ మార్కెట్లో వీటి వాటా 31.5 శాతం నుంచి 24.9 శాతానికి తగ్గింది. బౌల్ట్ మినహా మిగతా అన్ని బ్రాండ్ల (నాయిస్, బోట్, టైటాన్, ఫైర్ బోల్ట్) స్మార్ట్ వాచీల అమ్మకాలు తగ్గాయి.
- 2022, 2023లో భారీగా వృద్ధి చెందిన స్మార్ట్‌వాచీల మార్కెట్ ప్రస్తుతం కన్సాలిడేట్ అవుతోంది.
- ఇయర్‌వేర్ కేటగిరీ స్వల్పంగ్ 1.2 శాతం తగ్గి 1.99 కోట్ల యూనిట్లకు పరిమితం అయింది. ట్రూలీ వైర్‌లెస్ స్టీరియో (టీడబ్ల్యూఎస్) సెగ్మెంట్ అమ్మకాలు 1.2 శాతం తగ్గినా, 71.2 శాతం వాటాతో అగ్రస్థానంలో కొనసాగింది. నెక్‌బ్యాండ్ స్టయిల్ ఇయర్‌వేర్ మరింతగా 16.1 శాతం మేర పడిపోయింది. ఓవర్–ది–ఇయర్ సెగ్మెంట్ అమ్మకాలు 97.4 శాతం ఎగిసి 15 లక్షల యూనిట్లకు పెరిగాయి.
- టీడబ్ల్యూఎస్ విభాగంలో 31.9 శాతం వాటాతో బోట్ అగ్రస్థానంలో, 14.9 శాతం వాటాతో బోల్ట్ రెండో స్థానంలో ఉన్నాయి. బోట్ అమ్మకాలు 6.9 శాతం తగ్గాయి.
- స్మార్ట్ రింగ్స్ విక్రయాలు 2.8 శాతం పెరిగి 75,000కు చేరాయి. అల్ట్రాహ్యూమన్, గేబిట్, ఆబో సంస్థలు సంయుక్తంగా 65 శాతం మార్కెట్ వాటాతో అగ్రస్థానంలో కొనసాగాయి.
- మెటా, లెన్స్‌కార్ట్ కొత్తగా ప్రవేశపెట్టిన మోడల్స్ దన్నుతో స్మార్ట్ గ్లాసెస్ అమ్మకాలు 4,000 నుంచి ఏకంగా 50,000 యూనిట్లకు పెరిగాయి.
- స్మార్ట్ రిస్ట్‌బ్యాండ్స్ విక్రయాలు 118.5 శాతం పెరిగి 83,000 యూనిట్లకు చేరాయి. ప్రధానంగా శాంసంగ్‌కి చెందిన ఫిట్3కి గణనీయంగా డిమాండ్ నెలకొంది. క్యూ2లో రిస్ట్‌బ్యాండ్స్ కేటగిరీలో శాంసంగ్ 80.6 శాతం మార్కెట్ వాటా దక్కించుకుంది.

ఐదేళ్లలో ఆటోమొబైల్ దిగ్గజంగా భారత్

నంబర్ 1 స్థానానికి చేరుస్తాం: గడ్కరీ



న్యూఢిల్లీ: భారత ఆటోమొబైల్ పరిశ్రమను వచ్చే ఐదేళ్లలో ప్రపంచంలో నంబర్ 1గా మారుస్తామని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ప్రకటించారు. ఈఐసీఐ, కేపీఎంజీ నివేదికను ఆవిష్కరించిన సందర్భంగా గడ్కరీ మాట్లాడారు. భారత ఆటో పరిశ్రమ విలువ ప్రస్తుతం రూ.22 లక్షల కోట్లుగా ఉందన్నారు. 2014లో తాను రవాణా శాఖ బాధ్యతలు చేపట్టే నాటికి పరిశ్రమ పరిమాణం రూ.7.5 లక్షల కోట్లుగానే ఉన్నట్టు గుర్తు చేశారు. అమెరికా ఆటో రంగం విలువ రూ.78 లక్షల కోట్లుగా ఉంటే, చైనా ఆటోరంగం విలువ రూ.47 లక్షల కోట్లుగా ఉన్నట్టు తెలిపారు. ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్‌ను మార్చాలన్నది ప్రధాని మోదీ లక్ష్యమంటూ.. ఈ లక్ష్య సాధనాల్లో లాజిస్టిక్స్ రంగం కీలక పాత్ర పోషిస్తుందన్నారు. జీడీపీలో లాజిస్టిక్స్ వ్యయాలు 16 శాతంగా ఉంటే 10 శాతానికి తగ్గించగలిగినట్టు చెప్పారు. త్వరలో సింగిల్ డిజిట్‌కు తీసుకొస్తామని ప్రకటించారు.



మరింత ప్రాక్టీస్ కోసం...

- బ్రస్సెల్స్ డైమండ్ లీగ్ మీట్ నుంచి వైదొలిగిన నీరజ్ చోప్రా
- డైమండ్ లీగ్ ఫైనల్, ప్రపంచ చాంపియన్‌షిప్‌పై దృష్టి

న్యూఢిల్లీ: భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా డైమండ్ లీగ్ (డీఎల్) చివరి అంచె పోటీల నుంచి తప్పుకున్నాడు. ఇప్పటికే డైమండ్ లీగ్ ఫైనల్‌కు అర్హత సాధించిన నీరజ్... ప్రధాన టోర్నీకి ముందు పూర్తి స్థాయిలో ప్రాక్టీస్‌పై దృష్టి పెట్టాలనే ఉద్దేశంతో బెల్జియంలోని బ్రస్సెల్స్‌లో జరుగనున్న మీట్ నుంచి తప్పుకున్నాడు. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో పసిడి పతకం, 2024 పారిస్ ఒలింపిక్స్‌లో రజత పతకం సాధించిన నీరజ్ చోప్రా... ఈ నెల 28న స్విట్జర్లాండ్‌లోని జ్యూరిక్ వేదికగా జరగనున్న డైమండ్ లీగ్ ఫైనల్లో బరిలోకి దిగనున్నాడు. ఒక సీజన్‌లో జావెలిన్ త్రో ఈవెంట్‌లో నాలుగు డైమండ్ లీగ్ అంచె పోటీలు జరగడం పరిపాటి కాగా... ఇందులో ప్రదర్శన ఆధారంగా అథ్లెట్లు ఫైనల్‌కు అర్హత సాధిస్తారు. ఈ సీజన్‌లో నీరజ్ చోప్రా రెండు పోటీల్లోనే పాల్గొన్నా... మెరుగైన ప్రదర్శనతో ఫైనల్‌కు చేరాడు. ఇటీవల సిలెసియా టోర్నీ నుంచి సైతం నీరజ్ తప్పుకున్నాడు. 27 ఏళ్ల నీరజ్ చోప్రా ఈ సీజన్‌లో తొలిసారి 90 మీటర్ల మార్క్ అందుకున్నాడు. మే నెలలో జరిగిన దోహా డైమండ్ లీగ్ అంచె పోటీల్లో నీరజ్ జావెలిన్‌ను 90.23 మీటర్ల దూరం విసిరాడు. అనంతరం జూన్‌లో పారిస్ డైమండ్ లీగ్‌లో నీరజ్ జావెలిన్‌ను 88.16 మీటర్ల దూరం విసిరి విజేతగా నిలిచాడు. శుక్రవారం జరగనున్న బ్రస్సెల్స్ అంచె పోటీల అనంతరం టాప్-6లో నిలిచిన త్రోయర్లు డైమండ్ లీగ్ ఫైనల్‌కు అర్హత సాధించనున్నారు. జూలై 5న భారత్‌లో నిర్వహించిన తొలి అంతర్జాతీయ జావెలిన్ త్రో ఈవెంట్ 'నీరజ్ చోప్రా క్లాసిక్' తర్వాత భారత స్టార్ తిరిగి బరిలోకి దిగలేదు. బెంగళూరు వేదికగా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన ఆ టోర్నీలో నీరజ్ జావెలిన్‌ను 86.18 మీటర్ల దూరం విసిరి టైటిల్ గెలుచుకున్నాడు. ఓవరాల్‌గా ఈ సీజన్‌లో ఆరు పోటీల్లో పాల్గొన్న నీరజ్ అందులో నాలుగింట టైటిల్ సాధించడంతో పాటు మరో రెండు టోర్నీల్లో రెండో స్థానంలో నిలిచాడు. డైమండ్ లీగ్ ఫైనల్ అనంతరం వచ్చే నెల 13 నుంచి 21 వరకు టోక్యో వేదికగా ప్రపంచ చాంపియన్‌షిప్ జరగనుండగా... అందులో నీరజ్ డిఫెండింగ్ చాంపియన్‌గా టైటిల్ నిలబెట్టుకునేందుకు బరిలోకి దిగనున్నాడు.

పెరిగిన ప్రైజ్‌మనీ...

అథ్లెటిక్స్‌లో డైమండ్ లీగ్‌కు ప్రత్యేక స్థానం ఉంది. ప్రతి ఏటా 14 అంచెల పోటీలు నిర్వహించిన అనంతరం అత్యుత్తమ ప్రదర్శన చేసిన అథ్లెట్లను ఫైనల్‌కు ఎంపిక చేస్తారు. ఇందులో మొత్తం 32 ఈవెంట్స్ జరుగుతాయి... వాటి విజేతలకు డైమండ్ ట్రోఫీతో పాటు... వరల్డ్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో నేరుగా పాల్గొనేందుకు 'వైల్డ్ కార్డు' లభిస్తుంది. ఈ నెల 28న జరగనున్న డైమండ్ లీగ్ ఫైనల్ జావెలిన్ త్రో పోటీల్లో విజేతగా నిలిచిన అథ్లెట్‌కు రూ. 26.11 లక్షల ప్రైజ్‌మనీ సైతం లభించనుంది. ఈ ఏడాది పురుషుల 100 మీటర్ల పరుగు, 1500 మీటర్ల పరుగు, 400 మీటర్ల పరుగు, పోల్‌వాల్ట్... మహిళల 100 మీటర్ల పరుగు, 100 మీటర్ల హర్డిల్స్, 3000 మీటర్ల పరుగు, లాంగ్ జంప్ ఈవెంట్ల విజేతలకు మెరుగైన ప్రైజ్‌మనీ లభించనుంది. ఈ విభాగాల్లో విజేతగా నిలిచిన వారికి రూ. 43.52 లక్షలు, రెండో స్థానంలో నిలిచిన వారికి రూ. 17.40 లక్షలు, మూడో స్థానంలో నిలిచిన వారికి రూ. 8.70 లక్షలు దక్కనున్నాయి.

కేశవ్ ఖాతాలో 'టాప్' ర్యాంక్

ఐసీసీ వన్డే బౌలింగ్ ర్యాంకింగ్స్ ● వన్డే, టి20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో కొనసాగుతున్న గిల్, అభిషేక్ శర్మ

దుబాయ్: దక్షిణాఫ్రికా ఎడంచేతి వాటం స్పిన్నర్ కేశవ్ మహరాజ్... అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) వన్డే బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో తిరిగి అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. ఆస్ట్రేలియాతో తొలి వన్డేలో చక్కటి ప్రదర్శనతో చెలరేగిన కేశవ్... రెండు స్థానాలు ఎగబాకి 687 పాయింట్లతో 'టాప్' ర్యాంక్‌కు చేరాడు. ఆసీస్‌తో మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా తొలి వన్డేలో మహరాజ్... కంగారూలను తన స్పిన్‌తో కట్టిపడేశాడు. 33 పరుగులకే ఐదు ప్రధాన వికెట్లు పడగొట్టి జట్టును గెలిపించాడు. ఈ ఫార్మాట్‌లో అతడికిదే తొలి ఐదు వికెట్ల ప్రదర్శన కావడం విశేషం. 2023 డిసెంబర్ తర్వాత కేశవ్ మహరాజ్ తిరిగి 'టాప్' ర్యాంక్ దక్కించుకోగా... శ్రీలంక బౌలర్ మహీశ్ తీక్షణ (671 పాయింట్లు) రెండో స్థానానికి పడిపోయాడు. ఇక భారత మణికట్టు స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ 650 పాయింట్లతో మూడో స్థానానికి పరిమితమయ్యాడు. టాప్-10 వన్డే బౌలర్ల జాబితాలో భారత్ నుంచి కుల్దీప్‌తో పాటు రవీంద్ర జడేజా ఉన్నారు. 'జడ్డూ' 616 పాయింట్లతో తొమ్మిదో స్థానంలో కొనసాగుతున్నాడు. చాంపియన్స్ ట్రోఫీ చేజిక్కించుకున్న అనంతరం టీమిండియా ఒక్క వన్డే మ్యాచ్ కూడా ఆడకపోవడంతో ప్లేయర్ల ర్యాంకింగ్స్‌లో పెద్దగా మార్పులు సంభవించలేదు. పాకిస్తాన్‌తో సిరీస్‌లో చక్కటి ప్రదర్శన కనబర్చిన వెస్టిండీస్ పేసర్ జేడెన్ సీల్స్ 15 స్థానాలు మెరుగు పరుచుకొని 18వ ర్యాంక్‌కు చేరాడు. వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో భారత ఆటగాడు శుబ్‌మన్ గిల్ (784 పాయింట్లు) అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు.



రోహిత్, కోహ్లి పేర్లు గల్లంతు!

ఐసీసీ బుధవారం విడుదల చేసిన వన్డే ర్యాంకింగ్స్ జాబితాలో భారత స్టార్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి పేర్లు కనిపించలేదు. దీంతో ఒక్కసారిగా విమర్శలు వెల్లువెత్తాయి. వెంటనే తేరుకున్న ఐసీసీ సాంకేతిక లోపం కారణంగా ఈ పొరబాటు జరిగినట్లు వెల్లడించింది. తిరిగి సవరించిన జాబితాను విడుదల చేసింది. అందులో టీమిండియా వన్డే కెప్టెన్ రోహిత్ శర్మ 756 పాయింట్లతో రెండో స్థానానికి చేరగా... మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లి 736 పాయింట్లతో నాలుగో ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు. శ్రేయస్ అయ్యర్ 704 పాయింట్లతో ఎనిమిదో ప్లేస్‌లో ఉన్నాడు. పాకిస్తాన్‌తో సిరీస్‌లో రాణించిన వెస్టిండీస్ కెప్టెన్ షై హోప్ (21వ ర్యాంక్), ఆస్ట్రేలియాతో తొలి వన్డేలో ఆకట్టుకున్న దక్షిణాఫ్రికా సారథి తెంబా బవుమా (23వ ర్యాంక్) కూడా తమ స్థానాలను మెరుగు పరుచుకున్నారు. టి20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో భారత ఓపెనర్ అభిషేక్ శర్మ (829 పాయింట్లు) 'టాప్'లో కొనసాగుతుండగా... హైదరాబాదీ బ్యాటర్ తిలక్ వర్మ (804 పాయింట్లు) రెండో స్థానంలో ఉన్నాడు. భారత టి20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (739 పాయింట్లు) ఆరో ర్యాంక్‌లో... యశస్వి జైస్వాల్ (673 పాయింట్లు) పదో స్థానంలో ఉన్నారు.

క్వార్టర్ ఫైనల్లో మనుశ్‌-దియా జోడీ



మాల్మో (స్వీడన్): యూరోప్ స్మాష్ వరల్డ్ టేబుల్ టెన్నిస్ (టీటీ) టోర్నీ మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో మనుశ్ షా-దియా చిటాలె (భారత్) జోడీ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. బుధవారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో మనుశ్-దియా ద్వయం 11-8, 11-7, 8-11, 12-10తో పాంగ్ కొయెన్-జెంగ్ జియాన్ (సింగపూర్) జంటపై విజయం సాధించింది. 29 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో భారత జోడీ మొత్తం 42 పాయింట్లు గెలిచింది. ఇందులో తమ సర్వీస్‌లో 22 పాయింట్లు, ప్రత్యర్థుల సర్వీస్‌లో 20 పాయింట్లు సంపాదించింది. మహిళల డబుల్స్‌లో దియా చిటాలె-యశస్విని ఘోర్పడే (భారత్) ద్వయం పోరాటం ముగిసింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో దియా-యశస్విని 5-11, 10-12, 12-10, 9-11తో యువాన్ వాన్-సబీనా వింటర్ (జర్మనీ) చేతిలో ఓడిపోయారు. తొలి రౌండ్‌లో దియా-యశస్విని 11-6, 11-7, 11-5తో హానా గోడా-దినా మెశ్రీఫ్ (ఈజిప్ట్)లపై గెలుపొందారు. పురుషుల సింగిల్స్‌లో భారత కథ ముగిసింది. రెండో రౌండ్‌లో భారత నంబర్‌వన్ మానవ్ ఠక్కర్ 10-12, 7-11, 11-4, 12-14తో అన్ జేహైన్ (దక్షిణ కొరియా) చేతిలో పరాజయం పాలయ్యాడు. పురుషుల డబుల్స్‌లో మానవ్ ఠక్కర్-మనుశ్ షా (భారత్) జోడీ క్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో మానవ్-మనుశ్ 9-11, 11-4, 11-5, 11-6తో మిలోస్-కుబిక్ (పోలాండ్)లపై గెలిచారు.

గుకేశ్‌కు తొలి విజయం



సెయింట్ లూయిస్ (అమెరికా): సింక్‌ఫీల్డ్ కప్ గ్రాండ్ చెస్ టూర్ టోర్నమెంట్‌లో భారత గ్రాండ్‌మాస్టర్, ప్రపంచ చాంపియన్ దొమ్మరాజు గుకేశ్ తొలి విజయం అందుకున్నాడు. తొలి రౌండ్‌లో భారత్‌కే చెందిన ప్రజ్ఞానంద చేతిలో ఓడిపోయిన గుకేశ్... బుధవారం జరిగిన రెండో రౌండ్‌లో 50 ఎత్తుల్లో నొదిర్బెక్ అబ్దుసత్తొరోవ్ (ఉజ్బెకిస్తాన్)పై గెలుపొందాడు. మరోవైపు ప్రజ్ఞానంద ఖాతాలో తొలి 'డ్రా' చేరింది. ఫాబియానో కరువానా (అమెరికా)తో జరిగిన రెండో గేమ్‌ను ప్రజ్ఞానంద 37 ఎత్తుల్లో 'డ్రా' చేసుకున్నాడు. ఇతర గేముల్లో ఆలీరెజా ఫిరూజా (ఫ్రాన్స్) 100 ఎత్తుల్లో జాన్ క్రిస్టాఫ్ డూడా (పోలాండ్)పై నెగ్గాడు. లెవోన్ అరోనియన్ (అమెరికా)-సామ్ సెవియాన్ (అమెరికా) మధ్య గేమ్ 53 ఎత్తుల్లో... సో వెస్లీ (అమెరికా)-మాక్సిమ్ లాగ్రెవ్ (ఫ్రాన్స్) గేమ్ 45 ఎత్తుల్లో 'డ్రా'గా ముగిశాయి. 10 మంది మేటి గ్రాండ్‌మాస్టర్ల మధ్య 9 రౌండ్లపాటు ఈ టోర్నీ జరుగుతోంది.

ఆనంద్ X కాస్పరోవ్ గుకేశ్ X కార్ల్‌సన్

అక్టోబర్‌లో దిగ్గజాల మధ్య చెస్ పోరు





న్యూఢిల్లీ: ఇద్దరు చదరంగ దిగ్గజాలు విశ్వనాథన్ ఆనంద్, గ్యారీ కాస్పరోవ్ మరోసారి ముఖాముఖిగా తలపడేందుకు సిద్ధమవుతున్నారు. అక్టోబర్‌లో అమెరికాలోని సెయింట్ లూయిస్ వేదికగా జరగనున్న క్లచ్ చెస్ ఎగ్జిబిషన్ మ్యాచ్‌ల్లో ఈ దిగ్గజాలు ఎత్తులు పైఎత్తులు వేయనున్నారు. క్లాసికల్ ఫార్మాట్‌లో ప్రస్తుత ప్రపంచ చాంపియన్ దొమ్మరాజు గుకేశ్, ప్రపంచ నంబర్‌వన్ మాగ్నస్ కార్ల్‌సన్ (నార్వే) మధ్య కూడా గేమ్‌లు జరగనున్నాయి. ప్రపంచ చదరంగంలో అత్యుత్తమ ఆటగాళ్లుగా గుర్తింపు సాధించిన ఆనంద్, కాస్పరోవ్ మధ్య ఇప్పటి వరకు 82 గేమ్‌లు జరిగాయి. చివరిసారిగా 2021లో క్రొయేషియా ర్యాపిడ్, బ్లిట్జ్ టోర్నమెంట్‌లో ఈ ఇద్దరు తలపడగా... భారత గ్రాండ్‌మాస్టర్ విజయం సాధించాడు. 'ఇద్దరు ప్రపంచ మాజీ చాంపియన్‌లు గ్యారీ కాస్పరోవ్, విశ్వనాథన్ ఆనంద్.. క్లచ్ చెస్ (లెజెండ్స్) ఎగ్జిబిషన్ మ్యాచ్‌లో తలపడనున్నారు. అక్టోబర్ 7 నుంచి 11 మధ్య ఈ టోర్నీ జరగనుంది. తరానికి ఒక్కసారి జరిగే మ్యాచ్ ఇది' అని సెయింట్ లూయిస్ క్లబ్ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ టోర్నీ ప్రైజ్‌మనీ రూ. 1 కోటి 25 లక్షలు కాగా... ఇద్దరు దిగ్గజాల మధ్య 12 గేమ్‌లు నిర్వహించనున్నారు. ర్యాపిడ్, బ్లిట్జ్ విభాగాల్లో పోటీలు జరగనున్నాయి. ఇక ఇదే వేదికపై అక్టోబర్ 27 నుంచి 29 వరకు ప్రస్తుత అగ్రశ్రేణి ఆటగాళ్ల మధ్య మ్యాచ్‌లు జరగనున్నాయి. ఇందులో ప్రపంచ నంబర్‌వన్ కార్ల్‌సన్, రెండో ర్యాంకర్ నకమురా, మూడో ర్యాంకర్ ఫాబియానో కరువానా, ప్రపంచ స్టార్ గుకేశ్ తదితరులు పాల్గొననున్నారు. ఈ టోర్నీలో విజేతగా నిలిచిన వారికి భారీ ప్రైజ్‌మనీ దక్కనుంది. 'ఈ టోర్నీ ప్రైజ్‌మనీ రూ. 3 కోట్ల 58 లక్షలు. దీంతో పాటు ప్లేయర్లకు ప్రతిరోజు బోనస్, విజేతకు జాక్‌పాట్ వంటి ఎన్నో ఇతర ప్రయోజనాలు ఉంటాయి' అని నిర్వాహకులు తెలిపారు. డబుల్ రౌండ్ రాబిన్ పద్ధతిలో నిర్వహించనున్న ఈ పోటీల్లో 18 గేమ్‌లు జరుగుతాయి.

ఫైనల్లో డైమండ్ హార్బర్ ఫుట్‌బాల్ క్లబ్

కోల్‌కతా: డ్యూరాండ్ కప్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో డైమండ్ హార్బర్ ఫుట్‌బాల్ క్లబ్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. సుదీర్ఘ చరిత్ర ఉన్న డ్యూరాండ్ కప్‌లో ఈ సీజన్ ద్వారానే అరంగేట్రం చేసిన డైమండ్ హార్బర్ జట్టు తుదిపోరుకు అర్హత సాధించడం విశేషం. బుధవారం జరిగిన సెమీఫైనల్లో డైమండ్ హార్బర్ ఎఫ్‌సీ 2-1 గోల్స్ తేడాతో ఈస్ట్ బెంగాల్ ఫుట్‌బాల్ క్లబ్‌పై విజయం సాధించింది. డైమండ్ హార్బర్ జట్టు తరఫున మైకెల్ కోర్టజర్ ఇడియకెజ్ (66వ నిమిషంలో), జాబీ జస్టిన్ (83వ నిమిషంలో) చెరో గోల్ సాధించారు. ఈస్ట్ బెంగాల్ తరఫున అన్వర్ అలీ (67వ నిమిషంలో) ఏకైక గోల్ చేశాడు. తొలి అర్ధభాగంలో ఇరు జట్లు ఎంత ప్రయత్నించినా... ఒక్క గోల్ కూడా సాధించలేకపోయాయి. ద్వితీయార్ధంలో కోర్టజర్ ప్రత్యర్థి రక్షణ శ్రేణిని ఛేదిస్తూ... బైసైకిల్ కిక్‌తో చక్కటి గోల్ సాధించి జట్టు ఖాతా తెరిచాడు. అయితే డైమండ్ హార్బర్ జట్టుకు ఆ ఆనందం ఎక్కువసేపు నిలవలేదు. తదుపరి నిమిషంలోనే ఈస్ట్ బెంగాల్ స్టార్ స్ట్రయికర్ అన్వర్ అలీ 40 గజాల దూరం నుంచి గురి చూసి కొట్టిన బుల్లెట్ లాంటి బంతి గోల్‌పోస్ట్‌లో పడింది. దీంతో స్కోర్లు సమం కావడంతో మ్యాచ్ 'డ్రా'గా ముగియడం ఖాయమనిపించింది. కాసేపట్లో మ్యాచ్ ముగుస్తుందనగా జస్టిన్ గోల్ కొట్టడంతో డైమండ్ హార్బర్ జట్టు ఫైనల్‌కు అర్హత సాధించింది. తొలి సెమీఫైనల్లో షిల్లాంగ్ లాజాంగ్ జట్టుపై నెగ్గిన నార్త్‌ఈస్ట్ యునైటెడ్ క్లబ్‌తో డైమండ్ హార్బర్ క్లబ్ శనివారం ఫైనల్ ఆడనుంది.



భారత ఆటగాళ్ల ముందంజ

జూనియర్ ఇంటర్నేషనల్ సిరీస్ బ్యాడ్మింటన్ టోర్నీ

సాక్షి, హైదరాబాద్: కొటక్ ఇండియా జూనియర్ ఇంటర్నేషనల్ సిరీస్ బ్యాడ్మింటన్ టోర్నీ గచ్చిబౌలిలోని పుల్లెల గోపీచంద్ అకాడమీలో మొదలైంది. తెలంగాణ రాష్ట్ర క్రీడా మంత్రి వాకిటి శ్రీహరి ఈ పోటీలను బుధవారం ప్రారంభించారు. ఈ నెల 24 వరకు టోర్నీని నిర్వహిస్తారు. అండర్-19 విభాగంలో పురుషుల, మహిళల సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ ఈవెంట్లలో మ్యాచ్‌లు జరుగుతాయి. తొలి రోజు పోటీల్లో భారత వర్ధమాన ఆటగాళ్లంతా విజయాలు సాధించి రెండో రౌండ్‌లోకి అడుగుపెట్టారు. పురుషుల సింగిల్స్‌లో టాప్ సీడ్ రౌనక్ చౌహాన్ (భారత్) 21-12, 21-11తో ఆదిత్య కిరణ్ (యూఏఈ)పై విజయం సాధించాడు. మహిళల సింగిల్స్‌లో టాప్ సీడ్ ఇషిత నేగి (భారత్) 21-4, 21-16తో భారత్‌కే చెందిన మంచాల కీర్తిని ఓడించి ముందంజ వేసింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో కరామత్ ఉల్ హఖ్-దేవరబోయిన దీపిక జంట తొలి రౌండ్‌లో 12-21, 22-20, 25-23తో అర్నవ్ శర్మ-శాంతిప్రియ హజారికాపై గెలుపొందింది. ఇతర పురుషుల సింగిల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌లలో నెగ్గి ప్రణవ్, శ్రీకర్, భత్రాజు సాయి నచికేత్, బొబ్బా అఖిల్ రెడ్డి, జ్ఞాన దత్తు... మహిళల సింగిల్స్‌లో వలిశెట్టి శ్రేయాంశి, బోనం ప్రశంస, అంద్లూరి తన్వీరెడ్డి, భూపతి ఆదర్శిని, హితైశ్రీ గెలిచి ముందంజ వేశారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర క్రీడా సలహాదారు జితేందర్ రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఫాబియో ప్రపంచ రికార్డు

- అత్యధిక మ్యాచ్‌లు ఆడిన ఫుట్‌బాల్ ప్లేయర్‌గా ఘనత
- ఇంగ్లండ్ మాజీ గోల్‌కీపర్ పీటర్ షెల్టన్ రికార్డు బద్దలు
- 1391 మ్యాచ్‌లతో సరికొత్త చరిత్ర

రియో డి జెనీరో: బ్రెజిల్ ఫుట్‌బాల్ క్లబ్ ఫ్లూమినెన్స్ గోల్‌కీపర్ ఫాబియో అరుదైన రికార్డు సొంతం చేసుకున్నాడు. అత్యధిక మ్యాచ్‌లు ఆడిన ఫుట్‌బాల్ ప్లేయర్‌గా ఫాబియో ఘనత సాధించాడు. ఇంగ్లండ్ మాజీ గోల్‌కీపర్ పీటర్ షెల్టన్ పేరిట ఉన్న రికార్డును ఫాబియో బద్దలు కొట్టాడు. 44 ఏళ్ల ఫాబియో తాజాగా ఫ్లూమినెన్స్ క్లబ్ తరఫున బరిలోకి దిగడం ద్వారా కెరీర్‌లో 1391 మ్యాచ్‌లు పూర్తి చేసుకున్నాడు. ఇంగ్లండ్ మాజీ గోల్‌కీపర్ షిల్టన్ 1390 మ్యాచ్‌లు ఆడి 'గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు'లో చోటు సంపాదించగా... ఆ రికార్డును ఫాబియో తిరగరాశాడు. ఫాబియో వరల్డ్ రికార్డు సాధించిన సందర్భంగా ఈ మ్యాచ్ అనంతరం క్లబ్ యాజమాన్యం అతడిని ప్రత్యేకంగా సత్కరించింది. 'ఇదో అరుదైన అద్భుత ఘటన. ఫ్లూమినెన్స్ జెర్సీలో ఈ రికార్డు సాధించడం చాలా సంతృప్తినిచ్చింది. భవిష్యత్తులోనూ క్లబ్ తరఫున మరిన్ని మ్యాచ్‌లు ఆడి... జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించాలని అనుకుంటున్నా' అని ఫాబియో వెల్లడించాడు. అయితే దేశీయ, అంతర్జాతీయ పోటీలలో ఆటగాళ్ల మ్యాచ్‌ల సంఖ్యను లెక్కించే నిర్దిష్టమైన వ్యవస్థ లేకపోవడంతో... ఇలాంటి రికార్డుల విషయంలో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. 90ల్లో కెరీర్ ప్రారంభించిన ఫాబియో బ్రెజిల్ క్లబ్ క్రుజైరో తరఫున అధిక శాతం మ్యాచ్‌లు ఆడాడు.



బుధవారం మహారాష్ట్రలోని నాసిక్ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి నది



ఉత్తరాఖండ్‌లోని గంగోత్రి జాతీయరహదారిపై పడిన కొండచరియలను తొలగిస్తున్న దృశ్యం



పంజాబ్‌లోని జలంధర్‌లో జలమయమైన రహదారి జాగ్రత్తగా వెళ్తున్న పాఠశాల విద్యార్థులు

భారత్‌లో లైంగిక హింసపై
పాక్ మాట్లాడటం సిగ్గు చేటు

పాక్ ఆరోపణలను తిప్పికొట్టిన భారత్

న్యూయార్క్: జమ్మూకశ్మీర్‌లో లైంగిక హింస జరిగిందంటూ ఐక్యరాజ్యసమితిలో పాకిస్తాన్ చేసిన ఆరోపణలను భారత్ తిప్పి కొట్టింది. తమ దేశంలో మైనారిటీ మహిళలపై జరుగుతున్న నేరాలపై స్పందించని పాక్‌. భారత్‌పై మాట్లాడటం సిగ్గుచేటని ఐక్యరాజ్యసమితిలో భారత దౌత్యవేత్త ఎల్డోస్ మాథ్యూ పున్నూస్ వ్యాఖ్యానించారు. మహిళలపై నేరాలకు సంబంధించి ఆ దేశానికే దారుణమైన రికార్డు ఉందని గుర్తు చేశారు. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి (యూఎన్ఎస్‌సీ)లో సంఘర్షణ సంబంధిత లైంగిక హింసపై మంగళవారం జరిగిన బహిరంగ చర్చలో పున్నూస్ మాట్లాడారు. ఇతరులకు ఉపన్యాసాలు ఇచ్చే నైతికత పాకిస్తాన్‌కు లేదని స్పష్టం చేశారు. '1971లో పూర్వపు తూర్పు పాకిస్తాన్‌లో లక్షలాది మంది మహిళలపై పాకిస్తాన్ సైన్యం పాల్పడిన లైంగిక హింస నేరాలకు ఎలాంటి శిక్ష వేయకపోవడం సిగ్గు చేటు. ఆ దేశంలో మైనారిటీ వర్గాల్లో మహిళలు, బాలికలు నేటికీ అపహరణకు గురవుతున్నారు. అక్రమ రవాణా జరుగుతోంది. బలవంతపు వివాహాలు, మత మార్పిడులను ఎదుర్కొంటున్నారు. ఈ నేరాలకు పాల్పడేవారు ఇప్పుడు న్యాయం కోసం పోరాడుతున్నట్లు నటించడం విడ్డూరంగా ఉంది. పాక్ ద్వంద్వ వైఖరి, కపటత్వం స్పష్టమవుతున్నాయి' అని ఆయన వ్యాఖ్యానించారు. ఘర్షణ సంబంధిత లైంగిక హింస, దారుణమైన చర్యలకు పాల్పడేవారిని న్యాయం ముందు నిలబెట్టాలని పున్నూస్ డిమాండ్ చేశారు.

మహిళల రక్షణకు భారత్‌లో ప్రత్యేక వ్యవస్థలు

అంతేకాదు.. మన దేశంలో, ప్రపంచ శాంతి పరిరక్షక కార్యకలాపాల్లో లింగ ఆధారిత హింసను ఎదుర్కోవడానికి భారత్ చేస్తున్న ప్రయత్నాలను ఆయన వెల్లడించారు. లైంగిక దోపిడీ, దుర్వినియోగ బాధితుల కోసం యూఎన్ సెక్రటరీ జనరల్ ట్రస్ట్ ఫండ్‌కు విరాళాలు అందించిన మొదటి దేశాల్లో భారతదేశం ఒకటని గుర్తు చేశారు. ఇటువంటి నేరాలను నివారించడానికి యూఎన్‌తో స్వచ్ఛంద ఒప్పందంపై 2017లోనే భారత్ సంతకం చేసిందన్నారు. 2007లో లైబీరియాకు మొదటి పూర్తి మహిళా పోలీసు యూనిట్‌ను మోహరించిందని, ఐక్యరాజ్యసమితి కార్యకలాపాలకు మహిళా బృందాలను పంపుతూనే ఉందని పున్నూస్ ఎత్తి చూపారు. దేశీయంగా మహిళలను రక్షించడానికి భారత్ ప్రత్యేక వ్యవస్థలను సృష్టించిందని పున్నూస్ చెప్పారు. వీటిలో మహిళల భద్రత కోసం 1.2 బిలియన్ డాలర్లను నిర్భయ నిధికి కేటాయించిదని చెప్పారు.

పాక్‌లో 24 వేల మంది కిడ్నాప్..

పాకిస్తాన్‌లో గతేడాది 24 వేలమందికి పైగా కిడ్నాప్‌కు గురయ్యారని సస్టైనబుల్ సోషల్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ 2024 నివేదిక వెల్లడించింది. అంతేకాదు 5వేల మందిపై అత్యాచారం, 500 హానర్ కిల్లింగ్ కేసులు నమోదయ్యాయని తెలిపింది. సింధ్ ప్రావిన్స్‌లోని చాలా మంది హిందూ మైనారిటీ బాలికలకు బలవంతంగా వివాహం చేస్తున్నారని, మత మార్పిడి చేస్తున్నారని పేర్కొంది.

అఫ్గనిస్తాన్‌లో బస్సు దగ్ధం
17 మంది పిల్లలు సహా 73 మంది మృతి



కాబూల్: అఫ్గానిస్తాన్‌లోని పశ్చిమ హెరాత్ ప్రావిన్స్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. వలసదారులతో ప్రయాణిస్తున్న ఓ బస్సు.. ట్రక్కు, మోటార్ సైకిల్‌ను ఢీకొట్టడంతో మంటలు చెలరేగి దగ్ధం అయ్యింది. ఈ ప్రమాదంలో 17 మంది పిల్లలు సహా 73 మంది మరణించారు. ఇరాన్ నుంచి బహిష్కరణకు గురైన అఫ్గాన్ వలసదారులతో నిండిన బస్సు మంగళవారం కాబూల్‌కు బయలుదేరింది. సరిహద్దు దాటిన తరువాత హెరాత్ ప్రావిన్స్‌లో ప్రమాదానికి గురైంది. బస్సులో ఉన్న ప్రతి ఒక్కరూ మరణించారు. ఇతర వాహనాల్లో ఇద్దరు వ్యక్తులు కూడా మరణించారు. బస్సు డ్రైవర్ మితిమీరిన వేగం, నిర్లక్ష్యమైన డ్రైవింగ్ కారణంగానే ప్రమాదం జరిగిందని హెరాత్ పోలీసులు ప్రాథమిక విచారణలో తేల్చారు.

దశాబ్దాల సంఘర్షణ కారణంగా రోడ్లు దెబ్బతిన్న అఫ్గానిస్తాన్‌లో రోడ్డు ప్రమాదాలు సర్వసాధారణమయ్యాయి. ఇక 1970ల నుంచి లక్షలాది మంది అఫ్గన్లు ఇరాన్, పాకిస్తాన్‌లకు పారిపోయారు. 1979లో సోవియట్ దండయాత్ర సమయంలో, 2021లో తాలిబన్లు దేశాన్ని తమ వశం చేసుకున్న తరువాత ఈ వలసలు పెద్ద ఎత్తున కొనసాగాయి. ఇరాన్‌లో క్రమక్రమంగా అఫ్గాన్ వ్యతిరేక భావన పెరిగింది. శరణార్థులు చాలా కాలంగా వ్యవస్థాగత వివక్షను ఎదుర్కొంటున్నారు. పత్రాలు లేని అఫ్గాన్లు స్వచ్ఛందంగా వెళ్లిపోవాలంటూ మార్చిలోనే హెచ్చరించిన ఇరాన్ జూలై వరకు ఇచ్చిన గడువు కూడా పూర్తయ్యింది. జనవరి నుంచి 15 లక్షల మందికి పైగా అఫ్గాన్లు ఇరాన్‌ను వదిలి వెళ్లారని ఐక్యరాజ్యసమితి శరణార్థి సంస్థ తెలిపింది. వీరిలో చాలా మంది తరతరాలుగా ఇరాన్‌లో నివసిస్తున్నవారు కావడం గమనార్హం. జూన్‌లో ఇజ్రాయెల్‌తో జరిగిన స్వల్పకాలిక యుద్ధం తర్వాత జాతీయ భద్రతపై ఆందోళన నెలకొంది. ఈ నేపథ్యంలో.. లక్షలాది మంది అఫ్గాన్లను ఇరాన్ అధికారులు బలవంతంగా తిప్పి పంపించారు. భద్రతా వైఫల్యాలతో జరిగిన ఇజ్రాయెల్ దాడులకు అఫ్గాన్లను బలిపశువులు చేస్తున్నారనేది విమర్శకుల వాదన. ఎలాంటి పత్రాలు లేని అఫ్గాన్లను పాకిస్తాన్ కూడా వేగవంతం చేసిన విషయం తెలిసిందే. ఈ రెండు దేశాల నుంచి తిరిగి అఫ్గానిస్తాన్‌కు వచ్చిన శరణార్థుల సంఖ్య లక్షల్లో ఉంది.

గాజా ముట్టడికి సిద్ధం!

- అతి త్వరలో భారీ సైనిక ఆపరేషన్
- రంగంలోకి వేలాది మంది రిజర్వ్ సైనికులు

జెరూసలేం: గాజా స్ట్రిప్‌ను పూర్తిగా హస్తగతం చేసుకోవడమే లక్ష్యంగా ఇజ్రాయెల్ సైన్యం వ్యూహాలకు పదును పెడుతోంది. అతిత్వరలో భారీ ఆపరేషన్‌కు రంగం సిద్ధం చేస్తోంది. ఇందుకోసం వేలాది మంది రిజర్వ్ సైనికులను యుద్ధ రంగంలోకి దించబోతున్నట్లు సైన్యం బుధవారం వెల్లడించింది. అలాగే మరికొందరు సైనికుల సర్వీసును పొడిగిస్తున్నట్లు తెలియజేసింది. గాజాలో భారీ సైనిక ఆపరేషన్‌కు సంబంధించిన ప్రణాళికపై ఇజ్రాయెల్ రక్షణ మంత్రి కట్జ్ ఇప్పటికే ఆమోద ముద్ర వేశారు. హమాస్ మిలిటెంట్లను పూర్తిగా మట్టుబెట్టి, గాజాను ఆధీనంలోకి తెచ్చుకోవాలని ఇజ్రాయెల్ లక్ష్యంగా నిర్దేశించుకుంది. చీఫ్ ఆఫ్ ద స్టాఫ్ తుది ఆమోదం తర్వాత సైనిక చర్య ప్రారంభం కానున్నట్లు తెలుస్తోంది. ఇందుకోసం 60 వేల మంది రిజర్వ్ జవాన్లను సిద్ధం చేస్తున్నారు. అలాగే 20 వేల మంది సైనికుల సర్వీసును పొడిగిస్తున్నారు. మరోవైపు గాజాలో నరమేధం ఆపాలని ఇజ్రాయెల్‌లో మానవతావాదులు డిమాండ్ చేస్తున్నారు. హమాస్‌తో కాల్పుల విరమణ ఒప్పందం కుదుర్చుకోవాలని, బందీలను విడిపించాలని కోరుతున్నారు. గాజాలో మానవతా సాయం కొనసాగుతూనే ఉంది. ఇజ్రాయెల్ ఆంక్షల కారణంగా పాలస్తీనా పౌరులకు ఆహారం, ఔషధాలు, నిత్యావసరాలు అందడం లేదు. పూర్తిస్థాయి సైనిక ఆపరేషన్ మొదలైతే పరిస్థితి మరింత భయానకంగా మారే ప్రమాదం కనిపిస్తోంది. ఈ ఆపరేషన్ కోసం ఇప్పటికే కార్యాచరణ ఆరంభమైంది. హమాస్ మిలిటెంట్లు తిష్టవేసిన ప్రాంతాలను గుర్తిస్తున్నారు. తమ దేశాన్ని ఇకపై ఎవరూ బెదిరింపులకు గురి చేయకుండా శత్రువులను సమూలంగా అంతం చేయబోతున్నామని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహూ తేల్చిచెప్పారు. బందీలను క్షేమంగా విడిపిస్తామన్నారు.



సన్మానం సందర్భంగా జస్టిస్ సుదర్శన్ రెడ్డి, శరద్ పవార్ కరచాలనం. చిత్రంలో రాహుల్‌గాంధీ

న్యాయ దిగ్గజం జస్టిస్ సుదర్శన్‌రెడ్డి

- ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రశంస
- విపక్ష ఇండియా కూటమి ఆధ్వర్యంలో సన్మానం

సాక్షి, న్యూఢిల్లీ: భారతీయ న్యాయ వ్యవస్థలో జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి ఒక మహోన్నత దిగ్గజం అని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కొనియాడారు. ఉప రాష్ట్రపతి ఎన్నికలో విపక్ష 'ఇండియా'కూటమి తరఫున అభ్యర్థిగా ఎంపికైన జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని బుధవారం కూటమి నేతలకు పరిచయం చేశారు. పాత పార్లమెంట్ భవనంలో జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. రాజ్యాంగ సూత్రాలకు కట్టుబడి ఉన్న నిజాయతీపరుడిని ఉప రాష్ట్రపతి ఎన్నికలో నిలబెట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు. బీజేపీ దురాలోచనలను పార్లమెంటులో అడ్డుకోవడానికి, నిర్ణయాత్మకంగా వ్యవహరించడానికి బి.సుదర్శన్‌రెడ్డి అవసరమని అన్నారు. ఉప రాష్ట్రపతి ఎన్నికను రాజ్యాంగాన్ని రక్షించేవారికి, దానిపై దాడి చేసేవారికి మధ్య జరుగుతున్న యుద్ధంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అభివర్ణించారు. జస్టిస్ సుదర్శన్‌రెడ్డి తెలంగాణలో కుల గణన కోసం పనిచేశారని చెప్పారు. ఆయన దశాబ్దాలుగా న్యాయ సేవలు అందించారని, విలువలు పాటించడంలో చాంపియన్ అని ప్రశంసించారు. ప్రజాప్రతినిధులు 30 రోజులపాటు జైలు పాలైతే పదవి నుంచి తొలగిస్తూ కేంద్రం తీసుకొచ్చిన బిల్లులను రాహుల్ గాంధీ వ్యతిరేకించారు. మనం మళ్లీ మధ్యయుగం నాటికి రోజుల్లోకి వెళ్లబోతున్నామని ఆందోళన వ్యక్తంచేశారు. సన్మాన కార్యక్రమలో సోనియా గాంధీ, శరద్ పవార్, సంజయ్ రౌత్ తదితరులు పాల్గొన్నారు.

అల్బనీస్ బలహీనమైన నాయకుడు

- ఆయన ఇజ్రాయెల్‌కు ద్రోహం చేశారు
- ఆస్ట్రేలియా ప్రధానిపై నెతన్యాహు ఆగ్రహం
- వ్యక్తిగతంగా తీసుకోనన్న అల్బనీస్
- పాలస్తీనాకు ఆస్ట్రేలియా మద్దతివ్వడంతో ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు

జెరూసలేం: ఆస్ట్రేలియా ప్రధానమంత్రి ఆంతోనీ అల్బనీస్ ఇజ్రాయెల్‌కు ద్రోహం చేశారని ఆ దేశ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఆరోపించారు. ఆస్ట్రేలియాలోని యూదు సమాజాన్ని ఆ దేశం వదిలేసిందన్నారు. బలహీనమైన రాజకీయ నాయకుడిగా ఆయనను చరిత్ర గుర్తుంచుకుంటుందని విమర్శించారు. ఆస్ట్రేలియన్ యూదు సంఘం (ఏజేఏ) నిర్వహించిన కార్యక్రమానికి హాజరవ్వాలన్సిన ఇజ్రాయెల్ నేత సిమ్హా రోత్‌మన్ వీసాను ఆస్ట్రేలియా రద్దు చేసింది. విభజన రాజకీయాలు చేస్తున్నవారిపై తమ ప్రభుత్వం కఠినమైన వైఖరి తీసుకుంటుందని ఆ దేశ ఇమ్మిగ్రేషన్ మంత్రి టోనీ బర్క్ ప్రకటించారు. 'మీరు ద్వేషం, విభజన సందేశాన్ని వ్యాప్తి చేయడానికి ఆస్ట్రేలియాకు వస్తున్నట్లయితే.. మీరు ఇక్కడికి రావడం మాకు ఇష్టం లేదు'అని బర్క్ స్పష్టం చేశారు. దీంతో రోత్‌మన్ సమావేశంలో వర్చువల్‌గా పాల్గొని, ప్రసంగిస్తారని ఏజేఏ తెలిపింది. యూదు సమాజం టోనీ బర్క్‌కు, విదేశాంగ మంత్రి పెన్నీ వాంగ్‌కు తలవంచదని ప్రకటించింది. ఈ పరిణామాల పట్ల నెతన్యాహు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

వ్యక్తిగతంగా తీసుకోను

అయితే.. నెతన్యాహు వ్యాఖ్యలపై బర్క్ బుధవారం స్పందించారు. పాలస్తీనాను దేశంగా గుర్తిస్తున్నట్లు ఆస్ట్రేలియా ప్రకటించినందుకే ఆయనకు ఆగ్రహం వస్తోందన్నారు. ఇక.. బలమైన నాయకుడంటే.. ఇతర దేశాలపై దాడులు చేసేవారు, ఇతర దేశాల్లో ప్రజలను ఆకలితో చంపేవారు కాదని, దాడులు, హత్యలతో ఒక దేశాధ్యక్షుడి బలాన్ని అంచనా వేయలేమని ఎద్దేవా చేశారు. నెతన్యాహు వ్యాఖ్యలపై ప్రధాని అల్బనీస్ సైతం స్పందించారు. వాటిని వ్యక్తిగతంగా తీసుకోనన్నారు. తాను ఇతర దేశాల నాయకులను గౌరవంగా చూస్తానని, దౌత్యపరంగా వారితో సంభాషిస్తానని హుందాగా చెప్పుకొచ్చారు. అయితే ఇజ్రాయెల్ మితవాద నేతల వీసాలను ఆస్ట్రేలియా రద్దు చేయడం ఇదే మొదటిసారి కాదు. 2022లో పార్లమెంటును విడిచిపెట్టిన నాయకురాలు, ఇజ్రాయెల్ మాజీ న్యాయ మంత్రి అయెలెట్ షేక్డ్‌కు కూడా వీసా నిరాకరించారు.

నెతన్యాహుతో ఘర్షణ పడేవారే అసలైన నాయకుడు

నెతన్యాహు వ్యాఖ్యలను ఇజ్రాయెల్ ప్రతిపక్ష నాయకుడు యైర్ లాపిడ్ విమర్శించారు. అంతేకాదు.. ఆయన వ్యాఖ్యలను ఆస్ట్రేలియా నాయకునికి బహుమతిగా అభివర్ణించారు. 'రాజకీయంగా అత్యంత విషపూరిత నాయకుడైన నెతన్యాహుతో ఘర్షణ పడేవారే ప్రస్తుతం ప్రజాస్వామ్య ప్రపంచంలో అసలైన నాయకుడు. ఆస్ట్రేలియా ప్రధానమంత్రికి ఈ బహుమతిని ఇచ్చారు'అని ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

పాలస్తీనాకు మద్దతు ఇవ్వడంతో..

పాలస్తీనా దేశాన్ని యూఎన్‌లో ఉన్న 193 సభ్య దేశాల్లో 147 దేశాలు గుర్తించాయి. యూకే, ఫ్రాన్స్, కెనడాలు కూడా ఆ దేశాల జాబితాలో చేరాయి. ఆ తర్వాత ఆస్ట్రేలియా సైతం పాలస్తీనాకు మద్దతు ఇచ్చింది. ఆ సమయంలో ప్రధాని అల్బనీస్ మాట్లాడుతూ 'అమాయక ప్రజలపై యుద్ధ చూపుతున్న ప్రభావాన్ని నెతన్యాహు పట్టించుకోవడం లేదు. సహాయ పంపిణీ కేంద్రాల చుట్టూ ప్రజలు ఆహారం, నీటి కోసం క్యూలో నిలబడి ప్రాణాలు కోల్పోతున్నారు. ఇది ఆమోదయోగ్యం కాదు'అన్నారు. అప్పటినుంచి ఆయా దేశాల మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తతలు మొదలయ్యాయి. ప్రతిస్పందనగా, నెతన్యాహు మూడు దేశాల నాయకులపై దాడిని ప్రారంభించారు. కెయిర్ స్టార్మర్, ఇమ్మాన్యుయేల్ మాక్రాన్, మార్క్ కార్నీలు.. సామూహిక హంతకులు, రేపిస్టులు, శిశువుల హంతకులు, కిడ్నాపర్ల పక్షాన నిలుస్తున్నారని ఆరోపించారు.

'మోదీ డిగ్రీ'పై ఢిల్లీ హైకోర్టు తీర్పు వాయిదా

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చదివిన బ్యాచిలర్ డిగ్రీ విషయంలో తమ తీర్పును ఢిల్లీ హైకోర్టు వాయిదా వేసింది. మోదీ డిగ్రీ వివరాలు బహిర్గతం చేయాలంటూ కేంద్ర సమాచార కమిషన్(సీఐసీ) గతంలో ఢిల్లీ యూనివర్సిటీని ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ ఆదేశాలను సవాలు చేస్తూ ఢిల్లీ యూనివర్సిటీ ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ప్రధానమంత్రి గోప్యతను దృష్టిలో పెట్టుకొని ఆ వివరాలు వెల్లడించలేమని స్పష్టంచేసింది. సీఐసీ ఇచ్చిన ఆదేశాలను కొట్టివేయాలని కోరింది. ఈ పిటిషన్‌పై న్యాయస్థానం బుధవారం విచారణ చేపట్టింది. తీర్పును వాయిదా వేస్తున్నట్లు న్యాయమూర్తి జస్టిస్ సచిన్ దత్తా చెప్పారు. ఈ నెల 25న తీర్పు వెలువరించే అవకాశం ఉంది.

భారత్‌కు 5 శాతం రహస్య తగ్గింపు

- రష్యా డిప్యూటీ వాణిజ్య ప్రతినిధి ఎవ్‌గెనీ గ్రీవా వెల్లడి

న్యూఢిల్లీ: ఉక్రెయిన్-రష్యా యుద్ధానికి భారత్ పరోక్షంగా అండగా నిలుస్తోందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కన్నెర్ర చేస్తున్నవేళ ముడి చమురు కొనుగోలుపై భారత్‌కు 5 శాతం రహస్య తగ్గింపు(డిస్కౌంట్) ఆఫర్ చేస్తున్నట్లు భారత్‌లోని రష్యా డిప్యూటీ వాణిజ్య ప్రతినిధి ఎవ్‌గెనీ గ్రీవా బుధవారం వెల్లడించారు. ఇది వాణిజ్య సీక్రెట్ అని చెప్పడం గమనార్హం. ఈ 5 శాతం డిస్కౌంట్‌లో అప్పుడప్పుడు స్వల్ప మార్పులు ఉంటాయన్నారు. రష్యా నుంచి చమురు కొనే భారత వ్యాపారవేత్తలకు ఈ తగ్గింపు వర్తిస్తుందని పేర్కొన్నారు. చమురు విషయంలో షిప్పింగ్, బీమా సంబంధిత అంశాలను పరిష్కరించడానికి ఒక యంత్రాంగం ఉన్నట్లు తెలిపారు. ఇండియా చమురు అవసరాల్లో ఏకంగా 40 శాతం రష్యానే తీరుస్తోందని ఎవ్‌గెనీ గ్రీవా వివరించారు. బ్యారెల్‌కు 5 శాతం చొప్పున డిస్కౌంట్ ఇస్తున్నామని చెప్పారు. ఇండియా ప్రతిఏటా 250 మిలియన్ టన్నుల ఆయిల్ దిగుమతి చేసుకుంటోందని, ఇందులో 40 శాతం రష్యా చమురే ఉంటోందని స్పష్టంచేశారు.

అందరికీ న్యాయం మధ్యవర్తిత్వంతోనే

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ వ్యాఖ్య

న్యూఢిల్లీ: దేశంలో పౌరులందరికీ సత్వర న్యాయం దక్కాలంటే మధ్యవర్తిత్వం, న్యాయ సాయం ద్వారానే సాధ్యమని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ స్పష్టం చేశారు. అలాగాక న్యాయప్రక్రియ ద్వారానే పరిష్కారం జరగాలంటే అసాధ్యమని కుండబద్దలు కొట్టారు. ''న్యాయసాయం, మధ్యవర్తిత్వం-అందరికీ న్యాయం'అంశంపై బుధవారం సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ (ఎస్‌సీబీఏ) ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అణగారిన, బలహీన వర్గాలకు న్యాయ సాయం పొందే మార్గం సామాజిక, ఆర్థిక, భౌగోళిక తదితర అడ్డంకులమయంగా, సంక్లిష్టంగా ఉండటం క్షమార్హం కాదన్నారు. ''వారికి కోర్టులు అందనంత దూరంలో ఉంటాయి. వాటిని ఆశ్రయించాలన్నా భయపడే పరిస్థితి! సమర్థులైన లాయర్లను పెట్టుకోలేరు. ఫలితంగా న్యాయం వారికి గగనకుసుమంగా మారింది. ఈ దుస్థితి మార్చడం మధ్యవర్తిత్వం, న్యాయ సాయంతోనే సాధ్యం. ఇందుకు బార్, కోర్టులు సమన్వయంతో పని చేయాల్సిన చాలా కీలకం. ఈ విషయంలో లాయర్ల పాత్ర కూడా కీలకం. న్యాయ రథం సాఫీగా సాగాలంటే న్యాయమూర్తులు, లాయర్ల మధ్య సామరస్యం ముఖ్యం''అని అభిప్రాయపడ్డారు. పౌరుల్లో చాలామందికి తమ హక్కులపై కనీస అవగాహన కూడా ఉండటం లేదంటూ సీజేఐ ఆవేదన వెలిబుచ్చారు. నరిత్యం జన విస్ఫోటం జరుగుతున్న భారత్ వంటి దేశంలో కేసుల సంఖ్య నానాటికీ ఊహాతీతంగా పెరిగిపోతూ ఉంది. ఈ భారం తగ్గాలంటే మధ్యవర్తిత్వమే ఏకైక మార్గం. కక్షిదారులను మధ్యవర్తిత్వం దిశగా ఒప్పించాల్సిన బాధ్యత ప్రధానంగా సీనియర్ లాయర్లదే''అని స్పష్టం చేశారు.



నీటిపైనా, నింగిలోనూ దూసుకెళ్లే ఉభయచర వాహనమిది. 'ది రీజెంట్ వైస్రాయ్ సీగ్లైడర్' పేరున్న ఈ ప్రయాణికుల వాహనాన్ని బుధవారం తొలిసారిగా పరీక్షించారు. అమెరికాలోని రోడ్ఐలాండ్ రాష్ట్రంలోని నరాగన్‌సెట్ బే ప్రాంతంలో తీసిందీ ఫొటో

జార్ఖండ్‌లో 50,000 రేషన్ కార్డుల తొలగింపు

రాంచీ: జార్ఖండ్‌లోని తూర్పు సింగ్‌భూమ్‌లో ఎక్కువ కాలంగా ఉపయోగించకుండా ఉన్న 50,000 మందికి పైగా రేషన్ కార్డుదారుల పేర్లను అధికారులు తొలగించారు. మొత్తం 1,64,237 మంది కార్డులు ఉపయోగలో లేవని, వెరిఫికేషన్ డ్రైవ్లో భాగంగా వాటిలో 50,323 మంది పేర్లను తొలగించినట్లు అధికారులు ప్రకటించారు. మరో 1,13,338 మంది పేర్లను తనిఖీ చేస్తున్నట్లు తెలినపారు. ఆధార్ కార్డు నంబర్లు అనుమానాస్పదంగా ఉన్నందున జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో 20,067 మంది తొలగించినట్లు ప్రకటనలో వెల్లడించారు. నిజమైన లబ్ధిదారులకు మాత్రమే ఆహార ధాన్యాలు అందేలా చూడడమే ఈ వెరిఫికేషన్ లక్ష్యమని తెలిపారు.

మొసళ్లతో పోరాడి గెలిచిన మహిళలు

- భర్త, చిన్నారిని కాపాడుకున్న వైనం
- ధైర్యసాహసాలు ప్రదర్శించిన ఇద్దరు మహిళలు

బహ్రెయిచ్: తమ వారికి ఏదైనా ఆపదొస్తే మహిళ అపరకాళిగా మారుతుందన్న విషయాన్ని ఉత్తరప్రదేశ్ మహిళలు రుజువుచేశారు. ప్రవాహంలో హఠాత్తుగా ప్రత్యక్షమై ప్రాణసంకటంగా మారిన మొసళ్ల నుంచి తమ వారికి ఇద్దరు మహిళలు రక్షించుకున్న ఘటనలు ఆదివారం బహ్రెయిచ్ జిల్లాలో జరగ్గా ఆలస్యంగా వెలుగులోకి వచ్చాయి. భర్త కాలిని నోట కరిచిన మొసలి నుంచి భార్య కాపాడగా, మరో ఘటనలో ఐదేళ్ల కుమారుడిని మొసలి బారి నుంచి చాకచక్యంగా కాపాడి మరో మహిళ తన తల్లిప్రేమను నిరూపించుకుంది. ఖైరీఘాట్ పరిధిలోని ఘాఘ్రా నదీప్రవాహానికి అనుసంధానంగా ధకియా గ్రామంలో ఒక కాలువ ప్రవహిస్తోంది. ఇందులోకి ఏడు అడుగుల మొసలి వచ్చిచేరింది. ఆదివారం కాలువ సమీపంలో ఆడుకుంటున్న ఐదేళ్ల బాలుడు వీరును అది ఒక్కసారిగా నోటకరిచి కాలువలోకి లాక్కెళ్లింది. అక్కడే ఉన్న బాలుడి తల్లి మాయా ఒక్క సెకన్ కూడా ఆలోచించకుండా వెంటనే మొసలిని సమీపించి తన వద్ద ఉన్న ఇనుప రాడ్డుతో దానిపై దాడిచేసింది. ఆపకుండా పలుమార్లు రాడ్‌తో కొట్టడంతో దెబ్బలకు తాళలేక అది బాలుడిని విడిచిపెట్టింది. విషయం తెల్సుకున్న బహ్రెయిచ్ డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ అక్కడికి చేరుకుని కాలువలోకి మళ్లీ మొసళ్లురాకుండా వలలు ఏర్పాటుచేయించారు. మోతీపూర్ పరిధిలోని మాధవపూర్ గ్రామంలో అటుగా వెళ్లేందుకు రామ్‌తాలియా కాలువ దాటాల్సి ఉంటుంది. ఆదివారం 45 ఏళ్ల సైఫూ తన భార్య సుర్జానా, బంధువుతో కలిసి కాలువ దాటుతుండగా అందులోని పెద్ద మొసలు సైఫూ కాలిని నోట కరిచి కాలువ లోపలికి లాక్కెళ్లింది. ప్రాణభయంతో సైఫూ అరడం మొదలెట్టాడు. పక్కనే ఉన్న భార్య సుర్జానా ఏమాత్రం భయపడకుండా చీర కొంగును అతని వైపు విసిరి పట్టుకుని బయటకు లాగింది. ఇది చూసిన సమీప గ్రామస్థులు పరుగున వచ్చి కర్రలతో మొసలిపై దాడి చేసి సైఫూ కాలిని ఎలాగోలా విడిపించారు.

రాజీవ్ గాంధీకి ప్రధాని మోదీ నివాళులు

న్యూఢిల్లీ: దివంగత ప్రధానమంత్రి, కాంగ్రెస్ నేత రాజీవ్ గాంధీ 81వ జయంతి సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం నివాళులర్పించారు. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్టుచేశారు. కాంగ్రెస్ ముఖ్య నాయకులు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, కె.సి.వేణుగోపాల్‌తోపాటు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా తదితరులు సైతం నివాళులర్పించారు. దేశానికి రాజీవ్ గాంధీ అందించిన సేవలను స్మరించుకున్నారు. తన తండ్రి రాజీవ్ ఆశయాలను సాధించడమే తన జీవిత లక్ష్యమని రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

గోవా మంత్రి అలెక్సియో రాజీనామా

పనాజీ: గోవాలో బీజేపీ ప్రభుత్వం మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ ప్రారంభించింది. ఇందులో భాగంగా మంత్రి అలెక్సియో సికెరియా బుధవారం రాజీనామా చేశారు. మాజీ మంత్రి దిగంబర్ కామత్‌ను మళ్లీ మంత్రివర్గంలో చేర్చుకొనే అవకాశం కనిపిస్తోంది. అలాగే అసెంబ్లీ స్పీకర్ రమేశ్ తవాడ్కర్‌కు కూడా మంత్రిపదవి కట్టబెట్టే పరిస్థితి ఉందని ప్రభుత్వ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అయితే, వ్యక్తిగత కారణాల వల్లే తాను రాజీనామా చేశానని అలెక్సియో సికెరియా చెప్పారు.

ఢిల్లీలో భవనం కూలి ముగ్గురి మృతి

న్యూఢిల్లీ: దేశ రాజధాని దర్యాగంజ్‌లో బుధవారం మూడంతస్తుల భవనం కూలిపోయింది. ఈ ఘటనలో ముగ్గురు వ్యక్తులు మృతిచెందారు. వారు ఈ భవనంలో నిర్మాణ పనులు చేస్తున్న కార్మికులు జుబేర్, గుల్‌సాగర్, తౌఫిక్‌గా గుర్తించారు. శిథిలాల కింద చిక్కుకున్న మూడు మృతదేహాలు అతి కష్టం మీద అధికారులు వెలికితీశారు. అయితే, భవనం కూలిపోవడానికి కారణాలు ఇంకా తెలియరాలేదు.

విద్య, ఉద్యోగ సమాచారం

జామ్-2026

దేశంలోని ఐఐటీ సంస్థల్లో 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎమ్మెస్సీ, ఎమ్మెస్సీ(టెక్నాలజీ), ఎంఎస్(రీసెర్చ్), ఎంఎస్సీ -ఎంటెక్ డ్యూయల్ డిగ్రీ, జాయింట్ ఎంఎస్సీ-పీహెచ్‌డీ, ఎంఎస్సీ-పీహెచ్‌డీ (డ్యూయల్ డిగ్రీ) కోర్సుల్లో ప్రవేశాలకు జాయింట్ అడ్మిషన్ టెస్ట్ ఫర్ మాస్టర్స్ (జామ్-2026) నిర్వహిస్తారు. ఈ పరీక్ష ద్వారా ఐఐటీ సంస్థల్లో ప్రవేశాలు జరుగుతాయి. ఈ సంవత్సరం ఐఐటీ బాంబే పరీక్ష నిర్వహిస్తుంది.

» **మొత్తం సీట్ల సంఖ్య:** 3000.
» **అర్హత:** సంబంధిత విభాగాల్లో డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. ప్రస్తుతం చివరి సంవత్సరం డిగ్రీ చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.
» **ఎంపిక విధానం:** కంప్యూటర్ ఆధారిత ప్రవేశ పరీక్ష ద్వారా ఎంపికచేస్తారు. మొత్తం ఏడు సబ్జెక్టులలో పరీక్ష జరుగుతుంది. అవి కెమిస్ట్రీ, జియాలజీ, మ్యాథ్‌మేటిక్స్, బయోటెక్నాలజీ, ఎకనామిక్స్, మ్యాథమేటికల్ స్టాటిస్టిక్స్, ఫిజిక్స్.
» **దరఖాస్తు ఫీజు:** ఒక పేపర్‌కి ఎస్సీ, ఎస్టీ, మహిళా అభ్యర్థులకు రూ.1000, రెండు పేపర్లకు రూ.1350. మిగిలిన జనరల్ కేటగిరీకి చెందిన అభ్యర్థులకు ఒక పేపర్‌కి రూ.2000, రెండు పేపర్లకు రూ.2,700.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభతేది:** 05.09.2025
» **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరితేది:** 12.10.2025.
» **జామ్-2026 ప్రవేశ పరీక్ష తేది:** 15.02.2026.
» **ఫలితాల వెల్లడితేది:** 18.03.2026
» **వెబ్‌సైట్:** https://jam2026.iitb.ac.in

ఓయూ దూరవిద్యలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలు

ఉస్మానియా యూనివర్శిటీలోని ప్రొఫెసర్ జి.రామ్‌రెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ విభాగంలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి దూరవిద్యా విధానంలో ఎంబీఏ/ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» **కోర్సులు:** ఎంబీఏ, ఎంసీఏ. » **వ్యవధి:**రెండేళ్లు
» **అర్హత:** ఎంబీఏ కోర్సుకు ఏదైనా గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణులవ్వాలి. ఎంసీఏ కోర్సుకు గణితం సబ్జెక్టుగా డిగ్రీ లేదా ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై ఉండాలి.
» **ఎంపిక విధానం:** ప్రవేశ పరీక్ష ద్వారా ఎంపికచేస్తారు. టీజీ/ఐసెట్-2025లో అర్హత సాధించిన అభ్యర్థులు ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో నేరుగా ప్రవేశం పొందవచ్చు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 15.08.2025.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 02.09.2025
» **రూ.500 ఆలస్య రుసుముతో దరఖాస్తులకు చివరితేది:** 05.09.2025.
» **ప్రవేశ పరీక్ష తేది:** 07.09.2025.
» **వెబ్‌సైట్:** http://www.oucde.net

ఈస్టర్న్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్‌లో 280 ఐటీఐ అప్రెంటిస్‌లు

కోల్ ఇండియా లిమిటెడ్‌కు చెందిన ఈస్టర్న్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్(ఈసీఎల్)లో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఐటీఐ అప్రెంటిస్‌ల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 280.
» **ట్రేడుల వారీగా ఖాళీలు:** ఫిట్టర్-120, ఎలక్ట్రీషియన్-120, సీవోపీఏ-20, వెల్డర్-20.
» **అర్హత:** ఐటీఐ ఉత్తీర్ణులవ్వాలి.
» **స్టైపెండ్:** నెలకు ఎలక్ట్రీషియన్, ఫిట్టర్‌కు రూ.7,700, వెల్డర్, సీవోపీఏకు రూ.7000.
» **ఎంపిక విధానం:**విద్యార్హతల మెరిట్ ఆధారంగా
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ది ఆఫీస్ ఆఫ్ ది జనరల్ మేనేజర్, హెచ్‌ఆర్‌డీ, డిషెర్‌గర్, పశ్చిమ్ బుర్ద్వాన్, పశ్చిమ బెంగాల్-713333 చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 26.09.2025.
» **వెబ్‌సైట్:** /www.easterncoal.nic.in

ఎన్‌సీడీసీ, న్యూఢిల్లీలో డైరెక్టర్ పోస్టులు


న్యూఢిల్లీలోని నేషనల్ కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఎన్‌సీడీసీ).. ఒప్పంద ప్రాతిపదికన చీఫ్ డైరెక్టర్, డిప్యూటీ డైరెక్టర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 02.
» **పోస్టుల వివరాలు:** చీఫ్ డైరెక్టర్(మార్కెటింగ్)-01, డిప్యూటీ డైరెక్టర్(మార్కెటింగ్)-01.
» **అర్హత:** పోస్టును అనుసరించి మార్కెటింగ్‌లో బ్యాచిలర్ డిగ్రీతో పాటు ఎంబీఏ/పీజీడీఎం ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
» **వేతనం:** నెలకు చీఫ్ డైరెక్టర్‌కు రూ1,23,100 నుంచి రూ.2,15,900, డిప్యూటీ డైరెక్టర్‌కు రూ.67,700 నుంచి రూ.2,08,700.
» **వయసు:** చీఫ్ డైరెక్టర్‌కు 45 ఏళ్లు, డిప్యూటీ డైరెక్టర్‌కు 35 ఏళ్లు మించకూడదు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును డైరెక్టర్, నేషనల్ కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్‌సీడీసీ) 4-సిరి, ఇన్‌స్టిట్యూషనల్ ఏరియా, హౌజ్ కాస్, న్యూఢిల్లీ-110016 చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 31.08.2025.
» **వెబ్‌సైట్:** http://www.ncdc.in

ఇంజనీరింగ్‌తో అవకాశాలివిగో!

బీటెక్.. నాలుగేళ్ల ఇంజనీరింగ్ కోర్సు! ఈ కోర్సు పూర్తి చేసుకుంటే.. విస్తృత కెరీర్ అవకాశాలు సొంతం చేసుకోవచ్చనే భావన! ఏటా లక్షల మంది బీటెక్ పట్టా పూర్తి చేసుకుని జాబ్ మార్కెట్‌లో ప్రవేశిస్తున్నారు. మరికొందరు ఉన్నత విద్య లక్ష్యంగా.. గేట్, క్యాట్ వంటి ప్రవేశ పరీక్షలు రాస్తున్నారు. ఇంకొందరు స్టడీ అబ్రాడ్ అవకాశాలను అన్వేషిస్తున్నారు. ఈ నేపథ్యంలో.. బీటెక్ ఉత్తీర్ణులకు అందుబాటులో ఉన్న ఉన్నత విద్య, ఉద్యోగావకాశాలపై ప్రత్యేక కథనం..

» బీటెక్‌తో ఉన్నత విద్య, ఉద్యోగావకాశాలు
» ఎంటెక్, ఎంబీఏ, విదేశీ విద్యకు మార్గాలు
» యూపీఎస్సీ ఈఎస్ఈతో కేంద్రంలో ఇంజనీరింగ్ కొలువులు
» గేట్ స్కోర్‌తో ఎంటెక్, ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ ప్రోగ్రామ్స్‌లో ప్రవేశం
» మేనేజ్‌మెంట్ పీజీ అభ్యర్థులకు మార్గంగా నిలుస్తున్న క్యాట్
» జీఆర్ఈ, జీమ్యాట్, టోఫెల్‌తో విదేశాల్లో ఎంఎస్, ఎంబీఏ



ప్రస్తుత పరిస్థితుల్లో నైపుణ్యాలుంటే.. బీటెక్ ఉత్తీర్ణులకు అవకాశాలకు కొదవలేదు. క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో ఆఫర్లు అందుకోవచ్చు. లేదా స్వీయ అన్వేషణతో కార్పొరేట్ కంపెనీల్లో కొలువులు సొంతం చేసుకోవచ్చు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విభాగాల్లోనూ ఉద్యోగాలు అందుబాటులో ఉన్నాయి. ఉన్నత విద్య కోరుకుంటే.. ఐఐటీల్లో ఎంటెక్, పీహెచ్‌డీ, ఐఐఎంల్లో ఎంబీఏ మొదలు స్థానిక యూనివర్సిటీల్లో ఆయా పీజీ కోర్సుల్లో చేరొచ్చు.

గేట్‌తో.. ఎంటెక్ బాట

బీటెక్ ఉత్తీర్ణులకు అందుబాటులో ఉన్న ఉన్నత విద్య అవకాశం..ఎంటెక్. ఎంటెక్‌లో చేరేందుకు జాతీయ స్థాయిలో నిర్వహించే.. గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్(గేట్)లో అర్హత సాధించాల్సి ఉంటుంది. ఇందులో ర్యాంకు ఆధారంగా ఐఐటీలు, ఎన్ఐటీలు, వివిధ కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో, రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లో ఎంటెక్ కోర్సుల్లో ప్రవేశం లభిస్తుంది. అదే విధంగా రాష్ట్ర స్థాయిలోని యూనివర్సిటీల్లోనూ.. గేట్ ఉత్తీర్ణులకు ఎంటెక్ సీట్ల కేటాయింపులో తొలి ప్రాధాన్యం ఇస్తున్నారు. ప్రతి ఏటా గేట్‌ను ఫిబ్రవరి నెలలో నిర్వహిస్తారు. దీనికి సంబంధించిన నోటిఫికేషన్ ఆగస్టు లేదా సెప్టెంబర్ నెలల్లో వెలువడుతుంది. గేట్-2026 చెందిన నోటిఫికేషన్ ఇటీవలే విడుదలైంది. గేట్ స్కోర్‌తో ఎంటెక్ ప్రవేశాలు ఖరారు చేసుకున్న వారికి నెలకు రూ. 12,400 చొప్పున స్కాలర్‌షిప్ సైతం లభిస్తుంది.

పీజీఈసెట్

రాష్ట్ర స్థాయిలోని ఇంజనీరింగ్ కళాశాలల్లో ఎంటెక్‌లో చేరేందుకు మార్గం..పోస్ట్ గ్రాడ్యుయేట్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(పీజీఈసెట్). ఇందులో స్కోర్ ఆధారంగా యూనివర్సిటీ అనుబంధ కళాశాలలతోపాటు, ప్రైవేట్ కాలేజీల్లోనూ ఎంటెక్‌లో అడుగుపెట్టొచ్చు.

క్యాట్‌తో మేనేజ్‌మెంట్ పీజీ

బీటెక్‌తో అందుబాటులో ఉన్న మరో ఉన్నత విద్య కోర్సు ఎంబీఏ లేదా మేనేజ్‌మెంట్ పీజీ! ప్రతిష్టాత్మక విద్యాసంస్థలు ఐఐఎంలు అందించే మేనేజ్‌మెంట్ పీజీ కోర్సులో ప్రవేశం కోసం కామన్ అడ్మిషన్ టెస్ట్(క్యాట్)లో ప్రతిభ చూపాల్సి ఉంటుంది. క్యాట్‌కు దరఖాస్తు చేసుకునేందుకు 50 శాతం మార్కులతో ఏదైనా డిగ్రీలో ఉత్తీర్ణులవ్వాలి. ఆన్‌లైన్ పరీక్ష, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూల ద్వారా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. రాత పరీక్షలో క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, రీడింగ్ కాంప్రహెన్షన్ అండ్ వెర్బల్ ఎబిలిటీ, డేటా ఇంటర్‌ప్రిటేషన్, డేటా సఫిషియన్సీ అంశాలపై ప్రశ్నలుంటాయి. ఐఐఎంలతో పాటు దేశంలోని పలు ప్రముఖ బిజినెస్ స్కూల్స్ సైతం క్యాట్ స్కోర్‌ను ప్రామాణికంగా తీసుకుంటున్నాయి. రాష్ట్ర స్థాయిలో మేనేజ్‌మెంట్ పీజీ లేదా ఎంబీఏ చదవాలంటే.. ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ పేరిట నిర్వహించే ఐసెట్‌లో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది.

పీహెచ్‌డీకి సీఎస్ఐఆర్ యూజీసీ నెట్

పరిశోధనల పట్ల ఆసక్తి ఉన్న బీటెక్ అభ్యర్థులు సీఎస్ఐఆర్-యూజీసీ నెట్ ద్వారా పీహెచ్‌డీలో చేరొచ్చు. కెమికల్ సైన్సెస్; ఎర్త్, అట్మాస్ఫియరిక్ సైన్సెస్, ఓషియన్ అండ్ ప్లానెటరీ సైన్సెస్; లైఫ్ సైన్సెస్; మ్యాథమెటికల్ సైన్సెస్; ఫిజికల్ సైన్సెస్ విభాగాల్లో పరిశోధనల కోసం పీహెచ్‌డీకి అభ్యర్థులను ఎంపిక చేసే ఎంట్రన్స్ సీఎస్ఐఆర్ యూజీసీ-నెట్. బీటెక్‌తోనే ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశం పొందొచ్చు. ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీకి ఎంపికైన వారికి మూడేళ్ల పాటు జేఆర్ఎఫ్ పేరుతో నెలకు రూ.37 వేలు చొప్పున ఆర్థిక ప్రోత్సాహం.. ఆ తర్వాత రెండేళ్లపాటు ఎస్ఆర్ఎఫ్(సీనియర్ రీసెర్చ్ ఫెలోషిప్) నెలకు రూ.42వేలు చొప్పున లభిస్తుంది.

విదేశీ విద్య అవకాశాలు

బీటెక్ పూర్తిచేసిన విద్యార్థుల్లో ఎక్కువ మంది లక్ష్యం.. విదేశాల్లో ఉన్నత విద్య! విదేశీ యూనివర్సిటీల్లో ప్రవేశం పొందాలంటే.. జీఆర్ఈ,జీమ్యాట్, టోఫెల్ వంటి పరీక్షల్లో మంచి స్కోర్ సాధించాలి. ఆ తర్వాత ఆసక్తి ఉన్న యూనివర్సిటీకి ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోవాలి. ముందుగానే పాస్‌పోర్ట్‌ను సిద్ధం చేసి ఉంచుకోవాలి. సంబంధిత యూనివర్సిటీలో ప్రవేశం ఖరారయ్యాక వీసాకు దరఖాస్తు చేసుకోవాలి.

ఉద్యోగావకాశాలు

గేట్ స్కోర్‌తో.. పీఎస్‌యూల్లో

బీటెక్ ఉత్తీర్ణులు గేట్ స్కోర్ ఆధారంగా దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలు ఇంజనీర్ ట్రైనీ, ఎగ్జిక్యూటివ్ ట్రైనీ కొలువులు దక్కించుకోవచ్చు. గేట్ స్కోర్‌తో ఆయా సంస్థలకు దరఖాస్తు చేసుకోవాలి. మలిదశలో గ్రూప్ డిస్కషన్, గ్రూప్ టాస్క్, పర్సనల్ ఇంటర్వ్యూలను నిర్వహించి.. సదరు పీఎస్‌యూలు నియామకాలు ఖరారు చేస్తాయి.

ఈఎస్ఈతో కేంద్ర కొలువు

బీటెక్‌తో కేంద్ర ప్రభుత్వ కొలువులు సొంతం చేసుకునేందుకు మార్గం.. ఇంజనీరింగ్ సర్వీసెస్ ఎగ్జామినేషన్(ఈఎస్ఈ). యూపీఎస్సీ నిర్వహించే ఈఎస్ఈ ఎంపిక ప్రక్రియలో విజయం సాధించి కేంద్ర ప్రభుత్వ శాఖల్లోని సివిల్,మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగాల్లోగ్రూప్-ఎ, గ్రూప్-బి స్థాయి ఉన్నత కొలువులు లభిస్తాయి.మొత్తం మూడు దశలుగా.. ప్రిలిమ్స్ రాత పరీక్ష, మెయిన్స్ రాత పరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక ప్రక్రియ ఉంటుంది.

రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లోనూ

బీటెక్ ఉత్తీర్ణులకు రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోస్టులు అందుబాటులో ఉంటాయి. ఇరిగేషన్ అండ్ క్యాడ్, వాటర్ వర్క్స్, రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీరాజ్, హౌసింగ్ డెవలప్‌మెంట్ వంటి శాఖల్లో ఏఈఈ పోస్టులకు రాష్ట్ర ప్రభుత్వ పబ్లిక్ సర్వీస్ కమిషన్లు నోటిఫికేషన్లు విడుదల చేస్తాయి. రాత పరీక్షలో మెరిట్ ఆధారంగా ఆయా పోస్టులకు నియామకాలను ఖరారు చేస్తారు.

ప్రైవేట్ రంగంలో.. అవకాశాలిలా

ప్రస్తుత ఆధునిక టెక్నాలజీ యుగంలో బీటెక్ పాసైన వారికి ప్రైవేట్ రంగంలో విస్తృత అవకాశాలు లభిస్తున్నాయి. క్యాంపస్ ప్లేస్‌మెంట్ ప్రక్రియకే పరిమితం కాకుండా.. ఆఫ్ క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్స్, వాక్-ఇన్స్ నిర్వహిస్తూ అభ్యర్థులను ఎంపిక చేసుకుంటున్నాయి. అభ్యర్థులు తమకు ఆసక్తి ఉన్న కంపెనీల వెబ్‌సైట్లను, జాబ్ పోర్టల్స్‌ను నిరంతరం వీక్షిస్తూ ఉద్యోగాన్వేషణ కొనసాగించాలి.

బీటెక్ అభ్యర్థులు జాబ్ మార్కెట్‌లో డిమాండ్ ఉన్న కోర్సులకు సంబంధించి సర్టిఫికేషన్స్ పూర్తి చేయడం ద్వారా కొలువులు దక్కించుకోవచ్చు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీ, ఐఓటీ, క్లౌడ్ కంప్యూటింగ్, 3-డి డిజైన్, క్వాంటమ్ కంప్యూటింగ్ వంటి అంశాల్లో నైపుణ్యాలు పెంచుకోవడం ద్వారా జాబ్ మార్కెట్ అవకాశాలను చేజిక్కించుకోవచ్చు.


ఆసక్తికి ప్రాధాన్యం

బీటెక్ విద్యార్థులకు ఉన్నత విద్య, ఉద్యోగాల కోణంలో పలు అవకాశాలు అందుబాటులో ఉన్నాయి. సత్వరమే కొలువు సొంతం చేసుకోవాలనుకుంటే.. క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్స్, ప్రభుత్వ ఉద్యోగ పరీక్షలకు సన్నద్ధమవ్వొచ్చు.

అలా కాకుండా ఉన్నత విద్యపై ఆసక్తి ఉంటే.. గేట్, పీజీఈసెట్, సీఎస్ఐఆర్ -యూజీసీ నెట్‌లలో విజయానికి కృషి చేయాలి. వీటికోసం కూడా బీటెక్ మూడో ఏడాది నుంచే దృష్టి పెట్టడం ద్వారా సత్ఫలితం ఆశించొచ్చు. ఉద్యోగం లేదా ఉన్నత విద్య మార్గాన్ని తమ ఆసక్తి అనుగుణంగా ఎంపిక చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

Life is in language...

When you stop thinking new thoughts, new ideas, new imaginations, new feelings, new aptitudes and new intellectual creations, there is no need of a language. From the moment you get up from your bed, till the moment you go to your bed, the same set of stock vocabulary is enough. When you don't need any other vocabulary than your known, faded, stereotyped, boring, tiresome and tasteless vocabulary, it means that you have stopped thinking which makes you isolated. Find out what makes a word tick and how you can make it stick.



VOCABULARY

When somebody asked 'what is a language?', the other man replied 'words, words, words and words'. This is actually from William Shake-speare's immortal work 'Hamlet'.

It goes like this..

Polonius: What do you read, my Lord?
Hamlet: Words, words, words.
Polonius: What is the matter, my Lord?
Hamlet: Between whom? (In the original text, it is 'Between who?')
Polonius: I mean the matter that you read, my Lord.

In the above dialogue, one can see how important one's use of vocabulary is. Keeping a side the significance of the dialogue a while, there is a grammar mistake in it. 'Between' is a preposition. There is a rule that there must be an objective case pronoun after a preposition. Now this rule is violated. But we often say that they are exceptions. It may be true. Somebody wanted to know and asked "Did Shakespeare write in English?" Then the other man retorted "Shakespeare didn't write in English rather whatever he wrote is English".

Yes it is true. Hundred percent true. Emily Dickinson rightly opines;

"A word is dead
When it is said,
Some say. I say it just
Begins to live
That day"

Yes. Language is lively. Life is in language. Life without language is just unimaginable, a mere cipher. In vocabulary building, the problem is not so much finding new words or even finding out what they mean. The problem is to remember them, to fix them permanently in your mind. The simple way is to 'see the word, utter it thrice, use it once and it is yours'. Your being introduced to a number of words is of no use as you will forget them as quickly as you forget the names of people you are casually introduced to at a crowded party. Unless you meet them again or unless you spend some time with them, you can't say "I know them or they know me". Try to meet some of the more difficult words, see them in their contexts, look at them from other angles and spend some time with them. Your meeting them should not be a casual one. Some association should be established between you and the words. Try to bring into sharp and permanent focus those words that are now on the blurred fringe of your mind. Imagine a context and you will fall in the need of words.

Let's taste a spoon of words from the ocean of language...

Celibacy: Unmarried state, usually a religious vow of chastity.
Censorious: Being inclined to find faults.
Clinophobia: Morbid fear of lying in bed.
Confiscate: Seize (private property) by authority.
Connoisseur: One who appreciates, understands and enjoys arts.
Conscription: Compulsory enrollment, especially for the armed forces; draft.
Convalescence: Gradual return to health and strength after illness.
Claustrophobia: An abnormal fear of being in narrow or enclosed spaces.
Cynic: A person who believes all people are motivated by selfishness or one whose outlook is scor-nfully and often habitually negat-ive. (Cynic is a member of a sect of ancient Greek philosophers who believed virtue to be the only good and self-control to be the only means of achieving virtue).
Cynophobia: Morbid fear of dogs.
Cynosure: Centre of attention. An object that serves as a focal point of attention and admiration. Som-ebody or something that is the centre of admiration, attention or attraction.
Discophile: One who studies and collects phonographs.
Dissenter: Person who is hard to be pleased. (Often Dissenter One who refuses to accept the doctrines or usages of an established or a national church, especially a Protestant who dissents from the Church of England)
Dipsomania: Morbid craving or desire for alcohol.
Ditheism: Belief in independent principles of good and evil.
Diurnal: Relating to or occurring in a 24-hour period; daily or occurring or active during the daytime rather than at night: as in diurnal animals.

SYNONYMS AND ANTONYMS

S: = Synonyms A: = Antonym

- **Capricious**
S: Unpredictable, impulsive, fickle, changeable, inconstant, whimsical
A: Constant, firm, steadfast, unswerving
- **Cheek**
S: Impertinent boldness: (As in 'he shows the cheek to insult his hosts'). To speak impudently to or impudence, effrontery, gall, temerity, audacity, insolence, sauce, sass (=Impertinent, disrespectful speech; back talk)
A: Politeness, courtesy, humility, gentleness, respect.
(Cheek also means 'either side of the face below the eye. Eg. They are dancing cheek to cheek)
- **Dainty**
S: Pretty, neat, delicate, refined, tas-ty, delicious, fastidious, elegant, toothsome, exquisite, cute, palatable.
A: Inelegant, coarse, vulgar, rough, crude, rude, nasty, dirty.
- **Detrimental**
S: Harmful, injurious, hurtful, pernicious, damaging, noxious
A: Good, beneficial, valuable, useful, profitable, harmless, inoffensive, unobnoxious
- **Diligent**
S: Industrious, laborious, hard-working, attentive, assiduous, observant, mindful, vigilant, watchful, wakeful, careful
A: Careless, heedless, inattentive, indifferent, unobservant, unmindful
- **Docile**
S: Pliant, tractable, amenable, teachable, yielding, compliant, tame, submissive, gentle, unresisting, dutiful, passive, acquiescent, unassertive, manageable, governable, obsequious.
A: Obstinate, stubborn, intractable, self-willed, dogged, defiant, insolent, resistant, resisting, obdurate, disobedient, willful, uncompromising, unyielding, refractory, recalcitrant
- **Droll**
S: Amusing, laughable, funny, com-ic, sarcastic, whimsical, comical, odd, queer, farcical, ludicrous, ri-diculous, absurd, diverting, romp
A: Sad, lamentable, lugubrious, tragic, painful, dolorous, hurtful, distressing, grievous, woeful, rueful, mournful, deplorable, touching
- **Ephemeral**
S: Short lived, transitory, transient, fleeting, momentary, fugitive, evanescent, fugacious, temporary
A: Eternal, perpetual, perennial, permanent, intransient, lifelong, everlasting, long-lived, prolonged, protracted
- **Enormous**
S: Immense, gigantic, colossal, huge, vast, gargantuan, monstrous, prodigious, stupendous, plentiful, plenteous, copious
A: Trivial, insignificant, ordinary, average, small, little, tiny, diminutive.

MODEL QUESTIONS

Directions (Q. No. 1 - 5): ***Out of the four choices, select the one which can be substituted for the given words or sentences.***

1. Relating to the science of sounds
a) Acoustics b) Ultrasonic
c) Phonetic d) Sonics
2. A word formed from the initial letter or letters of each of the successive parts or major parts of a compound term:
a) Abbreviation b) Palindrome
c) Acronym d) Contraction
3. A substance which alleviates pain:
a) Narcotic b) Anodyne
c) Chloroform d) Intoxicant
4. A person who can speak several languages:
a) Linguist b) Lexicographer
c) Polyglot d) Multilingual
5. Deserving blame of an offence or crime:
a) Criminal b) Culpable
c) Punishable d) Culprit

Directions (Q. No. 6 - 14): ***From the given options, choose the one that is nearest in meaning to the underlined word:***

6. Gandhi is an ardent abolitionist.
a) Amnesty activist
b) One opposed to violence
c) War activist
d) One opposed to slavery
7. Only barren lands must be utili-zed for building the capital of AP
a) Unproductive b) Vacant
c) Fertile d) Assigned lands
8. With its good bandwidth, the company made good profits in its dish sales.
a) Measurement of handwritten data
b) Measurement of transferable data
c) Measurement of burned data
d) Measurement of shredded data
9. I felt it a little brackish.
a) Polluted b) Boring
c) Slightly salty d) Hot
10. Finally the hero gets catharsis.
a) Applaud
b) Gets relief from tension
c) Romantic reply d) Victory
11. The party's policies are deleterious to the state.
a) Beneficial b) Harmful
c) Retrospective d) Degrading
12. The invading force had no artillery and was completely annihilated.
a) Defeated b) Destroyed
c) Demolished d) Dismembered
13. The party can no longer win the admiration with its evanescent glory.
a) Vanishing b) Susceptive
c) Melting d) Evaporating
14. She looked at her friend's bristly chin.
a) Soft and shining
b) Rough c) Pricking
d) Cadent

KEY

1) a	2) c	3) b	4) c	5) b
6) d	7) a	8) b	9) c	10) b
11) b	12) b	13) a	14) b	

విపత్తు నిర్వహణలో అంతర్భాగమైనవి?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

డిజాస్టర్ మేనేజ్‌మెంట్

భారతదేశం- విపత్తుల నిర్వహణ

విపత్తు లేదా అత్యవసర పరిస్థితులపై నియంత్రణ ఉండటానికి, ప్రజలను విపత్తు ప్రభావం నుంచి తప్పించడానికి, వాటి వల్ల కలిగే నష్టాలను తగ్గించడానికి, విపత్తుల బారిన పడ్డ ప్రజలు కోలుకోవడానికి దోహదం చేసేలా రూపొందించిన వివిధ రకాల కార్యక్రమాల సమాహారమే 'విపత్తు నిర్వహణ'.

భారతదేశ విస్తీర్ణం 329 మిలియన్ హెక్టార్లు. దేశ భూభాగంలో ఉన్న 29 రాష్ట్రాలు, 7 కేంద్రపాలిత ప్రాంతాలు ఏదో ఒక రూపంలో, ఏదో ఒక రకమైన విపత్తును ఎదుర్కొంటున్నాయి. ఇప్పటి వరకు సంభవించిన భూకంపాలు, రెండు లేదా మూడేళ్లకు ఒకసారి దేశంలో ఏర్పడుతోన్న దుర్భిక్ష పరిస్థితులే ఇందుకు నిదర్శనం. 1967లో సంభవించిన కొయనా భూకంపం, 1993 నాటి లాతూర్ భూకంపం, 1994లో సూరత్‌లో ప్రబలిన ప్లేగు వ్యాధి, 1999లో ఒడిశా తీరాన్ని ముంచెత్తిన సూపర్ సైక్లోన్, 2014లో విశాఖ నగరాన్ని అతలాకుతలం చేసిన హుదూద్ తుపాను మొదలైన వాటిని విపత్తులకు ఉదాహరణలుగా పేర్కొనవచ్చు. వైపరీత్యాల కారణంగా ప్రాణ, ఆస్తి నష్టం అధికంగా వాటిల్లుతోంది. లక్షలాది మంది ప్రజలు నిరాశ్రయులవుతున్నారు. దేశంలోని సాంస్కృతిక, సహజ సంపద దెబ్బతింటోంది.

2004లో సునామీ వచ్చే వరకు భారత ప్రభుత్వం విపత్తులు వాటిల్లక ముందు తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి పెట్టలేదు. విపత్తుల నిర్వహణ కోసం, వాటి వల్ల కలిగే నష్టాన్ని కనిష్ఠ స్థాయికి తగ్గించడానికి అమలు చేసిన కార్యక్రమాలు.. విపత్తు సంభవించిన తర్వాత తీసుకునే పునరావాస, పునర్నిర్మాణ చర్యల రూపంలో ఉన్నాయి. అందువల్ల విపత్తులు సంభవిస్తే భారీ నష్టం వాటిల్లేది. భారత ప్రభుత్వం విపత్తు నిర్వహణలోని లోపాలను సవరించి 2005 మే 20న జాతీయ విపత్తు నిర్వహణ చట్టాన్ని రూపొందించింది. అమెరికా, జపాన్ లాంటి అభివృద్ధి చెందిన దేశాలు అమలు చేస్తున్న కార్యక్రమాలు, ప్రణాళికలను దృష్టిలో ఉంచుకొని ఈ చట్టాన్ని రూపొందించారు. ఈ చట్టం ప్రకారం విపత్తుల సమగ్ర నిర్వహణ కోసం 2005 మే 30న జాతీయ విపత్తు నిర్వహణ ప్రాధికారిక సంస్థ (NDMA)ను ఏర్పాటు చేశారు. 2005 డిసెంబరు 23 నుంచి జాతీయ విపత్తు నిర్వహణ చట్టం పూర్తిస్థాయిలో అమల్లోకి వచ్చింది. ఇందులోని సెక్షన్ 3(1) ప్రకారం 2006, సెప్టెంబరు 27న ప్రధానమంత్రి అధ్యక్షుడిగా తొమ్మిది మంది సభ్యులతో నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ పూర్తిస్థాయిలో అమల్లోకి వచ్చింది.



జాతీయ విపత్తు నిర్వహణ ప్రాధికారిక సంస్థ (NMDA)లోని ముఖ్యాంశాలు

- వివిధ స్థాయుల్లో ఉన్న సంస్థలు, ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయంతో విపత్తు నిర్వహణ యాజమాన్యం చేపట్టాలి.
- ప్రభావిత ప్రాంత ప్రజల జీవనోపాధి దృష్టిలో ఉంచుకొని విపత్తు యాజమాన్యం ఉండాలి.
- విపత్తు నిర్వహణ కోసం అమలు చేసే కార్యక్రమాలు ప్రభావిత ప్రాంతాల్లో సుస్థిరాభివృద్ధిని సాధించే విధంగా ఉండాలి.
- విపత్తు నిర్వహణకు సంబంధించి చేపట్టే సాంకేతిక పరిజ్ఞానం మారుమూల ప్రాంతాల్లో ఉన్న చివరి నిరాశ్రయుడికి సైతం అందుబాటులో ఉండాలి.
- సమగ్ర విపత్తు నిర్వహణకు ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు, శాస్త్రవేత్తలు, ఎన్‌జీవోల మధ్య సమన్వయం పెంపొందించే విధంగా కార్యక్రమాలు ఉండాలి.
- అన్నింటికంటే ముఖ్యంగా ప్రభావిత ప్రాంత ప్రజలకు విపత్తుల నుంచి తమను తాము రక్షించుకునేలా సరైన శిక్షణా కార్యక్రమాలను నిర్వహించి వారిని చైతన్యవంతుల్ని చేయాలి.
- సంస్థాగతమైన, న్యాయపరమైన, చట్టపరమైన, సాంకేతికపరమైన అంశాలన్నింటి మధ్య సమన్వయం సాధిస్తూ, అభివృద్ధి ప్రక్రియలన్నింటిలో విపత్తు యాజమాన్యాన్ని భాగస్వామ్యం చేయాలని ఎన్‌డీఎంఏ సూచిస్తోంది.

పైన పేర్కొన్న లక్ష్యాల సాధనకు విపత్తు యాజమాన్యంలో ఉండాల్సిన దశలను ఎన్‌డీఎంఏ సూచించింది. అవి..

ఎ) నివారణ బి) సంసిద్ధత
సి) ఉపశమనం డి) పునరావాసం
ఇ) పునర్నిర్మాణం ఎఫ్) ప్రతిస్పందన

ఎ. **నివారణ:** విపత్తు సంభవించడానికి ముందే చేపట్టే చర్యలు. ఉదాహరణకు వర్షాకాలానికి ముందే వరద ప్రభావిత ప్రాంతాల్లో వరదలు సంభవించకుండా జలాశయాల్లో పూడికలు తొలగించడం, నదులకు ఇరువైపులా కరకట్టల నిర్మాణం లాంటి చర్యలతో కూడిన కార్యక్రమమే నివారణ.

బి. **సంసిద్ధత:** వైపరీత్యాల ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కోవడానికి వైపరీత్య ఘటనకు ముందే చేపట్టే కార్యకలాపాలను సంసిద్ధత అని పిలుస్తారు. ఉదాహరణకు వైపరీత్య ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యల్లో పాల్గొనే ప్రభుత్వ సిబ్బంది వైపరీత్యం సంభవించడానికి ముందే సరిపడా రేషన్, ఔషధాలు, వాహనాలను సిద్ధం చేసుకోవాలి. సమాచార, ప్రసార మాధ్యమాల ద్వారా విపత్తుల సమాచారం తెలపాలి.

సి. **ఉపశమనం:** విపత్తు ప్రభావం పరిధి, దాని వల్ల వాటిల్లే ప్రమాదాలు, నష్టాలను తగ్గించే ఏ చర్యనైనా ఉపశమనం అనవచ్చు. విపత్తుకు ముందు, విపత్తు సమయంలో, విపత్తు తర్వాత కూడా ఉపశమన చర్యలను చేపట్టవచ్చు. ఉపశమన చర్యలో భాగంగా అనేక నిర్మాణాత్మక, నిర్మాణేతర చర్యలను చేపడతారు. అవి:

నిర్మాణాత్మక చర్యలు: విపత్తు ప్రభావిత ప్రాంతాల్లో విపత్తులను తట్టుకునే భవనాల నిర్మాణాన్ని చేపట్టడం, నదీ ఆనకట్టల ఎత్తును పెంచడం, వైపరీత్య ప్రాంతాల్లో దెబ్బతిన్న రోడ్లను, కమ్యూనికేషన్ వ్యవస్థను పునరుద్ధరించడం, వైపరీత్యం వల్ల నష్టపోయిన ప్రజలకు పునరావాస, పునఃనిర్మాణ కార్యక్రమాలు చేపట్టడం మొదలైనవి.

నిర్మాణేతర చర్యలు: వైపరీత్య ప్రభావం వల్ల దగ్గరి వ్యక్తులను కోల్పోయిన వారికి కౌన్సెలింగ్ ఇవ్వడం, ఆర్థిక సహాయం అందేలా చూడటం. ఉద్యోగావకాశాలు కల్పించడం, వారిని సురక్షితంగా ఇంటికి పంపడం లాంటి చర్యలు తీసుకోవాలి.

డి. **ప్రతిస్పందన:** వైపరీత్యం సందర్భంలో, వైపరీత్యం సంభవించిన వెంటనే దాని ప్రభావాలను తగ్గించడానికి చేపట్టే తక్షణ చర్యలు. ప్రభుత్వ సంస్థలు, ప్రభుత్వేతర సంస్థలు, స్వచ్ఛంద సంస్థల సహాయం, సమన్వయంతో చేపట్టే చర్యలు ఇందులో భాగంగా ఉంటాయి. ఉదాహరణకు బాధితుల ఫోన్ నంబర్లు తీసుకోవడం, మెడికల్ క్యాంపుల ఏర్పాటు, ఎప్పటికప్పుడు హెచ్చరికల జారీ, సరిపడా షెల్టర్లు, ఇతర సౌకర్యాలను ఏర్పాటు చేయడం మొదలైనవి.

ఇ. **పునరావాసం, పునర్నిర్మాణం:** ప్రతిస్పందన, సహాయక చర్యలు చేపట్టిన వెంటనే విపత్తు ప్రభావిత ప్రాంతంలోని పరిస్థితులు, అక్కడి ప్రజా జీవనం సాధారణ స్థితికి చేరుకునేందుకు చేపట్టే చర్యలు. ఉదాహరణకు రహదారుల మరమ్మతులు, శాశ్వత గృహాల నిర్మాణం, జీవనోపాధి కల్పించడం మొదలైనవి.

- పైన పేర్కొన్న వాటిలో చివరి మూడు చర్యలు విపత్తు నిర్వహణ కోసం 2004 వరకు ప్రభుత్వం అమలు చేస్తోన్న కార్యక్రమాల్లో అంతర్భాగంగా ఉండేవి. అయితే ఇవి విపత్తు అనంతరం తీసుకొనే చర్యలు. విపత్తు వాటిల్లడానికి ముందే జాగ్రత్త చర్యలు తీసుకోకపోవడం వల్ల జరగాల్సిన నష్టం జరిగిపోయేది. ఈ లోపాన్ని సవరిస్తూ విపత్తు అనంతర చర్యలతోపాటు విపత్తులు సంభవించడానికి ముందు తీసుకునే చర్యలు(సంసిద్ధత, నివారణ) కూడా విపత్తు నిర్వహణ కార్యక్రమాల్లో అంతర్భాగంగా చేర్చాలని ఎన్ఎండీఏ సూచించింది.

విపత్తు నిర్వహణకు సంబంధించి ప్రభుత్వం చేపట్టిన చర్యలు

- 1937లో సంభవించిన బిహార్-నేపాల్ భూకంపం తర్వాత బ్రిటిష్ ప్రభుత్వ హయాంలో విపత్తు నిర్వహణపై సెంట్రల్ రిలీఫ్ కమిషనర్ ఆధ్వర్యంలో ఒక వ్యవస్థీకృత నిర్మాణం ప్రారంభమైంది.
- స్వాతంత్ర్యం వచ్చాక కూడా విపత్తు నిర్వహణను సెంట్రల్ రిలీఫ్ కమిషనర్ ఆధ్వర్యంలోనే నిర్వహించేవారు.
- ఐక్యరాజ్యసమితి సాధారణ సభ 1990వ దశాబ్దాన్ని అంతర్జాతీయ విపత్తు తగ్గింపు దశాబ్దంగా ప్రకటించింది. దీనికి అనుగుణంగా మన దేశంలో ఒక శాశ్వత, సంస్థాగత విపత్తు నిర్వహణ విభాగాన్ని ఏర్పాటు చేశారు. ఇది వ్యవసాయ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో పనిచేస్తుంది.
- 1999 అక్టోబరు 29న వ్యవసాయ మంత్రిత్వ శాఖ మాజీ కార్యదర్శి కె.సి.పంత్ అధ్యక్షతన ఒక అత్యున్నత కమిటీ ఏర్పాటైంది. ఈ కమిటీ సూచనల ప్రకారం 2002 ఫిబ్రవరి 2న విపత్తు నిర్వహణ విభాగాన్ని గృహమంత్రిత్వశాఖలోని సంయుక్త కార్యదర్శి పరిధిలోకి తెచ్చారు. దుర్భిక్షం మినహా మిగతా అన్ని రకాల విపత్తుల నిర్వహణను గృహమంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో చేపడతారు. దుర్భిక్ష నిర్వహణ మాత్రం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలోనే కొనసాగుతోంది.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. అన్ని ప్రకృతి వైపరీత్యాలకు సంబంధించి (దుర్భిక్షం మినహా) విపత్తు నిర్వహణ కార్యకలాపాలను సమన్వయం చేయడానికి కేంద్రంలో ఉన్న సంస్థ ఏది? (Town Planning Exam)
   ఎ) హోం మంత్రిత్వశాఖ
   బి) సాంఘిక న్యాయ, సాధికారత శాఖ
   సి) వ్యవసాయ మంత్రిత్వశాఖ
   డి) శాస్త్ర, సాంకేతిక మంత్రిత్వ శాఖ
2. కింది వాటిలో విపత్తు నిర్వహణలో అంతర్భాగమైనవి ఏవి? (Town planning Exam)
   ఎ) పునరావాసం బి) పునర్నిర్మాణం
   సి) నివారణ డి) పైవన్నీ
3. 2005 విపత్తు నిర్వహణ చట్టం ప్రకారం ఏర్పాటు చేసిన జాతీయ విపత్తు నిర్వహణ ప్రాధికారిక సంస్థ అధ్యక్షుడు ఎవరు? (Town planning Exam)
   ఎ) ప్రధానమంత్రి
   బి) హోం శాఖ మంత్రి
   సి) ఆర్థికమంత్రి
   డి) గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి
4. విపత్తు నిర్వహణ కార్యకలాపాలు జరిపే సమయం? (Town planning Exam)
   ఎ) విపత్తు రావడానికి ముందు
   బి) విపత్తు సమయంలో
   సి) విపత్తు తర్వాత
   డి) పై అన్ని సమయాల్లో

సమాధానాలు

1) ఎ 2) డి 3) ఎ 4) డి

మాదిరి ప్రశ్నలు

1. ఐక్య రాజ్య సమితి విడుదల చేసిన విపత్తుల నివేదిక-2014 రిపోర్ట్ ప్రకారం ప్రపంచంలో అత్యధిక విపత్తు ప్రభావిత ముప్పు ఉన్న నగరం ఏది?
   ఎ) చికాగో బి) టోక్యో
   సి) కోల్‌కతా డి) మనీలా
2. విపత్తు నివేదిక-2014 ప్రకారం అత్యధిక విపత్తు ప్రభావిత నగరాల్లో ప్రపంచంలో ఏడో స్థానంలో ఉన్న భారత నగరం?
   ఎ) ముంబై బి) చెన్నై
   సి) కోల్‌కతా డి) కొచ్చిన్
3. ఐక్య రాజ్య సమితి సాధారణ సభ ఏ దశాబ్దాన్ని ప్రపంచ విపత్తు తగ్గింపు దశాబ్దంగా ప్రకటించింది?
   ఎ) 1980 బి) 1990
   సి) 2000 డి) 2010
4. విపత్తు నిర్వహణ విభాగాన్ని ఏ సంవత్సరంలో ఏర్పాటు చేశారు?
   ఎ) 2002 జనవరి 2
   బి) 2002 ఫిబ్రవరి 2
   సి) 2003 ఫిబ్రవరి 3
   డి) 2002 జనవరి 3

సమాధానాలు

1) బి 2) సి 3) బి 4) బి

Who among the following faces R?

BANK EXAMS

REASONING

Model Questions

Directions (Q. No. 1-7): Study the following information to answer the given questions.

Eight people, viz A, B, C, D, E, F, G and H are sitting in a straight line facing North. Each of them has passed a recruitment exam and must join the office in different months, viz January, February, March, April, May, June, July and August but not necessarily in the same order.

G sits third to the right of the person who joins in May. The person who joins in August sits second to the right of G. A and E are immediate neighbours of each other. Neither A nor E has joining dates in either May or August. Neither A nor E is an immediate neighbour of G.

H sits third to the right of the person whose joining date is in January. Neither A nor E has joining dates in January. H's joining date is not in August.

Only two people sit between E and the person whose joining date is in July. The person whose joining date is in February sits on the immediate left of D.

Only one person sits between E and B. C joins before July. E joins after April. G joins after A.

1. In which of the following months does H join the office?
   1) April 2) June 3) July
   4) February 5) March
2. Who among the following sits exactly between E and B?
   1) The person whose joining date is in May
   2) The person whose joining date is in January
   3) D
   4) A
   5) The person whose joining date is in August
3. "H" is related to "July" in a certain way based on the above arrangement. "B" is related to "June" following the same pattern. "___" is related to "May" following the same pattern.
   1) F 2) G 3) A 4) D 5) C
4. Which of the following is true regarding D?
   1) Only two people sit to the left of D
   2) D is sitting second to the right of the person whose joining date is in July
   3) E and B are immediate neighbours of D
   4) D's joining date is in May
   5) None is true
5. Who among the following has joining date in June?
   1) F 2) E 3) G 4) D 5) C
6. How many people sit between C and the person whose joining date is in April?
   1) None 2) One 3) Two
   4) Three 5) Four
7. Who among the following are sitting at extreme ends of the line?
   1) A and the person whose joining date is in August
   2) The person whose joining date is in May and E
   3) C and G
   4) The persons whose joining dates are in March and June
   5) None of these

Directions (Q. No. 8-12): Study the following information to answer the given questions.

Eight people are sitting in two parallel rows containing four people each in such a way that there is an equal distance between adjacent persons. In row 1, A, B, C and D are sitting (but not necessarily in the same order) and all of them are facing North. In row 2, P, Q, R and S are sitting (but not necessarily in the same order) and all of them are facing South. Therefore, in the given seating arrangement, each member sitting in a row faces another member of the other row. S sits second to left of Q. A faces the immediate neighbour of S. Only one person sits between A and C. P does not face A. B is not an immediate neighbour of A.

8. Which of the following is true regarding D?
   1) D sits at one of the extreme ends of the line
   2) A sits on the immediate left of D
   3) Q faces D
   4) C is an immediate neighbour of D
   5) No immediate neighbour of D faces R
9. Who among the following faces C?
   1) P 2) Q 3) R 4) S
   5) Cannot be determined
10. Who among the following sits on the immediate right of the person who faces C?
    1) P 2) Q 3) R 4) S
    5) Cannot be determined
11. Four of the following five are alike in a certain way based on the given seating arrangement and thus form a group. Which is the one that does not belong to that group?
    1) A 2) Q 3) R 4) B 5) S
12. Who among the following faces R?
    1) A 2) B 3) C 4) D
    5) Cannot be determined

Directions (Q. No. 13-18): Study the following information to answer the given questions:

In a certain code,
"time and money" is written as "ma jo ki",
"manage time well" is written as "pa ru jo",
"earn more money" is written as "zi ha ma" and
"earn well enough" is written as "si ru ha".

13. What is the code for "earn"?
    1) si 2) ru 3) ha 4) ma
    5) Cannot be determined
14. Which of the following represents "more time" ?
    1) pa jo 2) zi ki 3) ma ki
    4) si jo 5) jo zi
15. What is the code for "manage"?
    1) ru 2) pa 3) jo
    4) ha 5) Either "jo" or "ru"
16. Which of the following may represent "money matters"?
    1) ki to 2) ma pa 3) fi ma
    4) ha ma 5) ma jo
17. What does "ru" stand for?
    1) well 2) manage
    3) time 4) enough
    5) Either "time" or "enough"
18. Which of the following may represent "good enough"?
    1) ru si 2) da ha 3) si pa
    4) si da 5) ki ru

Directions (Q. No. 19-23): Study the following information carefully and answer the given questions.

A word and number arrangement machine, when given an input line of words and numbers, rearranges them following a particular rule in each step. The following is an illustration of input and rearrangement.

Input: gone over 35 69 test 72 park 27
Step I: 27 gone over 35 69 test 72 park
Step II: 27 test gone over 35 69 72 park
Step III: 27 test 35 gone over 69 72 park
Step IV: 27 test 35 park gone over 69 72
Step V: 27 test 35 park 69 gone over 72
Step VI: 27 test 35 park 69 over gone 72
Step VII: 27 test 35 park 69 over 72 gone

Step VII is the last step of the rearrangement.

As per the rules followed in the above steps, find out in each of the following questions the appropriate step for the given input.

19. **Input:** 86 open shut door 31 49 always 45
    How many steps will be required to complete the rearrangement?
    1) Five 2) Six 3) Seven
    4) Four 5) None of these
20. **Step III of an input:** 25 yes 37 enemy joy defeat 52 46
    Which of the following is definitely the input?
    1) enemy 25 joy defeat yes 52 37 46
    2) 37 enemy 25 joy yes defeat 52 46
    3) enemy joy defeat 25 52 yes 46 37
    4) Cannot be determined
    5) None of these
21. **Step II of an Input:** 18 win 71 34 now if victory 61.
    How many more steps will be required to complete the rearrangement?
    1) Three 2) Four 3) Five
    4) Six 5) More than six
22. **Input:** where 47 59 12 are they going 39
    Which of the following steps will be the last but one?
    1) VII 2) IV 3) V
    4) VIII 5) None of these
23. **Step II of an input:** 33 store 81 75 full of goods 52
    Which of the following will be step VI?
    1) 33 store 52 of 75 81 full goods
    2) 33 store 52 of 75 full 81 goods
    3) 33 store 52 of 75 goods 81 full
    4) There will be no such step
    5) None of these

Explanations

(1-7):

March	June	May	Jan	July	April	Feb	Aug
A	E	C	B	F	G	H	D

1. 4 2. 1 3. 1 4. 5 5. 2
6. 3 7. 1

(8-12):

	Q	P	S	R
Row 2	Q	P	S	R
Row 1	B	C	D	A

8. 4 9. 1 10. 2 11. 5 12. 1

(13-18):

time and money → ma jo ki... (i)
manage time well → pa ru jo...(ii)
earn more money→ zi ha ma..(iii)
earn well enough → si ru ha ...(iv)
From (i) and (ii), time → jo
From (i) and (iii), money → ma
From (i), and → ki
From (ii) and (iv) well → ru
From (ii), manage → pa
From (iii) and (iv), earn → ha
From (iii), more → zi
From (iv), enough → si

13. 3 14. 5 15. 2

16. Since "matters" is a new word. So, new code is introduced for "matters" ie, "fi". Code for "money" is "ma". **Ans: 3**

17. 1

18. Code for "enough" is "si" and since "good" is a new word, so a new code for "good", ie "da" is introduced. **Ans: 4**

(19-23):

The machine rearranges numbers in ascending order and word in reverse alphabetical order alternately.

19. **Input:** 86 open shut door 31 49 always 45
    Step I: 31 86 open shut door 49 always 45
    Step II: 31 shut 86 open door 49 always 45
    Step III: 31 shut 45 86 open door 49 always
    Step IV: 31 shut 45 open 86 door 49 always
    Step V: 31 shut 45 open 49 86 door always
    Step VI: 31 shut 45 open 49 door 86 aways **Ans: 2**

20. Can't proceed backward. **Ans: 4**

21. **Step II:** 18 win 71 34 now if victory 61
    Step III: 18 win 34 71 now if victory 61
    Step IV: 18 win 34 victory 71 now if 61
    Step V: 18 win 34 victory 61 71 now if
    Step VI: 18 win 34 victory 61 now 71 if
    Four more steps are needed to complete the rearrangement. **Ans: 2**

22. **Input:** where 47 59 12 are they going 39
    Step I: 12 where 47 59 are they going 39
    Step II: 12 where 39 47 59 are they going
    Step III: 12 where 39 they 47 59 are going
    Step IV: 12 where 39 they 47 going 59 are **Ans: 5**

23. **Step II:** 33 store 81 75 full of goods 52
    Step III: 33 store 52 81 75 full of goods
    Step IV: 33 store 52 of 81 75 full goods
    Step V: 33 store 52 of 75 81 full goods
    Step VI: 33 store 52 of 75 goods 81 full **Ans: 3**